మిసిమి

చింతనాత్మక సారస్వతం

మాసపత్రిక మే 2011 ₹ 20

2555 బుద్ధ జయంతి ప్రత్యేక సంచిక

(చిత్రకారుడు : తల్లావఝుల శివాజి)

మిసిమి

మాసపత్రిక

"All that we are is the product of what we have thought"

- Dammapada.

సంపుటి 22 **మే 2011** **సంచిక 5**

ప్రధాన సంపాదకుడు

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

సంపాదకుడు

అన్నపరెడ్డి బుద్ధఘోషుడు

సమాలోచక మండలి

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ అబ్బూరి గోపాలకృష్ణ
డాక్టర్ జయధీర్ తిరుమల రావు
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు

సహాయ సంపాదకులు

కాండ్రేగుల నాగేశ్వర రావు
ముంగర జాషువ

రెసిడెంట్ ఎడిటర్

వల్లభనేని అశ్వినీకుమార్

సంస్థాపక సంపాదకులు

రవీంద్రనాథ్ ఆలపాటి

Printed & Published by

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹200
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

మీ చందా **మిసిమి** *పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 80వ పుట చూడండి.

ఈ నెల...

త్రిరత్న వందనం 3
– బొర్రా గోవర్ధన్

తెలుగునాట బౌద్ధ సంస్కృతి 6
– సంబటూరు వీరనారాయణ రెడ్డి

బుద్ధుని జీవితం : ఒక నిశ్శబ్ద విప్లవం 11
– డి. చంద్రశేఖర్

సమాధి స్థితి. 15
– కళ్యాణమిత్ర సత్యనారాయణ గోయంకా

ఆచార్య నరేంద్రదేవ్–బౌద్ధ ధర్మ దర్శన్ 19
– సూర్యదేవర సంజీవ్‌దేవ్

విపశ్యన – మనోవిశ్లేషణ 26
– అన్నపరెడ్డి బుద్ధఘోషుడు

వర్ణవ్యవస్థా లేక మరణవ్యవస్థా? 30
– భదంత ఆనంద కౌసల్యాయన్

నాలుగు పారాజిక ధర్మాలు 36
– ఈమని శివనాగిరెడ్డి

ధర్మచేతన (కవిత) 40
– తియ్యగూర సీతారామి రెడ్డి

భగవాన్ బుద్ధ 41
– మహాత్మాగాంధీ

బుద్ధుని సేవించి తరించిన దశమాతలు. 42
– డా. వీపూరి సుదర్శన్

తెలుగుకవుల బౌద్ధాభిమానం 46
– డా. యు. దేవపాలన

విష్ణుకుండినులు – బౌద్ధం. 51
– డా. రాజేంద్ర అనూరాధ

బౌద్ధమత పునరుజ్జీవనం–పండిత అయోతీదాస్. 54
– డా. చల్లపల్లి స్వరూపరాణి

బౌద్ధంలో వ్యక్తి స్వాతంత్ర్యం 57
– డా. రాయదుర్గం విజయలక్ష్మి

సౌందరనందం 62
– డా. వోలేటి పార్వతీశం

బుద్ధుని అడుగుజాడలలో... 66
– భీమవరపు రవిచంద్రా రెడ్డి, దేవళ్ళ శంకర్

భారతదేశంలో బౌద్ధధర్మ పతనం 73
– డా. బాబా సాహెబ్ అంబేద్కర్

ముఖచిత్రం : నివాళి, ఫోటో : టి. అనిల్ కుమార్ (రాజన్ స్కూల్ ఆఫ్ ఫోటోగ్రఫీ)

రెండవ అట్ట, మూడవ అట్ట : బుద్ధుని చిత్రాలు : తల్లావఝుల శివాజి

చివరి అట్ట : అవలోకితేశ్వర (టిబెటన్ చిత్రం)

బౌద్ధ సంప్రదాయంలో బుద్ధ జయంతి మూడు ప్రత్యేకతలను సంతరించుకుంది. సిద్ధార్థుడు వైశాఖ పూర్ణిమనాడే జన్మించాడు. ముప్పది అయిదేండ్ల తర్వాత ఉరువెల (ఇప్పటి గయ)లో నేరంజనానది ప్రక్కన బోధివృక్ష ఛాయలో సంబోధి ప్రాప్తమయింది. ఎనబదిఏండ్లకు అదే దినాన కుసినార (ఇప్పటి ఉత్తర్‌ప్రదేశ్) వనంలో మహాపరినిర్వాణం చెందాడు. థేరవాద బౌద్ధం ప్రకారం – బుద్ధుడు 2555 సంవత్సరాల క్రితం నిర్వాణం చెందాడని విశ్వసిస్తారు. మహాయాన సంప్రదాయ ప్రకారం బుద్ధుని పరినిర్వాణం క్రీ.పూ. 483 నాటికి లెక్కించబడింది. భారతదేశంలో ప్రచారంలో వున్న మూడు కాలమాన లెక్కల పద్ధతుల్లో బౌద్ధశకం పురాతనమైనది. మిగిలిన రెండు శాలివాహన, విక్రమనామ శకాలు.

ఈ నెల **మనిమి** బుద్ధ జయంతి ప్రత్యేకం.

బౌద్ధ సంబంధమైన అనేక విషయాలపై వ్యాసాలు అందిస్తున్నాం. ముఖ్యంగా తెలుగువారి జీవనంతో వేయిసంవత్సరాలపైగా పెనవేసుకుని పోయిన విశ్వాసంగా పేరొందినది బౌద్ధధర్మం. దురదృష్టవశాత్తు అనేక కారణాలవలన (అందులో బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రామాణికంగా చూపినవి కొన్ని ఈ సంచికలోనే ఉన్నవి.) భారతదేశంలో బౌద్ధం క్షీణించి పొరుగుదేశాలకు వలస పోవలసి వచ్చింది. ఇందుకు దోహదం చేసినది – సాంఘికంగా ప్రజలను కుల – వర్గాలుగా చీల్చిన శక్తులు మాత్రమే. ఈ ప్రమాణాలే ప్రజలను అస్పృశ్యులుగా, అంటరానివారిగా అణచి అవిద్యకు కారణమైనవి.

ఇప్పటికైనా మనం మేల్కొని ఈ అనైతికమైన మాయాజాలం నుంచి బైటపడి కులవిభజనల కుయుక్తులను అధిగమించి సాంఘిక పునర్వికాసం సాధించవలసి వుంది.

తెలుగునాట బౌద్ధధర్మ ప్రాశస్త్యాన్ని, చరిత్రను వీరనారాయణ రెడ్డి వ్యాసంలో విపులంగా వివరించారు.

ఆచార్య నరేంద్రదేవ్ వ్రాసిన 'బౌద్ధధర్మ దర్శన్' బృహద్గ్రంథాన్ని సవివరంగా సమీక్షించిన సంజీవదేవ్, బౌద్ధధర్మ చరిత్రను సంక్షిప్తంగా మన కళ్ళ ముందుంచారు.

'త్రిరత్న వందనం' మన కందించినవారు బొర్రా గోవర్ధన్. వీరి బౌద్ధ సాహిత్యానువాదాలు ఇటీవలనే వెలుగులోకి వస్తున్నాయి. 'ధర్మచేతన' కవిత – తియ్యగూర సీతారామి రెడ్డి ఎంతో ఆర్తితో వ్రాశారు.

బుద్ధఘోషుని 'విపశ్యన–మనోవిశ్లేషణ' ఫ్రాయిడ్ మనోవైజ్ఞానిక సిద్ధాంతాలకు, బౌద్ధములోని ధ్యాన ప్రక్రియలకు వున్న సంబంధాలను, ఇప్పటికీ అనుసరణీయమైన ప్రాధాన్యతను వివరిస్తోంది.

చంద్రశేఖర్, బుద్ధుని జీవితాన్ని నిశ్శబ్ద విప్లవంగా వర్ణించారు. భదంత ఆనంద కౌసల్యాయన్ – భారతదేశంలోని కులవ్యవస్థలను, సాంఘిక దురాచారాలను సహేతుకంగా గర్హించారు.

ఎన్నో వ్యాసాలు – లబ్ధ ప్రతిష్ఠులు వ్రాసినవే – చోటు లేకపోవటమనే ఒకే కారణంతో ప్రచురించలేక పోతున్నాం. వీలుకల్పించుకొని మునుముందు అందించగలమని మనవి చేస్తూ...

– సంపాదకులు

త్రిరత్న వందనం

(బుద్ధ, ధర్మ, సంఘ వందనం)

- బొర్రా గోవర్ధన్

ఇతిపి సో భగవా అరహం సమ్మాసంబుద్ధో విజ్జాచరణ సంపన్నో సుగతో లోకవిదూ అనుత్తరో పురిసదమ్మసారథి సత్థా దేవమనుస్సానం బుద్ధో భగవా'తి

ఆ..
భగవానుడు
పూజనీయుడు
అరహతుడు
పూర్ణజ్ఞానుడు
శీల సంపన్నుడు
పరినిర్వాణ పథికుడు
సర్వలోక సుజ్ఞానుడు
శిష్యకోటి మార్గదర్శకుడు
దేవ మానవ సద్గురుడు
సమ్యక్ సంబుద్ధుడు
సకల క్లేశ వినాశకుడు
ఆ....
బుద్ధునికి వందనం..!
భగవానునికి వందనం...!

యే చ బుద్ధా అతీతా చ, యే చ బుద్ధా అనాగతా
పచ్చుప్పన్నా చ యే బుద్ధా, అహం వందామి సబ్బదా

యే సంబుద్ధులు – గతమునుండిరో
యే సంబుద్ధులు – భావి నుందురో
ప్రస్తుతమేసంబుద్ధులుండిరో
సర్వదా వారికిదే వందనం!

నత్థి మే సరణం అఞ్ఞం బుద్ధో మే సరణం వరం
ఏతేన సచ్చవజ్జేన హోతు మే జయమంగళం

లేదులే వేరే శరణం – బుద్ధుడే ఉత్తమ శరణం
ఈ సత్య వాక్య తేజం – కలిగించు జయమంగళం!

ఉత్తమంగేన వందేహం, పాదపంసుం వరుత్తమం
బుద్ధే యో ఖలితో దోసో బుద్ధో ఖమతు తం మమం
బుద్ధం యావ నిబ్బానపరియంతం సరణం గచ్ఛామి

సుగతుని సుమపాదధూళికి–చేస్తా శిరసాభి వందనం
తనయెడ చేసిన తప్పులన –దయగల బుద్ధుడు క్షమించును
నా నిర్వాణ పర్యంతం–ఆ బుద్ధుడే నాకు శరణం

బుద్ధుని పేర్లు - విశేషవివరణ

ఇతిపి సో భగవా అరహం సమ్మాసంబుద్ధో విజ్జాచరణసంపన్నో సుగతో లోకవిదూ అనుత్తరో పురిసదమ్మసారథి సత్థా దేవమనుస్సానం బుద్ధో భగవా'తి

అరహం...

రాగ ద్వేష రహితుడు
సకల క్లేశ వినాశకుడు
సంసారచక్ర విధ్వంసకుడు
దేవ మానవ పూజనీయుడు
రహస్యవర్తన మెరుగనివాడు
అందుకే.... అరహతుడాభగవానుడు !

సమ్మాసంబుద్ధో.....

దీనజనావళి దుఃఖనివారణ
దారులకై వెదుకాడినవాడు
స్వయం శోధన చేసినవాడు
పరిపూర్ణ జ్ఞానం పొందినవాడు
అందుకే....సమ్యక్ సంబుద్ధుడాభగవానుడు!

బొర్రా గోవర్ధన్, ఫోన్ : 9390600157

విజ్జాచరణ సంపన్నో ....

ప్రజ్ఞా పథము ప్రబోధించాడు
అష్టాంగమార్గం చూపించాడు
అనవరతం ఆచరించాడు
అవిద్యను అంతం చేశాడు
అందుకే.... విద్యాచరణ సంపన్నుడాభగవానుడు!

సుగతో.....

అష్టాంగ పథమున ఆ జినుడు
చూడచక్కని సుందర గమనుడు!
మృదు భాషణుడు ! మధుర బోధకుడు!
పరినిర్వాణ పరమ పథికుడు !
అందుకే... సుగతుడాభగవానుడు!

లోకవిదూ.....

యోగ్యత లెరిగి బోధించినవాడు
చిత్తశాంతి కలిగించినవాడు
త్రికాలజ్ఞానం కలిగినవాడు
త్రిలోకాలలో పూజనీయుడు
అందుకే.... లోకవిదుడా భగవానుడు!

అనుత్తరో పురిసదమ్మసారథీ....

భిక్షుగణాల సుశిక్షకుడు
శిక్షణలో కడు ఉత్తముడు
దమనీయుల మార్గదర్శి
అందుకే..ఆ భగవానుడు ..
పరమోత్తమ ధర్మసారథి.....!

సత్థాదేవమనుస్సానం....

కఠిన చిత్తము కరిగిపోగ
అవరోధాలు అధిగమించగ
దేవమానవ జనగణాలకు
ధ్యానయోగము తెలిపెను
మనోరుగ్మత బాపెను
గురులకే గురు వయ్యెను...
అందుకే... దేవమానవ సద్గురుడాభగవానుడు.!

బుద్ధో....

నాల్గు ఆర్య సత్యాలను
జ్ఞానయోగమున తెలుసుకునీ
ఈ సత్యాల పూర్ణ జ్ఞానమే
దుఃఖ నివారణ దారియనీ
తెలిసినవాడు... తెలిపినవాడు
సంబోధిని సాధించిన వాడు
అందుకే... సంబుద్ధుడాభగవానుడు .....!

భగవాన్....

చిత్త యోగ సంపన్నుడు
శిష్యపరంపర యశోధరుడు
రాగ ద్వేష మోహాలను
భగ్నం చేసిన జినుడు
పరమ సత్య ప్రబోధకుడు
అనంత కీర్తి ప్రభాకరుడు
సకల జగతి ఉద్ధారకుడు
అవిశ్రాంత ఉద్దీపకుడు
అందుకే.....భగవానుడాభవదీయుడు...!

ధమ్మవందనం

స్వాక్ఖాతో భగవతా ధమ్మో , సందిట్ఠికో,
అకాలికో ఏహిపస్సికో,ఓపనయికో,
పచ్చత్తంవేదితబ్బో విఞ్ఞూహీ'తి
నమో తస్స నియ్యానికస్స ధమ్మస్స

స్వయంగా...చక్కగా....
భగవానుడు చాటిన ధమ్మం
ఇక్కడే... ఇప్పుడే...
తెలియునట్టిది ....
కాలాతీతమైనది..
వచ్చి చూడదగినది..
ముందుకు నడిపించునది..
విజ్ఞులకు అనుభవైకమైనది...
ఆ ధమ్మానికి...నమామి..
నమో..నమో ..నమామి !

యే చ ధమ్మా అతీతా చ, యే చ ధమ్మా అనాగతా
పచ్చుప్పన్నా చ యే ధమ్మా, అహం వందామి సబ్బదా

యే ధమ్మం- గతమునుండెనో
యే ధమ్మం భావి నుండునో
ప్రస్తుతమేధమ్మముండెనో
దానికి సర్వదా వందనం

నత్థి మే సరణం అఞ్ఞం ధమ్మో మే సరణం వరం
ఏతేన సచ్చవజ్జేన హోతు మే జయమంగళం

లేదులే వేరే శరణం – ధమ్మమే ఉత్తమ శరణం
ఈ సత్య వాక్య తేజం–కలిగించు జయమంగళం

ఉత్తమంగేన వందేహం , ధమ్మం చ తివిధం వరం
ధమ్మే యో ఖలితో దోసో ధమ్మో ఖమతు తం మమం
ధమ్మం యావ నిబ్బానపరియంతం సరణం గచ్ఛామి

త్రిరూప ధమ్మమే యోగ్యం – చేస్తా శిరసాభి వందనం
తన యెడ చేసిన తప్పులను – దయతో ధమ్మం క్షమించును
నా నిర్వాణ పర్యంతం – ఆ ధమ్మమే నాకు శరణం

సంఘ వందనం

సుపటిపన్నో భగవతో సావకసంఘో
ఉజుపటిపన్నో భగవతో సావకసంఘో
ఞాయపటిపన్నో భగవతో సావకసంఘో
సామీచిపటిపన్నో భగవతో సావకసంఘో
యదిదం చత్తారి పురిసయుగాని అట్ఠపురిసపుగ్గలా
ఏస భగవతో సావకసంఘో; ఆహునేయ్యో
పాహునేయ్యో, దక్ఖినేయ్యో, అంజలికరణీయో
అనుత్తరం పుఞ్ఞక్ఖేత్తం లోకస్సాతి
నమో తస్స అట్ఠ అరియపుగ్గల మహాసంఘస్స

సద్ధర్తన సాధకుల – భగవానుని శ్రావక సంఘం
ఋజువర్తన సాధకుల – భగవానుని శ్రావక సంఘం
న్యాయమార్గ పురోగాముల– భగవానుని శ్రావక సంఘం
సన్మార్గ పురోగాముల – భగవానుని శ్రావక సంఘం
నాలుగు జంటలూ – ఎనమండుగురూ
ఉత్తములైన – పురుషులు ఉన్నట్టి
– భగవానుని శ్రావక సంఘం

ఈ శ్రావక సంఘం
సత్కార సముచితం – దక్షిణలకు పాత్రం
అభివాద అర్హం – ఆతిథ్యయోగ్యం
అనుత్తరం ఆ సంఘం – పూజనీయం
సకల జగతికే అది – పుణ్యక్షేత్రం
ఆ...మహా సంఘానికి నమస్సులూ.....
అష్టఆర్యపుద్గల సంఘానికి కైదండలూ.....

యే చ సంఘా అతీతా చ యే చ సంఘా అనాగతా
పచ్చుప్పన్నా చ యే సంఘా అహం వందామి సబ్బదా

యే సంఘం– గతమునుండెనో
యే సంఘం –భావి నుండునో
ప్రస్తుత మే సంఘముండెనో
దానికి సర్వదా వందనం

నత్థి మే సరణం అఞ్ఞం సంఘో మే సరణం వరం
ఏతేన సచ్చవజ్జేన హోతు మే జయమంగళం

లేదులే వేరే శరణం – సంఘమే ఉత్తమ శరణం
ఈ సత్య వాక్య తేజం–కలిగించు జయమంగళం
ఉత్తమంగేన వందేహం సంఘం చ తివిధుత్తమం
సంఘే యో ఖలితో దోసో సంఘో ఖమతు తం మమం
సంఘం యావ నిబ్బానపరియంతం సరణం గచ్ఛామి

త్రిరూప సంఘమే యోగ్యం–చేస్తా శిరసాభి వందనం
తన యెడ చేసిన తప్పులను–దయతో సంఘం క్షమించును
నా నిర్వాణ పర్యంతం – ఆ సంఘమే నాకు శరణం



తెలుగునాట బౌద్ధ సంస్కృతి

- సంబటూరు వీరనారాయణ రెడ్డి

బుద్ధుని జీవితకాలంలోనే బౌద్ధధర్మ దీప్తులు తెలుగు నేలపై ప్రసరించాయి. అస్సక రాజ్యంలోని గోదావరి తీరాన్నుంచి బావరి శిష్యులు రాజగృహంలోనున్న బుద్ధ భగవానుని కలుసుకొని ఆయన బోధనలను విని, బుద్ధ వచనాన్ని ఇక్కడికి తీసుకొచ్చారు.

బుద్ధుని మహాపరినిర్వాణం తరువాత పోతలి (నేటి బోధన్) నుంచి పాలించిన ఒక అస్సకరాజు, అతని కుమారుడు సుజాతలకు మహాకాత్యాయనుడు బౌద్ధ దీక్షనిచ్చినట్లు *విమానవత్తు* వ్యాఖ్యానంలో ఉంది. కానీ వైశాలీలో జరిగిన రెండవ బౌద్ధ సంగీతిలో పొడజూపిన సిద్ధాంతపరమైన వైరుద్ధ్యాల తరువాతనే తెలుగునేలపై బుద్ధధర్మం వ్యాప్తి చెందిందని చెప్పొచ్చు. బౌద్ధ భిక్షువులు వాడవచ్చున్న పదిరకాల వస్తువుల (దశవత్తూని) పై మహాసాంఘికుల అభిప్రాయాన్ని వైశాలీ స్థవిరులు అంగీకరించకపోవటంతో కొందరు మహాసాంఘికులు దక్షిణాదికి తరలివచ్చి బుద్ధధర్మ వ్యాప్తికి కారకులైనారు.

అలా తరలివచ్చిన వారిలో మహాదేవుడనే బౌద్ధాచార్యుడు, కృష్ణాతీరంలోగల ధాన్యకటకం (అమరావతి)లోని చైత్యశాలలో స్థిరపడి చైత్యకమనే మహాసాంఘిక శాఖను స్థాపించటంతో ఆంధ్రదేశంలో బౌద్ధధర్మం వేళ్లూనుకొంది. బౌద్ధ భిక్షువులేకాక, సామాన్యజనంకూడా అధికసంఖ్యలో బౌద్ధాన్ని ఆచరించేందుకు వీలుగా, మహాదేవుడు స్థూపారాధనతోపాటు లోకోత్తరుడైన బుద్ధుని కొనియాడే అచారాలు ఎక్కువగా ప్రచారం గావించాడు.

పర్యవసానంగా కృష్ణాతీరంలో మరిన్ని ఆరామాలు విస్తరించి పూర్వశైల, అపరశైల, ఉత్తరశైల, రాజగిరిక, సిద్ధార్థికులనే చైత్యకవాద ఉపశాఖలు కొద్దిపాటి తేడాలతో మహాసాంఘిక సిద్ధాంతాలను ప్రచారం గావించాయి.

అశోకుని (క్రీ.పూ. 269–228) ఆధ్వర్యంలో పాటలీ పుత్రంలో జరిగిన మూడో బౌద్ధ మహాసంగీతి సందర్భంగా ఈ చైత్యక వాద ఉపశాఖలనుంచి హాజరైన భిక్షువులను అంధకులని ప్రఖ్యాత వ్యాఖ్యాత, బౌద్ధాచార్యుడైన బుద్ధఘోషుడు పేర్కొన్నాడు. ఈ అంధకులే *అభిధర్మం*లోని కొన్నిఅంశాలు, బుద్ధుని లోకోత్తరతపై జరిగిన చర్చకు కారకులైనారు. మూడో సంగీతి నిర్వహణా బాధ్యతలను స్వీకరించిన విభాజ్యవాదుల్లో ప్రముఖుడైన మొగ్గలిపుత్త స్థవిరుడు ఈ విషయాలను తోసిపుచ్చినట్లు, *కథావత్తు* వ్యాఖ్యానంలో చెప్పబడింది.

కళింగ యుద్ధం తరువాత బౌద్ధాభిమానిగా మారిన అశోకుడు తన సామ్రాజ్యంలోని వివిధ ప్రాంతాలకేకాక మధ్యధరాతీరం వరకూ భిక్షువులను పంపించి బుద్ధధర్మ వ్యాప్తికి పెద్ద ఎత్తున పూనుకొన్నాడు. యుద్ధంవల్ల దెబ్బతిన్న కళింగలో బౌద్ధధర్మ వ్యాప్తికి అశోకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొన్నట్లు అతని ధౌళి, జౌగడ ధర్మలిపులు తెలియ జేస్తున్నాయి. అశోకుడు తన సోదరుడైన తిస్సకుమారుని కోసం కళింగలోని భోజకగిరి వద్ద ఒక విహారాన్ని నిర్మించాడు. ఇలా బౌద్ధానికి చేయూతనిచ్చిన అశోకుని తోడ్పాటుతో ఎన్నో స్థూపాలు, ఆరామాలతో పాటు ఆంధ్రదేశంలోని ధాన్యకటకం, శాలిహుండాల్లోని మహాచైత్యాలు ఆయన కాలంలోనే ఇంకా అభివృద్ధి చేయబడినాయి. దేశంలోనూ, వెలుపలా నలుచెరులా బౌద్ధవ్యాప్తికి తోడ్పాటునందించిన మౌర్యచక్రవర్తి అశోకుని తరువాత, మగధ సామ్రాజ్యం పతనమై పుష్యమిత్ర శుంగుని వశమవటంతో బౌద్ధం నిరాదరణకు గురైంది. బౌద్ధానికి బద్ధవ్యతిరేకి అయిన పుష్యమిత్రుని వైదికమత దురభిమానం అనేకమంది బౌద్ధభిక్షువులను విచక్షణారహితంగా చంపటానికి దోహదం చేయటంతో, మగధనుంచి చాలామంది బౌద్ధ భిక్షువులు ఆసరాకోసం దక్షిణాపథానికి తరలివచ్చారు. వివిధ మతాలను సమాదరిస్తున్న శాతవాహనుల అధీనంలో కొచ్చిన

సంబటూరు వీరనారాయణ రెడ్డి, ఫోన్ : 040-23548655

ఆంధ్రదేశం శాంతియుత జీవనానికి అనువైనప్రదేశంగా గుర్తించిన ఉత్తరాది బౌద్ధభిక్షువులనేకమందికి ఆశ్రయ మిచ్చింది.

క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో రాజకీయ సుస్థిరతకూ, పరమతసహనానికీ, ఆర్థిక సుసంపన్నతకు కట్టుబడిన శాతవాహన పాలన, ప్రజల్లో సృజనాత్మకత పెల్లుబకటానికి కూడా దోహదం చేసింది. క్రీస్తుశకం మొదటి, రెండో శతాబ్దాల కాలం తెలుగునేలపై బంగారుశకాన్ని ఆవిష్కరించింది. అంతవరకూ బౌద్ధానికి ఆలవాలమైన మధ్యమదేశాన్ని మించిన ఆసరాను ఆంధ్రదేశం అందించి బౌద్ధ తాత్త్వికతకు పెద్ద పీటను వేసింది. సరిగ్గా ఇదేసమయంలో బౌద్ధధార్మిక ఆలోచనలు కొత్తపుంతలు తొక్కాయి. తరతరాలుగా వస్తున్న థేరవాద బౌద్ధం సామాన్యుల నాకట్టుకోలేకపోయింది. ఈ కొత్త ఆలోచనలు వారిని బుద్ధ ధర్మానికి చేరువయ్యేట్లు చేశాయి. అప్పుడే క్రొత్తగా *ప్రజ్ఞా పారమిత సూత్రాలు, రత్నకూట* సాహిత్యం బుద్ధవచనంగా బౌద్ధారామాల్లో ప్రాచుర్యం పొందాయి. బోధిపక్షీయ ధర్మాల లాంటి బౌద్ధమూల బోధనలను విస్మరించ కుండా శూన్యత, కరుణలకు ప్రాధాన్యత నిస్తూ మరికొన్ని సూత్రాలు ధాన్యకటక పరిధిలోని బౌద్ధారామాల్లో మహాయాన బౌద్ధం ఆవిర్భావానికి దారితీసింది. సంప్రదాయ థేరవాద బౌద్ధంకంటే విశాల దృక్పథంగల ఈ మహాయానం ఒక ఉద్యమంలా భాసిల్లి 'రెండో ధర్మచక్ర ప్రవర్తనం'గా గుర్తింపు పొందింది.



మహాయానం : బోధిసత్వయానంగా కూడా పిలువబడిన మహాయానం బౌద్ధంలో పెనుమార్పులను తీసుకొచ్చింది. శూన్యత, బుద్ధుల లోకోత్తరత, పారమితల ఆచరణ, బోధిచిత్తాన్ని సంతరించుకొని అర్హంతల మాదిరిగా కేవలం వ్యక్తిగత నిర్వాణంకంటే, భిన్నంగా బహుజనుల ప్రయోజనం కోసం పాటుపడే బోధిసత్వ భావనలు మహాయాన ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు. కరుణతో సంసార దుఃఖంనుంచి అందరికీ విముక్తి కలిగించటమే బోధిసత్వులు ప్రధాన విధిగా భావిస్తారు. ఈ కోవలోనే ప్రాచుర్యం పొందిన అవలోకితేశ్వర, మంజుశ్రీ బోధిసత్వులు కరుణ, ప్రజ్ఞలతో ఉపాసకుల హితంకోసం ఆరాధింపబడినారు.

క్రీ.శ. 6వ శతాబ్దిలో వజ్రయానం లేక మంత్రయానమనే మరో బౌద్ధయానం ఆంధ్రదేశంలోనే పుట్టిందని అనేక పండితుల అభిప్రాయం గ్రంథకర్తలెవరో సరిగా తెలియని అనేక తాంత్రిక గ్రంథాలు కూడా ఇక్కడి నుంచే వెలువడినాయి. వీటిలో *గుహ్యసమాజ, వజ్రశిఖర, సర్వతథాగత తత్వసంగ్రహ, మహావైరోచన ఇంకా మంజుశ్రీ మూలతంత్రాలు* ముఖ్యమైనవి. బుద్ధుడు కాలచక్ర మూలతంత్రాన్ని ధాన్యకటకంలో బోధించాడని, దీన్నే 'మూడో ధర్మచక్ర ప్రవర్తన'గా పేర్కొంటారని టిబెటన్ సంప్రదాయంలో ఉంది. వజ్రయాన బౌద్ధాచార్యుల్లో శుభకర సింహ, వజ్రబోధి, సిద్ధనాగార్జున (క్రీ.శ 9వ శతాబ్ది) మొదలైన వారు తెలుగునేలపై వజ్రయాన బౌద్ధవ్యాప్తికి కృషి చేశారు.

బౌద్ధసాహిత్యం: మహాయాన ఆవిర్భావంతో సంస్కృత బౌద్ధ సాహిత్యం మునుపెన్నడూ లేనంతగా పుట్టు కొచ్చింది. 'మహాయాన' మనే పదం మనకు తొలిసారిగా *అష్టసాహస్రిక ప్రజ్ఞాపారమిత* గ్రంథంలో కనిపిస్తుంది. ఒక కథనం ప్రకారం, ఆచార్య నాగార్జునుడు నాగలోకంనుంచి *శతసాహస్రిక ప్రజ్ఞా పారమిత సూత్రాలను* సేకరించి శూన్యత, కరుణ భావనలను జన బాహుళ్యంలో బాగా ప్రచారం గావించాడు. కొంచెం లోతుగా ఆలోచిస్తే, *ప్రజ్ఞాపారమిత సూత్రాలు* కృష్ణా లోయలోని పూర్వశైల ఆరామాల్లో క్రోడీకరింపబడి వుండవచ్చునని విశదమౌతుంది.

మాధ్యమికవాదాన్ని ప్రతిపాదించిన తత్వవేత్త, ప్రసిద్ధ బౌద్ధాచార్యుడైన నాగార్జునుని *మూలమాధ్యమకారిక,* మధ్యమమార్గసారాన్ని అందించింది. *శూన్యతాసప్తతి, విగ్రహవ్యావర్తిని, వైపుల్య ప్రకరణ* లాంటి బౌద్ధ తాత్విక గ్రంథాలు; గౌతమిపుత్ర శాతకర్ణికి రాసిన సుహృల్లేఖ, రత్నావళి లాంటి లేఖాసాహిత్యం చతుస్తవంలాంటి భక్తివంతమైన స్తుతులను పోలిన గ్రంథాలు, ఆయన ఇతర రచనల్లో ముఖ్యమైనవి. నాగార్జునుని *ప్రజ్ఞాపారమిత సూత్రాలపైగల* ఒకేఒక వ్యాఖ్యానం చైనాలో మాత్రమే అందుబాటులో ఉంది. ఇన్ని రచనలు చేసిన గొప్ప బౌద్ధాచార్యున్ని మహాయాన

బౌద్ధులు రెండో బుద్ధునిగా కీర్తించారు. బుద్ధుడు ప్రవచించిన మధ్యమమార్గం, ప్రతీత్య సముత్పాదాలకు పర్యాయపదంగా నిలిచిన నాగార్జునుని శూన్యతా వాదం మహాయాన బౌద్ధానికి ఆయువుపట్టైంది. నాగార్జునుని శిష్యుడైన ఆర్యదేవుడు రాసిన చతుశ్శతకంలో నాగార్జునుని సిద్ధాంతాలను మరింత ప్రచారం గావించాడు. క్రీ.శ. 5వ శతాబ్దిలో మాధ్యమిక వాదం బుద్ధపాలితుడు, భావవివేకుడు, ప్రతిపాదించిన ప్రాసంగిక, స్వాతంత్రిక వాదాలుగా విడిపోయింది. బుద్ధ పాలితుడు మాధ్యమికతత్వాన్ని విశదీకరిస్తూ మాధ్యమిక కారికవృత్తిని రచించాడు. భావవివేకుడు మాధ్యమికవాద ప్రాముఖ్యతపై *కరతాల రత్న, తర్కజ్వాల, ప్రజ్ఞాప్రదీప* అనే గ్రంథాలను రచించాడు. చంద్రకీర్తి అనే మరో బౌద్ధాచార్యుడు *ప్రసన్న పాద, మాధ్యమిక అవతార* అనే గ్రంథాలను రాసి ఆ సిద్ధాంతాలను మరింత వివరించాడు.

జావాలోని బోరోబుదూరు స్థూపం

మహాయాన బౌద్ధులు సంస్కృతంలో *లేఖ, శతక, కారిక*లనే కొత్త సాహిత్యప్రక్రియలను ప్రారంభించారు. ఆచార్య నాగార్జునుని *సుహృల్లేఖ, రత్నావళి,* మాతృ చేతుని *కనిష్కలేఖ, చంద్రగోమిని శిష్యలేఖలు* ఈ కోవకు చెందినవే.

ధాన్యకటకానికి చెందిన సుధనుడనే ఒక ధనికుని కుమారుడు సంబోధిని పొందాలన్న తపనను వివరించే గండవ్యూహం అనే మరో ముఖ్యమైన రచన ఈ సందర్భంగానే వెలువడింది. మంజుశ్రీ ప్రోద్బలంతో, సుధనుడు బోధి అన్వేషణకోసం దక్షిణ భారతదేశంలోని ఎన్నో ప్రదేశాలు తిరిగి, 53 మంది ఆచార్యుల బోధనలను (వీరిలో 20 మంది మహిళలుండటం విశేషం) గ్రహించాడన్న ఆసక్తికర విషయాలను ఒక నవలలా వివరించే ఈ గ్రంథం ఆంధ్రదేశంలోనే రచించబడిందని పరిశోధకుల అభిప్రాయం. సుధనుని పర్యటనలను వివరించే 460 శిల్పాలను జావాలోని బోరోబుదూరు స్థూపంలో చూడవచ్చు. ఈ రచన అవతంసక సూత్రమనే ఒక పెద్ద గ్రంథంలో ఒక భాగంగా కూర్చబడింది. తథాగత గర్భ అనే భావన అంటే ప్రతి జీవిలోనూ బుద్ధత్వముంటుందన్న ఇతి వృత్తంతోసాగిన శ్రీమాల *సింహనాద సూత్రం* దక్షిణాసియా దేశాల బౌద్ధులపై ఎంతో ప్రభావాన్ని చూపింది. దక్షిణ లియాంగ్ వంశానికి చెందిన చైనా సామ్రాట్టు వూ-తి (క్రీ.శ. 7వ శతాబ్ది), జపాన్ రాకుమారుడైన షోతోకు తైషీ (క్రీ.శ. 7వ శతాబ్ది) మొదలైన ఎంతో మంది బౌద్ధ ప్రముఖులు *సింహనాద సూత్రం*పై వివిధ వ్యాఖ్యానాలు రాశారు. అలెక్స్ వేమన్ అనే బౌద్ధ పరిశోధకుడు మాత్రం ఈ రచన ఇక్ష్వాకుల కాలంలో ఆంధ్రదేశంలోనే జరిగిందని గట్టిగా నమ్మాడు.

క్రీ.శ. 4-5 శతాబ్దాల్లో కొద్దిపాటి సంస్కరణలతో ముందుకొచ్చిన బ్రాహ్మణ మత పునరుద్ధరణ ఉధృతిని మాధ్యమిక, విజ్ఞానవాద బౌద్ధాచార్యులు గట్టిగా ఎదుర్కోవాల్సి వచ్చింది. అందులో భాగంగా ఈ ప్రాంతంలోపుట్టి, బౌద్ధతర్క పితామహుడుగా కీర్తిగాంచిన ఆచార్య దిఙ్నాగుడు, *ఆలంబన పరీక్ష హేతుచక్ర, న్యాయముఖ ప్రమాణసముచ్చయా*లనే బౌద్ధ తత్వ, తర్కగ్రంథాలను రాశాడు. దిఙ్నాగునికి సమఉజ్జీ అనదగిన తిరుమలవాసియైన మరో బౌద్ధాచార్యుడు ధర్మకీర్తి తన *ప్రమాణ వార్తిక*లో దిఙ్నాగుని ఆలోచనలకు మరింత పదునుపెట్టి *ప్రమాణవినిశ్చయ, న్యాయబిందు, హేతుబిందు*లలో ప్రజ్ఞకు పెద్దపీటేశాడు. ఇక థేరవాద విషయానికొస్తే కోటనెమలిపురి (గుంటూరు జిల్లా)కి చెందిన ఆచార్య బుద్ధఘోషుడు *త్రిపిటక*లపై అట్టకథలనే వ్యాఖ్యానాలను, బౌద్ధవిజ్ఞాన సర్వస్వమనదగిన *విశుద్ధిమగ్గ* అనే గ్రంథాన్ని రాసి, థేరవాదం నిలబడ గలిగేట్లు చేశాడు.

సాహిత్యపరంగా చూస్తే, బౌద్ధ సంప్రదాయాలనుంచేకాక లౌకిక, శృంగారగాథల్ని కూడా పైశాచీ భాషలో సేకరించి

పొందుపరిచిన గుణాఢ్యుని బృహత్కథ దురదృష్టవశాత్తు కాలి బూడిదై పోయింది. అందులోని కొన్ని భాగాలు, బుద్ధస్వామి రచించిన బృహత్కథాశ్లోక సంగ్రహంలోనూ, క్షేమేంద్రుని *బృహత్కథామంజరి*లోనూ, సోమదేవుని *కథాసరిత్సాగరం* లోనూ లభిస్తున్నాయి. శాతవాహన రాజైన హాలుని *గాథాసప్తశతి*లో పల్లెపట్టుల్లోంచి సేకరించిన శృంగార భరితం, హాస్యపూరితమైన అనేకగాథలు చదవరులను అలరింప జేస్తాయి. ఆమాటకొస్తే హాలునికి, లీలావతికీ జరిగిన పెళ్ళిని వివరించే రచయిత ఎవరో తెలియని *లీలావతీ పరిణయమనే* ప్రాకృత గ్రంథంకూడా ఎంతో ఆసక్తికరంగా సాగిన మరో మహాకావ్యం.

కళ-కట్టడాలు : బుద్ధుని ధర్మంపట్లగల గౌరవ, విశ్వాసాలతో అప్పటికి అందుబాటులోనున్న శిల్పం, చిత్రం, సంగీత కళలను బౌద్ధధర్మ వ్యాప్తికోసం విరివిగా వినియోగించుకొన్నారు. ఇక కట్టడ పరంగా ఆలోచిస్తే, అప్పటి వరకూ చనిపోయిన వారిని పాతిపెట్టి, చుట్టూ రాళ్ళతో గోడలుగాపేర్చి, ఆపైన రాతిని కప్పి, అర్ధగోళాకారంలో మట్టిదిబ్బను ఏర్పరచే ఆచారాన్ని బౌద్ధశిల్పులు, స్తూపాకారాన్ని నిర్మించటంలో పాటించారు. ప్రతిస్థూపమూ నిర్వాణాన్ని సూచించటానికే కాక తక్కువ సొగసులతో అందంగా తీర్చిదిద్దారు. ఒక గుండ్రటి అరుగు (మేధి) మీద నీటిబుడగ ఆకారంలో అండమూ, దానిపైన చదరపు హార్మికం, కిందచుట్టూ ప్రదక్షిణాపథం, దానికి నాలుగు వైపులా నాలుగు వేదికలు, వాటిపై సిద్ధార్థ గౌతముని జీవితంలోని ఐదు ప్రధాన ఘట్టాలను సూచించే ఆయక స్థంభాలు, తరువాత స్థూపం వద్దకు చేరుకోటానికి తోరణాలు, ఒక్కోసారి మెట్లు కలిగి ఉండటం ఆంధ్రదేశ బౌద్ధ స్థూపాల ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. వీటిలో భట్టిప్రోలు, అమరావతి, నాగార్జునకొండ, చందవరం, జగ్గయ్యపేట, శంకారం మరియు శాలిహుండం ముఖ్యమైనవి. స్థూపంచుట్టూ కింది నుంచి 12 అడుగుల ఎత్తువరకూ బుద్ధుని జీవిత ఘట్టాలు, జాతక కథలను శిలాఫలకాలపై ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఆనాటి జనం, జంతువులు, చెట్లూ, చేమలూ, ఉట్టిపడేట్లు చెక్కిన ఈ శిల్పాలు ఆనాటి జీవన విధానాన్ని చూపరులకు విడమర్చి చెబుతున్నట్లుంటాయి. శిల్పాల్లోని నాట్యం చేసే వాళ్లు, వాద్యపరికరాలతో పాడేవాళ్లు, వారు ధరించిన దుస్తులు, ఆభరణాలు, తలకట్టు, ఆనాటికే సంగీత, నృత్యకళలు ఉన్నత స్థితిలో ఉండేవని తెలియజెబుతున్నాయి. నిర్మాణం, పునర్నిర్మాణాలకు ఐదుశతాబ్దాలు పట్టినా, కట్టడపరంగా పరిపూర్ణతను సంతరించుకొన్న అమరావతి స్థూపం దక్షిణ భారతంలోనే పేర్కొనదగిన స్థూపం. తరువాత చెప్పుకోదగ్గ స్థూపాల్లో నాగార్జునకొండ, గోలి మొదలైనవి ముఖ్యమైనవి. ధాన్యకటక మహాచైత్యానికిబయటి రాతి కంచెను ఆచార్య నాగార్జునుడే కట్టించాడని టిబెట్టు చరిత్రకారుడైన తారానాథుడు పేర్కొన్నాడు. శిల్పకళలో భారతదేశానికి తలమానికమనదగిన అమరావతి శిల్పం, ఆగ్నేయాసియా బౌద్ధస్థావరాలపై ఎంతో ప్రభావాన్ని చూపింది. గుంటుపల్లి వద్దగల బౌద్ధ గుహాలయాలు తొలితరానికి చెందిన గుహలేకాక, పశ్చిమ భారతదేశంలో వెలసిన కార్లే, భాజ, కన్హేరి, అజంతా గుహలను తొలచటానికి దారిచూపాయి. బుద్ధుని బొమ్మ మొదటిసారి ఎక్కడ చిత్రించారో, ఎక్కడ చెక్కారో ఇంత వరకూ తేలని సమస్యగా మిగిలిపోయింది. అయితే తరువాత కాలంలో బౌద్ధ శిల్పం గాంధార, మధుర, అమరావతి మూడు విభిన్న శైలిలో కొనసాగింది. ప్రాపంచిక విషయాలకు ధార్మికత జోడించి ఆధ్యాత్మిక భావనలను శిల్పాల్లో చెక్కటానికి శిల్పులు ఎంతగానో తపించి ఉంటారు. ఒకసారి వరవడి ఏర్పడినతర్వాత అన్నిబౌద్ధ స్థావరాల్లోనూ బౌద్ధశిల్పకళ నిరాటంకంగా కొనసాగింది. వివిధ రకాలుగా వివిధ మాధ్యమాల్లో వర్ణచిత్రాలుగానీయండి, శిల్పాలు గానీయండి – సృష్టించినన్ని బుద్ధుని ప్రతిమలు మరే ఇతర మనిషికి గానీ, దేవునికిగానీ, సృష్టించబడ లేదంటే ఆశ్చర్యం కలుగుతుంది.

ఆసియా దేశాలపై ప్రభావం : బుద్ధుని శాంతిపూర్వక ధర్మం పయనించిన ఆసియా దేశాలన్నిటిల్లో అక్కడి ప్రజల ఆలోచనావిధానాల్లోనో, ఆచారవ్యవహారాల్లోనూ, సామాజిక రంగాల్లోనూ ప్రస్ఫుటమైన మార్పులు తీసుకొచ్చిందనటంలో అనుమానం లేదు. అక్కడి ప్రజల్లో కారుణ్య భావన పెంపొంది నైతిక వర్తనతో లేనంత అరమరికలులేని శాంతియుత జీవన విధానాన్ని అలవరచుకోవటానికి తోడ్పడింది. క్రీస్తు శకంలోని మొదటి వెయ్యేళ్ళల్లో చైనానుంచి యాత్రికులు భారతదేశానికి, భారతదేశంనుంచి పండితులైన బౌద్ధాచార్యులు చైనాకు వెళ్ళటమేకాక, అనేక సంస్కృత బౌద్ధ గ్రంథాల్ని చీనీ భాషలోకి అనువదించారు. మనదేశంలో బౌద్ధధర్మంగురించి రాసిన ప్రతిమాటా ముందుగా చైనాకు, అక్కడినుంచి జపాన్, కొరియాలకు చేరుకొంది. దాదాపుగా అన్నిబౌద్ధశాఖలు ఈ

దేశాల్లో సత్యసిద్ధి, సన్లన్, నిర్వాణహుయెన్, తీన్‌తె, ఛాన్, ప్యూర్‌లాండ్ (సుఖావతి), షాషియంగ్ అనే పేర్లతో ధార్మిక కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాయి. వీటన్నిటిపై ఆచార్య నాగార్జునుని మాధ్యమికవాదం విపరీతమైన ప్రభావాన్ని చూపటమేకాక, టిబెట్, మంగోలియాల్లో ప్రధాన బౌద్ధతాత్వికంగా గుర్తింపు పొందింది. బోధిధర్ముడు స్థాపించిన జెన్ బౌద్ధం శూన్యవాదం ఆధారంగా పుట్టుకొచ్చిందే. మాధ్యమిక, యోగాచారవాదాలు రెండూ కలగలిసిన తంత్రయానమనే మరో బౌద్ధశాఖ, ప్రాచీన ఆరాధనా పద్ధతులను ఆసరాచేసుకొని దక్షిణాసియా దేశాలకుపాకి, ఎంతోమంది అనుచరులను ప్రోది చేయగలిగింది.

నౌకా వ్యాపారంలో మిగతా ప్రాంతాల కంటే ముందున్న ఆంధ్రదేశం ద్వారా బౌద్ధ, హిందూమతాలు దక్షిణాసియా దేశాలకు వ్యాపించాయి. నాగార్జునుకొండవద్ద సింహళ విహార మున్నట్లు బయటపడిన శాసనాధారం, *దంతవంశం, అట్టకథల్లో* పేర్కొన్న వివరాలనుబట్టి ఆంధ్రదేశానికి, శ్రీలంక, మియన్మార్‌లతో ప్రాచీనకాలంనుంచే సంబంధాలున్నట్లు తెలిసింది. థాయ్‌లాండ్, జావా, సుమత్రా, బోర్నియో, అన్నాంలలో ఉన్న బుద్ధ ప్రతిమలు, శిల్పాలలో అమరావతి బౌద్ధ శైలి కొట్టొచ్చినట్లు కనబడుతుంది.

ధాన్యకటకం, శ్రీపర్వత – విజయపురిగా పిలువబడిన నాగార్జునకొండవద్దగల బౌద్ధవిద్యాలయాలు దూరదేశాల ఎంతోమంది బౌద్ధపండితులను ఆకర్షించాయి. చీనీ బౌద్ధ యాత్రికుడు యువాన్‌చాంగ్ ధాన్యకటకంవద్ద కొన్నాళ్ల పాటు నివసించి *అభిధర్మాన్ని* అధ్యయనం చేశాడు.

మహోన్నత వైభవ ప్రాభవాలను చవిచూచిన బౌద్ధం, క్రీ.శ. 10వ శతాబ్ది తరువాత సన్నగిల్లడం ప్రారంభమైంది. తురుష్క ముష్కర మూకల దాడిలో అనేక విహారాలూ, విద్యాలయాలూ కొల్లగొట్టబడటమేకాక, అనేక బౌద్ధ గ్రంథాలయాలు మాడిమసైపోయి, జ్ఞానసైరాశ్యం దాపురించింది. ఏ నేలపై పెరిగి దాదాపు వెయ్యేళ్ళకుపైగా తిరుగులేని విశ్వాసంగా పాతుకుపోయిన బౌద్ధం అదే నేలనుంచి మెల్లగామెల్లగా నిష్క్రమించటం భారతదేశ చరిత్రలో అతిదారుణమైన విషయం. ఆంధ్రదేశంలో కూడా దాదాపు అదే జరిగింది. కాకతీయుల కాలం (క్రీ.శ. 13వ శతాబ్ది) వరకూ ఆదరించబడిన బౌద్ధం, అటుతరువాత క్రమేపీ కానరాకుండా పోయింది. శ్రీలంకలోని గదలదేనియ బౌద్ధ విహారంలోగల ఒక శాసనంలో 14వ శతాబ్దానికి చెందిన ధర్మకీర్తి అనే థేరుడు, ధాన్యకటక స్థూపానికి మరమ్మత్తులు చేయించాడన్న శాసనాధారంవల్ల ఆంధ్రదేశంలో బౌద్ధం కొనసాగుతుందనీ తెలియజేసే చారిత్రకాధారం. మెల్లమెల్లగా బౌద్ధసారాన్ని కొల్లగొట్టిన హిందూమతం, బౌద్ధధర్మాన్ని అనేక రకాలుగా తనలో కలుపుకొని మరింత బలపడి, బౌద్ధధర్మ ఉనికిని నామమాత్రం గావించింది. బౌద్ధంలోని నైతికత, తాత్వికతలను స్వీకరించిన హిందూమతం మరింత పుంజుకొని బలపడింది.

బౌద్ధంలోని హేతువాద దృక్పథం, సత్యసంధతలు హిందువుల్లో ప్రగాఢమైన ముద్ర వేసుకొన్నాయి. అన్నింటినీ వదులుకోవటమేకాక ఇంటిని విడిచిపెట్టివెళ్ళటం, పరమత సహనం, కరుణ, దానగుణం, సమానత, అహింసలనే బౌద్ధశీలాలు బౌద్ధానంతర హిందూమత ఆలోచనారీతుల్లో ప్రసరించాయని ప్రసిద్ధ చరిత్రకారుడు టాయన్ బీ అభిప్రాయం వెలిబుచ్చాడు. సత్కారీ ముఖర్జీ ఇంకొంచం ముందుకుపోయి "పైకి ఎట్లు కనబడినా ప్రతి హిందువు కూడా అంతరంగంలో బౌద్ధుడే" అన్నాడు. మనదేశంలో బౌద్ధం నిలదొక్కుకోలేక ఆసియా దేశాల్లోకెళ్లి సగంమందికి శరణాగతమై, పశ్చిమదేశాలకు కూడ వ్యాపించిన సంగతి తెలిసిందే.

ఇక్కడ చెప్పుకోవాల్సిన మరో సత్యమేమంటే, మనదేశంలోని మరే ప్రాంతంలో లేనన్ని బౌద్ధారామాలు ఆంధ్రదేశంలో ఉన్నాయి. దాదాపు ఇప్పటి వరకూ 150కిపైగా బౌద్ధ స్థావరాల ఉనికి బయటపడింది. గత వైభవ ప్రాభవాల నేపథ్యంలో బౌద్ధం ఇప్పుడిప్పుడే తెలుగునేలపై మళ్లీ మొగ్గ తొడగటం మొదలైంది. అనేక బౌద్ధసంఘాలు నెలకొని ప్రజల్లో బౌద్ధంపట్ల అవగాహనను పెంపొందిస్తున్నాయి. ఎన్నో విహారాలు, అధ్యయన, ధ్యానకేంద్రాలు ఇప్పటికే తమ కార్యకలాపాలను పరివ్యాపితం చేస్తున్నాయి. ఆర్య అష్టాంగమార్గం అందించిన జీవనవిధానాన్ని అనేకమంది అలవరచుకొని తమ జీవితాలను అర్థవంతంగానూ, సుఖవంతంగానూ, శాంతమయంగా తీర్చిదిద్దుకొంటున్నారు కూడా.

బౌద్ధ ధర్మాంకురసభ (కోల్‌కతా) వారిచే నడపబడుతున్న 'జగజ్జోతి' అనే పత్రిక నూరేళ్ల సంచికలో ప్రచురించబడిన ఇంగ్లీషు వ్యాసానికి ఇది అనువాదం.

బుద్ధుని జీవితం : ఒక నిశ్శబ్ద విప్లవం

- డి. చంద్రశేఖర్

గౌతమ బుద్ధుడు తన బోధనల్లో ఏం చెప్పాడో దాన్నే ఆచరించాడు, తానేది ఆచరించాడో అదే యితరులకు బోధించాడు. అటువంటప్పుడు, బుద్ధుని బోధనలుగాక ఆయన జీవితం ప్రత్యేకంగా మనకందించే సందేశం ఏమైనా వుంటుందా? అనే ప్రశ్న తలెత్తటం సహజం. ఖచ్చితంగా చెప్పాలంటే ఆయన బోధనలకు వేరుగా బుద్ధుని జీవిత సందేశం లేదు. అయితే, యిదేవిషయాన్ని మరోకోణంలో చూస్తే, బుద్ధుని ధర్మాన్ని ఆయన బోధనల ద్వారా మరియు వ్యక్తిగా ఆయన జీవితం ద్వారా కూడా అర్థం చేసుకోవచ్చని తెలుస్తుంది. మనం సాధారణంగా మొదటి పద్ధతిని అనుసరించటాన్నే చూస్తుంటాం. కాని వ్యక్తిగా బుద్ధునిలో ప్రస్ఫుటంగా కనిపించే లక్షణాలను ఆయన జీవితం నుండి అర్థం చేసుకోవటంవల్ల మానవుడిగా బుద్ధుడు, ఆయన బోధనలు కూడా మనకు మరింత సన్నిహితంగా, లోతుగా అర్థమయ్యే అవకాశం వుంది.

బుద్ధుని బోధనల్ని అత్యంత విశ్వసనీయంగా, వాస్తవ సంఘటనల సమేతంగా మనకందించే పాళీ త్రిపిటకాల్లో జ్ఞానోదయం ముందునాటి బుద్ధుని (సిద్ధార్థుని) జీవితం గురించి వివరించిన సందర్భాలు చాలా తక్కువ. జ్ఞానోదయం తరువాత ఆయన చేసిన బోధనల్లో యిందుకు సంబంధించిన విషయాలను సందర్భానుసారంగా అక్కడక్కడ ప్రస్తావించటం జరిగింది. ఈ విషయాలపై ఆధారపడి బుద్ధుని జీవితకథను మనం రేఖామాత్రంగా అర్థంచేసుకొనే వీలుంది.

బుద్ధుని సహచరులైన భిక్షువులకు ఆయన తొలినాటి జీవితం గురించి త్రిపిటకాలు నమోదుచేసిన దానికంటే ఎక్కువే తెలిసి వుండాలి. ఎందుకంటే, కొందరు భిక్షువులు ఆయనతో కలిసి ఆయన పుట్టి పెరిగిన కపిలవస్తునగరానికి వెళ్ళారు. కనుక, అక్కడ వారికి బుద్ధుని తొలినాటి జీవితవిశేషాలు తెలియటం చాలా సహజం. దీనికితోడు, యిరవైతొమ్మిది సంవత్సరాలపాటు గృహస్తుజీవితం గడిపిన సిద్ధార్థునితో కలిసి జీవించినవారు అనేకులు, పరివ్రాజకులుగా మారి తమ జీవితాంతం బౌద్ధభిక్షువులు, భిక్షుణిలుగా జీవించారు. వీరిద్వారా బుద్ధుని గత జీవితవిశేషాలు భిక్షు సంఘంలో ప్రచారం పొందటానికి ఎంతో అవకాశం వుంది. అయినప్పటికి పాళీగ్రంథాల్లో బుద్ధుని తొలినాటి జీవిత విశేషాలు ఎక్కువగా చోటుచేసుకోలేదు. ఇందుకు దారితీసిన కారణాల్ని బౌద్ధ రచయితలు, చరిత్రకారులు అంచనావేశారు. పాళీ త్రిపిటకాలు రూపొందేనాటికి, భిక్షుసంఘం బుద్ధుని జీవిత చిత్రణకంటే ఆయన బోధనల సారాంశమే ముఖ్యమైనదిగా భావించింది. 'ఎవరు ధర్మాన్ని దర్శించ గలుగుతారో, వారు తథాగతుని దర్శించుతారు' అని బుద్ధుడు చెప్పిన మాటలు భిక్షువులకు మార్గదర్శకం. అందుకే వారు ఆయన వ్యక్తిగత జీవిత విశేషాలపై పెద్దగా శ్రద్ధపెట్టలేదు. ఈ వ్యాసం వుద్దేశం కూడా బుద్ధుని జీవితవిశేషాలను అందించటం కాదు. పాళీ గ్రంథాల్లో మనకు లభించిన విషయాలపై ఆధారపడి, ఆయన మూర్తిమత్వంలో స్పష్టంగా కనిపించే కొన్ని విశిష్టమైన అంశాలను విశ్లేషిస్తూ, గౌతమ బుద్ధుని ధర్మాన్ని మరింత సన్నిహితంగా, లోతుగా వివరించే ప్రయత్నమే యిది.

సిద్ధార్థ గౌతముని గృహపరిత్యాగం గురించి భిన్నమైన కథనాలు ప్రచారంలో వున్నాయి. సాధారణంగా అంతఃపురానికే పరిమితమైన జీవితం గడుపుతున్న సిద్ధార్థుడు, ఒకరోజు విహారంకోసం బయటకువెళ్ళి ఒక వృద్ధుణ్ణి, రోగిని, శవాన్ని చూసి మనసు చలించటంతో యిల్లువిడిచి సత్యాన్వేషి అయినాడనేది వాడుకలోనున్న కథనం. తనను ప్రేరేపించిన విషయాలు ఏవైనప్పటికి, సిద్ధార్థుడు గృహస్తుజీవితాన్ని (గృహాన్ని మాత్రమే కాదు) వదలి వెళ్ళాడు; జీవితాంతం పరివ్రాజకుడిగా జీవించాలనే కృత నిశ్చయంతోనే యిల్లువిడిచి

డి. చంద్రశేఖర్, ఫోన్ : 9290091232

వచ్చాడని నమ్మటానికి, ఆయన ఆనాటినుండి గడిపిన యాభైఒక్క సంవత్సారాల జీవితమే సాక్ష్యం. మానవ జీవితంలోని దుఃఖాన్ని సమూలంగా తుదముట్టించటమే తన జీవితపరమార్థంగా ఎంచుకొని, ఆ దిశగా, సత్యశోధనకు నడుంబిగించిన గౌతముడు యిక ఏనాడూ వెనుతిరగలేదు. ఈ మహాసంకల్పమే బుద్ధుని జీవితం మనకందించే మొదటి సందేశం. వ్యక్తిగా, సామాజికంగా, మానవుని జీవితానికి సంబంధించిన అత్యంత మౌలికమైన సత్యాన్ని విస్పష్టంగా దర్శించగలిగినవారు యిటువంటి సంకల్ప బలాన్ని పొందుతారు. అష్టాంగమార్గంలో 'సమ్యక్ సంకల్పం' అనే అంశం దీన్ని తెలియజేస్తుంది.

బుద్ధుడు తనజీవితంలోని వివిధ దశల్లో – గృహస్తు, పరివ్రాజక, తథాగత దశల్లో ఎక్కడవున్నా తనచుట్టువుండే పరిసరాలను సున్నిత హృదయంతో, సునిశితమైన పరిశీలనతో గమనించేవాడని తెలుస్తుంది. ఆయన బోధనలుగా చెప్పబడే సుత్తపిటకంలో విస్తారంగా కనిపించే వివరణలు, ఉపమానాలు యిందుకు తిరుగులేని సాక్ష్యం. కొలనులోని పువ్వులు, అడవిలోనిచెట్లు, రాలిపడిన ఆకులు, గడ్డిమేసే పశువులు, పశువులకాపర్లు, ఆ కాలంలో వేగంగా విస్తరిస్తున్న రకరకాల వృత్తులు, వృత్తిపనివారు – క్లుప్తంగా చెప్పాలంటే, ఆయన దృష్టిలోపడినదేదీ అతని నిశితమైన పరిశీలననుండి తప్పించుకోలేదంటే అతిశయోక్తికాదు. ఉదాహరణకు, నిరంజర నది ఒడ్డునగల ఉరువేల గ్రామంలో కఠోరమైన ధ్యానాన్ని కొనసాగిస్తూనే, అందరు అల్పమైందిగా భావించే పశువులకావరి వృత్తిని ఆయన ఎంత నిశితంగా పరిశీలించాడో తెలుసుకోటానికి 'స్వస్తి' అనే పశువులకాపరి వృత్తాంతం చదివితే చాలు. ఇటువంటి గాథలు పిటకాల్లో కొల్లలుగా వున్నాయి. ఇలాంటి పరిశీలనానుభవం నుండి తన ధర్మబోధనల్లో అవసరమైన ఉపమానాలను ఎప్పటికప్పుడు ఎంచుకొని చెప్పటం, వాటిలోని అత్యంతసూక్ష్మమైన వివరాలు, చదివే పాఠకులకు, ఆశ్చర్యం కలిగించకమానవు. సుత్తాల్లో వివిధ సందర్భాలకు అతికినట్లుండే యీ ఉపమానాలకు ప్రత్యామ్నాయాలను సూచించటం దాదాపు అసాధ్యం అనిపిస్తుంది.

బుద్ధుని పరిశీలనాపాటవాన్ని మరింత చాటిచెప్పే మరో ముఖ్యమైన అంశం వుంది. తన బోధనల్ని వింటున్న శ్రోతల, మరీ ముఖ్యంగా, ఆయనతో వాదించాలని వచ్చే శ్రమణ, బ్రాహ్మణుల మనసుల్ని అప్పటికప్పుడు కలిగే కొద్దిపాటి పరిచయంతోనే ఆయన లోతుగా అర్థం చేసుకొనేవాడు. ప్రతి ఒక్కరికి వారివారి స్థాయినిబట్టి బోధించేవాడు. కొందరి ప్రశ్నలకు సవివరమైన సమాధానాలిస్తే, మరికొందరి ప్రశ్నలకు, తిరిగి ప్రశ్నించటం ద్వారా వారి ప్రశ్నను విశ్లేషించి, తమంతటతామే సరైన అభిప్రాయాలకు రావటానికి దోహదం చేసేవాడు. చివరకు మౌనంకూడా కొన్ని ప్రశ్నలకు సరైన సమాధానం అని చాటిచెప్పాడు. త్రిపిటకాల్లో తరచుగా కనిపించే "సతి-సంప్రజ్ఞానం" (ఎరుకతో కూడిన స్పష్టమైన గ్రహింపు), "యథాభూత జ్ఞానం" (ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకోవటం) అనేమాటలు యిటువంటి పరిశీలన ఫలితంగా రూపొందినవే అయివుండాలి. 'తాను పరిశీలిస్తున్న వస్తువు, వ్యక్తి లేదా సంఘటనకు సంబంధించిన ఏ అంశం కూడా తనదృష్టినుండి జారిపోకుండా, వాటన్నిటిని ఒకొక్కటిగా గ్రహించటం' అని యీ మాటలకు మనం అర్థం చెప్పుకోవచ్చు. ప్రపంచంలోని అన్నిటిపట్ల రాగరహితంగా వుండాలని బోధించిన తథాగతుడు, తానలా వుంటూనే వాటిని సంపూర్ణంగా అర్థంచేసుకోవటం నిజంగా అద్భుతమైన విషయం. ఇటువంటి సున్నితమైన, సునిశితమైన పరిశీలనా దృష్టి ఆయననుండి మనం నేర్చుకోదగిన మరో అంశం.

సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన విశ్వాసాలను, సిద్ధాంతాలను, ఆచారాలనుకాదని, వాటికి భిన్నమైనమార్గంలో పయనించటానికి ఎంతో ధైర్యం, సాహసం కావాలి. ప్రత్యేకించి, అప్పటివరకూ ఎవరూ నడవని కొత్తదారిలో నడవటానికి యివి మరింత అవసరం. ఎందుకంటే అలా నడిచేవ్యక్తి ప్రపంచం మొత్తాన్ని కాదని ముందుకుపోతున్నట్లే. బుద్ధుడు తన పరివ్రాజక జీవితపు మొదటిదశలోనే యోగులైన తన గురువులు చెప్పే బోధల్ని, ఆచరణను అనుభవపూర్వకంగా తప్పని భావించాడు. ఏ తటపటాయింపు లేకుండా వెంటనే వాటిని తిరస్కరించటమే గాక, తన గురువుల్ని వదిలి వచ్చేశాడు. ఆనాటికి ధార్మిక జ్ఞానరంగంలో వేదాలకుగల సాధికారతను ప్రశ్నించటానికి, వాటిని తిరస్కరించటానికి ఎంతో సాహసం కావాలి. బుద్ధుని సమకాలికులైన కొందరు, అటు తరవాత కాలానికి చెందిన ఎందరో తత్వవేత్తలు, శాస్త్రజ్ఞులు వేద ఉపనిషత్తుల్లో చెప్పినవాటికి భిన్నమైన వాదాలు కలిగివుండి కూడా, వాటి సాధికారతను బహిరంగంగా ప్రశ్నించటానికి వెనుకంజవేశారు.

కాని, బుద్ధుడు, మరికొందరు పరివ్రాజకులు ఏ తటపటాయింపులేకుండా యిందుకు సాహసించారు.

ఇంతకంటే జటిలమైన మరో అనుభవాన్ని బుద్ధుడు అంతర్గతంగా ఎదుర్కొన్నాడు. తన గురువుల్ని వదిలివచ్చిన బోధిసత్వ గౌతముడు, సత్యశోధనకోసం ఆత్మదండనాయోగాన్ని తనమార్గంగా ఎంచుకున్నాడు. కౌండిన్య తదితర మిత్రుల సహకారంతో దీన్ని అత్యంతనిష్టతో ఆచరించాడు. ఫలితంగా శరీరంచిక్కి, శల్యమై ఎముకల గూడులా మారాడు. ఈ తపశ్చర్యగురించి విని, ఆయన నివాసముంటున్న ఉరువేల పరిసరప్రాంత ప్రజలు తండోపతండాలుగా ఆయన్ను చూడటానికి వచ్చేవారు. అతని మిత్రులు (సంబోధిప్రాప్తి తరువాత బుద్ధుని తొలి శిష్యులు) కూడా, సిద్ధార్థుడు సమున్నత జీవితసత్యాన్ని కనుగొనే దశకు చేరుకున్నాడని భావించి, ఎంతో గౌరవభావంతో ఆయనకు సేవలు చేశారు. తన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా, ధ్యాన కారణంగా, ఆయనకు ఎంతో గౌరవం, పేరు ప్రతిష్ఠలు కలిగాయి. కాని యిటువంటి స్థితిలో, దాదాపు మృత్యువుకు చేరువైన, ఆయన ఆత్మదండనా యోగం నిరుపయోగం, శరీరం శుష్కించటంవల్ల దుఃఖ విమోచన కలగదు, శరీరం ఆరోగ్య వంతంగా, శక్తివంతంగా వున్నపుడే మనసు సత్యశోధనకు అనువుగా వుంటుందని గుర్తించాడు. దీన్ని గ్రహించిన మరుక్షణం ఆయన ఆత్మదండనాయోగాన్ని వదిలి ఆహారం తీసుకోవటం ప్రారంభించాడు. దీనితో 'సిద్ధార్థ గౌతముడు లక్ష్యసుద్ధి లేక ధ్యానాన్నునుండి జారుకున్నాడ'ని భావించి కౌండిన్య, తదితర మిత్రులు ఆయన్ను ఒంటరిగా వదిలి వెళ్ళిపోయారు. ఇతరులు చెప్పినదాన్ని తిరస్కరించే దానికన్నా, తాను నమ్మి ఆచరించినమార్గం తప్పని తెలుసుకున్నప్పుడు, దాన్ని వదులు కోవటానికి మరింత మనోబలం కావాలి. అందుకే ఒక పాశ్చాత్య రచయిత 'బుద్ధుని అంతరంగంలో ఒక తిరుగుబాటుదారుడు వున్నాడ'ని అంచనా వేశాడు.

ఇతరులు చెప్పిన వాటిపై మాత్రమేగాక ఆయన ఒక విధంగా, తనపైతానే 'తిరుగుబాటు' చేశాడు. 'సత్యశోధనా మార్గంలో ప్రతిబంధకాలైనప్పుడు యితరులు నిర్మించిన చట్రాలనేగాక, తనకుతాను నిర్మించుకున్న వాటిని సైతం బద్ధలుకొట్టి ముందుకు సాగాలనే సందేశం బుద్ధుని జీవితంలో అంతర్లీనంగా వుంది. అందుకే, తన బోధనల్ని కూడా లోతుగా పరిశీలించి, అనుభవపూర్వకంగా సరైనవనిపిస్తేనే ఆచరించమని ఆయన తన అనుయాయులైన భిక్షువులకు, ఉపాసకులకు బోధించాడు.

'జ్ఞానం వేదప్రమాణం' అనిచెప్పిన వైదికులు, మనుషులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణాల్లో ఏదోఒకదానికి మాత్రమే చెందుతారని చెప్పారు; మనిషి తన వర్ణం (కులం) తో మాత్రమే గుర్తించబడతాడని అన్నారు కాని, కులంపట్ల పూర్తి ఉపేక్షాభావంతో బుద్ధుడు, మనిషిని మనిషిగా మాత్రమే గుర్తించాడు. ఎటువంటి తటపటాయింపులేకుండా, ధర్మమార్గంలో నడవదల్చుకున్న వారందరిని భిక్షుసంఘంలోకి ఆహ్వానించాడు. కులాలతో నిమిత్తంలేకుండా అందరూ, జ్ఞానాన్ని, విముక్తి పొందటానికి అర్హులేనని చెప్పటం ఆనాడు ఒక విప్లవం. ఈ నిశ్శబ్ద విప్లవాన్ని నిరాటంకంగా కొనసాగించటంలో ఆయన ఎనలేని ధైర్యసాహసాలను ప్రదర్శించాడు. ధర్మమార్గంలో నడవదలచిన వారందరికి ఆయనలోని యీ లక్షణం స్ఫూర్తిదాయకం.

ఈనాటి ప్రపంచంలో వున్నట్లే, బుద్ధునికాలంలో కూడా అనేక వాదాలు (తాత్విక చింతనలు) ప్రచారంలో వున్నట్లు తెలుస్తుంది. ఆ కాలంలో విభిన్నమైన అరవైరెండు వాదాలు ప్రచారంలో వున్నట్లు పాళీగ్రంథాల్లో చెప్పబడింది. ఇదే కాలానికి చెందిన జైనగ్రంథాల్లో మూడువందల నలభైవాదాలు వున్నట్లు చెప్పబడింది. వీటిలో ఏది సరైంది లేదా ఆచరించదగింది అనేది తేల్చుకోవటం నిజంగా జటిలమైన సమస్యే. కొందరు మనిషిజీవితం, అతను చేసే చర్యలు, యీ

ప్రపంచం అంతా మిథ్య అన్నారు; కొందరు 'అన్నీ సర్వశక్తివంతుడైన పరబ్రహ్మ లేదా ఈశ్వరుని నిర్ణయం ప్రకారమే జరుగుతాయ'ని అన్నారు; యింకొందరు 'మనిషి జీవితంతోసహా ప్రపంచమంతా మార్చటానికి వీలుకాని సూత్రాలపై నడుస్తుందని, ఏవిధంగా చూసినా మనిషి చేతిలో ఏమీలేదని వాదించారు. సంబోధి ప్రాప్తికి చాలాకాలం ముందే బుద్ధుడు భిన్నమైన తాత్వికచింతనల్ని తెలుసుకున్నాడు. అయితే ఆయన వీటిలో సరైనది లేదా ఆచరించదగింది ఏది? అని ప్రశ్నించలేదు. ఎందుకంటే, ప్రచారంలో వున్న వాదాల్లో ఏదో ఒకటి సరైనమార్గ తీరాలన్న నియమం ఏమీలేదు. ఉన్నవన్నీ కూడా లోపభూయిష్టం, పాక్షికం అయ్యే అవకాశం లేకపోలేదు. కనక సిద్ధార్థుడు యితరులు చెప్పే వాదాల్లోని విషయంపై మాత్రమేగాక, వారి ఆచారణపై దృష్టి నిలిపాడు. ఆనాటి తాత్వికులంతా, సత్యాన్ని తెలుసుకోటానికి అనుసరిస్తున్న 'పద్ధతి' సరిగాలేనందువల్లే తమ ప్రత్యర్థులు దారితప్పారని వారిని విమర్శించారు. కాబట్టి సత్యాని తెలుసుకునే సరైన పద్ధతి ఏదో వుండి వుండాలి. దాన్ని అనుసరించటం ద్వారానే మనిషిలో సరైన మార్గాన్ని తెలుసుకోగలిగే అంతరంగ పరివర్తన కలుగుతుంది. ఆ పద్ధతిని అనుసరించి తగిన సాధన చెయ్యకుండా తానుకూడా సత్యాన్ని తెలుసుకోవటం సాధ్యపడదని ఆయన గుర్తించాడు.

ఈ అన్వేషణలో ఆయన అంతిమంగా కనుగొన్నదే అష్టాంగమార్గం, దాన్ని అనుసరించిన ఫలితమే సంబోధిప్రాప్తి. ఈ సంఘటనల మధ్య బుద్ధుడు అనుసరించిన వైఖరి స్వతస్సిద్ధమైంది, అంటే తనకుతానే రూపొందించుకున్నది. మనకు తెలిసిన ఆధారాల్నిబట్టి, యిటువంటి వైఖరి, ఏదోఒక స్థాయిలో, సంబోధిప్రాప్తికి చాలా ముందునుండే ఆయనలో వుంది. 'ఏ విషయమైనా నీకు నీవుగా తెలుసుకుని, దర్శించి, అనుభవపూర్వకంగా సత్యమనిపిస్తేనే దాన్ని అంగీకరించు' అని ఆయన భిక్షువులకు బోధించాడు. తనుబోధించిన ధర్మాన్ని 'వివేకవంతుడైన ప్రతివ్యక్తి తన అనుభవంద్వారా తెలుసుకోగలడ'ని చెప్పాడు. మనిషి స్వతంత్రంగా, స్వతసిద్ధంగా ఆలోచించాల్సిన అవసరాన్ని పైవిషయాలు తెలియజేస్తున్నాయి. ఇది కొరవడినప్పుడు బుద్ధుని బోధనల్ని అర్థం చేసుకొనే క్రమంలో పక్కదోవపట్టే అవకాశం ఎప్పుడూ వుంటుంది. ఈ విషయమే 'అత్తశరణ, అనన్యశరణ' (మీకు మీరే ఆధారం, యితరులపై ఆధారపడవద్దు) అనే రూపంలో బుద్ధుడు తన జీవిత చరమాంకంలో పదేపదే నొక్కి చెప్పాడు. ఈ మాటలకు నిదర్శనంగా ఆయన జీవితం సాగింది.

మనిషి తన మనసులోని ఆలోచనల్ని 'వున్నది వున్నట్లు' మాటల్లో వ్యక్తం చెయ్యటానికి స్పష్టత, నిజాయితీతోపాటు తగిన నైపుణ్యం కూడా వుండాలి. తాను చెప్పినదాన్ని చెప్పినట్లు ఆచరించటానికి పైన చెప్పినవాటితోపాటు ఎంతో సాధన, ప్రజ్ఞ అవసరం. మన ఆలోచనల్ని మాటలుగా, యీ రెండిటిని ఆచరణగా మలచటంలో మనం ఎన్నోసార్లు విఫలమవటాన్ని ఎవరికివారు తమ అనుభవాన్ని తరచిచూసుకుంటే తెలుస్తుంది. ఈ మూడింటి (మనోవాక్కాయకర్మలు: ఆలోచన, మాటలు, ఆచరణ) మధ్య సంపూర్ణమైన సమన్వయం సాధించటాన్ని ఆధునిక మనోవిజ్ఞానశాస్త్ర పరిభాషలో 'మూర్తిమత్వ సమగ్రత' అని పిలుస్తారు. సమ్యక్ సంకల్పం, సమ్యక్ వాక్కు, సమ్యక్ కర్మ అనే పేర్లతో యివి అష్టాంగ మార్గంలోవున్నాయి. అయితే వీటిమధ్య పరిపూర్ణమైన సమన్వయం సాధించటం ఒక అసాధారణమైన, అద్భుతమైన అనుభవమని చెప్పవచ్చు. ఇటువంటి సమున్నతమైన స్థితిని పొందిన గౌతమబుద్ధుడు, మనిషిలో మామూలుగా వుండే ఎటువంటి బలహీనతల్ని ప్రదర్శించలేదు. మూర్తిమత్వ సమగ్రతను సాధిచటంలో, ప్రపంచానికి యింతవరకు తెలిసిన పరిపూర్ణ నమూనాగా ఆయన నిలిచాడని బౌద్ధులుకాని వారు సైతం అంగీకరిస్తారు. తాను దీన్నిసాధించటమేగాక, సంకల్పశుద్ధి కలవారెవరైనా తగినసాధనతో దీన్నిపొందగలరని ఆయన బోధించాడు. పురాతన పాళీగ్రంథాల్లో తథాగతుడైన బుద్ధుని మూర్తిమత్వ సమగ్రత నిండుగా ప్రవహిస్తూ కనిపిస్తుంది. పాళీ సుత్తాలను వింటున్నా, చదువుతున్నా అది 'దాచినా దాగని' సత్యంలా మనముందు నిలబడుతుంది. బుద్ధుని బోధనల్ని అధ్యయనం చేసేవారికి, ఆచరించేవారికి యీ 'సమగ్రత' ఒక బోధనాంశంగా మాత్రమేగాక, మూర్తిమత్వలక్షణంగా ఎనలేనిస్ఫూర్తిని అందిస్తుంది.

ఇవి ఒకవ్యక్తిగా బుద్ధునిలో మనకు కనిపించే కొన్ని ముఖ్యమైన లక్షణాలు. బుద్ధునిలోగల లక్షణాలనే ఏకైక కారణంతో వీటిని మనం ఆదర్శంగా స్వీకరించాల్సిన అవసరం లేదు. మనిషి యీ లక్షణాల్ని పెంపొందించుకున్నప్పుడు అవి అతనికి, యితరులకు మేలుచేస్తాయని మనం స్వయంగా, అనుభవపూర్వకంగా నమ్మితేనే వీటిని అనుసరించాలి, అలా కాకుండా అవి మనిషికి కీడుచేస్తాయని నమ్మితేవాటిని తిరస్కరించాలి.

సమాధి స్థితి

- కళ్యాణమిత్ర సత్యనారాయణ గోయంకా

మనసును ఏదో ఒక ఆలంబనపైన నిలకడగా నిలిపి ఉంచితే అది ఏకాగ్రమవుతుంది. ధ్యానమగ్న మౌతుంది, అచంచలమౌతుంది. కాని చిత్త ఏకాగ్రత మాత్రమే సమ్యక్ (సరియైన) సమాధికాదు; ఉత్తమ సమాధికాదు. సమ్యక్ సమాధికోసం కుశలమవ్వాల్సి ఉంటుంది. పాపరహిత మవ్వాల్సి ఉంటుంది. ఇది చాలా అవసరం. కుశలచిత్తపు ఏకాగ్రతే సమ్యక్ సమాధి అనబడుతుంది –**"కుసల చిత్తేకగ్గతా సమాధి."**

"చిత్తము సమాధానమవ్వడమే సమాధి." సమాధానమంటే సమతుల్యతలో **ఆధానమగుట,** సమతలో స్థిరపడుట. విషయ – ఆలంబనము చిత్తాన్ని స్థిరపరచలేదు. అది చిత్త సమతుల్యతను పాడుచేసే తీరుతుంది. అందుకని కుశలచిత్తము యొక్క ఏకాగ్రతనే సమాధానమని గుర్తించాలి. దాన్నే సరైన సమాధిగా గ్రహించాలి.

రాగమయమైనచిత్తం కుశలమైందికాదు; ద్వేషమయమైన చిత్తం కుశలమైందికాదు; మోహమయమైన చిత్తం కుశలమైందికాదు. రాగద్వేషమోహముల ఆలంబనతో చిత్తమును ఏకాగ్రము చేసినప్పుడు ఏకాగ్రత ఐతే వస్తుంది కానీ సమాధి రాదు; **సమాధానము** రాదు. ఇలాంటి ఏకాగ్రత సమ్యక్ అయిందికాదు, శుద్ధమైందికాదు. ఆ ఏకాగ్రతలో మనమేలు నిహితమైలేదు. రాగ–ద్వేష–మోహాలపైన ఆలంబితమైన ఏకాగ్రత ఆయావిషయచింతనలోలీనమై పోతుంది. అలాంటప్పుడు అది కల్యాణకారిణి ఎలా కాగలుగుతుంది?

ఉదాహరణకు పిల్లి తన ధ్యాసనంతా ఎలుకమీద ఉంచినప్పుడు అది పూర్తిగా ఏకాగ్రచిత్తమై ఉంటుంది. తన ఆలంబన పట్ల ధ్యానస్థమై ఉంటుంది. ఎలుక బొరియ మీదనే దృష్టినంతా కేంద్రీకరించి అత్యంత ఏకాగ్రతను కలిగి ఉంటుంది. చేప కొరకు చెరువుఒడ్డున ఒంటికాలిపై నిలుచున్న కొంగ నీటిమీదనే తనధ్యాసను కేంద్రీకరించినప్పుడు అది కూడా ఏకాగ్రచిత్తమై ఉంటుంది. ఇక దానికి మరే విషయమూ పట్టదు. ఇదంతా ఎలుక కోసం, చేపకోసం, లోభం (రాగము)తో నిండిన మనసు యొక్క ఏకాగ్రత. ఇది సమ్యక్ సమాధి కాదు. ఇటువంటి ఏ సమాధి కూడా సమ్యక్ సమాధి కాదు, శుద్ధమైందీ కాదు.

ఇదే విధంగా యుద్ధభూమిలో శత్రువుకోసం మాటువేసి దాగిన సైనికుడు శత్రుకందకం మీదనే ధ్యాసపెట్టి ఎంతో ఏకాగ్రచిత్తుడై ఉంటాడు. శత్రువు అలా కందకం నుండి తల ఎత్తీఎత్తగానే తుపాకి పేలుస్తాడు. జంతువుల వేటలో మాటువేసిన వేటగాడు పూర్తి ధ్యాసతో తుపాకి గురి చూసుకొని కదలకుండా కూర్చుంటాడు. అతని చిత్తం ఎంతో ఏకాగ్రమై ఉంటుంది. వేటజంతువు కనిపించడమే ఆలస్యం – తుపాకి గుండు దిగబడినట్టే. ఇలా చెడు ఆలోచనలతో కూడిన ద్వేషమయమైన చిత్తం ఏకాగ్రమైతే అయింది కానీ కుశలమైన చిత్తం మాత్రం కాలేదు. కాబట్టి ఇలాంటి చిత్త ఏకాగ్రత సమ్యక్ సమాధి కాదు; శుద్ధ సమాధి కాదు.

ఏదో ఒక మత్తుపదార్థాన్ని సేవించి, మంచి నిషాలో మునిగిపోయిన వ్యక్తి, ఆ నిషాలో పూర్తిగా తన్మయుడై పోతాడు. అతని చిత్తం ఆ తన్మయత్వంలో లీనమై ఏకాగ్రతను కూడా పొందుతుంది. ప్రగాఢ నిద్రలో మునిగిపోయిన వానివలె సుషుప్త స్థితిని పొందుతాడు. వానికి లోపల, బయట ఏం జరుగుతోందో తెలుసుకునే తెలివి ఉండదు. ఇదే విధంగా ఎల్.ఎస్.డి.లవంటి మాదక ద్రవ్యాలను వాడినవ్యక్తి మాయామరీచికలను, సుందర స్వప్నలోకాలను దర్శిస్తూ వాటిలో పూర్తిగా తన్మయుడైపోతాడు. ఈ రెండు సందర్భాలలోనూ చిత్తం సమతను కోల్పోతుంది. సమతుల్యత నశించిపోతుంది. ఇలా విషమమైన చిత్తం ఆధారంగా వచ్చిన ఏకాగ్రత చిత్త సమాధానం కాదు. ఇలాంటి సమాధి సరియైన సమాధి కాదు, శుద్ధ సమాధి కాదు.

చిత్త ఏకాగ్రత కోసం భావావేశంతో కూడిన ఆలంబన కూడా తగినది కాదు. దీనివలన చిత్తము యొక్క శుద్ధసమత

తెలుగు సేత : డా. యన్.పి. సుబ్రమణ్యం, ఫోన్ : 9032797059

నశిస్తుంది. చిత్త సమతుల్యత పాడయి, అది రాగజన్యమైన ఆసక్తులలో మునిగిపోతుంది. భావుకత్వంలో లీనమై పోతుంది. ఏకాగ్రత కలుగుతుంది గానీ శుద్ధత్వం దూరమౌతుంది.

ఏ ఆలంబన మనకు ప్రియం కాదో, ఏ ఆలంబన మనకు అప్రియం కాదో, ఏ ఆలంబన పట్ల మనలో రాగం కలుగదో, ద్వేషం కలుగదో, ఆ ఆలంబన మనకు కావాలి. ఏ ఆలంబన మనలను మోహపు మొద్దు నిద్రలో మునిగిపోకుండా కాపాడుతుందో, ఏ ఆలంబన మనలను స్వీయ (అంతర) సమ్మోహనంలో, బాహ్య సమ్మోహనంలో పడనీయకుండా కాపాడుతుందో, ఏ ఆలంబన మనలను సుషుప్తికారకధ్యానాల నుండి రక్షిస్తుందో, ఆ ఆలంబన మనకు కావాలి. అది నిరంతరం చిత్తాన్ని మెలకువలో, జాగరూకతలో నిలబెట్టుకోడంలో మనకు సహాయపడగలదై ఉండాలి.

బాహ్యప్రపంచంలోని స్థూల ఇంద్రియసుఖాలు మనలను తన్మయత్వంలో ఎలాగూ పడేస్తాయి. కానీ ఆధ్యాత్మికత పేరుతో చెలామణి అవుతున్న సూక్ష్మ ఇంద్రియసుఖాలు కూడా మనకు తన్మయత్వాన్నే కలుగజేస్తాయి. కానీ ఈ తన్మయత్వం బంధం వేసే తన్మయత్వం. ముక్తినిచ్చేది కాదు. అతీంద్రియ సుఖాల పేరుతో ప్రాప్తించే ధ్యానసమాధులన్నీ కూడా మనల్ని బంధంలో కట్టి ఉంచేవే. కళ్ళుమూసుకున్నప్పటికీ ఏదోఒక దివ్య మనోహర రూపం, ఆకృతి, రంగు, ప్రకాశంలవంటివి కనిపించి వాటిలో చిత్తం ఏకాగ్రమవ్వటం, ఏవేవో లయబద్ధమైన, మధురమైన ధ్వనులు, నాదాలు మొదలైన వాటిపైన చిత్తం ఏకాగ్రమవ్వటం, ఏవో సుమధురసౌరభాల రసాస్వాదనలో చిత్తం ఏకాగ్ర మవ్వటం, ఏదో శరీరస్పర్శవల్ల జనించిన సుఖద పులకరింతల పైన చిత్తం ఏకాగ్రమవ్వటం – ఇత్యాది దివ్యానుభూతల పేరుతో ఉన్న సూక్ష్మస్థితులన్నీకూడా రాగరంజితమైనవే. మోహ బంధంలో కట్టిపడేసేవే. ఇవి మనలను ముక్తివైపుకు తీసుకువెళ్ళే సమ్యక్ సమాధులు కావు. సమ్యక్ సమాధికోసం పరిశుద్ధమైన ఆలంబన (ఆధారం)తో చిత్త ఏకాగ్రతను అభ్యసించే సాధకునికి కూడా ఇలాంటి అతీంద్రియ అనుభూతులు కలుగవచ్చు. కానీ వీటిని మార్గంలో ఎదురయ్యే మైలురాళ్ళుగా భావించి, వీటిని అంటిపెట్టుకోకుండా ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాకాకుండా వీటినే అంతిమ లక్ష్యంగా స్వీకరించి ఆగిపోతే మాత్రం మళ్ళీ రాగబంధంలో చిక్కుకుపోతాం. చిత్తవిముక్తి యొక్క అంతిమస్థితిని చేరుకోలేము. కాబట్టి ఎలాంటి అనుభూతి ఎదురైనా, దాన్నే పట్టుకొని వేళ్ళాడకుండా జాగ్రత్త వహించాలి. దాన్నే పట్టుకొని కూర్చుండిపోతే అది మన కాళ్ళకు సంకెళ్లయి పోతుంది. మన ప్రయాణానికి అడ్డుగోడ అవుతుంది. ఏదీ మనకాళ్లకు బంధం కారాదు. దేన్నీ మనం అడ్డుగోడ కానివ్వరాదు. ప్రతిక్షణం అత్యంత అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగితేనే అంతిమ లక్ష్యాన్ని చేరుకోగలుగుతాం.

శుద్ధసమాధికొరకు తగినఆలంబనను ఎన్నుకునేటప్పుడు మరో జాగ్రత్త కూడా తీసుకోవాలి. ఆ అలంబన మనల్ని సంప్రదాయపు ఉచ్చులో బంధించనిదై ఉండాలి. మనం ఎన్నుకున్న ఆలంబన ఏ సంప్రదాయానికో చెందిన రూపాకృతులకుగానీ, శబ్దోచ్చారణకుగానీ చిహ్నంగా ఉండరాదు. ఎందుకంటే ఆలంబన అందరూ నిస్సంకోచంగా స్వీకరించగలదిగా ఉండాలి. సమాజంలోని ఏ ఒక్క వ్యక్తికి కూడా దీనిని స్వీకరించడంలో అభ్యంతరం ఉండరాదు. సంకోచం ఉండరాదు. మనం ఎన్నుకొన్న ఆలంబన సమాజంలోని ఏ సంప్రదాయంవారికీ, ఏ వర్గంవారికీ ఇబ్బంది కలిగించేదిగా ఉండకూడదు. వారి మనసు నొప్పించేదిగా ఉండకూడదు. ఇది శీల–సమాధి–ప్రజ్ఞల మార్గం. సంపూర్ణ ముక్తిమార్గం. సర్వదా సార్వజనీనమైంది, సార్వదేశికమైంది. కాబట్టి మనం ఎన్నుకునే ఆలంబన కూడా సార్వజనీనమై, సార్వదేశికమై, సర్వోపయుక్తమై ఉండటం అత్యంత ఆవశ్యకం.

పైన పేర్కొన్న గుణాలన్నింటినీ కలిగి ఉన్న ఆలంబనగా మనం వచ్చే – పోయే శ్వాసను ఎన్నుకొన్నాం. అది కూడా సర్వథా విశుద్ధరూపంలో! విశుద్ధమంటే దీనితో ఏ శబ్దాన్నీ, నామాన్నీ, జపాన్నీ, రూపాన్నీ, ఆకారస్వరూపాలనూ జోడించం. కేవలం శ్వాస రాకపోకలపైన మాత్రమే ఎడతెగని జాగరూకత కలిగి ఉండే అభ్యాసం చేస్తాం. అది కూడా పూర్తిగా సహజమైన శ్వాస. దానంతటదే వస్తూ పోతూ ఉండే శ్వాస. అది దీర్ఘం (పొడవు)గా ఉంటే దీర్ఘంగా ఉందనీ, హ్రస్వం (కురచ – చిన్నది)గా ఉంటే హ్రస్వంగా ఉందనీ, బరువుగా ఉంటే బరువుగా ఉందనీ, తేలికగా ఉంటే తేలికగా ఉందనీ, స్థూలంగా ఉంటే స్థూలంగా ఉందనీ, సూక్ష్మంగా ఉంటే సూక్ష్మంగా ఉందనీ తెలుసుకుంటూ, ఉన్నదాన్ని ఉన్నట్లుగా గమనిస్తాం. సహజమైన శ్వాసను ఇలా ఆలంబన చేసుకున్నప్పుడు, మనం శ్వాసతో కసరత్తు చేయడం లేదని బాగా గుర్తుంచుకోవాలి. శ్వాస కేవలం ఆలంబన మాత్రమే. ఆలంబన ఎంత సహజంగా ఉంటే అంత మంచిది. కాబట్టి దాని సహజత్వాన్ని ఏ మాత్రం భంగపరచరాదు. అందులో ఏ మాత్రం జోక్యం చేసుకున్నా కృత్రిమత్వాన్ని పుట్టించిన

వాళ్ళమౌతాం. అది (ఆ కృత్రిమత్వం) ప్రకృతి సిద్ధంగా వాటికవే వెల్లడయ్యే సత్యాలను తెలుసుకోనీయ కుండా మనముందు అడ్డుగోడలను కడుతుంది. అలాగే సహజత్వానికి ఎదురు దిశలో పయనించిన వాళ్ళమవుతాం. సహజరీతిలో దానికదే వెల్లడయ్యే సత్యంనుండి దూరమైపోతాం.

ఈ చిత్తాన్ని ఏకాగ్రం చేసే పని ఎందుకు చేస్తున్నాం? చిత్తం ఏకాగ్రమయ్యే కొద్దీ అది సూక్ష్మము, తీక్షణము అవుతుంది. అంతిమమైన పరమసత్యాన్ని కప్పి ఉండే ఆవరణలనన్నింటినీ ఈ సూక్ష్మము, తీక్షణము అయిన మనసుతో చొచ్చుకుపోతూ చీల్చివేయగలం. ఆధ్యాత్మికతను నిరావరణంచేసి, ప్రజ్ఞాచక్షువు ద్వారా స్వీయసత్యాన్ని అనుభూతితో తెలుసుకుంటూ పరమసత్యాన్ని సాక్షాత్కారం చేసుకోడానికి ఇలా సూక్ష్మాతిసూక్ష్మంగా తయారైన మనసు మనకు సహాయపడే విధంగా తయారు చేసుకోవాలి. ఇలాంటి స్థితిలో ఆలంబనను ఎంత అకృత్రిమంగా ఉంచుకుంటే, అది అంత సహజంగా ఉంటుంది. మనం దారితప్పి చీకటి సందుల్లో తిరుగాడటంనుండి రక్షింపబడతాం. ఋజుమార్గంపై నిలకడగా పయనించగలుగుతాం.

ఉచ్వాస-నిశ్వాసలను ఆలంబనగా ఎన్నుకోడానికి ఇంకో కారణంకూడా ఉంది. మనసులోని వికారాలతో శ్వాసకు ప్రకృతిసిద్ధమైన సంబంధం ఉంది. ఎప్పుడెప్పుడు మనసు వికారాలతో వికృతమౌతుందో-కోపము, భయము, కామవాసనలు, ఈర్ష్య, లోభం, ద్వేషంవంటి వికారాలు మనసులో కలిగినప్పుడు - సహజంగానే మన శ్వాసలో మార్పొస్తుంది. అది తీవ్రంగా, స్థూలంగా మారుతుంది. మనసులోని వికారాలు తగ్గేకొద్దీ శ్వాసగమనం కూడా నెమ్మదైపోతుంది, సూక్ష్మమవుతుంది. సమాధి అభ్యాసం తరువాత, ప్రజ్ఞాక్షేత్రంలోప్రవేశించి మనం మన మనోవికారాల బంధనాల నుండి విముక్తి కోసం కృషి చేయాల్సి ఉంటుంది. ఇలాంటి స్థితిలో సహజ శ్వాసయొక్క రాకపోకల ఆలంబన అత్యంత ఉపయోగకరంగా ఉంటుంది. సాధనయొక్క తదుపరి దశలో ఇది మనకు సహాయకారిగా పనిచేస్తుంది.

స్థూలంగా ఉన్న శ్వాసను గమనిస్తూ-గమనిస్తూ చిత్తం ఏకాగ్రమయ్యేకొద్దీ, శ్వాస దానిసహజ సూక్ష్మతవైపు పురోగమిస్తుంది. బాగా సూక్ష్మమై సన్నబడిపోతుంది. అప్పుడప్పుడు అది సన్నని వెంట్రుకంత సన్నబడి, బయటికి వచ్చిన వెంటనేలోనికి పోవడం జరుగుతుంది. కొన్నిసార్లు మరీ సూక్ష్మమై సహజ కుంభకస్థితిదాకా వెళుతుంది. శ్వాసచలనం ఆగిపోయినట్లనిపిస్తుంది. అందుచేత మనకు మరొక విషయం కూడా స్పష్టమౌతుంది. మనం ఎన్నుకొన్న ఆలంబన స్థూలంనుండి సూక్ష్మానికి చేరవేసేగుణం కలది. ఇంకా ముందుముందు మనం మన లోలోపల దాగియున్న తెలియని సత్యాలనెన్నింటినో తెలుసుకోవాల్సి ఉంటుంది. అవి మరింత సూక్ష్మమైనవి కాబట్టే శ్వాస రాకపోకల ఆలంబన సరైన ఆలంబన; సర్వదా అనుకూలమైన ఆలంబన, అన్ని స్థితులలోనూ పనికొచ్చే ఆలంబన. మన అంతరమనసులో కర్మసంస్కారాల ఉత్తుంగ తరంగాలు ప్రతిక్షణం ఎగిసి పడుతున్నాయి. లోలోపల సంవేదనలు పుడుతూ - గిడుతూ నిరంతరంగా ప్రవాహమానమై ఉన్నాయి. అణువణువులో అసంఖ్యాకమైన స్పందనలు నిరంతరం నాట్యమాడుతూనే ఉన్నాయి. వాటన్నింటినీ తెలుసుకోవాల్సిఉంది. నిరంతరం మారుతూఉండే శరీర-చిత్తాల ప్రవాహస్వరూపాన్ని తెలుసుకోవాల్సి ఉంది. కానీ ఇదంతా అత్యంత సూక్ష్మ స్థాయిలో జరుగుతోంది. అక్కడికి చేరుకోడానికి మనం మన మనసును కూడా అతిసూక్ష్మంగా, తీక్షణంగా చేసుకోవాలి. కాబట్టి ముందుగా మనంనడుస్తున్న స్థూలశ్వాసయొక్క అవిరామ ప్రవాహాన్ని గమనించడం మొదలుపెట్టవలసి ఉంటుంది.

మనలోపల జరుగుతున్నదంతా అప్రయత్నంగా, దానంతటదే జరుగుతోంది. ఇది స్వతఃసిద్ధంగా నడిచే మనశ్శరీరాల అవిరామ ప్రవాహం. అంతరజగత్తులో అనుక్షణం జరుగుతున్న సృష్టి - లయాల ఈ అనాయాస ప్రవాహస్థితిని నిరీక్షించడానికి మనకు ప్రయత్న పూర్వకము (సాయాసము), అప్రయత్న పూర్వకము (అనాయాసము) ఈ రెండురకాలుగా పనిచేసే ఆలంబన అవసరమౌతుంది. ఎందుకంటే దాని ప్రయత్న పూర్వకగతిని చూసి తెలుసుకొని, వెనువెంటనే దాని అప్రయత్న పూర్వకగతిని నిరీక్షించే అభ్యాసం ప్రారంభించాలి గనుక, మన శరీరంలో శ్వాసకు ఈ ప్రత్యేకత ఉంది. దాన్ని మనం కావాలనుకున్నప్పుడల్లా ప్రయత్న పూర్వకంగానూ నడపగలిగినా, మన ప్రయత్నమేమీ లేనప్పుడు కూడా అది నడుస్తూనే ఉంటుంది. కాబట్టి మనం సాయాస (ప్రయత్న పూర్వక) స్థితి నుండి అనాయాస (అప్రయత్న పూర్వక) స్థితివరకు చేరుకోవడానికి, జ్ఞాతము (తెలిసినదాని) నుండి అజ్ఞాతము (తెలియనిదాని) వరకు చేరుకోవడానికి, సుపరిచితమైన నది ఈ ఒడ్డునుండి అపరిచితమైన ఆ ఒడ్డుకు చేరుకోవడానికి ఈ శ్వాస ఒక వంతెనలా పనిచేస్తుంది. అందుకని కూడా శ్వాస ఆలంబన సర్వదా ఉపయుక్తమైంది.

మనం అభ్యాసం ప్రారంభించిన శీల-సమాధి- ప్రజ్ఞా మోక్షముల ఈ మార్గం సాధనాక్షేత్రంలో మనల్ని ఎంత లోలోతుల వరకు తీసుకువెళుతుందంటే, అక్కడ మనం స్వాభావికంగానే పరమార్థసత్యాన్ని అనుభూతికి తెచ్చుకోగలుగుతాం. దీనికొరకు మనం ఈ క్షణంలో (వర్తమానంలో) అనుభూతికి వస్తున్న యథాభూత సత్యాన్ని నిరీక్షణ చేసే (చూసి తెలుసుకునే) అభ్యాసం చేయడం అవసరం. ఎందుకంటే అంతిమ పరమార్థసత్యం ఈ క్షణంలో సాక్షాత్కారమయ్యే సత్యమేగాని గడిచిపోయిన క్షణానిదిగానీ, రాబోయే క్షణానిది గానీ కాజాలదు. గడిచిన క్షణాలను మనం గుర్తుకు మాత్రమే తెచ్చుకోగలం. అలాగే రాబోయే క్షణాల గురించి ఊహలూ, కల్పనలూ మాత్రమే చేయగలం. కనుక పరమసత్యాన్ని సాక్షాత్కరించుకోవడంకోసం వర్తమాన క్షణాల్లో ప్రకటిత మవుతున్న స్థూలసత్యాలను సావధానంగా, జాగరూకతతో, ఎరుకతో గమనిస్తూ - గమనిస్తూ ఉంటే సూక్ష్మ సత్యాలపైన కమ్ముకున్న అజ్ఞానపు పొరలు తొలగుతూ పోతాయి. ఆపైన అనుభూతికి వచ్చే వర్తమాన సూక్ష్మ సత్యాల ఆవరణలను కూడా ఛేదిస్తూ సూక్ష్మాతిసూక్ష్మ స్థితిలో గల అంతిమ పరమసత్యాన్ని సాక్షాత్కరింప చేసుకోగలం.

దీనికోసం చిన్న చిన్న వర్తమాన క్షణాలలోకూడా జీవించగలిగే అభ్యాసం చెయ్యాలి. ఈ అభ్యాసమే మన మొత్తం సాధన యొక్క ఋజుమార్గం. ఇదే రాజమార్గం. ఈ క్షణంలో జీవించే అభ్యాసం చేయడంకోసం, ఈ క్షణం శరీరంలో జరిగే స్థూలఘటన, అనగా లోనికివచ్చే శ్వాస మరియు బయటికివెళ్ళే శ్వాసపట్లఎరుకను, జాగరూకతను పెంపొందించుకోవడం నేర్చుకోవాలి. ఇలా చేస్తున్నప్పుడు గతంలోని చేదు - తీపి జ్ఞాపకాలుగానీ, భవిష్యత్తుకు చెందిన చేదు - తీపి బయాందోళనలూ, కోరికలూగానీ మనసు మీద మేఘాలవలె కమ్ముకోకుండా జాగ్రత్త వహించాలి. కేవలం శుద్ధ శ్వాస రాకపోకల ఎరుకను, యథాభూత (ఎలా ఉంటే అలాంటి) శ్వాస రాకపోకల ఎరుకను మాత్రమే కలిగి ఉండాలి. భూత భవిష్యత్ కాలాల చేదు ఘటనలు, తీపి గుర్తులు, శంకలు, కల్పనలు మొదలైనవన్నీ రాగద్వేషాలను పుట్టిస్తాయి. ఎందుకంటే అవి ప్రియమైనవో, అప్రియమైనవో అయి వుంటాయి కాబట్టి, భూత-భవిష్యత్ కాలాలకు సంబంధించిన రాగద్వేషపూరిత జ్ఞాపకాలనుండీ, కల్పనలనుండీ చిత్తం ముక్తిపొంది వర్తమాన క్షణంలోని శ్వాసరాకపోకల ఎరుక మీద స్థిరపడుతూ ఉన్న కొద్దీ, చిత్తం రాగద్వేషాలనుండి విమోచనం పొందుతూ పోతుంది. అంతేకాదు. అది మెలకువతో ఉంది గనుక మోహం నుండి కూడా ముక్తి పొందుతుంది. శ్వాసను గమనిస్తూ ఉన్నప్పుడు మన మనసులో దానిపట్ల ప్రియమైన భావంగానీ, అప్రియమైన భావంగానీ జనించదు. దానిపట్ల ఆకర్షణ గానీ, వికర్షణ గానీ ఉండదు. రాగమూ కలగదు, ద్వేషమూ కలగదు.

శరీరంలో జరిగే సహజ ఘటనను ఆసక్తిలేని ఒక ప్రేక్షకుడిలా మాత్రమే చూడటం నేర్చుకుంటాము. భూత భవిష్యత్తుల బంధాలనుండి విముక్తులమై రాగద్వేషాల ఉచ్చు నుండి బయటపడి, ఈ క్షణంలోనే జీవించే మొదటి ప్రయత్నం మొదలుపెడతాం. బుడిబుడి అడుగులతో పడుతూ - లేస్తూ నడక నేర్చుకొనే చిన్న పిల్లవాడిలా ప్రారంభమైన ఈ ప్రయత్నం, నిరంతర అభ్యాసంతో అభివృద్ధి చెందుతూ, ఒక రోజు దృఢమైన, బలమైన, తడబడని అడుగులతో యాత్రను పూర్తి చేసే యోగ్యత కలిగినవారిగా మనలను తీర్చిదిద్దుతుంది.

సమ్యక్ సమాధిని పరిపుష్టం చేసుకోకుండా మనం ఈ క్షణపు లోలోతుల్లోకి దిగలేము. ప్రజాక్షేత్రంలో నిలదొక్కుకోలేము. సమాధిని సమ్యక్ రీతిలో పరిపుష్టం చేయడం కోసం చిత్తానికి ఈక్షణపు యథార్థ అనుభూతికి సంబంధించిన, కల్పనారహితమైన, నిర్దోషమైన ఆలంబనను ఇవ్వాలి. శ్వాస రాకపోకల ఎరుకే ఆ ఆలంబన. దీని ఆధారంగా ఈ క్షణంలో జీవించడం నేర్చుకుంటూ రాగవిహీనము, ద్వేషవిహీనము, మోహవిహీనము ఐన కుశల చిత్తం యొక్క ఏకాగ్రతను పరిపుష్టం చేసుకోవాలి. శరీరంతోనూ, మనసుతోనూ చేసే దుశ్చర్యల నుండి మనలను కాపాడుకోగలిగే సామర్థ్యాన్ని వృద్ధి చేసుకోవాలి. ప్రజ్ఞలోపుష్టిచెంది, మాలిన్యపూరిత చిత్త వికారాలను పెకలించి వేస్తూ, మానసిక దుష్కర్మలనుండి దూరంగా ఉండగలిగే శక్తిని పెంపొందించుకోవాలి.

ఈ విధంగా పొందిన శుద్ధసమాధి మంగళ దాయకమైంది. శుభాన్ని చేకూర్చేది. రండి సాధకులారా రండి! శ్వాస రాకపోకలపట్ల ఎరుక కలిగి ఉండే అభ్యాసం చేస్తూ సమాధిని పరిపుష్టం చేసుకుందాం! సమాధి పుష్టి చెందడం వల్ల శీలం కూడా పుష్టి చెందుతుంది. శీలము, సమాధి పుష్టి చెందినపుడు, ప్రజ్ఞ కూడా పుష్టి చెందుతుంది. శీల, సమాధి, ప్రజ్ఞల పరిపుష్టిలోనే విముక్తి ఉంది. వికారాలనుండి విముక్తి, దుఃఖాలనుండి విముక్తి, అవిద్య - అజ్ఞానాల నుండి విముక్తి.

సమాధి మార్గం నిజంగానే మంగళప్రదమైన మార్గం సుఖ - శాంతుల మార్గం. విముక్తి మార్గం.

ఆచార్య నరేంద్రదేవ్-బౌద్ధ ధర్మ దర్శన్

- సూర్యదేవర సంజీవ్‌దేవ్

మానవజీవితం ఒక మహోన్నత పరిణతి. ఆ పరిణతిధార మామూలుగా పైనుంచి క్రిందకు ప్రవహించక క్రింద నుంచి పైకి ప్రవహిస్తుంది. అది ఊర్ధ్వ ప్రవంతి. ఈ పరిణతిధారకు అనేక మార్గాలు తోడ్పడ్డాయి. విజ్ఞానాలు, కళలు, మతాలు, దర్శనాలు మొదలైనవెన్నో ఈ పరిణతిధారకు వేగాన్ని పరిపుష్టినీ ప్రసాదించాయి. వీటిలో మతాల సహకారం కొంత వెలుగునూ, కొంతచీకటినీ కలిగివున్నది, నిజానికి ఇందులో వెలుగుకంటే చీకటే ఎక్కువ. ఈ పరిణతిధారలో తోడ్పడినవన్నీ మార్గాలు గమ్యాలు కావు. ఒకనాటి మానవజీవితానికి మతం కొంతవరకు అవసరం అయివుండవచ్చు నేమో కాని నేటి మానవజీవితానికి మతం అవసరంలేదు. మానవ జీవితం మతాన్ని అధిగమించి మానవతలో ప్రవేశించాలి. మానవతకు మార్గదర్శి హేతువాదం.

ప్రతి మతానికి తన స్వంత దర్శనం ఒకటి వుంటూ వచ్చింది. అటువంటి వాటిల్లో బౌద్ధం ఒకటి. ఇటువంటి బౌద్ధదర్శనాన్ని గురించి రచించబడ్డ గ్రంథమే "బౌద్ధ ధర్మ దర్శన్." మహావిద్వాంసుడైన ఆచార్య నరేంద్రదేవ్ ప్రతిభావంతంగా రచించాడు. ఆచార్య నరేంద్రదేవ్ సోషలిస్టు నాయకుడిగా లోకానికి ఎక్కువ పరిచితుడు. ఆయన సాహిత్య జీవితంకంటే ఆయన రాజకీయ జీవితం ఆయనకు మహోపకారిగా రూపొందింది. ఆయన అహమ్మద్‌నగర్ కోటలో రాజకీయ ఖైదీగా వుంటున్న సమయంలో కావలసినంత తీరిక వుండటంవల్ల ఫ్రెంచ్ భాషలో వున్న "అభిధర్మకోశ" అనే బౌద్ధ దర్శన గ్రంథాన్ని హిందీలోకి అనువదించటం జరిగింది. అంతటితో ఆగక నరేంద్రదేవ్ బౌద్ధదర్శనాలన్నిటిని అవలోకన చేయడం ప్రారంభించాడు. వాటన్నిటి ఫలితమే ఈ "బౌద్ధ ధర్మ దర్శన్". ఈ గ్రంథంలోని విశిష్టత ఏమంటే బౌద్ధాన్ని గురించి, బౌద్ధ దర్శనాలను గురించీ మొత్తం అంతా ఒకే గ్రంథంలో రచించబడింది. ఇటువంటి సమగ్ర బౌద్ధ గ్రంథం భారతీయ భాషల్లో కాని మరి ఏ విదేశ భాషల్లో కానీ లేదు. బౌద్ధ దర్శనాలన్నీ మౌలికంగా ఒకే గ్రంథంలో లేవు. అవన్నీ విభిన్న గ్రంథాల్లో అస్తవ్యస్తంగా వున్నాయి. ఆచార్య నరేంద్రదేవ్ అత్యంత కృషిచేసి వాటినన్నిటి గురించి ఈ గ్రంథంలో విశదంగా విద్వత్పూర్ణంగా వివరించాడు. ఆయన హిందీ శైలి బలీయమైంది. ప్రస్ఫుటమైంది. అభివ్యక్తిశీలమైంది.

ఈ గ్రంథం అయిదు ఖండాలు గాను, ఇరవై అధ్యాయాలుగాను విభజించబడి వున్నది. మొదటి ఖండపు అయిదు అధ్యాయాల్లో బౌద్ధం పుట్టుపూర్వోత్తరాలు, స్థవిరుల సాధనా విధానాలు వర్ణించబడి వున్నాయి. ప్రథమ అధ్యాయంలో భారతీయ సంస్కృతిలోని రెండు ప్రధాన ప్రవాహాలను గురించి వున్నది. బుద్ధుడు జన్మించే సమయానికి దేశంలో రెండు ధార్మిక సంప్రదాయాలు వ్యాప్తిలోకి వచ్చి వున్నాయి. మొదటిది బ్రాహ్మణ పంథా, రెండవది శ్రమణ పంథా, మొదటి వారికి వేదాలు ప్రధానం, రెండవవారికి వేదాలు అప్రధానం. మొదటివారికి యజ్ఞయాగాదులు ముఖ్యం, రెండవవారికి అవి అవసరం

సూర్యదేవర సంజీవ్‌దేవ్ (1914-1999)

లేదు. అయితే వైదికులంతా ఆస్తికులే. శ్రమణులలో ఎక్కువ భాగం నాస్తికులు. ఆస్తికులు కూడా వుండేవారు. ఆస్తికతకు నాస్తికతకు భగవంతునితో సంబంధం లేదు, భగవంతుని అస్తిత్వంలో విశ్వాసం వుండటం ఆస్తికవాదం, అంటే పరలోకలోకంలో విశ్వాసం కలిగివుండటం, నాస్తికవాదం అంటే పరలోకంలో విశ్వాసం లేకపోవటం. ''నాస్తిపర లోకోయస్యనః'' అనే ఆనాటి శాస్త్రవాక్యాన్ని గ్రంథకర్త ఉదహరించాడు. ఈ వాక్యం మహావ్యాసకర్త అయినట్టి పాణిని సృష్టించింది. అందుకే బుద్ధుని కాలంలో భగవంతుని ఉనికికి అంత ప్రాధ్యానంలేదు. ప్రాధాన్యం ఎక్కువగా కర్మ సిద్ధాంతానికి, పరలోక వాదానికి వుండేది. బుద్ధుని సమకాలికుడుగా ప్రసిద్ధిగాంచిన అజితకేశ కంబల్ అనే ఆచార్యుడు, ఆనాడు నాస్తికుడుగా పేరు పొందాడు. ఆయనకు ఇహలోకమే కాని పరలోకంలేదు. మరణించక పూర్వంవున్న జీవితమే సత్యంకాని మరణానంతర జీవితంకాదు.

ప్రథమ ఖండంలోని మొదటి అధ్యాయంలో పైన పేర్కొన్న ఆనాటి రెండు చింతాస్రవంతుల విషయం మాత్రమే కాక బుద్ధుని ఆవిర్భావం, ఆయన సమకాలికులైన ఆచార్యులు, ధర్మప్రచారం బుద్ధుని అస్తమయం (పరినిర్వాణం) మొదలైనవి రచించబడి వున్నాయి. రెండవ అధ్యాయంలో బుద్ధుని ఉపదేశాల సార్వజనీనత, ఆయన మధ్యమమార్గం, బోధనలు పంచశీలాలు, మొదలైనవి వివరించబడి వున్నాయి. మూడవ దానిలో ధర్మప్రచారానికి సంబంధించిన భాషను గురించిన చర్చ వివరంగా వున్నది.

ఈ విషయంలో గ్రంథకర్త అంటారు – బుద్ధుడు ఆనాడు తన ఉపదేశాలను ఏభాషలో ప్రచురించాడు అని ఖచ్చితంగా తేల్చటానికి తగిన చరిత్రకాధారాలు అంతగా లభించటంలేదని బుద్ధఘోషుని అభిప్రాయం ప్రకారం బుద్ధుడు ఆనాడు ఉపయోగించిన భాష 'మాగధి' అని పాళీభాష మాగదిజన్యం. రీస్ డేవిడ్స్ అభిప్రాయం ప్రకారమైతే బుద్ధుని మాతృభాష కోశలభాష, ఆ భాషలోనే ఆయన ధర్మప్రచారం చేశాడని, కోశల రాజ్యప్రభావంవల్ల ఆనాడు కోశలభాష ఢిల్లీ నుంచి పాట్నావరకు, శ్రావస్తినుంచి అవంతి వరకు వాడుకలో వున్నది. రీస్ డేవిడ్స్ అభిప్రాయంప్రకారం కోశల భాషలోని వ్యావహారిక రూపం నుంచి పాళీభాష ఉత్పన్నమైంది.

గ్రంథకర్త బుద్ధుని భాషావిషయంలో ఒక నిర్ణీత అభిప్రాయానికి రాలేకపోయారు. భాషా విషయంలో బుద్ధుడు ఖచ్చితమైన ఒక మార్గాన్ని దేన్నీ అనుసరించలేదనీ, తన అనుయాయులందరకూ తన ఉపదేశాలను ఏ భాషలోనైనా ప్రచారం చేసుకునే అనుమతిని ఇచ్చినట్లు గ్రంథకర్త వివరిస్తారు. ఒకసారి బుద్ధుని శిష్యులిద్దరు బుద్ధునికి చెప్పారట బుద్ధ వాక్కులను ఎవరికి తెలిసిన భాషలో వారు ప్రచారం చేస్తున్నారు. కనుక ఆ విధంగా చేయకుండా బుద్ధ వాక్కులన్నీ క్రమబద్ధంగా సంస్కృతంలో వుండేలాగా ఆజ్ఞాపించమని, కాని బుద్ధుడు అందుకు అంగీకరించక తన వాక్కులను ఎవరి భాషలో వారు ఉపయోగించుకోవచ్చని అనుమతించాడు. (అనుజానామి భిక్ఖవే సకాయ నిరుత్తియా బుద్ధవచనం పరియాపుణిత్తు) వినీతదేవుడు, (క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దం) కథనం ప్రకారం, బౌద్ధులలోని సర్వాస్తివాదులు మహాసాంఘికులు సంస్కృతంలోను, సమ్మితీయులు అపభ్రంశంలోను, స్థవీరవాదులు పాళీ భాషలోను వ్యవహరిస్తుండేవారు.

బుద్ధుడు భాషా విషయంలో ఏ అడ్డంకులనూ ఏర్పరచక తన అనుయాయులకు సంపూర్ణ భాషా స్వేచ్ఛనిచ్చాడు. తన వాక్కులు ఏ భాషలో వ్యాప్తిచెందాలనే దానికికాక ఏ భాషలోనైనా సరే సక్రమంగా, లోతుగా, మార్పులేకుండా వ్యాప్తి చెందాలనే దానికి ప్రాధాన్యం ఇచ్చాడు. విషయం ప్రధానం, మాధ్యమం ప్రధానం కాదని బుద్ధుని అభిప్రాయం. బౌద్ధానికి సంబంధించిన ఆది సాహిత్యం పాళీభాషలోనే వుంది.

ఇక ప్రథమ ఖండంలోని చతుర్థాధ్యాయం అంతా 'నికాయాలు' సంబంధమైన వివరణతో నిండి వున్నది. బుద్ధుని మరణానంతరం నూరు సంవత్సరాలకు బౌద్ధ సంఘంలో భేదాభిప్రాయాలు తలెత్తటంతో సంఘంలో చీలికలేర్పడ్డాయి. వీరందరి మధ్య ఒక పరిష్కార మార్గం ఏర్పరచటానికి తూర్పు పడమర భిక్షువులు అంతా కలిసి ఒక సభచేసి బౌద్ధ మహా సంఘాన్ని కొన్ని నికాయాలుగా విభజించడం జరిగింది. ఈ నికాయలు మొత్తం 18. అవి ముఖ్యంగా నాలుగు ప్రధాన నికాయాల నుంచి విభజింపబడినాయి. ఆర్య, మహాసాంఘిక, ఆర్యస్థవిర, ఆర్యమూల సర్వాస్తివాద, ఆర్య సమ్మతీయ అనేవి నాలుగు ప్రధాన నికాయాలు (సంప్రదాయాలు). ఒక్కొక్క నికాయం దేశంలోని ఒక్కో ప్రాంతంలో వ్యాప్తిచెందింది. ప్రథమఖండంలోని ఆఖరిది అయిన పంచమాధ్యాయమంతా మానవుని అంతర్జగత్తుకు చెందిన సమాధిని గురించిన వివరణతో వుంది. లౌకికసమాధి అని, లోకోత్తర సమాధి

అని సమాధిని రెండుగా విభజించటం జరిగింది. ఈ అధ్యాయమంతా కూడా గహనమైన మనో విజ్ఞానానికి సంబంధించి వుంది. నిర్వాణాన్ని అందుకోటానికి బుద్ధుడు నైతిక రీతిలనేకాక మనో వైజ్ఞానిక రీతులను కూడ అనేకం సూచించాడు. విపశ్యనధ్యానం, ప్రజ్ఞ, శుభత్కరం, విద్య, ధర్మం, శీలం, ఉత్తమ జీవిక, సమాధి అనేవి ప్రధానాలు. వీటిలో సమాధికి ప్రధాన స్థానం. విపశ్యన అనేది కూడా విశేష ప్రాధాన్యాన్ని కలిగివుంది. ధర్మాలన్నీ అనిత్యాలుగా, దుఃఖమయాలుగా మారుతాయి. విపశ్యనను లోకోత్తర సమాధి అని అంటారు. ఈ ప్రథమ ఖండంలోని పంచమాధ్యాయంలో గ్రంథకర్త బుద్ధుని పాండితి, అభివ్యక్తి, అంతర్ దృష్టి, సమాలోచన, విషయవిశదీకరణ మొదలైనవి అపారమైనవి. ఒక వైపున పారిభాషిక పదాలు వాడుతూనే మళ్ళీ అవి సామాన్య పాఠకునకు అర్థమయ్యేలాగా సరళ హిందీ పదాల్లో వివరిస్తూ చాలావరకు విషయంలోని జటిలతను ప్రాంజలపరిచారు గ్రంథకర్త. ఈ ప్రథమ ఖండంలోని మిగతా నాలుగు అధ్యాయాలను అర్థం చేసుకోవడంవేరు, ఆ అయిదవ అధ్యాయాన్ని అర్థంచేసుకోవటం వేరు. మిగతావి ఎక్కువ భాగం బాహ్యస్థూల రేఖలు.

మహాయానం ఉత్పత్తి, దాని వికాసం, దాని దర్శనాలు, దాని సాహిత్యం మొదలైనవన్నీ ఈ ఖండంలో రచించబడినాయి. అశోకచక్రవర్తి బౌద్ధుడు. ఆయన కాలంలో బౌద్ధం మనదేశంలో విస్తరించడమే కాక దేశాంతరాలకుకూడా పయనించింది. అశోకుని సమయంనాటికి ఇంకా బౌద్ధులలో విగ్రహారాధన తలయెత్తలేదు. అదివరలో స్తూపాల్లోవున్న బుద్ధుని అస్తికలను బయటికితీసి 8400 నూతన స్తూపాలలో ప్రవేశపెట్టినట్లు చెపుతారు.

ద్వితీయ ఖండంలోని అయిదు అధ్యాయాలు కూడ మహాయాన బౌద్ధానికి సంబంధించినవే. మహాయానం ఉత్పత్తి, దాని వికాసం, దాని దర్శనాలు, దాని సాహిత్యం మొదలైనవన్నీ ఈ ఖండంలో రచించబడినాయి. అశోకచక్రవర్తి బౌద్ధుడు. ఆయన కాలంలో బౌద్ధం మనదేశంలో విస్తరించడమే కాక దేశాంతరాలకుకూడా వయనించింది. అశోకుని సమయంనాటికి ఇంకా బౌద్ధులలో విగ్రహారాధన తలయెత్తలేదు. అదివరలో స్తూపాల్లోవున్న బుద్ధుని అస్తికలను బయటికితీసి 8400 నూతన స్తూపాలలో ప్రవేశపెట్టినట్లు చెపుతారు. బుద్ధుని కాలంలో బౌద్ధం నైతిక ధర్మ ప్రధానం. వాస్తవికతను కలిగివుండేది. బుద్ధుడు తనను మానవుడుగానే చెప్పుకొన్నాడు. లోకోత్తర పురుషుడుగా చెప్పుకోలేదు. బుద్ధుని మరణానంతరం కొంతకాలానికి బుద్ధుని దైవంగా పూజించ ప్రారంభించారు. బుద్ధుడు ఏదైతే నిషేధించి పోయినాడో దానినే క్రమేణ ఆయన అనుయాయులు ఆచరించసాగారు. హేదువాదాన్నీ, నైతికమార్గాన్నీ బౌద్ధులు ఆచరించటంలో అభిరుచి కనపరచి బౌద్ధంలో ఒక లోకోత్తర వాతావరణాన్ని సృష్టించుకొని అందులో ఆనందాన్ని అన్వేషించసాగారు. అరూపసాధన రూపసాధనలోకి రూపాంతరం చెందసాగింది. గతించిన బుద్ధునికి దైవత్వం ఆపాదించి, ఆరాధించటం ప్రారంభించారు. ఇటువంటి వారంతా కలసి మహాయానం అనే పేరు పెట్టుకొని అదివరలో వ్యాప్తిలోవున్న మౌలిక బౌద్ధాన్ని హీనయానం అనే పేర పిలిచి కించపరచసాగారు. అప్పటినుంచే మహాయానం ఉద్భవించింది. గ్రీకులు కూడ ఈ మహాయానాన్ని స్వీకరించినప్పటి నుంచి వారు బుద్ధ ప్రతిమలను నిర్మించసాగారు. ఆ నిర్మించిన ప్రతిమలను ఆరాధించసాగారు.

మహాయానంలో బోధిసత్వులు ప్రత్యక్షం కాజొచ్చారు. హీనయాన బౌద్ధంలో నిర్వాణం చెందటం బౌద్ధుల ఆదర్శంగా వుండేది. మహాయానంలో వైయక్తిక నిర్వాణం స్వార్థపరంగా భావించబడి బోధిసత్వులుగా లోకంలో వెలసి మానవసేవ చేయటం లోకోత్తర జీవితపు చరమ ఆదర్శంగా ఎంచబడసాగింది. అవలోకితేశ్వర, ముంజుశ్రీ, మైత్రేయ మొదలైనవారెందరో బోధిసత్వులు మహాయానంలో సృష్టించబడటం జరిగింది. హీనయానంలో వాస్తవం తప్ప కల్పన లేదు, మాహాయానంలో. అలౌకిక శక్తులనేకం సృష్టించబడినాయి. ఈ విధంగా మహాయానం అంతా ఒక గొప్ప లోకోత్తర సత్తాగా రూపొందింది. ఇందులో బుద్ధుని ఉపదేశాలకంటే బుద్ధుని నామరూపాలకు ఎక్కువ ప్రాధాన్యం లభించసాగింది. హీనయానంలోని అష్టాంగమార్గానికి బదులు మహాయానంలో బోధిసత్వచర్య బాగా పాతుకపోయింది. హీనయానం అర్హత్వాన్ని సంపాదించటం, మహాయానం బోధిసత్వాన్ని సంపాయించటం. హీనయానానికి మరొక పేరు శ్రావకయానం. మహాయానికి బోధిసత్వయానం అనీ, అగ్రమానం అని కూడా పేర్లున్నాయి.

ఆచార్య నరేంద్రదేవ్ ప్రదర్శించిన సూక్ష్మ వివరాలనుబట్టి చూస్తే ఈ విషయాల్లో ఆయన జరిపిన గవేషణ అతి గహనమైందని తెలుస్తుంది. ఎక్కడెక్కడ గుప్తమైవున్న భోగట్టా అంతా ఇందులో వ్యక్తమైంది. మహాయాన బౌద్ధ గ్రంథాలన్నీ సంస్కృతంలో రచింపబడినవే. హీనయాన బౌద్ధ గ్రంథాలలో కూడా కొన్ని సంస్కృతంలో రచించబడినప్పటికీ ఎక్కువగా పాళీలో రచించబడినవే. హీనయానంలో అనేక శాఖలు ఏర్పడినట్లుగానే మహాయనంలో కూడ వివిధ శాఖలు ఏర్పడినాయి. మంత్రయానం, వజ్రయానం, తంత్రయానం శాఖలు వెలిశాయి. ఇవిగాక ప్రజ్ఞాయానం నుంచి రెండు దార్శనిక శాఖలు వెలిశాయి. మొదటిది మాధ్యమికవాదం, రెండవది విజ్ఞానవాదం. మాధ్యమికవాది విశ్వాసం ప్రకారం వస్తువులన్నీ స్వభావశూన్యాలు, ఇక విజ్ఞాన వాది విశ్వాసం ప్రకారం బాహ్య వస్తుసముదాయం అంతా కూడా మిథ్య అనీ, విజ్ఞానం మాత్రమే సత్యం అనీ, బోధిసత్వుడు అవసరం అయిన మానవులకు సహాయపడుతుంటాడు. మహాయానులకు ప్రాచీన నికాయలు అంగీకారాలే కాని హీనయానులకు మహాయాన గ్రంథాలు అంగీకారాలు కావు. మహాయానులు ఏమి చెపుతారంటే మహాయానం అనేది నవీనమైందేమీ కాదు. హీనయానపు ప్రామాణికతను రుజువు చేస్తున్నది. మాధ్యమకారికల వృత్తికారుడైన చంద్రకీర్తి కథనం ప్రకారం హీనయాన గ్రంథాలలో కూడ శూన్యతకు సంబంధించిన శిక్షణ దొరుకుతుంది.

బౌద్ధులు శూన్యతకు అర్థం ఏమీలేని ఖాళీప్రదేశం అనికాదు, కంటికి కనుపించని భాగం అని. కంటికి కనుపించనిదంతా ఏమీ లేనట్లు కాదు. దూరాలు కంటికి కనుపించవు. అందుకని ఆ దూరాల్లో ఏమిలేవని అర్థమా? మిల్లీమీటర్‌లో పది లక్షలవంతు కంటికి కనిపించదు. అందుకని అది లేనట్టా. శూన్యతకు రూపంలేందిగా తీసుకున్నారు. అంటే అరూపమైనదంతా శూన్యం క్రింద లెక్క. శూన్యం కానిదంతా రూపభేదంతో నిండివుంటుంది. శూన్యం అనేది ఏ రూపంతోనూ నిండివుండక అరూపంగా మాత్రమే వుంటుంది. శూన్యత అంటే అరూపంతోవున్న పూర్ణతయే!

తృతీయ ఖండంలో బౌద్ధ దర్శనానికి సంబంధించిన సామాన్య సిద్ధాంతాల వివరణ వున్నది. ప్రతీత్యసముత్పాద, క్షణ భంగవాదం, సేశ్వరవాదం, అనాత్మవాదం మొదలైన దర్శనాలు చర్చించబడినాయి. బౌద్ధులు కర్మవాదాన్ని గురించీ, నిర్వాణాన్ని గురించి కూడా తర్కపూర్ణమైన చర్చ వున్నది. చతుర్థ ఖండంలో బౌద్ధ దర్శనంలోని నాలుగు ప్రస్థానాలకు సంబంధించిన ప్రత్యేక గ్రంథాలను ఆధారం చేసుకొని చేసిన విషయ వివరణ, ఇదర దర్శనాలతో పోల్చిచూస్తూ చేసిన తులనాత్మక అనుశీలనా వున్నాయి. అసంగుని విజ్ఞానవాదం, వసుబంధుని శూన్యవాదం మొదలైనవాటి విస్తృత వర్ణన వున్నది. ఇక అంతిమ ఖండమైన పంచమఖండం అంతా బౌద్ధన్యాయానికి సంబంధించింది. ఇందులో ఆకాశవాదం, కాలవాదం గురించి లోతైన చర్చ సాగింది. న్యాయానికి (తర్కానికి) సంబంధించిన ప్రత్యక్ష, స్వార్థానుమాన, పదార్థానుమాన విషయాలను గురించి విపులమైన చర్చ వున్నది. గ్రంథాంతంలో ఈ విషయాలకు సంబంధించిన అనేక గ్రంథాలు పేర్లు ఇవ్వబడినాయి.

బౌద్ధానికి సంబంధించిన దర్శన శాస్త్రాలు, తర్కశాస్త్రాలు, శాస్త్రగ్రంథాలు మొదలైనవన్నీ సునిశితంగా సమాలోచించ బడినాయి. నాగార్జున తర్కం, వసుబంధుని తర్కం, దిజ్నాగుని తర్కం, ధర్మకీర్తితర్కం మొదలైనవన్నీ ఇందులో క్షుణ్ణంగా విశ్లేషించబడినాయి. తర్కం, తత్వం ఈ రెంటి ధారలూ లోతుగా ప్రవహించినాయి. వీటిని చదవటం సులభమేకాని అర్థంచేసుకోవడం కొందరికి మాత్రమే సులభం. వారికి కూడ సులభమైన సులభంకాదు. కఠినమైన సులభం. ఇది ఆకారంలో బృహత్ గ్రంథం, ఆలోచనలో బృహత్ గ్రంథం, విషయంలో బృహత్ గ్రంథం. దీన్ని చదవటానికి చాలా రోజులు పడుతుంది. చదివేదాన్ని అర్థంచేసుకోటానికి ఇంకా ఎక్కువ రోజులు పడుతుంది. దీని జటిల స్వభావాన్ని గ్రహించే నరేంద్రదేవ్ దీన్ని సాధ్యమైనంత సరళ శైలిలో వ్రాయ ప్రయత్నించారు. ఆయన హిందీ వాక్యాలు చాలా చిన్న చిన్నవిగా రచించారు. ఇందులోని భాష అర్థం కావటం చాలా సులభం. అయితే భాష అర్థం కావటం వేరు, ఆభాష అభివ్యక్తపరచే విషయం అర్థంకావటంవేరు. చదవటం అలవాటుంటే భాష అర్థమవుతుంది. విషయంతో ప్రాథమిక పరిచయమైనా లేనిదే విషయం అర్థం కాదు. అంటే ఈ గ్రంథం ఇద్దరకు అవసరంలేదు, అసలు విషయంతో బొత్తిగా పరిచయంలేని పామర పాఠకునకు, విషయం అంతా సమగ్రంగా తెలిసిన పండిత పాఠకునకు. మొదటి పాఠకుడు దీన్ని చదివినా అర్థంకాదు, రెండవ పాఠకుడు దీన్ని చదవనవసరమే లేదు, విషయంలో కొంత పరిచయం

ఉండి దాన్ని గురించి ఇంకా ఎక్కువ తెలుసుకోవాలని అభిలషించే పాఠకునకు ఇది ఎక్కువ ఉపయోగకరం.

బౌద్ధంలో తత్వాలను, తర్కాలను మాత్రమే కాక బుద్ధుని జీవితాన్ని కూడ సంగ్రహంగా వివరించారు. ఈ గ్రంథంలో బుద్ధుడుగా రూపొందకముందున్న సిద్ధార్థుని జీవిత విశేషాలు మాత్రమే ఎక్కువమందికి తెలుసు. బుద్ధుని సాధనకు సంబంధించిన వివరాలతో ఆయన మహాసంబోధిని పొందిన తరువాతి జీవిత విశేషాలతో చాలామందికి పరిచయం వుండదు. బుద్ధ జీవితానికి సంబంధించిన కొన్ని అరుదైన విశేషాలను, బుద్ధుని సమకాలిక పురుషులను గురించి బౌద్ధ సంఘపు నాటి పరిస్థితులను గురించి గ్రంథకర్త ఇందులో వివరంగా వర్ణించారు.

బుద్ధుడు జన్మించేనాటికి తాపసులకూ, వనవాసులకూ, సంఘంలో ఎక్కువ విలువ ఉండేది. అరణ్యాల్లో వుండి తపస్సు చేస్తేనే కాని ముక్తిలభించదు అనే విశ్వాసం ఆనాటికి పాతుకుపోయివుంది. అరణ్యాల్లో వుండే ఇటువంటి వారిని అరణ్యకులు అనేవారు.

బుద్ధుడు క్షత్రియ జాతిలో జన్మించాడు. ఆకాలంలో క్షత్రియులకు చాలా గౌరవం ఉండేదట. జనకమహారాజు క్షత్రియుడైనప్పటికీ గొప్ప నేతగా పేరొందాడు. బౌద్ధ, జైనమతాల స్థాపకులు క్షత్రియులే. "పాళీనికాయ" అనే గ్రంథంలో వర్ణవ్యవస్థను గురించి వ్రాస్తూ క్షత్రియులను మొదటి కులంవారుగా పేర్కొన్నట్లు ఇందులో గ్రంథకర్త తెలుపుతారు. బుద్ధుడు జన్మించిన శాక్యవంశపు రాజ్యం అంత గొప్పది కాదు, అది చిన్న రాజ్యమే. ఆనాడు భారతదేశంలో అంతగా విశాలమైన రాజ్యాలులేవు. తరువాత నందవంశీయులు సంఘటితపరచిన పిమ్మట చంద్రగుప్త మౌర్యుడు ఆ రాజ్యాన్ని పెద్దది చేశాడు. బుద్ధునికి పూర్వం పదహారు మహారాష్ట్రాలు వుండేవట. బుద్ధుని కాలంలో నాలుగు ప్రధాన రాజ్యాలు సంఘటితం అవుతున్నవి. 1. మగధ : ఇందులో అంగదేశం కలిసివుండేది. 2. కోశల: దీని రాజధాని శ్రావస్తి, కాశీ కలిసివుండేది. దీని పాలకుడు ప్రసేనజిత్. 3. కౌశాంబి : దీని ఏలిక వత్సరాజు ఉదయనుడు. 4. అవంతి: దీని రాజు చండప్రద్యోతుడు. ఈ నాలుగు రాజ్యాల రాజధానులు కూడ కొంతకాలానికి బౌద్ధ కేంద్రాలుగా రూపొందాయి.

బుద్ధుడు జన్మించిన శాక్యవంశపు రాజ్యం అంత గొప్పది కాదు, అది చిన్న రాజ్యమే. ఆనాడు భారతదేశంలో అంతగా విశాలమైన రాజ్యాలులేవు. తరువాత నందవంశీయులు సంఘటితపరచిన పిమ్మట చంద్రగుప్త మౌర్యుడు ఆ రాజ్యాన్ని పెద్దది చేశాడు. బుద్ధునికి పూర్వం పదహారు మహారాష్ట్రాలు వుండేవట. బుద్ధుని కాలంలో నాలుగు ప్రధాన రాజ్యాలు సంఘటితం అవుతున్నవి.

ప్రాచీన భౌగోళిక, సాంఘిక విశేషాలు కూడా ఈ గ్రంథంలో లభిస్తాయి. 26 వందల ఏళ్ళనాటి భారతదేశపు భౌగోళిక, సాంఘిక, రాజనైతిక, పరిస్థితులకూ నేటి వాటికీ ఏమాత్రం పోలికలుండటానికి వీలుండదు. సాంస్కృతికంగా కొన్ని పోలికలుండవచ్చు.

సిద్ధార్థుడు అందరు రాజకుమారుల వలె విద్య నార్జించినాడు. సిద్ధార్థునికి బాల్యంనుంచీ ప్రాపంచిక సుఖాలమీద కొంతవిరక్తి వుంటుండేది. జీవిత రహస్యాలను, మరణ రహస్యాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస వుండేది. ఆనాడు తాపసులకూ అరణ్యకులకూ విలువుండేది. తన తండ్రి దగ్గరకు కాల-దేవల మొదలైన తాపసులు వస్తుండేవారు. సిద్ధార్థునికి పరమార్థసత్యం తెలుసుకోవాలనే ఆరాటం ఎక్కువైంది. ఒకనాడు ఇల్లు వదిలి బయటికి వెళ్ళిపోయి కాషాయ వస్త్రాలు ధరించి భిక్షు వేషంలో సంచారం సాగించాడు. ఒక తపోవనంలో తెలుసుకున్నాడు బింబప్రకోష్ఠంలో "ఆలారకాలీకు" అనే తాపసి నివసిస్తున్నాడనీ, ఆయనకు నిఃశ్రేయస్సుకు సంబంధించిన జ్ఞానం అనంతంగా వున్నదనీ. అప్పుడు సిద్ధార్థుడు తపోవనం లోకి పోయి ఆ తాపసిని కలుసుకొని ఈ జరామరణ రోగం నుంచి జీవులు ఏవిధంగా విముక్తు లవుతారని ప్రశ్నించాడు. అప్పుడు "ఆలార" తన శాస్త్రాన్ని సిద్ధార్థునకు విశదపరచాడు. జగత్తుయొక్క ఉత్పత్తినీ, దాని వివర్తననూ వివరించాడు. తత్వోపదేశంచేసి నైష్ఠిక పద ప్రాప్తికి ఉపాయాలను కూడ సూచించాడు. కాని సిద్ధార్థునకు ఆ తాపసి ఉపదేశాలు సంతృప్తినివ్వజాలక పోయినాయి. ఇంకా విశేషాలను తెలుసుకొనేనిమిత్తం సిద్ధార్థుడు "ఉద్రక-రామపుత్ర" నివసించే ఆశ్రమానికి చేరుకున్నాడు. కాని ఆయన తత్వం కూడా సిద్ధార్థునకు నచ్చలేదు. వీరి శిక్షణంతా సాంఖ్యయోగానికి సంబంధించినది. వీరందరివల్ల

సంతృప్తిలభించక సర్వ శ్రేష్టమైన జ్ఞానోదయ ప్రాప్తిగ వేషణలో "ఉరువేల" చేరుకొని నేరంజనా నదీతీరాన తనలో కూడా శ్రద్ధ వున్నది, వీర్యం ఉన్నది, స్మృతి ఉన్నది, ఏకాగ్రత ఉన్నది, ప్రజ్ఞ ఉన్నది కనుక తాను స్వయంగా జ్ఞానోదయాన్ని పొందగలనని ధ్యాన నిమగ్నుడయ్యాడు.

ఆనాడు బుద్ధుని సమకాలికులు ఆరుగురు ప్రసిద్ధులున్నారు. అజితకేశ కంబల్, పూరనకస్సప, పకుధకాచ్చాయన్, మఖ్ఖిలిగోసాల్, సంజయవేలట్టిపుత్త, నిగంఠనాతపుత్త అనేవారు. వీరిలో నిగంఠనాతపుత్త జైనమతంలోని అంతిమతీర్థంకరుడైన మహావీరుడు. అజితకేశకంబల్ మతంలో సుకృతిలేదు. దుష్కృతిలేదు. ఇహంలేదు, పరంలేదు, ఇందులోని మిగతా నలుగురి వాదాలుకూడా విడ్డూరమైన వాదాలు. వీరిలో గోపాల్ అనే ఆయన అజీవక స్థాపకుడు. రకరకాలైన కష్టమైన తపస్సులను చేస్తుంటాడు. జేతవనం వెనక ఆయన నివాసం. ఈయన పంచాగ్నుల సెగలమధ్య నిలిచి తపస్సు చేసేవాడు. తాపసులైనందున వీరికి సమాజంలో ఆదరణ లభించేది. ప్రజలు శకునాల, స్వప్నాల ఫలితాలను గురించీ, ఇంకా అలౌకిక విషయాలను గురించీ వీరిని అడిగి తెలుసుకొంటూవుండేవాళ్ళు. అశోకుడు, ఆయన పౌత్రుడు దశరథునికి సంబంధించిన రచనల్లో అజీవకుల విషయాలు గోచరిస్తాయి.

అజీవకులుకాక ఆనాడు ఇంకా ఇతర సంప్రదాయపు తాపసులు అనేకమంది ఉండేవారు. వారంతాకూడా శరీరాన్ని వివిధ విధాలుగా కష్టపెడుతుండే వారు. కొందరు నారవస్త్రాలు ధరిస్తే మరికొందరు కుశవస్త్రాలు (గడ్డి వస్త్రాలు) ధరించేవారు. కొందరు కేశకంబళ్ళను ధరిస్తే మరికొందరు పక్షుల ఈకలను ధరించేవారు. కొందరు ముళ్ళమీద శయనించి తపస్సుచేసేవారు. వాతావరణ వైపరీత్యాలను సహించే నిమిత్తం ఎండలో, వానలో, మంచులో తమ తమ శరీరాలను బాధపెట్టేవారు. దుఃఖంద్వారా సుఖం ప్రాప్తిస్తుందని వారి విశ్వాసం. ఇటువంటి కష్టమైన జీవితాలను గడుపుతున్నారని సమాజంలో వారికి విలువవుండేది. వీరంతా ఏ ఉద్దేశ్యంతో తపస్సుచేస్తున్నారో తెలిసేదికాదు. కొన్ని అద్భుత శక్తుల ప్రాప్తినిమిత్తం తపస్సు ఆచరిస్తున్నారేమో అనిపిస్తుంది. ఏవో కొన్నిమహిమలను ప్రదర్శిస్తుండేవారు కూడా.

ఇటువంటి పరిసరాల్లో, పరిస్థితుల్లో బుద్ధుడు కూడ "నేరంజన" నదీతీరాన ఉండి ఆరు సంవత్సరాలపాటు ఇటువంటి బాధామయ తపస్సును ఆచరించాడు. బుద్ధునితో మరి అయిదుగురు భిక్షువులు కూడ వుండేవారు. జనన మరణాలమీద విజయం సాధించాలని వారి తపస్సు. వారు ఒక్క బియ్యపుగింజను తిని జీవించేవారు. దీని ఫలితం వారి శరీరాలు కృశించిపోయి ఎముకలూ చర్మమూ మిగిలి పోయాయి. అప్పుడు వారికి తెలిసింది. ఇటువంటి వైరాగ్య జీవితంద్వారా ముక్తిలభించదని, దుర్భలులు ముక్తి అందుకో లేరని, ఇటువంటి ఆలోచనతో బుద్ధుడు తన అనశవ్రతాన్ని వదిలి తిరిగి ఆహారం తీసుకోప్రారంభించాడు. ఆయన శరీరము, మనస్సుకూడ ఆరోగ్యాన్ని పొందిన తరువాత ఆయన తిరిగి ఏకాగ్రసాధన సాగించాడు. ఆ అయిదుగురు సహచరులకూ బుద్ధుని నూతనపద్ధతి నచ్చక ఆయన్ను వదిలివెళ్ళటం జరిగింది. అంతటితో సిద్ధార్థుడు రావిచెట్టు క్రింద కూర్చొని బోధి లభించనిదే ఆ ఆసనాన్ని వదలనని దృఢనిశ్చయం చేసుకొన్నాడు. రాత్రి ప్రథమ యామంలో ఆయనకు జ్ఞానంకలిగింది.

రెండవయామంలో దివ్యచక్షువులు ప్రకాశించినవి. మూడవ యామంలో ద్వాదశ ప్రతీత్య–సముత్పాద సాక్షాత్కారం జరిగింది. ఇక అరుణోదయ సమయంలో ఆయనకు సర్వజ్ఞత సాక్షాత్కరించింది. ఆనాటినుంచి సిద్ధార్థుడు బుద్ధుడు అయినాడు.

సిద్ధార్థునకు ఆ రాత్రంతా సంభవిస్తున్న ఈ నాలుగుదశల జ్ఞానప్రాప్తి, ఆచార్య నరేంద్రదేవ్ ఇందులో కొంత వైజ్ఞానిక చర్చ చేసి అది ఎంతవరకు సంభవం, ఎంతవరకు అసంభవం. అది ఎంతవరకు సత్యం, ఎంతవరకు అసత్యం అని కొంత మనోవైజ్ఞానిక విశ్లేషణ చేస్తే బాగుండేది. అది ఆయన చేయలేదు. తనకు దొరికిన, చారిత్రకాధారాలను మాత్రమే ఆయన ప్రదర్శించారు. కాని వాటిని గురించి తన స్వీయ అభిప్రాయాలను ఆయన వెల్లడించే శ్రమ అంతగా తీసుకోలేదు. వాస్తవాన్ని పెట్టి కల్పన కొలవటానికి ప్రయత్నించాలి. ఈ గ్రంథంలో ఎంత విడ్డూర విషయం, ఎంతటి అసంభావ్య విషయం వచ్చినా, దాన్ని వున్నది వున్నట్టుగా ఉల్లేఖించాడే కాని అటువంటి విడ్డూరాలు తాను స్వయంగా నమ్ముతున్నాడా నమ్మటంలేదా అనేదాన్ని గురించి ఆయన ఏమాత్రమూ అభిప్రాయ ప్రకటనలు చేయలేదు. బహుశా ఈ వస్తుగతవైఖరి చరిత్రకారులకు ముఖ్యమై వుంటుంది.

సిద్ధార్థునికి సంబోధిప్రాప్తి జరిగి బుద్ధుడు ఆయిన తరువాత ఏడు వారాలపాటు అక్కడ చెట్లక్రింద కాలాన్ని గడుపుతూ తన జీవితాన్నర్పించి పొందిన విముక్తి ఆనందాన్ని అనుభవించసాగాడు. ధర్మోపన్యాసాలు చేయటం మొదట్లో ఆయనకు ఇష్టంలేదు. కాని కొందరి అనురోధంవల్ల ఆయన ధర్మోపదేశాలు చేయటానికి ఇష్టపడటం జరిగింది. ఆయన తన ప్రథమ ధర్మోపదేశాన్ని తనను తపస్సు కాలంలో వదిలివెళ్ళిన అయిదుగురు సహచరులకూ "ఋషిపత్తన్" మృగదావనం (కాశీ సమీపపు సారనాథ్) లో చేశాడు. ఆ ప్రధమోపన్యాసం ఆషాడ పూర్ణిమ రోజున జరిగింది. దానిపేరే "ధర్మచక్ర ప్రవర్తనసూత్ర". ఆ అయిదుగురు సహచరులూ బుద్ధునికి మొదటి శిష్యులైనారు. క్రమేణా కొద్దికాలంలోనే బుద్ధునికి అరవైమంది శిష్యులు ఏర్పడ్డారు. వీరందరితో ఒక సంఘం ఏర్పరచబడింది. సన్యసించిన శిష్యులను భిక్షువులనీ, గృహస్థ శిష్యులను ఉపాసకులనీ అంటారు.

బుద్ధుడు తన శిష్యబృందంలోకి స్త్రీలను చేర్చుకొనటానికి ప్రథమంలో నిరాకరించాడు. కాని తన ప్రియశిష్యుడైన ఆనందుని సలహా ననుసరించి తన అభిప్రాయాన్ని మార్చుకొని మహాప్రజాపతి గౌతమిని భిక్షుణిగా స్వీకరించాడు. తన కుమారుడైన రాహుల్‌ను కూడా భిక్షువుగా చేర్చుకొన్నాడు. ప్రథమంలో ఏర్పడ్డ అరవైమంది శిష్యులనూ అక్కడక్కడ ధర్మప్రచారానికి పంపి తాను స్వయంగా "ఉరువేల"లో ప్రవేశించాడు. క్రమేణ పేదలు మొదలు రాజుల వరకూ కులతలు మొదలు సాధ్వీమణులవరకూ బుద్ధుని శిష్యులు, శిష్యురాండ్రు కాజొచ్చారు. బుద్ధుని జీవితకాలంలోనే బౌద్ధం చాలావరకు వ్యాపించింది. ఆయన మరణానంతరం ఖండాంతరాల్లో కూడా వ్యాప్తి చెందింది.

బుద్ధుని ఉపదేశాలు చాలా సరళంగాను, ఆచరణ యోగ్యంగా, నిత్యజీవితంలోని బాధలనుంచి విముక్తి పరిచేవి. జటిలమైన దార్శనిక తత్వాలను ఆయన బోధించేవాడు కాదు. మానవుడు దుఃఖాల్లో ఉంటున్నాడు. దుఃఖాలనుంచి బయట పడటమే మానవజీవితాదర్శం. అందుకే బౌద్ధం అంతగా ప్రజారంజకమైంది. కాని బుద్ధుని మరణానంతరం బౌద్ధంలో జటిలమైన వివిధ తత్వాలు, తర్కాలు, అనంతంగా సృష్టించబడటం జరిగింది. బుద్ధుడు తన జీవితంలో ఉపదేశించిన తత్వాలు చాలా సరళమైనట్టివి. బుద్ధుడు మధ్యమ మార్గాన్ని ఉపదేశించాడు. దేనిలోకూడ అతి అనేది పనికిరాదు. జీవితంలో అతి భోగం, అతి త్యాగం వాంఛనీయాలు కావు.

భిక్షువు ఆచరించవలసిన దశశీలాలు: 1. ప్రాణములు తీయను. 2. చౌర్యానికి పాల్పడను. 3. లైంగిక దురాచారాలకు పాల్పడను. 4. అబద్ధములు చెప్పను. 5. ప్రమాదమునకు నెలవులయిన మత్తు పానీయములను త్రాగను. 6. అకాల భోజనము చేయను. 7, 8. నృత్యము, గీతము, వాద్య సంగీతము, వీధినాటకాలు, మాలలు, గంధములు, విలేపనములు అలంకారములు, ఆభరణములు – ఈ వినోద విలాసాలకు దూరంగా ఉంటాను. 9. ఎత్తుగా పెద్దదిగా ఉన్నట్టి పడకమంచం మీద శయనించను. 10. ధనరూపమైన బంగారు నాణాలను వెండి నాణాలను దానంగా తీసుకొనను.

గృహస్తు ఆచరించవలసినవి పంచశీలాలను పరిశీలిస్తే దశశీలాలలోవున్న మొదటి ఐదు శీలాలను పంచశీలాల క్రింద పరిగణిస్తారు.

బౌద్ధంలో అష్టాంగ మార్గానికి చాలా ప్రాధాన్యం వున్నది. జీవితంలో భాగస్వామ్యం చాలా అవసరం. అటువంటి భాగస్వామ్యం వుండాలంటే నిత్యజీవితంలోని ప్రతిపనీ వక్రంగాకాక, సక్రమంగా వుండాలి. అందుకే బౌద్ధంలో అష్టాంగమార్గం ఏర్పాటైంది. 1. సరైన దృష్టి, 2. సరైన సంకల్పం, 3. సరైన వాక్కు, 4. సరైన కర్మ, 5. సరైన జీవం, 6. సరైన వ్యాయామం, 7. సరైన స్మృతి, 8. సరైన సమాధి.

ఆచార్య నరేంద్రదేవ్ రచించిన "బౌద్ధధర్మ దర్శన్" ఒక గొప్ప విజ్ఞాన సర్వస్వం. ఈ గ్రంథంలో లేని బౌద్ధ విషయం ఏ గ్రంథంలోను లేదు. బౌద్ధ గ్రంథాలన్నిటిలో వున్న విషయమంతా ఒక గ్రంథంలో ఉన్నది. ఆయన అపారభాషా పాండితి, అనంతమైన విషయ పరిజ్ఞానం, బాహ్య అనుశీలన, దార్శనిక అంతర్‌దృష్టి, తార్కిక శక్తి, విశ్లేషణాత్మక వివరణ, సంశ్లేషణాత్మక సమన్వయం, నిష్పాక్షిక చారిత్రక సత్యాన్వేషణ మొదలైనవి వాటికవేసాటి. ఈ గ్రంథానికి, గ్రంథకర్తకు, ఎన్ని విశేషణాలనుపయోగించనప్పటికి అవి అతిశయోక్తులు కాజాలవు. "బౌద్ధ ధర్మదర్శన్"లోని ప్రతిపుటకూడ ఒక జ్ఞానకిరణం! ప్రతివాక్యం కూడ ఒక సజీవ సత్యం!! ప్రతి వాక్కు కూడా ఒక సంబోధి!!!

విపశ్యన - మనోవిశ్లేషణ

- అన్నపరెడ్డి బుద్ధఘోషుడు

బుద్ధుడు 2500ల సంవత్సరాల క్రితం ఒక మహావిప్లవాన్ని తెచ్చాడు. అందరూ ఆత్మ ఉందని నమ్మే ఆ రోజులలో ఆత్మ లేదని చెప్పడమే కాదు, లేదనే విషయాన్ని సతిధ్యానం ద్వారా అనుభవంలోకి తెచ్చుకోవచ్చని నిరూపించాడు. అటువంటి భ్రమనుంచి బయటపడడం ద్వారా మనిషి ఆరోగ్యవంతమైన, ఫలప్రదమైన నిండుజీవితాన్ని జీవించవచ్చని చెప్పాడు.

19, 20వ దశాబ్దాలలో సిగ్మండ్ ఫ్రాయిడ్ మరో విప్లవం తెచ్చాడు. చేతనను పీఠం మీది నుంచి లాగి, అచేతనను ఆ స్థానంలో కూర్చోబెట్టాడు. అచేతనలో ఉండే ఘర్షణలు, కుంఠనాలు, తీరని కోర్కెలు మనిషి ప్రవర్తనను ప్రభావితం చేస్తాయని, వీటిని క్షాళనం చేస్తే మనిషి ఆరోగ్యవంతంగా జీవించవచ్చని చెప్పాడు. క్షాళన చేయడానికి మనోవిశ్లేషణను ప్రవేశపెట్టాడు. ఈ విధానాన్ని పాశ్చాత్య దేశాలలో – ముఖ్యంగా ఐరోపా, అమెరికాలలో మానసిక రోగులకు ఊరట చేకూర్చేందుకు విరివిగా ఉపయోగిస్తున్నారు. అయితే ఈ విధానంలో స్వాస్థ్యం పొందిన రోగులకు ఆ స్వాస్థ్యం ఎక్కువ కాలం నిలవడం లేదు. మరి ఆ స్వాస్థ్యం దీర్ఘకాలం కొనసాగడానికి, ఇటీవలి మానసికరోగ నిపుణులు, భారతీయ యోగులు ప్రతిపాదించిన యోగంతో – అందునా ముఖ్యంగా బుద్ధుడు ప్రతిపాదించిన అభిధమ్మ మూర్తిమత్వ సిద్ధాంతంతో పరపరాగసంపర్కంచెందించి ఉత్తమఫలితాలను సాధిస్తున్నారు.

ఈ దిశలో ముందుగ దృష్టి సారించిన వారు ఆర్.ఎమ్. బక్ (కెనడా) కారల్ గూస్టాఫ్ యూంగ్, అంగ్యాల్, అబ్రహోమ్ మాస్లో ఎరిక్ ఫ్రామ్ (డి.టి. సుజుకితో కలిసి 'జెన్ బుద్ధిజమ్ అండ్ సైకోఎనాలసీస్' రాశాడు), అలొవాట్స్ (సైకోథెరఫీ ఈస్ట్ అండ్ వెస్ట్ రాశాడు) ఎప్సిటీన్, ఎంగ్లర్ చెప్పాలంటే – ఇంకా ఎంతోమంది ఉన్నారు.

ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. అభిధర్మం లక్ష్యం కేవలం చేతన ధర్మాలను పరిశీలించడం కాదు. చేతనంమీద మూర్తిమత్వ అలవాట్లు విధించిన పరిమితులను దాటి, మనస్సుకు స్వేచ్ఛను కల్పించే బాటను వేయడం. ఆ బాట ఏమిటంటే, సతిధ్యానం ద్వారా, అనుభవాన్ని అవ్యవహితంగా ఒక ప్రేక్షకునిలా, నిర్లిప్తంగా, చూసినప్పుడు, స్వేచ్ఛ అంచులకు చేరతాడా ధ్యాని. ఇలాంటి వెసులుబాటు మనోవిశ్లేషణలో లేదు. ఫ్రాయిడ్‌కు అప్పటికి బౌద్ధం గురించి మిడిమిడి జ్ఞానం మాత్రమే ఉంది.

బుద్ధుడు ఆత్మ లేదన్నమాట నిజమే. కాని ఆయన లేదన్నది వ్యావహారిక ఆత్మ (నేను) ను కాదు. ఆయన చెప్పిందల్లా ఈ వ్యావహారిక (సంవృతి) ఆత్మకు కేవలతను, శాశ్వత సత్యాన్ని, ప్రత్యేక, వైయక్తిక సత్యాన్ని, పారమార్థిక స్థాయిని కల్పించవద్దని మాత్రమే చెప్పాడు. 'నేను' అనేది ఒక చెట్టు, స్త్రీ, రాయిలాగ (జాతి) నామవాచకం మాత్రమే అన్నాడు. దానికి ప్రత్యేకమైన ఉనికి సుబ్బయ్య, వెంకయ్యకులా ఏదీలేదు. మామూలుగా మనం చేసే పొరపాటేమిటంటే ఈ 'నేను' (ఆత్మ)కు ఎక్కువ వాస్తవికతను అంటగడతాము. మనం అంటగట్టే ఈ 'అధిక' వాస్తవికత 'నేను', 'నీవు'ల మధ్య వేరుతనాన్ని స్థిరం శాశ్వతం, అనుల్లంఘనీయం చేస్తుంది. ఈ వేరుతనాన్ని పిండికొట్టే శక్తి మనోవిశ్లేషణ సిద్ధాంతానికి, పూర్తి మేరకు సతిధ్యానానికి ఉంది. సతి ఉన్నత స్థాయికి చేరినప్పుడు, ఉందని భావించిన భ్రమైక ఆత్మ తొలగిపోవడంతో, ఆత్మ (నేను) ఉందనుకొన్న కారణంగా ఏర్పడిన వేరుతనం చెరిగిపోయి వ్యక్తి సర్వవ్యాప్త వాస్తవికతలో సంలీనం చెందుతాడు. అదే నిర్వాణం.

దీనికి ఒక చిన్నకథ: సతిధ్యానంలో ఉన్నత శిఖరాలకు చేరిన మణిభద్ర అనే టిబెటన్ మహిళ మట్టికుండతో నీళ్ళు

అన్నపరెడ్డి బుద్ధఘోషుడు, ఫోన్ : 8801714004

తెస్తూ జారిపడింది. కుండ పగిలి నీరు 'పరవళ్ళు' తొక్కుతూ భయటకు ప్రవహించాయి. దీనిని చూసిన ఆమె ఆకస్మికంగా విముక్త అయింది. ఇక్కడ జరిగింది ఏమంటే – పరిపక్వానికి చేరిన ఆమె సతిధ్యానం "ఆమెకు ఎరుక పరచదలచిన దానికి" – "ఒక నమూనాగా" ఈ "నీరు భళుక్కున ప్రవహించడం" పనిచేసింది. ఆ భళుక్కున ప్రవహించే నీటిలా, ఆమె చేతనం గూడ వేగంగా ప్రవహించి వాస్తవికతతో మమేకం అయింది. ఆమె చేతనం ఇలా పగిలిపోవడం– స్వేచ్ఛా విదళనం కావడం, మళ్ళి దూరం కాకుండ ముక్కలు కావడం ఈ విదళనం మనిషికి ఉన్న అంతర్గత అవసరాలలో ఒకటి. తాను కేవల వాస్తవాన్ని అనే విశ్వాసం నుంచి విముక్తం కావడం. ఇక్కడ రెండు అంశాలున్నాయి. ఒకటి తాను (తన ఆత్మ) నిత్యమనే విశ్వాసం. రెండు ఈ విశ్వాసంనుంచి బయటపడాలనే అంతర్గత అవసరం. ఈ రెండింటి మధ్య వైరుధ్యాన్ని శాస్త్రజ్ఞులు గుర్తించారు. మొదటిదానిని కొన్నాళ్ళు బలపరిచినా, పాశ్చాత్యులు బౌద్ధాన్ని చదవడం మొదలెట్టాక రెండోదాని వైపు మొగ్గారు.

ఇటువంటి మనోవిజ్ఞాన శాస్త్రవేత్త లందరికీ బౌద్ధం చెప్పేది ఒక్కటే : 'అసలు ఆత్మ ఉందా? అది నిత్యమా? అది నిజంగా నిజమా? విచ్ఛిన్నం కానిదా?–అనే ప్రశ్నలకు మామూలుగా మనుషులంతా "అవును" అనే సమాధానం చెబుతారు. కాని దీనికి సంబంధించి బౌద్ధుల అవగాహన వేరు. మామూలుగా ఆత్మ నిజంగా నిజమైనట్లే "పైకి కనిపించినా" – అది నిజంగా నిజం కాదు. "పైకి కనిపించడం మాత్రమే నిజం. అలా అది పైకి కనిపించడానికి" దారి తీసిన పరిస్థితుల (హేతు ప్రత్యాయాలు) కంటే అది వేరుకాదు. హేతు ప్రత్యయాల వలన అలా కనిపించిన 'ఆత్మ'కు, లేకపోయినా ఉందని భావించబడిన శాశ్వతాత్మకు మధ్య తేడాని గమనించడం ద్వారా ఆత్మాభివ్యక్తీకరణలను సరిగా ఆనందించవచ్చు. దీనిని బట్టి మనకు అర్థమయ్యేది ఏమంటే మనస్సుకు రెండు శక్తులు ఉన్నాయని : ఒకటి మబ్బులు పట్టించడం (చీకట్లోకి నెట్టడం), రెండు మబ్బులను చెదరగొట్టడం.

ఫ్రాయిడ్ ఈ మబ్బులను చెదరగొట్టడానికి అనేక పద్ధతులను – కలలకు అర్థం చెప్పడం, జోకులు (పరిహాసోక్తులు), సమ్మోహ నిద్ర, స్వేచ్ఛాసంసర్గం, బదిలీ – కనిపెట్టాడు. అయితే వీటన్నింటి వెనుక ఒక ప్రత్యేక, వివక్త, విస్పష్ట, విశిష్ట, ఐక్య ఆత్మ ఉందన్న అస్పష్టభావన దోబూచులాడుతుంది. అలాగే ఇవన్నీ ఒక అచేతనం ఉందనే భావనకు దారితీస్తాయి. అయితే ఫ్రాయిడ్‌కు బౌద్ధ అచేతన అర్థం కాలేదు. అతడు నిర్వాణాన్ని విచ్ఛిత్తి మరణంగా అపార్థం చేసుకొన్నాడు. కాని ఇటీవల వచ్చిన ఎంగ్లర్, ఎప్సిటేన్, జాన్‌సన్ గోల్‌మన్‌లు మొదలైన మానసికరోగ నిపుణులు ఈ తప్పిదాన్ని సరిదిద్దారు. బుద్ధునికి అతి చేరువలోకి వచ్చారు.

ఇప్పుడు మనం మనిషిలో ఆత్మ భావన (నేను భావన) మొదట ఎలా రూపుదిద్దుకొంటుందో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఇది తెలిస్తే తప్ప మన చర్చ ముందుకు నడవదు.

అప్పుడే పుట్టిన బిడ్డకు మనస్సు ఉండదు. ఆ ఆత్మ భావన ఉండదు. రక్తం, మాంసం, నరాలు, ఎముకలతో గూడిన కేవలం మాంసం ముద్ద మాత్రమే. తల్లి తాను వేరువేరు అనే జ్ఞానం అతనికి ఉండదు. తను వేరు, ఈ ప్రపంచం వేరు అనిగూడ అతడు గుర్తించలేడు. సంజ్ఞానాత్మక నాడీమండలం క్రమ పరిణామం చెందడంతో, చుట్టూ ఉన్న భౌతిక పరిసరం, సామాజిక పరిసరంలతో సంపర్కం చెందడంతో, తాను వేరు, తల్లివేరు, ప్రపంచం వేరు, వస్తువులు వేరు అనే "వేరుతనం" అతనిలో పాదు కొంటుంది. ఇలా "వేరుతనం" పాదుకొనక ముందర అతని అనుభవం అతని సర్వాంతర్యామిత్వాన్ని, సర్వశక్తిమంతిత్వాన్ని సూచిస్తుంది. ఎందుకంటె అతడు అంతా తానే, తానే అంతట

అనుకొంటాడు (అంటే అతనికి ఒక మనసు ఉండి పెద్ద వాళ్ళు ఆలోచించినట్లు ఆలోచించి అనుకొంటాడనుకోరాదు). పరిమితులు, వేరుతనంలేని అతని అనుభవం అలాంటిది. దానిని ఫ్రాయిడ్ స్వానురాగం (తనను తాను ప్రేమించుకొనుట) అని, మహాసాగరానుభూతి అని పిలిచాడు. ఇదొక మహాదానందం పరిమితులు లేనిది. తల్లి గర్భంలో మాయా ప్రపంచంలో ఈదులాడుతున్నప్పటి సుఖం – పురాణాల్లో విష్ణువు సముద్ర గర్భంలో పాన్పుపై తేలియాడుతూ పొందే ఆనందం. సంజ్ఞానాత్మక పరిణామంతో తాను వేరు, తల్లి వేరు, ఈ ప్రపంచం వేరు. ఇది కుర్చీ, ఇది రాయి అని గుర్తించడంతో అతనిలో 'నేను' భావన (మిధ్యాత్మ) ఏర్పడుతుంది. 'నేను' ఏర్పడడంతో 'నీవు' ఏర్పడుతుంది. 'నాది', 'నీది' ఏర్పడుతుంది. పరిమితులు ఏర్పడతాయి. ఈ వేరు తనంతో స్వర్గసుఖా (మహాసాగరానుభూతిని)ల్ని కోల్పోయి కష్టాలలో పడతాడు. మిగతా జీవితకాలం అంతా తనకు తెలియకనే (అచేతనంగానే – అంతర్గతంగానే) ఆ స్వర్గసుఖం కోసం – మళ్లీ తల్లి గర్భంలోనికి ప్రవేశించి అదే సుఖాన్ని జుర్రుకోవాలని అర్రులు జాస్తాడు. కాని అతడు ఎప్పటికి తిరిగి తల్లి గర్భంలోకి ప్రవేశించలేడు. కాకపోతే మహా అయితే భార్య గర్భంలోకి ప్రవేశించి అంత సుఖాన్ని కాకపోయినా కొంత సుఖాన్ని పొందుతాడు.

ఆ విధంగా వేరుతనంతో ఏర్పడిన 'నేను' 'మిధ్యాత్మ' సామాజిక, మత, రాజకీయ, మానసిక సమీకరణలతో బలం పుంజుకొని బలపడి, ఘనీభవించి, 'రాక్ ఆఫ్ రిబ్రాల్టర్' గా మారి ఒక 'సత్యం' అయి కూర్చొంటుంది. అంటే నేను పలాన, నా ఊరు పలాన, నా దేశం పలాన, నా అంతస్థు పలాన, నా మతం పలాన, నా భార్య పలాన, నా పార్టీ పలాన, నా ఉద్యోగం పలాన – ఇటువంటి 'పలాన'లతో, కొలతలతో – అంటే ఇటువంటి హేతు పత్యయాలతో నిర్మితమై, ఘనీభవించి, సత్త్వమై కూర్చొంటుంది. దీనిని మతం శాశ్వతాత్మ – జన్మపరంపరలలో కొనసాగే ఆత్మ, అఖండ ఆత్మ అని అంటుంది. ఇలా ఘనీభవించి, మానవుని సర్వ అనర్థాలకు, రోగాలకు (భ్రమలకు) మూలమైన ఈ ఆత్మ డొల్లతనాన్ని విపశ్యన ద్వారా బౌద్ధం ఎండగట్టింది.

ఈ విపశ్యన ధ్యానాన్ని ఆశ్రయించి మానసికారోగ్యాన్ని చేకూర్చాలనుకొనే మానసిక వైద్యులు బౌద్ధంతో ఏకీభవిస్తున్నారు. ఇలా ఏర్పడి ఆత్మలో వారు రెండు అంత్యాలను చూస్తున్నారు. You have to be somebody before you become no body అంటున్నారు. అంటే ఒకడు కోచి కావాలని, నకోచి కావాలంటే, ధ్యానానుభవం విప్పారాలంటే ఎంతో కొంత వ్యవస్థీకృత ఆత్మ ఉండాలి. అంటే ఈ వ్యవస్థీకృత ఆత్మ ఇంతకు ముందు నే చెప్పిన శాశ్వత శిలా సదృశ ఆత్మకాదని గుర్తించాలి. ఇక్కడ ధ్యానికోచి నుంచి నకోచికి ధ్యాన ప్రక్రియలో పయనిస్తాడు. దీనికిగాను వారు మూర్తిమత్వ నిర్మితిలో రెండు ఉపనిర్యాలను గుర్తించారు. అవి ఒకటి ఆదర్శాత్మ, రెండు ఆత్మాదర్శం. ఆత్మ తనను గూర్చి తను ఏర్పరుచుకొన్న భావనయే ఆదర్శాత్మ. ఇది పరిపూర్ణం, గాఢం, ఘనం, నిత్యం, రహస్యం విశ్వాసానికి మూలం ఒకప్పుడు తల్లి గర్భంలో పొందిన స్వానురాగ, మహాసాగరానుభూతులను తిరిగి పొందాలనే ఆదర్శాన్ని ముందుంచుకొన్నది ఆత్మాదర్శం. ఈ రెండింటి మధ్య తేడా మొదటిది సత్త్వం అయితే రెండోది సంభూతం చెందేని, మరొకటి మారేది becoming. మొదటిది ఏది ఉందో దానిని చెబితే, రెండోది దేనిని సాధించాలో దేనిగా మారాలో దానిని చెబుతుంది. ఈ మనోవిశ్లేష శాస్త్రజ్ఞుల ప్రకారం సాధించ వలసింది ఏమంటే–తల్లి గర్భంలో తాను పొందిన పరిపూర్ణత, సర్వశక్తిమంతతో, మహానందం – స్వానురాగం, మహాసాగరానుభూతులను తిరిగి పొందడమే.

సంప్రదాయ మనోవిశ్లేషకులు విపశ్యనా ధ్యానంలో జరిగేది శైశవ స్వానురాగ స్థితికి ప్రతీపగమనమే అంటారు. మరి బుద్ధుడు ఆదర్శాత్మ మిధ్యా అన్నాడుగదా అంటే మాటాడరు.

థేరవాద అభిధర్మ ధ్యాన విధానాన్ని కూలంకషంగా ఞానమోలి, ఞానపోనిక, గోల్‌మన్, ఎఫ్టీన్‌లు అధ్యయనం చేశారు. అందులో రెండు విభాగాలను గుర్తించారు. ఒకటి సమాధి లేక ఏకాగ్రత, రెండు సతి. సమాధిలో, ఏకాగ్రతలనే అవధానం ఒకే వస్తువుపై కేంద్రీకృతం అవుతుంది. ఇది అనివార్యంగా 'సమత'కు తీసుకువెళ్తుంది. సతిలో అవధానం క్షణ క్షణం మారే ప్రపంచానికి అనుక్షణం ఎరుకలో ఉంటుంది. ఈ రకమైన అవధానంలో ఆలోచనలను, ప్రతిమలను, సంవేదనలను–ఇంకా చేతననుగూడ–అన్నింటిని ప్రవాహంగా చూడడం జరుగుతుంది. ఈ ప్రవాహాన్ని మనస్సు–శరీర (నామ రూపం) ప్రవాహంగా గ్రహించడం జరుగుతుంది. ఈ విధమైన నామ–రూప అస్థిర, అవైయక్తిక, తాత్కాలిక

మూర్తిమత్వ స్వభావాన్ని కళ్ళకు కడుతుంది. ఈ మూర్తిమత్వ ప్రవాహం ఎరుక పరాకాష్ఠకు చేరడంతో సంబోధి కలుగుతుంది. ఈ ప్రపంచం అనిత్యం. అనత్త, దుఃఖమని ధ్యాని ఎరుగుతాడు. ధ్యాని సతి ధ్యానానుభవం పెరిగే కొలది వ్యక్తిని ఆత్మను ఒకటిగాచేసి చూసే మిధ్యాదృష్టి పటాపంచలవుతుంది. ఈ విధంగా ఆత్మభావన, ఓటికుండ పగిలిపోయినట్లు, దుమ్ము వెదజల్లబడినట్లు, నువ్వులు వేయించినట్లు, అన్ని రూపాలు (వస్తువులు) పేలిపోయినట్లు ధ్యానికి అనుభవంలోకి వస్తుంది – అని ఞానమోలి చెబుతారు.

ఏకాగ్రత ధ్యానంలో, ధ్యాని ధ్యానవస్తువుతో ఐక్యం చెందుతాడు. తల్లి, శిశువు ఐక్యతలా ఏకాగ్రతలో ధ్యానిపొందే ఆనందం తల్లి–శిశువు ఐక్యతగల శిశువుపొందిన మహా సాగరానుభూతికి సదృశం. ఆ విధంగా ఏకాగ్రతా ధ్యానంలో, ఆత్మాదర్శం స్వానురాగ సుఖాన్ని తిరిగి పొందడం – సంతృప్తం అవుతుంది. అంటే ఈ ధ్యానంలో అతడు తల్లిగర్భంలోకి తిరిగి ప్రవేశించిన వాడవుతాడు. దీనికి సదృశమైన అనుభవమే రెండోరుూనం (ఎనిమిరుూనాలలో రెండోది) లోనూ ధ్యానికి కలుగుతుంది. ఈ అనుభవాన్ని బుద్ధడు–ఏవైపు నుంచి తూములేని, నీరు అడుగునుంచి ఊరే నీటిబుగ్గ ఉండి, వర్షం కురియకుండ నింపబడే కొలనులాగ, రుూనం లోతులనుంచి లేచిన సుఖకరవేదనలతో, ధ్యాని శరీరంలో ప్రతిభాగం, ఏ భాగం మిగిలిపోకుండ, తడపబడుతుంది. ఈ ప్రవాహం ఫ్రాయిడ్ చెప్పిన లిబీడోకి సమానమంటాడు అలెగ్జాండర్.

ఏకాగ్రత ధ్యానంలో, ధ్యాని ధ్యానవస్తువుతో ఐక్యం చెందుతాడు. తల్లి, శిశువు ఐక్యతలా ఏకాగ్రతలో ధ్యానిపొందే ఆనందం తల్లి-శిశువు ఐక్యతగల శిశువు పొందిన మహా సాగరానుభూతికి సదృశం. ఆ విధంగా ఏకాగ్రతా ధ్యానంలో, ఆత్మాదర్శం స్వానురాగ సుఖాన్ని తిరిగి పొందడం - సంతృప్తం అవుతుంది. అంటే ఈ ధ్యానంలో అతడు తల్లిగర్భంలోకి తిరిగి ప్రవేశించిన వాడవుతాడు.

కాని సతిధ్యానానుభవాలకు ఆత్మదర్శాని (తల్లి బిడ్డ ఏకతానుభవా నందానికి)కి ఏమీసంబంధంలేదు. ఈ సతిధ్యానానుభవాలు, గాఢంగా ఎక్కడో లోతులతో పాతిపెట్టబడిన మిధ్యానాను భవాలు, గాఢంగా ఎక్కడో లోతులతో పాతిపెట్టబడిన మిధ్యా దర్శాత్మ సత్తాను, (అస్తిత్వాన్ని) సవాలు చేసి, పెరికివేస్తాయి. భ్రమ జనిత ఆత్మసత్తాకు భూమిక లేదని అది అశాశ్వతమనీ, శూన్యమనీ, డొల్ల అనీ ఆ అనుభవాలు రుజువుపలుకుతాయి. ఇటువంటి అనుభవాలతో తడిసి పోయిన ధ్యానికి నిలబడడానికి ఆధారం ఏదీ ఉండదు. ఎందుకంటే అతడు అత్యంతగాఢంగా కాపాడుకొంటూ వచ్చిన అభిసంజ్ఞల (తననుతానుగా గుర్తించడానికి ఉపయోగపడే ''పలాన పలానలను, గుర్తులను–అవి తనవికావు, తాను అవి కాదు,'' అని వదిలి వేయాల్సి వస్తుంది.

విశుద్ధిమగ్గ ఇలా అంటుంది : ''అతడు తనలో ఉందని భావించిన ఆత్మ అనస్తిత్వాన్ని చూస్తాడు... తన ఆత్మ, మరొకని ఆత్మ ఆస్తికాదని అతడు తెలుసుకొంటాడు... మరొక ఆత్మ అనస్తిత్వాన్ని చూస్తాడు. ఈ విధంగా – ఎక్కడ గూడ ఇతరుని ఆత్మలేదు... అతడు ఇతరుని చూస్తాడు ఇలా : ఆ ఇతరుడు తన ఆత్మ ఆస్తి కాదు అని ఈ విధంగా – నేను అతని ఆత్మకు స్వామిని కావడమనేది లేదు. అందుకని ఈ సంసారాల (సంఖారాల) సమూహారాన్ని 'ఆత్మ' లేదా 'ఆత్మ అస్తి' శూన్యతగా చూడబడుతుంది'' – ఞానమోలి.

శైశవంలో రూపొందిన ఆదర్శాత్మ ఈ విధంగా బూడిద అయిపోవడం మనకు పాశ్చాత్య మనోవిజ్ఞాన గతిశీల శాస్త్రంలో కనిపించదు. శైశవంలో పాదుకొన్న స్వానురాగం, మహాసాగరానుభూతుల అవశేషాలు పెద్దయ్యాక గూడ వ్యక్తిలో కనిపిస్తాయి. వీటిని ఆత్మాదర్శం ఎప్పటికీ సంతృప్తం చేసుకోలేదు. ఫలితం వ్యక్తి ఏకాకితనాన్ని, శూన్యాన్ని అనుభవిస్తాడు. బుద్ధుడు ప్రతిపాదించిన విపశ్యనాధ్యానం అటు పూర్తిగా ఆదర్శాత్మను, ఇటు ఆత్మాదర్శాలైన స్వానురాగ మహాసాగరా భూతులను తుడిచివేస్తుంది. ఆ విధంగా మనిషి ఏ మిధ్యాకశ్మలాలు లేని శుద్ధ వ్యక్తి అవుతాడు.

ఇప్పుడు పాశ్చాత్య మానసిక వైద్యులు థాయ్‌లాండ్ లాంటి దేశాలలో బౌద్ధ గురువుల దగ్గర విపశ్యనా ధ్యానాన్ని నేర్చుకొని దాని పరిజ్ఞను మనోవిశ్లేషణకు జోడించి, పదికాలాల పాటు నిలిచే స్వాస్థ్యాన్ని రోగులకు అందజేయగలుగుతున్నారు.

వర్ణవ్యవస్థా లేక మరణవ్యవస్థా ?

- భదంత ఆనంద కౌసల్యాయన్

ఋగ్వేదంలోని పురుషసూక్తంలో బ్రహ్మ నోరు, బాహువులు, ఉదరం, పాదాలు వీటి నుంచి ఉద్భవించినట్లు చెప్పబడిన వర్ణవ్యవస్థ వల్ల సమాజానికి ఏ మేలూ జరుగలేదు.

దీనికి కారణం అసంఖ్యాకమైన ప్రవృత్తులుగల మనుషులను ఏదో చేసి బలవంతంగా మూడు లేక నాలుగు వర్గాలుగా విభజించడం అసాధ్యం కావడం. ఈ కారణం చేతనే వర్ణవ్యవస్థను 'ఆదర్శ వ్యవస్థ'గా భావించే భారతీయ హిందూ సమాజం ఈ రోజు మూడు-నాలుగు కాదు, నాలుగు వేల కులాలు, ఉపకులాలుగా విభజించబడి ఉంది.

వర్ణాలననుసరించి చేసిన ఈ వర్గీకరణ ఒక సాహిత్య కల్పన మాత్రమే. అయితే కుల వ్యవస్థ మాత్రం ఒక సామాజిక వాస్తవం. ఇప్పుడు ఈ కులాలన్నింటినీ మరోసారి కొత్తగా నాలుగు కోళ్ళ గంపల క్రిందికి తోసేసేందుకు ప్రయత్నించడం ఎంత హాస్యాస్పదమో, అంతే హానికరం కూడా. ఒక ఆదర్శంగా ఇది ఒక ప్రమాదకరమైన కల్పన అయితే ఆచరణలో ఎన్నడూ సాకారం కాజాలని ఒక కల మాత్రమే.

శ్రీమద్భగవద్గీతలో ఈ చాతుర్వర్ణ వ్యవస్థ గురించి ఇలా ఉంది:

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః।
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్॥ (4-13)

(అర్జునా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర ఈ నాలుగు వర్ణాల విభజన వారివారి గుణ-కర్మలననుసరించి నేనే చేశాను. ఈ చాతుర్వర్ణ వ్యవస్థకు కర్తను నేనే అయినప్పటికీ నీవు నన్ను అకర్తగా (కర్తకాని వానిగా) నూ, నాశము లేనివానిగానూ భావించు.)

కృష్ణుడన్న ఈ మాట నిజంగానే అద్భుతంగా ఉంది. కర్తగా భావించబడడంవల్ల ఎక్కడైతే కీర్తి వచ్చే అవకాశం ఉందో, అక్కడ నేను కర్తను, ఎక్కడైతే అపకీర్తి వచ్చే అవకాశం ఉందో, అక్కడ అకర్తను. బొమ్మా నాదే, బొరుసూ నాదే!

ఆ తర్వాత భగవద్గీతలోనే పద్దెనిమిదవ అధ్యాయంలో ఆ కృష్ణుడే ఇలా అన్నాడని ఉంది.

బ్రాహ్మణ క్షత్రియ విశాం శూద్రాణాం చ పరంతప ।
కర్మాణి ప్రవిభక్తాని స్వభావ ప్రభవైర్గుణైః ॥ (18-41)

(శత్రు సంహారకుడవైన ఓ అర్జునా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రుల విధులను వారివారి స్వభావాన్ననుసరించి, గుణాలననుసరించి విభజించడం జరిగింది.)

శమో దమస్తప్ప శౌచం క్షాంతిరార్జవమేవ చ ।
జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥ (18-42)

(శాంతి, ఆత్మనిగ్రహము, తపస్సు, శుచిత్వము, సహనము, ధర్మవర్తనము, జ్ఞానము, తెలివి, మతతత్పరత, అను తమ సహజ గుణములచేత బ్రాహ్మణులు పని చేయుదురు.)

శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।
దానమీశ్వర భావశ్చ క్షాత్రం కర్మస్వభావజమ్ ॥ (18-43)

(శౌర్యము, తేజస్వీత, ధృధనిశ్చయము దక్షత, యుద్ధమునందు ధైర్యము, ఔదార్యము, నాయకత్వము ఇవి క్షత్రియులకు సహజములైన కార్యగుణములు.)

కృషి గోరక్ష వాణిజ్యం వైశ్యకర్మ స్వభావజమ్ ।
పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥ (18-44)

(అర్జునా! వ్యవసాయము, గోసంరక్షణ, వర్తకము, ఇవి వైశ్యుల సహజ కర్మలు. అదేవిధంగా కేవలం 'సేవించడం' శూద్రునికి సహజకర్మ.)

బాగా గమనిస్తే కృష్ణుడు మొదట భగవద్గీత నాలుగో అధ్యాయంలోనేమో గుణ కర్మలననుసరించి నేను వర్ణాల విభజన చేశానన్నాడు. తర్వాత పద్దెనిమిదవ అధ్యాయంలోనేమో వర్ణాల సహజ గుణాలననుసరించి వారివారి కర్మలను నిర్ధారించానన్నాడు. మరి ఇంతకూ గుణకర్మలననుసరించి

తెలుగు సేత : జె. లక్ష్మీరెడ్డి, ఫోన్ : 09811589430

వర్ణాల విభజన జరిగిందా లేక వర్ణాలననుసరించి గుణకర్మలను నిర్ధారించడం జరిగిందా?

పరస్పర విరుద్ధంగా ఉన్న ఈ రెండు మాటల్లో నాకేమో రెండవమాటే సరి అయినదిగా తోస్తూంది. అంటే, వర్ణాలననుసరించి వారి గుణకర్మల నిర్ధారణ జరిగింది. ఇంతకూ నా విశ్వాసం ఏమిటంటే సమాజాన్ని నాలుగు భాగాలుగా విభజించే ఆలోచన ఒక ఆరోగ్యకరమైన ఆదర్శ కల్పనా కాదు, ఆచరణలో కార్యరూపం ధరించగలిగిన ప్రణాళికా కాదు. మాట వరుసకు దీన్ని ఆదర్శంగా భావించి ఆలోచించి చూద్దాం. ఒక వర్ణం కేవలం విద్యనే అభ్యసిస్తూ, జ్ఞానార్జనే చేస్తూ ఉండినప్పుడు, దానివద్ద జీవనోపాధికి సంబంధించిన స్వతంత్ర సాధనం ఏదీ లేనప్పుడు ఆ వర్ణంలోని వారు ధనార్జనకోసం అచిరకాలంలోనే ఆ విద్యద్వారా చేయగలిగిన మోసాన్నే, కపటాన్నే, దుష్టోపాయాలనే తమ జీవనోపాధిగా మలచుకోరా?

ఇక రెండోవర్గం విద్యనభ్యసించదు. యుద్ధంలో శౌర్యం ప్రదర్శించడమే దాని పని అయినప్పుడు విద్య లేని ఇలాంటి వర్గంలోని వారు అచిర కాలంలోనే తమ శస్త్రబలంతో ఇతరులను శాసించేవారుగా, బాధించేవారుగా మారిపోరా?

అదే విధంగా మూడవ వర్ణంవారు వ్యవసాయం, వ్యాపారం మాత్రమే చేస్తూ ఉంటారు. విద్యాబలం గానీ, శస్త్రబలం గానీ లేక, ధనబలం మాత్రమే కలిగి ఉన్నవాళ్ళు స్వార్థాన్నీ, ధనదాహాన్నీకాక సమాజహితం ఏమిటో తెలుసుకోగలరా?

అదేవిధంగా విద్యాబలం గానీ, శస్త్రబలం గానీ, ధనబలం గానీ లేకుండా ఉంటూ తక్కిన మూడు వర్ణాలవారి సేవ చేయడమే అనివార్యమైన విధిగా జీవించే నాల్గవ వర్ణం అనతికాలంలోనే హీనమై, పతితమై, పాదాక్రాంతమై పోదా?



ఉత్తర భారతదేశంలో ఒక పద్యం ప్రచారంలో ఉంది. అస్పృశ్యత, శూద్రవర్ణ ఉత్పత్తి చరిత్ర సంక్షిప్తంగా అందులో చెప్పినట్లు తోస్తుంది:

జాకీ ధన ధరతీ హరీ, తాహి న రాఖియే సంగ్ ।
జో సంగ్ రాఖే హీ పడే, తో కర్ రాఖియే అపంగ్ ॥

(ఎవరి ధనాన్ని, భూమిని అపహరిస్తావో, వాణ్ణి దగ్గర ఉంచుకోకు. ఒకవేళ దగ్గర ఉంచుకోవలసి వస్తే– వాణ్ణి వికలాంగుణ్ణి (మానసికంగానో, శారీరికంగానో)చేసి ఉంచుకో.)

వర్ణాల వర్గీకరణ చేయడం సంభవమూ కాదు, ఆ అవసరమూ లేదు. అయితే భారతదేశంలోని అత్యధిక సంఖ్యాకుల్లో వ్యాపించి ఉన్న కుల వ్యవస్థ నిజానికి ఒక సామాజిక కుష్ఠురోగం. దాని శవ పరీక్ష చేయడం సమాజ శ్రేయస్సు కోరే ప్రతి ఒక్కరికీ ఉన్న అతి ముఖ్యమైన బాధ్యత.

కులవ్యవస్థ ఒక దోషరహితమైన వ్యవస్థ అనీ, అది ప్రతి నాగరిక సమాజంలో ఉండే శ్రమ విభజన అని కొందరు అంటారు. మరి ఇది నిజంగా శ్రమ విభజనేనా? ఇది శ్రమ విభజన కాక నిజానికి శ్రామికుల విభజనే కాదా? పరిశీలిద్దాం: నిస్సందేహంగా ప్రతి నాగరిక సమాజానికి శ్రమ విభజన అవసరం ఉంటుంది. అయితే శ్రమ విభజన పేరుతో ఈ విధంగా శ్రామికుల అసహజ విభజన అమలులో ఉన్న నాగరికదేశం ఎంత వెతికినా మనకు కానరాదు. శ్రమ విభజన శ్రామికుల ఇష్టాయిష్టాలపైన ఆధారపడి ఉంటుంది. మరి పుట్టుక ఆధారంగా ఏర్పడిన కుల

వ్యవస్థ కూడా వారివారి ఇష్టంపైన ఆధారపడి ఉంటుందా? నేను పుట్టిన కులం వదలి నాకిష్టమైన మరో కులంలో చేరాలి, అని ఎవరైనా అనుకుంటే స్వేచ్ఛగా అలా చేయగలడా? శ్రమ విభజననుసరించి జరిగే శ్రామికుల విభజన ఆ శ్రామికుడు పనిచేస్తున్నంత కాలం వరకు మాత్రమే ఉంటుంది. ఆ విభజన శాశ్వతం కాదు. మనిషి పుట్టిన రోజునుంచి చనిపోయేదాకా అతడు పుట్టిన కులం ఏ విధంగా అతన్ని అతుక్కొని ఉంటుందో, ఆ విధంగా శ్రమ విభజన జీవితాంతం ఎవరినీ అతుక్కొని ఉండదు. ఈ కుల వ్యవస్థ శ్రమ విభజన ఎంతమాత్రం కాదని చెప్పడానికి మరో కారణం శ్రమ విభజన సిద్ధాంతంలో పెచ్చు-తగ్గుల ఆలోచనకు ఆస్కారం రవ్వంతకూడా లేకపోవడం. కానీ పుట్టుకపైన ఆధారపడి ఉన్న కులవ్యవస్థలో ఒక కులంలోని ప్రతి వ్యక్తి తనను ఏదో ఒక కులానికి చెందిన వ్యక్తులకంటే ఎక్కువగాను, మరో కులానికి చెందిన వ్యక్తులకంటే తక్కువగాను భావించుకుంటాడు. శ్రమ విభజన, కులవ్యవస్థ, ఈ రెండింటిలో ఇంత స్పష్టమైన తేడా ఉన్నప్పుడు వివేకవంతులెవరూ ఈ రెండింటిని ఒకటిగా భావించరు.

మరికొందరంటారు, కులవ్యవస్థ ఒక వర్ణం యొక్క రక్తాన్ని శుద్ధంగా ఉంచే ప్రయత్నమని వైజ్ఞానికులు రక్త వర్గీకరణ చేశారు. అయితే రక్తవిజ్ఞానం ప్రకారం ఇద్దరు బ్రాహ్మణుల రక్తం కూడా పరస్పరం భిన్నంగా ఉండవచ్చు, ఎవరైనా ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు బ్రాహ్మణుడు, మరొకరు దళితుడు అయినప్పటికి కూడా వారి రక్తం ఒకేవిధంగా ఉండవచ్చు. చాతుర్వర్ణ వ్యవస్థననుసరించి ఎవరు కూడా ఇది బ్రాహ్మణుని రక్తమని, ఇది క్షత్రియుని రక్తమని, ఇది వైశ్యుని రక్తమని, ఇది శూద్రుని రక్తమని తేల్చి చెప్పలేరు.

కొందరు కులాల భిన్నత్వాన్ని జాతుల భిన్నత్వానికి పర్యాయంగా భావిస్తారు. జాతుల భిన్నత్వం ఒకటైతే, కులవ్యవస్థ దానికి పూర్తిగా భిన్నమైంది. నిజానికి భారతదేశ సమాజంలో అనేక జాతులు, ఉపజాతులు కలిసిపోవడం జరిగిన తర్వాతి కాలంలోనే ఇక్కడ కులవ్యవస్థ పాతుకొని పోయింది. కులవ్యవస్థ ఒకే జాతికి సంబంధించిన ప్రజల్లో కూడా విస్తారంగా నెలకొన్న సామాజిక వర్గీకరణ.

నిజం చెప్పాలంటే మానవులంతా ఒకే కులం. ఏ కులానికి చెందినవారైనా సరే, ఇద్దరు స్త్రీ-పురుషుల సంగమం జరిగినప్పుడు మానవజాతికే చెందిన ఆడ శిశువుగానీ, మగ శిశువు గానీ జన్మిస్తుంది. అంతేగాని, గుర్రం, గాడిద కలిసినప్పుడు ఏ విధంగా గుర్రం జాతికి గాని, గాడిద జాతికి గాని చెందని ఒక మూడవజాతి 'కంచర గాడిద' పుడుతుందో ఆ విధంగా మానవేతర సంతానం కలగదు. దీని ద్వారా కుల వ్యవస్థకు మానవశాస్త్రంతో కూడా ఎలాంటి సంబంధం లేదని స్పష్టంగా తెలుస్తుంది.

గుర్రాల లేక ఎద్దుల జాతిని ఉన్నత పరచడానికి ఏ విధంగా మంచి ఆడ-మగ గుర్రాలను, ఆవు-ఎద్దులను ఎన్నుకోవడం జరుగుతుందో, అలాగే మానవజాతిని ఉన్నత పరచే ఉద్దేశ్యంతో కూడా మంచి వధూవరుల ఎంపిక చేయడం జరుగుతూందా? అలా జరగనప్పుడు కుల వ్యవస్థను మానవజాతి శ్రేష్ఠతను కాపాడే సాధనంగా భావించడం పెద్ద పొరపాటు కాదా?

పెళ్ళి విషయంలో కులవ్యవస్థ కేవలం ఒక నిషేధాత్మకమైన నిబంధన మాత్రమే. ఫలానా వాళ్ళ పెళ్ళి ఫలానా వాళ్ళతో జరగడానికి వీలు లేదు, అని అనేవరకే. ఏ వధూవరులనైనా కొందరు ఇతర వధూవరులతో పెళ్ళి చేసుకోకుండా ఆపడం మాత్రమే దాని పని! అలా కాక ఈ కుల వ్యవస్థ యోగ్యులైన వధూవరులను ఎంపిక చేయడంలో సహాయపడే ఒక సంస్థ అయి ఉంటే ఎంత బాగుండేది!

శరీర నిర్మాణ దృష్టితో చూసినప్పుడు కులవ్యవస్థ ద్వారా నిర్మితమైన, దానిద్వారా అనుదినం కబళించబడుతున్న హిందూజాతి మరుగుజ్జుల జాతిగా మనకు కనిపిస్తుంది. ఇందులోని పెద్ద శాంతం మనుషులు సైన్యంలో చేరడానికి అనర్హులుగా భావించబడుతారు.

వేర్వేరు కులాలు వేర్వేరు వృత్తుల పేర్లు మాత్రమే అని కొందరు అంటూ ఉంటారు. చాకలి, కమ్మరి, వడ్రంగి, కంసాలి, ఇవన్నీ వృత్తులేకదా! ఈ వృత్తులను వంశానుగతంగా ఉంచడంలో ఉద్దేశ్యం ఆ వృత్తులను ఉన్నత స్థాయిలో నిలిపి ఉంచడమే అని కూడా అంటూ ఉంటారు.

పని ఏదైనా అందులో అభిరుచి ఉన్న వ్యక్తికే అది ఆసక్తికరంగా ఉంటుంది, ఉత్సాహం పుట్టిస్తుంది కూడా. తనకు అభిరుచి ఉన్న విషయంలోనే ఏ వ్యక్తి అయినా విశేషమైన ప్రగతిని సాధించగలుగుతాడు. అభిరుచి లేని విషయంలో ఎవరూ ప్రగతి సాధించలేరు. కంసాలి కుమారుడు కంసాలి వృత్తిలో అభిరుచి ఉన్నప్పుడే అందులో రాణించగలుగుతాడు.

అభిరుచి లేనప్పుడు అతడు ఆ వృత్తిని అవలంబించి ఉన్నతి పొందుతాడనిగానీ, ఆ వృత్తిని మరింత ఉన్నత స్థాయికి తీసుకు పోగలుగుతాడని గానీ ఆశించలేం.

ఇక్కడ ఆలోచించవలసిన మరో విషయం కూడా ఉంది. మన పూర్వీకులు చేస్తూ ఉండిన వృత్తులు, పనులు చాలా కొద్దిగానే ఉండేవి. కానీ, ఇప్పుడు వారి సంతతి ఎదుట వేలకొద్దీ వృత్తులు వచ్చి నిలిచాయి. పుత్రుడు తండ్రి వృత్తే చేయాలనే సిద్ధాంతాన్ని అంగీకరిస్తే, ఈ కొత్త-కొత్త వృత్తులు చేపట్టగలిగిన భారతీయులు ఎక్కడి నుంచి వస్తారు? ఆధునిక ప్రపంచానికి సంబంధించిన ప్రత్యక్ష అనుభవం మాత్రం, ఎవరైతే తమ పూర్వీకులు ఏ వృత్తిని అవలంబించారు అనేదాన్ని లెక్క చేయకుండా కొత్త-కొత్త వృత్తులను అవలంబించారో వాళ్ళంతా సఫలతపొందారు, ఉన్నతి సాధించారు అనే చెప్తుంది.

ఇతర జాతుల ప్రజలు చంద్రునిపైన తమ-తమ వలస రాజ్యాలు స్థాపించాలని యోచన చేస్తున్న ఈ సమయంలో కూడా ఈ కులవ్యవస్థ, ఈ వర్ణవివక్ష, ప్రపంచంలో ఎక్కడైనా ఉంది అంటే, అది కేవలం భారతదేశంలోనే, భారతదేశంలోని హిందూ సమాజంలోనే ఉంది. ఇక హిందూ సమాజం గురించి ఆలోచిస్తే చెదలు ఏ విధంగా కర్రను తినేస్తుందో, ఆ విధంగా కులవ్యవస్థ దాన్ని తినేసిందని చెప్పక తప్పదు.

హిందూ సమాజంపైన, కులతత్వ కారుమేఘం దాని హిందూ చైతన్యాన్ని పూర్తిగా కప్పివేసిందేమో అని అనిపించేంత దట్టంగా వ్యాపించి ఉంది. ఒక్కోసారైతే హిందూ చైతన్యం అనేది ఏదైనా ఉందా? అనే సందేహం కూడా కలుగుతుంది.

ఈ కులాల్లో పరస్పరం హెచ్చు-తగ్గు అనే భావన లేకుండా ఉండి ఉంటే హిందూ సమాజం అనేక కులాల్లో విభాజితమై ఉంది, అనేది అంత చింతించదగిన విషయం కాకుండా ఉండేది. అన్ని కులాలు తమను ఏదో ఒక కులంకంటే హెచ్చుగా, మరేదో కులంకంటే తక్కువగా భావించుకోవడం మాత్రమే ఇందులో లేదు. ఒక్కోసారి రెండు కులాలూ నేను గొప్ప అంటే నేను గొప్ప అని కలహించుకుంటూ కూడా ఉంటాయి. ఇది కులాల మధ్య విద్వేషానికి దారితీస్తుంది. వర్ణవ్యవస్థ పరిధిలో ఇమిడి ఉన్న ప్రతి బ్రాహ్మణుడు, శూద్రుడు మాత్రమే ఈ దయనీయ స్థితిలో లేడు, వర్ణవ్యవస్థ పరిధి వెలుపలికి తోసివేయబడిన బహిష్కృతులు, తిరస్కృతులు, అవమానితులు కూడా ఉన్నారు.

సంస్కృతంలో అందరికీ తెలిసిన శ్లోకం ఒకటుంది. ఎందరో ఉపదేశకులు కోడిపుంజు మిద్దెక్కి కూసినట్లు గట్టిగా దాన్ని వల్లిస్తూ ఉంటారు-

ఏతద్దేశ ప్రసూతస్య సకాశాదగ్రజన్మనః
స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వ మానవాః॥

దీని అర్థం, భారతదేశంలో జన్మించిన అగ్రజన్ములనుంచే - బ్రాహ్మణులనుంచే - భూమిపైనున్న సమస్త మానవులు తమ సద్వర్తన నేర్చుకున్నారు అని.

భూమిపైన ఉన్న మానవులందరి మాట ఎందుకు? ఈ భూదేవతలు, ఈ భూసురులు స్వయానా తమ భారత దేశంలోనే ఇప్పటిదాకా ఒక పెద్ద సంఖ్యలో మనుషులను నేర ప్రవృత్తిగల జాతులుగా ఉంచారు. మరో పెద్ద మానవ సమాజాన్ని 'అస్పృశ్యు'లుగా తయారు చేశారు, చేసి అలాగే ఉంచారు. శూద్రులకు విద్యాభ్యాసం నిషిద్ధం అన్నారు. ఇక స్త్రీలను కూడా, వాళ్ళు బ్రాహ్మణ కులం వారైనా సరే విద్య నేర్చుకోడానికి అర్హులుగా భావించలేదు.

వారి మాట చెల్లుబాటైతే ఇప్పుడు కూడా ఇతరులనెవ్వరినీ చదువు సంధ్యలు నేర్చుకోనిచ్చేవారు కాదు. ఏ విధంగా రాముడు తపస్సు చేసుకుంటున్న శంబూకున్ని (బ్రాహ్మణుల ప్రేరణతో) తపస్సు చేస్తున్నాడనే అపరాధానికి వధించాడో, అలాగే నేర ప్రవృత్తిగల వారిని, అస్పృశ్యులను, శూద్రులను, స్త్రీలను కూడా నిరక్షర కుక్షులుగానే ఉంచేసే వారు. అయితే ఇప్పుడు గడియారం ముల్లు ముందుకు సాగిపోయింది. ఇక దాన్ని వెనక్కు మళ్ళించడం ఎవరికీ సాధ్యపడదు. ఇప్పుడొచ్చింది అస్పృశ్యతను శాస్త్రసమ్మతమని సమర్థించినందుకు పూరీ జగద్గురువు శంకారాచార్యులకు కూడా పట్నా, ఢిల్లీ రెండేసి కోర్టుల నుంచి సంజాయిషీ చెప్పమని సమ్మన్లు పంపిన కాలం. అయితే ఇప్పుడు సంజాయిషీ చెప్పమనడం వరకే జరిగింది!

ఈ సమస్య ఒకరినొకరు హీనంగా భావించడం ద్వారా పరిష్కారం కాదు. అన్ని కులాలను సమానమైనవిగా భావించినప్పుడే పరిష్కారమవుతుంది. తథాగతుడు 2500 సంవత్సరాల పూర్వం చేసిన బోధ కూడా ఇదే.

మన పూర్వ రాష్ట్రపతి సర్ రాధాకృష్ణన్ లాంటి వాళ్ళు హిందువుల్లో కొన్ని ప్రత్యేక గుణాలున్నందువల్లనే చరిత్ర గమనంలో అనేక ఇతర జాతులు భూమిపైన నిలువకుండా

నశించి పోయినా హిందువుల మనుగడ మాత్రం కొనసాగుతూ ఉంది, అని అలసట – సొలసట లేకుండా వల్లిస్తూ ఉంటారు. హిందువులు ఇప్పటికీ మనుగడ కొనసాగిస్తూ ఉండడం మాత్రం వాస్తవమే. అయితే వారి పరిస్థితి శోచనీయంగా లేదా? కళ్ళున్నవాళ్ళు ఎవరైనా చూడవచ్చు. హిందువులు ఇకనైనా తమ వక్రగతిని విడిచి పెట్టకపోతే వారు వినాశంవైపు అతి వేగంగా సాగిపోడాన్ని ఎవరూ ఆపలేనిరోజు అతి త్వరలోనే వస్తుంది. నిజమైన హిందూ శ్రేయోభిలాషి ఒకరు హిందూ జాతిని 'మరణోన్ముఖమైన జాతి' అని చాలా అర్థవంతంగా వ్యాఖ్యానించాడు.

ఆ శూద్రుల గురించి హిందూ శాస్త్రాలు ఏమంటున్నాయో చూడండి--

1. ధనార్జన చేసే శక్తి ఉన్నా కూడా శూద్రుడు ధనం ప్రోగుచేసుకోరాదు. ఎందుకంటే శూద్రుడు ధనవంతుడైనప్పుడు బ్రాహ్మణునికి కంటకంగా మారుతాడు.

2. శూద్రుడు జపతపాలు, యజ్ఞహోమాలు చేసినప్పుడు రాజు వాణ్ణి కఠినంగా శిక్షించాలి.

బ్రాహ్మణుడు దుశ్శీలుడైనా పూజ్యుడే. శూద్రుడు ఎంత శీలవంతుడైనా తిరస్కరింపతగినవాడే.

గోస్వామి తులసీదాసు కూడా ఈ మాటే చెప్పాడు–

పూజియె విప్ర జ్ఞాన-గుణ హీనా, శూద్ర న పూజియె జ్ఞాన-ప్రవీనా

(జ్ఞానం, సుగుణాలు, లేకున్నా బ్రాహ్మణుణ్ణి పూజించాలి. జ్ఞానం, సుగుణాలు ఉన్నా శూద్రుణ్ణి పూజించరాదు.)

శాపత తాడత పరుష కహంతా, విప్ర పూజియ గావహి సంతా

(బ్రాహ్మణుడు శపించినా, దండించినా, పరుష వచనాలు పలికినా అతడు పూజ్యుడే అని జ్ఞానులైన వారు చెబుతారు.)

జ్ఞానులైరవారే ఇలా చెప్పినప్పుడు అజ్ఞానులు మరి ఏమి చెబుతారో!

3. శూద్రుడు బ్రాహ్మణ స్త్రీతో సంభోగం చేస్తే రాజు ఆ శూద్రుని ఇంద్రియాన్ని కోసి వేయించి వాని ధనమంతా లాగేసుకోవాలి.

4. ఏ శూద్రుడైనా ఒక బ్రాహ్మణ స్త్రీతో సాన్నిహిత్యం పెంచుకుంటే, ఆ శూద్రుణ్ణి అగ్గిలో పడేయాలి.

మరోవైపు బ్రాహ్మణుల కోసం ఇలా చెప్పడం ఉంది –

స్త్రీ రత్నం దుష్కులాదపి

(నీచ కులానికి చెందిందైనా, స్త్రీ రత్నాన్ని స్వీకరించాలి.)

ధర్మ సూత్రాల నుంచి, గృహ సూత్రాల నుంచి, మనుస్మృతి మొదలైన అనేక స్మృతులనుంచి మీరు ఎన్ని కావాలంటే అన్ని ఇలాంటి ఉదాహరణలు సేకరించవచ్చు.

ఈ పని చేయాలి కూడా. దీనివల్ల మరేలాభం కలిగినా, కలగక పోయినా, ఈ శాస్త్రాలను చూపి ఎవరైతే ప్రగల్భాలు పలుకుతూ ఉంటారో, వాళ్ళు ఈ శాస్త్రాల అద్దంలో తమ ముఖం తప్పక చూసుకోగలుగుతారు.

హిందూ శాస్త్రాలు ఎవరికోసం ఇలాంటి కఠోరమైన, ఇంత క్షుద్రమైన ఆజ్ఞలు కల్పించాయో, ఏ అనాగరికాతి అనాగరిక దేశంలోని మానవులు కూడా ఎవరిపట్ల జరిగిన దురాచారాలను తలచుకొని సిగ్గుతో తలవంచుకోకుండా ఉండలేరో, ఆ 'అస్పృశ్య'లు, శూద్రులు నిజానికి ఎవరు? 'అస్పృశ్య'ల, శూద్రుల పట్టిక లెక్కించ వీలు లేనంత సుదీర్ఘమైంది. మురికిగా ఉన్న చోటును శుభ్రం చేసే పాకీవాడు శూద్రుడే కాదు, అంత్యజుడు కూడా. కానీ, ఏ బ్రాహ్మణుడు శుభ్రంగా ఉన్న చోటును మురికి చేస్తాడో అతడు శూద్రుడూ కాదు, అంత్యజుడూ కాదు. మురికి బట్టలు శుభ్రం చేసే చాకలి శూద్రుడు. కానీ, చాకలి శుభ్ర పరచిన బట్టలు హాయిగా తొడుక్కొని మైల పరచేవాడు మాత్రం ద్విజుడు. చర్మంతో చెప్పులు తయారుచేసే మాదిగ శూద్రుడేకాదు, అస్పృశ్యుడు కూడా. కానీ మాదిగవాడు తయారుచేసిన చెప్పులు వేసికొని హాయిగా తిరిగే ద్విజుడు అస్పృశ్యుడూ కాదు, శూద్రుడూ కాదు. ఎంతవరకని చెప్పేది? బోయీలు శూద్రులు, కంసాలి శూద్రుడు, కమ్మరి శూద్రుడు, దర్జీ శూద్రుడు, సాలెవాడు శూద్రుడు, వడ్రంగి శూద్రుడు – సారాంశం ఏమిటంటే ఎవరెవరైతే చమటోడ్చి, కష్టించి సంపద సృష్టిస్తారో, వాళ్ళంతా శూద్రులు, ఎవరెవరైతే శూద్రుల శ్రమ ఫలితంతో భోగాలు అనుభవిస్తారో, వాళ్ళు అగ్రకులాలవాళ్ళు!

ఏ దేశంలో శ్రామికవర్గం ఇతరులద్వారా ఈ విధంగా తిరస్కారానికి, దండనకు గురి అవుతుందో, ఆ దేశం ఎప్పటికైనా ప్రగతి సాధించగలుగుతుందా? అందరూ దేశ సమైక్యత గురించి మాట్లాడతారు. కానీ, ఏ దేశభూమిలో కులతత్వ విషబీజాలు ఈ విధంగా నాటడం జరిగిందో, అక్కడ

సమ్యైకత అనే మొక్క పెరగగలుగుతుందా? కులవాదం గానీ, ఉప కులవాదం గానీ, వర్ణవాదంగానీ, ఇవన్నీ మనిషి పుట్టుకనాశ్రయించి ఉండడమే ఈ అనర్థానికంతా మూలం.

దేశాభ్యుదయం కోసం సమాజాన్ని బలోపేతం చేయడానికి ఉన్న ఉపాయం ఒకటే, భారతదేశంలోని బహు సంఖ్యాకుల్లో వ్యాపించి ఉన్న కులతత్త్వాన్ని, వర్ణవాదాన్ని నిర్మూలించడం.

కొందరు వర్ణవ్యవస్థ జన్మపైన కాక, కర్మపైన, గుణకర్మలపైన ఆధారపడి ఉందని, అది జన్మపైన ఆధారపడి ఉన్న కులవాదానికి, వర్ణవాదానికి భిన్నమైందని అంటూ, అలాంటి వ్యవస్థను స్థాపించాలని అంటూ ఉంటారు. ఈ అభిప్రాయానికి తొలుత ప్రాచుర్యం కల్పించినవాడు ఆర్యసమాజ సంస్థాపకుడు స్వామి దయానందుడు. ఆర్య సమాజం ఉత్తర భారతదేశంలోను, దాని ప్రభావం ఉన్న అన్ని ఇతర ప్రాంతాల్లోను ఈ అభిప్రాయానికి ప్రచారం కల్పించే గట్టి ప్రయత్నం చేసింది. అయితే ఈ ప్రయత్నంలో అది పూర్తిగా విఫలమైంది. బ్రాహ్మణులుగా చెప్పబడే వారి కుటుంబంలో జన్మించని కొందరిని గుణకర్మలననుసరించి 'పండిత్‌జీ', 'ఆచార్యజీ' అని పిలిచేట్లు చేయడంలో మాత్రమే అది సఫలమైంది అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అయితే నేటివరకు అది బ్రాహ్మణ తల్లిదండ్రులకు పుట్టిన ఏ ఒక్కరినీ అతని గుణకర్మలననుసరించి 'శూద్రుడు'గా ప్రకటించడంలో సఫలత సాధించలేకపోయింది.

ఇక ఈ వర్ణవ్యవస్థ జన్మ ఆధారంగానూ నిలిచి ఉండలేదు, గుణకర్మల ఆధారంగానూ నడవలేదు, అని మాటిమాటికి చెప్పవలసిన అవసరం లేదనుకుంటాను. ఒక ఆదర్శంగా ఇది ఎంత దోషభూయిష్టమో, ఆచరణలో అంతకంటే దోషభూయిష్ఠం.

సాంఘిక విప్లవమే మన సమాజాన్ని దృఢంగా, శక్తివంతంగా మార్చగలుగుతుంది. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక మునుపు లోకమాన్య తిలక్‌లాంటి రాజకీయ నాయకులుకూడా సాంఘిక విప్లవం విషయంలో ఉదాసీనంగా ఉన్నారు. స్వయానా లోకమాన్య తిలక్ ఒక క్రైస్తవుని చేతిమీదుగా టీ తాగినందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవలసి వచ్చిందని ముందు అనుకున్నాం. ఏ లోకమాన్య తిలకైతే స్వాతంత్ర్యం తన 'జన్మసిద్ధమైన హక్కు' అని అనేక సంవత్సరాలు జైల్లో ఉన్నాడో, ఆ లోకమాన్య తిలకే ఒక భారతీయ క్రైస్తవుని చేతిమీదుగా టీ తాగగలిగి ఉండే మానవతా సిద్ధమైన తన హక్కుకోసం ఏమీ చేయలేకపోయాడు. సాంఘిక విప్లవం విషయంలో ఉదాసీనత వహించిన మరోవర్గం, తనను సమాజవాదిగా, సామ్యవాదిగా, మార్క్సువాదిగా చెప్పుకొనే వర్గం కూడా భారతదేశంలో ఉంది. ఈ సిద్ధాంతాన్ని నమ్మేవాళ్ళు ఆర్థికమైన విప్లవం జరిగినప్పుడు సాంఘిక విప్లవం దానంతట అదే జరుగుతుందని భావిస్తారు.

ఇది వారి భ్రమ అని నా అభిప్రాయం. సాంఘిక విప్లవానికి ముందు ఆర్థిక విప్లవం జరగదు. జరిగినా అది నిలిచి ఉండలేదు. మనిషి ఏ పని చేసినా కేవలం ఆర్థిక స్వార్థ ప్రేరణతోనే చేస్తాడు, అనేది పాక్షికదృష్టి మాత్రమే. ఏ కారణాలవల్ల ఏర్పడినా మానవుని మతవిశ్వాసాలు కూడా ఒక పెద్ద శక్తే. వాటి సదుపయోగము, దురుపయోగము రెండూ జరగవచ్చు. కాలంలో ఇంత మార్పు వచ్చినా కూడా బ్రాహ్మణవాద సామ్రాజ్యం మాత్రం చెక్కు చెదరకుండా నిలిచే ఉంది!



ప్రాతిమోక్ష (పాటి మొక్ఖ) నియమాలు :

నాలుగు పారాజిక ధర్మాలు

- ఈమని శివనాగిరెడ్డి

పదిహేను రోజులకొకసారి జరిగే ప్రాతిమోక్ష సూత్రాలను వల్లెవేసేప్పుడు నాలుగు పారాజిక ధర్మాలను ప్రస్తావించి అమలు పరుస్తారు. దీక్షను తీసుకొని, శిక్షణపొంది తన బలహీనతలను వెల్లడించకుండా ఉంటూ, లైంగిక కార్యకలాపాల్లో పాల్గొన్న బౌద్ధ భిక్షువు తీవ్రమైన నేరానికి గురౌతాడు. ఆ భిక్షువు చీవరాలను త్యజించి, సాధారణ గృహస్తు జీవనానికి వెళ్ళాలే తప్ప మళ్ళీ భిక్షువుగా కొనసాగే హక్కును కోల్పాతాడని వినయపిటకం నిర్దేశించింది. ఇలా పారాజికుడైన భిక్షువు. 1. శరీరం నుంచి తలను నరికేయబడి, మొండేనికి మళ్ళీ తలను జోడించినా అతుక్కోనట్లుగా; 2. చెట్టునుంచి రాలిపోయిన పండుటాకులను మళ్ళీ కొమ్మలకు అతికించినా పచ్చదనాన్ని సంతరించుకోనట్లుగానూ; 3. ముక్కలుగా పగలగొట్టబడిన పెద్ద బండరాయిని తిరిగి అతికించినా మునుపటిలా ఆ పెద్దబండను చేయలేనట్లు గానూ; 4. తాటిచెట్టు తలను నరికిన తరువాత మళ్ళీ పెరగనట్లూ పోల్చి చెప్పారు.

అలాగే కావాలని ఇవ్వని వస్తువును దొంగిలించినపుడు, కావాలనే ఒక వ్యక్తిని చంపినపుడు, తెలియని విషయాన్ని, అర్థంకాని విషయాన్ని గొప్పలుగా చెప్పుకొంటూ తన దగ్గర లోకాతీత శక్తులున్నాయని, బౌద్ధధర్మాన్ని సరిగా అర్థం చేసుకోకుండా, తనకంతా తెలుసనీ, తానొక విపస్సినని బొంకే భిక్షువు సంఘసభ్యునిగా ఉండే అర్హత కోల్పోయి, సంఘం నుంచి బహిష్కరించబడతాడనీ వీటినే 'నాలుగు పారాజిక ధర్మాలు'గా బుద్ధుడు పేర్కొన్నాడని వినయపిటకం చెబుతోంది.

ఇలా ఈ నాలుగు పారాజిక ధర్మాలకు గురైన భిక్షువులు, భిక్షుణిలు ఉన్నతమైన ధార్మిక ప్రగతిని పొందేమార్గాన్ని చేరుకోవటంలో (అర్హంత లేక నిబ్బాణగమనంలో) ఓడిపోయిన వారుగా గుర్తించబడతారుగాబట్టి, వారిని పారాజికులనీ, భిక్షుత్వంనుంచి బహిష్కరణకు, శిక్షించబడిన శిక్షాదత్తకులని పిలుస్తారు. సిద్ధార్థ గౌతముడు సంమక్సంబద్ధత్వాన్ని పొందిన ఐదేళ్ల తరువాత వైశాలీనగరంలోనున్నపుడు శీతాకాలం, ఐదో పక్షంలో పన్నెండోనాడు మధ్యాహ్నం పన్నెండు గంటలకు, పూజనీయ యసిక కలందక పుత్రుని విషయంలో మొదటి పారాజిక శీలా (ధర్మా)న్ని ఒక నియమంగా ప్రవేశపెట్టాడు.

సిద్ధార్థ గౌతముడు సంబుద్ధుడైన ఆరేళ్లకు రాజగృహంలో నున్నపుడు శీతాకాలంలో రెండోపక్షంలో తొమ్మిదోరోజు మధ్యాహ్నం పన్నెండుగంటలకు పూజనీయ ధనియుడనే బౌద్ధాచార్యుడు, మగధరాజైన బింబిసారుడు, పాంసుకులికుడనే బౌద్ధభిక్షువులకు సంబంధించినచర్చలో భాగంగా, దొంగ తనానికి సంబంధించిన అస్తేయ (చౌర్య) పారాజిక శీలాన్ని నియమంగా చెప్పాడు. సంబుద్ధత్వాన్ని సంతరించు కొన్న ఆరేళ్లకు వైశాలీనగరంలో నున్నపుడు శీతాకాలంలో మూడోపక్షంలో పదోనాడు మధ్యాహ్నం పన్నెండుగంటలకు, సంచారిఅయిన మృగదండికుడు, రోగిష్టులైన బౌద్ధభిక్షువులకు సపర్యలుచేసే వారినుద్దేశించి, మూడోదైన ప్రాణాంతక (మనుష్య హత్య) పారాజిక శీలాన్ని బోధించాడు.

సిద్ధార్థుడు, బుద్ధుడైన ఆరేళ్లకు శ్రావస్తినగరంలో నున్నపుడు శీతాకాలంలో నాలుగో పక్షంలో పదమూడోనాడు మధ్యాహ్నం అభిమానికుడనే బౌద్ధ భిక్షువు, ఇంకా గ్రామాల్లో నివసిస్తున్న అనేకమంది భిక్షువులనుద్దేశించి, నాలుగోదైన 'ఉత్తరి మనుష్య ధర్మపారాజిక' అనే లోకాతీత (అతీంద్రియ) శక్తుల పారాజిక శీలాన్ని బోధించాడు.

పదిహేను రోజులకొకసారి జరిగే ప్రాతిమోక్షసూత్రాలను పఠించే సందర్భంగా సంఘనాయకుడుగానీ, స్థలీరుడుగానీ ఈ నాలుగు పారాజికధర్మాలను చదివి, ఈ నాల్గింటిలో ఏదో ఒక నేరాన్ని చేసినట్లయితే దాన్ని బహిరంగంగా ఒప్పుకోమని

ఈమని శివనాగిరెడ్డి, ఫోన్ : 9848598446

సంఘ సభ్యులనుద్దేశించి ప్రకటన చేస్తాడు. ప్రకటన తరువాత ఏదేని ఒక భిక్షువు పారాజికుడని తేలితే ఆ విషయాన్ని ప్రస్తావించి, సంఘాన్నుంచి ఆ భిక్షువును బహిష్కరిస్తున్నట్లు తెలియజేస్తారు. ఇలా మూడుసార్లు ప్రకటించి, వారి మౌనాన్ని అంగీకారంగా స్వీకరించి శిక్షను విధించి అమలుచేస్తారని వినయపిటకంలోని ప్రాతిమోక్ష (పాటిమొక్ఖ) నియమాల్లో చెప్పబడింది.

ఈ నాలుగు పారాజిక ధర్మాలతోపాటు, 13 సంఘాధి శేషనేరాలు, రెండు అనియతనేరాలు, ముప్పై నిస్సగ్గియ నేరాలు, వాటికి తగినశిక్షలుకూడా నియమాల్లో చేర్చ బడినాయి. బుద్ధుడు ఏ ఏ సందర్భాల్లో ఈ నియమాల నేర్పరచాడో తెలుసుకొందాం.

1. అబ్రహ్మచర్య పారాజిక : ఒకసారి వజ్జిదేశంలో కరువొచ్చి బౌద్ధభిక్షువులకు భిక్ష దొరకటం కష్టమైంది. ఆచార్య సుదిన్నుడు అక్కణ్ణించి మరో ప్రాంతానికి వెళ్ళాలనుకొని వైశాలి అందుకు తగిన ప్రదేశమనీ, తన బంధువులు, ధనికులు, పెద్ద రైతులు చాలా మంది ఉన్నారనీ, వారుచేసే దానాలవల్ల భిక్షువులకు మేలు కలుగుతుందనుకొని వైశాలికి బయలుదేరి వెళ్ళాడు. వైశాలీలోని కూటాగారంలో ఆచార్య సుదిన్నుడున్న సంగీతిని తెలుసుకొని, జ్ఞాతులంతా ఆయనకు అరవైరకాల వంటకాలను, అరవై కుండల్లో అక్కడికి తీసుకెళ్ళారు. ఆ కుండలు ఇతర భిక్షువులకోసమనుకొని, భిక్షకోసం కలందక గ్రామం చేరుకొని, కొన్ని ఇళ్ల తరువాత తన ఇంటికే వెళ్లాడు. ఆ సందర్భంగా తన జ్ఞాతుల దాసి పాచిపోయిన ఆహారాన్ని పారబోస్తుండగా, ఆహారాన్ని తన పాత్రలో వేయమనగా ఆమె అలాగేనని సుదిన్నుని భిక్షాపాత్రలో వేసింది. అలా వేసేటప్పుడు కాళ్లు, చేతులూ, గొంతునూ గుర్తుబట్టి వాళ్లింటికెళ్ళి అతని తల్లితో 'అమ్మా ఆచార్య సుదిన్నుడు మన గ్రామానికి వచ్చాడ'ని చెప్పింది.

ఆచార్య సుదిన్నుడు అక్కణ్ణించి మరో ప్రాంతానికి వెళ్ళాలనుకొని వైశాలి అందుకు తగిన ప్రదేశమనీ, తన బంధువులు, ధనికులు, పెద్ద రైతులు చాలా మంది ఉన్నారనీ, వారుచేసే దానాలవల్ల భిక్షువులకు మేలు కలుగుతుందనుకొని వైశాలికి బయలుదేరి వెళ్ళాడు. వైశాలీలోని కూటాగారంలో ఆచార్య సుదిన్నుడున్న సంగీతిని తెలుసుకొని, జ్ఞాతులంతా ఆయనకు అరవైరకాల వంటకాలను, అరవై కుండల్లో అక్కడికి తీసుకెళ్ళారు.

ఒక గోడ పక్కగా దాసి జారవిడిచిన భిక్షను తింటుండగా, అతని తండ్రిచూచి, 'పాచిన పదార్థాన్ని తినేబదులు ఇంటికి రావచ్చుగద నాయనా' అని ఇంటికి తీసుకెళ్లి, భోజన పదార్థాన్ని వడ్డించాడు. అంతకుముందే తిన్నందున భిక్ష స్వీకరించలేనని రేపటి భోజనానికి అంగీకరించాడు. చానాళ్ల తరువాత, తన కొడుకు ఇంటికొచ్చిన సంతోషంతో ఇల్లంతా అలంకరించి, ఒకవైపు బంగారం, మరోవైపు వెండిని రాశులుగా పోయించి, కప్పించి, మధ్యలో ఆసనాన్నేర్పాటుచేసి కోడల్ని పిలిచి సుధిన్నుడు ఏ అలంకారాలను ఇష్టపడేవాడో వాటిని ధరించి రమ్మంది. తల్లిదండ్రుల సంపదలపట్లా, బాగా అలంకరించు కొని వచ్చిన భార్యపట్లా మక్కువ చూపించని ఆచార్య సుదిన్ననితో అతని తల్లి 'కనీసం బీజదానమైనా చేయ'మని కోరగా సుదిన్నుడు అందుకు అంగీకరించాడు. భార్యచేతిని పట్టుకొని వనంలోకెళ్ళి (ఇలా చేయకూడదన్న ఏ నిబంధనా లేనందువల్ల) పూర్వపు భార్యతో మూడు సార్లు శృంగారంలో మునిగితేలాడు. సుదిన్నుని మునుపటి భార్య గర్భందాల్చి ఒక బిడ్డకు జన్మనీయుగా, అతనికి 'బీజకుడ'ని పేరుపెట్టారు. అతని తల్లిదండ్రులకు బీజకమాత, బీజక పిత అని పేర్లొచ్చాయి (కొన్నాళ్ళ తరువాత బీజకుడూ, అతని తల్లీ సంఘంలోచేరి అర్హంతులైనారు).

సుదిన్నుడు రతిలో పాల్గొన్న తరువాత, ఖిన్నుడై, ధర్మ వినయానికి తూట్లు పొడిచానని, బ్రహ్మచర్యానికి భంగం కలిగిందని బాధపడి, పశ్చాత్తాపపడి, ఆహారంకూడా తీసుకోకుండా బక్కజిక్కి పోయి దుఃఖితుడవగా గమనించిన తోటి భిక్షువులు ఆ విషయాన్ని బుద్ధభగవానునికి తెలియజేశారు. అప్పుడు ఈయన సుదిన్నుని పిలిచి, నిజాన్ని తెలుసుకొని 'ఉపాదాన రాహిత్యం కోసం ధర్మాన్ని బోధించాడు. కామసంజ్ఞలను గుర్తించి, కామ వాంఛనువీడి, కామ వితర్కాన్ని పెరికేయడం గురించీ, కామ పిపాసను నాశనం చేయటం గురించీ, కామజ్వరాన్ని పరిశీలింపజేయడం గురించీ, నేను ఎన్నివిధాలుగా బోధించలేదు? ఈ విధంగా నీవు, అసద్ధర్ముమూ, గ్రామ్యధర్ముమూ, వృషలధర్ముమూ అయిన అబ్రహ్మచర్యానికి పాల్పడి, అకుశల ధర్మాలను సేవించనున్న వారికి మొదటి వానివైనావు' అని భిక్షువులతో, భిక్షువులారా! భిక్షువుల శిక్షణనూ, ఆజీవికనూ స్వీకరించిన భిక్షువు తన దౌర్భల్యాన్ని

వివరించి శిక్షణను వీడకుండా, చివరికి అడజంతువులతో కూడా అబ్రహ్మచర్యకు పాల్పడి లైంగిక కార్యకలాపాల్లో పాల్గొంటే ఆ భిక్షువు పారాజితుడై (ధర్మపథంలో ఓడిపోయిన వాడై) భిక్షువులతో సహజీవనానికి అనర్హుడౌతాడ'నే నియమాన్ని విధించాడు.

2. చౌర్యానికి సంబంధించిన పారాజిక : బుద్ధభగవానుడు రాజగృహంలోని గృధ్రకూట పర్వతంపై విహరిస్తున్నపుడు, అనేకమంది భిక్షువులు ఇసిగిలి పర్వతం దగ్గర గడ్డిగాదాలతో కుటీరాలను నిర్మించుకొని వర్షావాసం చేస్తున్నారు. అదే సందర్భంలో కుమ్మరి కొడుకైన ధనియుడు కూడా అదే రకమైన కుటీరాన్ని నిర్మించుకొని వర్షావాసంలో ఉన్నాడు. వర్షావాసం ముగిసింతర్వాత, భిక్షువులు గడ్డిగాదాలలో కట్టుకొన్న కుటీరాల్ని ఊడదీసి గడ్డినీ, కట్టెల్నీ విడివిడిగా పోగుబెట్టి ఇతర ప్రాంతాల కెళ్ళారు. ధనియుడు మాత్రం మిగతా రెండు రుతువులు కూడా అక్కడే గడిపాడు. ఒకనాడు ఆయన భిక్షకు వెళ్లగా కొందరు దొంగలు ఆయన కుటీరాన్ని కూల్చి కట్టెల్నెత్తుకెళ్ళారు. ధనియుడు తరుణోపాయంగా కాల్చిన బంకమట్టితో కుటీరాన్ని కట్టుకున్నాడు. అందంగా తయారైన ఆ కుటీరంలో నివసిస్తున్న సంగతి తెలిసి భగవానుడు అలాంటి కుటీరాల్లో శ్రమణులు నివసించరాదనీ, దాన్ని కూల్చి వేయించగా, ధనియుడు, ఒకచోట దాచి ఉంచిన రాజుగారి కట్టెల్ని, తన కిచ్చినట్లుగా భావించి, తీసుకెళ్ళి కుటీరాన్ని నిర్మించుకొంటాడు. సంగతి తెలిసిన సేనియ బింబిసారుడు ధనియుని పిలిపించి, కట్టెల్ని ఎలా ఎత్తుకెళ్ళావని ప్రశ్నించగా, గతంలో మీరే ఇచ్చారని అబద్ధం చెప్పాడు. ఈ సంగతివిన్న బుద్ధుడు, ధనియుని గర్హించి, ఇవ్వని దాన్ని తీసుకొన్న భిక్షువు సంవాసం చేయ యోగ్యుడు కాని పారాజికు (పరాజితు) డౌతాడన్న నియమాన్ని విధించాడు.

3. హత్యాపారాజిక : ఒకసారి బుద్ధభగవానుడు వైశాలీలోని మహావన కూటాగారశాలలో విహరిస్తున్నప్పుడు, భిక్షువులకు అశుభాన్ని గురించి బోధించాడు. వీతరాగులకు శుభం, అశుభం ఒకటిగానే ఉంటాయి. కాబట్టి భగవానుడు అశుభ ధ్యానాన్ని గొప్పగా పొగిడేవాడు. ఒకనాడు భిక్షువులతో, 'నేను ఒక పదిహేనురోజులపాటు ప్రతిసల్లానంలో ఉండాలను కొంటున్నాను. 'నాకు భిక్షను తెచ్చే భిక్షువు తప్ప నా దగ్గరకు ఎవరూ రాకూడదని' అన్నాడు. బుద్ధభగవానుని అశుభ సమాపత్తిని విన్న భిక్షువులు, అనేక అశుభ భావనల్లో తేలిపోతూ, తమ శరీరాలపట్ల అసహ్యాన్ని పెంచుకొన్నారు. అలా తమ తమశరీరాలపై అసహనాన్ని పెంచుకొన్న భిక్షువులు కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడగా, మరికొందరు ఇతర భిక్షువుల్ని హత్యలు చేయటం ప్రారంభించారు. కొందరు శ్రమణులు మృగలండికుడనే మరో శ్రమణుని దగ్గరకెళ్ళి 'మృగలండికా! నీవు మా ప్రాణాలుతీస్తే, మా పాత్రలు, చీవరాలు నీకు దక్కుతాయి' అని చెప్పారు.

మృగలండికుడు పాత్రలు, చీవరాల కోసం ఎంతో మంది భిక్షువులను చంపి, వారి ప్రాణాలు తీయడానికుపయోగించిన కత్తి రక్తంతో తడిచిపోగా, దాన్ని కడగటానికి వగ్గుదా నదికి చేరి, ఆ కత్తిని కడుగుతుండగా 'అయ్యో, ఎంతోమంది బౌద్ధ భిక్షువులను చంపానే! ఇది నాకు అశుభం, అలాభం, దుర్లబం' అనుకొంటుండగా, మిథ్యాదృష్టి కలిగి మారుని సైన్యంలో చేరిన భూసురులు కనిపించి, 'మృగలండికా, నీవు తరించని వారినెందరినో తరింపజేశావు. ఇది నీకు శుభమని' చెప్పగా, నిజమేననుకొన్న అతడు, కత్తి చేతబూని, ప్రతి విహారమూ తిరుగుతూ రోజుకు ఒకరినో, ఇద్దరినో, ఒక్కోసారి అరవైమంది వరకూ చంపేవాడు.

పదిహేనురోజుల ప్రతిసల్లానం నుంచి లేచి, 'ఆనందా, ఏమిటీ భిక్షువులు తక్కువమంది కనిపిస్తున్నార'ని అడిగాడు బుద్ధభగవానుడు. 'భంతే భిక్షువులు నిర్వాణమార్గంలో స్థిరపడేందుకు ఇంకోఉపాయం చెప్పండ'నగా, బుద్ధుడు వైశాలీ నగరంలోనున్న భిక్షు సంఘాన్ని సమావేశపరచి ఆనాపానస్మృతి సమాధిని భావితమూ, బహులీకృతమూ చేసుకొన్నట్లయితే, అది శాంతమూ, ప్రణీతమూ, అనాసక్తవంతమూ అయిన సుఖవిహారాన్ని కలిగిస్తుందని బోధించాడు.

అంతేకాక పాపకాలూ, అకుశలాలూ అయిన ధర్మాలను ఉపశమింపజేయటానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పాడు. భిక్షువు బాసింపట్టు వేసి కూర్చొని శరీరాన్ని తిన్నగా ఉంచి, స్మృతిని ఎదురుగా ప్రతిష్టింపజేసుకొని, దీర్ఘంగా ఊపిరితీసుకొన్నపుడు, విడుస్తున్నప్పుడు, దీర్ఘంగా ఊపిరితీసుకొంటున్నట్లు, విడుస్తున్నట్లు, హ్రస్వంగా ఊపిరినితీసుకొంటున్నప్పుడు, విడుస్తున్నపుడు, అలా చేస్తున్నట్లు తెలుసుకొని అభ్యసిస్తాడు. తరువాత, కాయాన్నంతనీ అనుభూతిచెందుతూ ఊపిరితీసుకొంటూ,

విడుస్తూ; కాయసంస్కారాన్ని ప్రశమింపజేస్తూ ఊపిరి తీసుకొంటూ, విడుస్తూ; ప్రీతి అనుభూతిచెందుతూ, సుఖాన్ని అనుభూతి చెందుతూ, చిత్త సంస్కారాలని అనుభూతి చెందుతూ, చిత్తాన్ని అనుభూతి చెందుతూ, చిత్తాన్ని ప్రమోదింపజేస్తూ, చిత్తాన్ని ఏకాగ్రం చేస్తూ, చిత్తాన్ని విముక్తం చేస్తూ, అనిత్యానుపశ్యన చేస్తూ, విరాగానుపశ్యన చేస్తూ, నిరోధానుపశ్యన చేస్తూ, పరిత్యాగానుపశ్యన చేస్తూ, ఊపిరితీసుకొంటూ, విడుస్తూ, ఊపిరితీసుకొంటున్నాను, విడుస్తున్నానని తెలుసుకొంటూ అభ్యసిస్తాడు' అని ఆనాపానసతి సమాధి కలిగించే శుభ, లాభకరమైన అనాసక్త సుఖవిహారాన్ని కలిగిస్తుందని భిక్షువులకు వివరించాడు బుద్ధభగవానుడు.

తరువాత భిక్షువులనుద్దేశించి 'భిక్షువులారా! ఆత్మహత్యలు చేసుకొంటూ, ఇతరులను హత్యలు చేస్తూ, మృగలండికుని సమీపించి ప్రాణాలు తీయమని కోరటం నిజమేనా?' అని అడిగాడు. నిజమేనన్న భిక్షువులతో 'ఇది తగనివని. దీనిని నివారించటానికి ఈ శిక్షాపదాన్ని విధిస్తున్నాను. ఏ భిక్షువైనా, తెలిసి మనుష్యుల ప్రాణాలుతీసినా, లేక హంతకుని వెదికి పెట్టినా లేక మరణాన్ని ప్రశంసించినా, మరణించటానికి ప్రేరేపించినా, ఆ భిక్షువు సహవాసం చేయటానికి అయోగ్యుడైన పారాజికు డౌతాడు' అనే నియమా న్నేర్పరిచాడు బుద్ధభగవానుడు.

4. ఉత్తరిమనుష్య ధర్మ (దివ్యశక్తుల ప్రదర్శనకు సంబంధించిన) పారాజిక : ఒకసారి బుద్ధభగవానుడు వైశాలీనగరంలో మహావనంలోని కూటాగారశాలలో విహరిస్తుండగా, చాలామంది భిక్షువులు వగ్గముదానదీతీరంలో వర్షావాసం చేస్తున్నారు. అదే సమయంలో వజ్జిదేశంలో కరువు విలయతాండవం చేస్తుంది. భిక్షకు ఇబ్బంది లేకుండా జీవించటానికి కొందరు భిక్షువులు ఉపాయాన్నాలోచిస్తున్నారు. వారిలో కొందరు, 'మనం గృహస్తులకు కొన్ని పనులు చేసి పెట్టిగానీ, వారికి వార్తలను చేరవేసిగానీ, గృహస్తుల ముందు మనం ఒకరినొకరం, గొప్పవారుగా ప్రశంసించుకొంటూ, గృహస్తుల మెప్పుపొంది భిక్షను తేలిగ్గా పొందగలమ'ని తీర్మానించుకొన్నారు. అలాంటి గొప్ప భిక్షువులు మా దగ్గర వర్షావాసం చేయటం లాభమని తాము కూడా తిననటువంటి మంచి మంచి భోజనాలనూ, పానీయాలను సమర్పించారు. వర్షావాసం ముగిసిన తరువాత బుద్ధుని సమీపించిన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భిక్షువులను చూచి, బుద్ధుడు 'భిక్షువులారా! అంతా కలసి మెలసి, పొరపొచ్చాలు కష్టాలు లేకుండా వర్షావాసాన్ని గడిపారా?' అని అడిగాడు. 'ఏ కష్టమూ లేదు భంతే' అని తెలిపిన భిక్షువుల సంగతి తెలుసుకొని, 'పొట్టకోసమని గృహస్తుల యందు దివ్యశక్తుల గురించిన పరస్పర ప్రశంసలను ఎందుకు చేసుకొన్నారు? ఇది చేయరానిదని చెప్పి, "భిక్షువులారా! ఈ లోకంలో ఏ భిక్షువు చాలామంది వెంటరాగా, గృహస్తుల సత్కార, గౌరవమన్ననలతో పాటు చీవర, భిక్ష, శయనాసన, పథ్యాపదాల లాభాన్ని పొందుతాడో ఆ భిక్షువు మొదటి మహాదొంగ. అలాగే తథాగతుని ధర్మ వినయాన్ని నేర్చుకొని, అది తన స్వంతమని మిడిసిపడే భిక్షువు రెండో మహాదొంగ. మరోపాపియైన భిక్షువు పరిశుద్ధ బ్రహ్మచర్యాన్ని గడుపుతున్నా భిక్షువుపై అబ్రహ్మచర్య దోషారోపణ చేస్తాడో అతడు మూడో మహాదొంగ. అలాగే విహారానికి చెందిన వస్తువులను గృహస్తులకు ఇచ్చి వారిని సంతోషింపజేస్తాడో అతడు నాలుగో మహాదొంగ. ఈ లోకంలో శ్రమణ, బ్రాహ్మణ దేవ మనుష్యులతో కూడిన ప్రజలలో లేనిదీ అభూతమైనదయిన దివ్యశక్తి ఉందని ప్రకటించి, భిక్షను భుజించాడు గనుక అతడు అందరినీ మించిన ఐదో మహాదొంగ. ఈ సందర్భంగా బుద్ధుడు 'ఏ భిక్షువైతే లేని దివ్యశక్తిని తనకు ఆపాదించుకొని, నాకిది తెలుసు, నేను దీన్ని దర్శించాను' అని చెబుతూ, తాను తుచ్ఛమైన అబద్ధం చెప్పానని పశ్చాత్తాపం చెందడో అతడు భిక్షు సంఘంతో సహవాసం చేయటానికి అయోగ్యుడైన పారాజికుడౌతాడని" శిక్షా పదాన్ని విధించాడు.

ఈ లోకంలో శ్రమణ, బ్రాహ్మణ దేవ మనుష్యులతో కూడిన ప్రజలలో లేనిదీ అభూతమైన దయిన దివ్యశక్తి ఉందని ప్రకటించి, భిక్షను భుజించాడు గనుక అతడు అందరినీ మించిన ఐదో మహాదొంగ. ఈ సందర్భంగా బుద్ధుడు 'ఏ భిక్షువైతే లేని దివ్యశక్తిని తనకు ఆపాదించుకొని, నాకిది తెలుసు, నేను దీన్ని దర్శించాను' అని చెబుతూ, తాను తుచ్ఛమైన అబద్ధం చెప్పానని పశ్చాత్తాపం చెందడో అతడు భిక్షు సంఘంతో సహవాసం చేయటానికి అయోగ్యుడైన పారాజికుడౌతాడని" శిక్షా పదాన్ని విధించాడు.

ధర్మచేతన

అనంతకాల శంఖపు మొననుండి మొదలై
విశాల విశ్వవ్యాప్తిలో
జీవన గంగా ప్రవాహం
ఎన్నెన్ని కొత్త పుంతలు తొక్కిందోగానీ
పాలపుంతలకు లెక్కేలేదు!
విశ్వాన్ని వినాశనం వైపుకు
పరుగులెత్తించే
థర్మోడైనమిక్ సూత్రధర్మం ఒకవైపు
స్థిరత్వం కోసం ప్రయత్నించే ప్రతికణంలోని
అజ్ఞాత అస్తిత్వ చేతన ధర్మం మరోవైపు
విరుద్ధ ద్వంద్వాలతో
కాలవాహిని కదలిపోతుంటే
పుట్టిగిట్టే
ఈ అనంత చేతన శంఖాలలో
ఇప్పటి నాజీవన శంఖం
ఎప్పుడు మొదలయిందోగానీ
ఊహ తెలిసేటప్పటికి, స్పృహ వచ్చేటప్పటికి
నా చుట్టూ నా ప్రపంచం
బుద్ధుల్లెందరో వచ్చి వెళ్లినా
అసంబద్ధంగానే ఉంది
స్వప్నలోకాలన్నీ చెరిగి పోతుంటే,
చెదిరే స్వప్నాలకు చేతన లేదని తెలిసింది
చేతన కాలంతో కదలివస్తుంటే
అహం ఆనకట్టై
కలల కాల్వల ప్రక్కదారులకు మళ్లుతుంటే
ఎండమావులే పండుతాయని తెలిసింది!
ధర్మపు పంట పండించడానికి
సత్యచేతనత్వపు ధర్మకాయంకోసం
వెదుకులాట మొదలైంది
ధర్మచక్రం మళ్లీ కదలసాగింది
స్వప్నలోకపుటాకాశంలో విహరించడం కన్నా
కలల కడలిలో పూలపాన్పులపై శయనించడం కన్నా
లేత పచ్చికపై స్వేచ్ఛగా నడిచే అనుభూతిలో
అంతఃచేతనా తరంగాల
అనిత్యతను తెలుసుకొంటూ -
బతుకు రాల బాటలో
కష్టాల ముళ్లపాదల్లో
ఆటు పోటుల్లో గుండె చప్పుళ్లను
వచ్చిపోయేవిగా తెలుసుకొంటూ -
సమతతో సాగిపోవడం
అద్భుతమని తెలిసివచ్చింది!

- తియ్యగూర సీతారామి రెడ్డి

భగవాన్ బుద్ధ

- మహాత్మాగాంధీ

క్షమాగుణానికి అహింస పరాకాష్ఠ. ధైర్యం గలవారికి మాత్రమే క్షమించే అర్హత వుంటుంది. భయంతో అహింసను ఆచరించగలమా?

అహింస క్షత్రియోచిత ధర్మం. మహావీరుడు, గౌతముడు క్షత్రియులే. రాముడు, కృష్ణుడు కూడా క్షత్రియులే. వీరందరూ అహింసను సమర్థించిన వారే. అహింసా ప్రచారకులే. మనం కూడా అహింసను ప్రచారంచేయాలి. కాని ఇప్పుడు అహింస పిరికి వాళ్ళు ప్రచారంచేయటం వలన, చిన్నచూపు చూడబడుతోంది. కాని క్షమాగుణానికి పరాకాష్ఠ అహింస అని కదా ముందు అనుకున్నాం. ధైర్యస్థులకు మాత్రమే క్షమించే అర్హత వుంటుంది.



నేను బుద్ధుణ్ణి ఆదర్శంగా తీసుకుంటున్నానని నా పెద్ద కుమారుడు దెప్పుతుంటాడు. అంతేకాదు బుద్ధుని బోధనలను ప్రచారం చేస్తున్నానని నా స్నేహితులు, ముఖ్యంగా హిందూ స్నేహితులు తిడుతున్నారు కూడా. సనాతన హిందూ ధర్మపు ముసుగులో ప్రచారం చేస్తున్నానని దూషిస్తున్నారు. నిజానికి సంబుద్ధుని బోధనల నుంచి నేను ఎంతో ప్రేరణ పొందాను. అందులోని ముఖ్యాంశాలు ఎన్నో ఇప్పటి హిందూ ధర్మంలో విలీనం అయిపోయినాయి. బుద్ధుడు తన అసామాన్యమైన త్యాగంతో, మహాభినిష్క్రమణ ద్వారా, విశుద్ధ జీవన విధానం వలన హిందూమతాన్ని ఎంతగానో ప్రభావితం చేశాడు. ఆ విధముగా హిందూమతం బుద్ధుడికి ఎంతో ఋణపడి వుంది.

నాకర్థమైనంతవరకు బుద్ధుడు ప్రవచించిన నిర్వాణ నిర్వచనం మనలోని దుష్టస్వభావాన్ని నిర్మూలించుకొని అవినీతి ఆలోచనల నుంచి మనలను మనం రక్షించుకోవడమే. ప్రపంచ చరిత్రలో కార్యకారణ సిద్ధాంతాన్ని బోధించిన ఒకే ఒక బోధ గౌతమబుద్ధుడు.

జంతుబలుల ద్వారా దేవుడనేవాడిని ప్రసన్నం చేసుకోవడం అవివేకమని, అనాగరికమని బుద్ధుడు చెప్పాడు. ఇప్పటి కుల వ్యవస్థ, ఆయన కాలపరిస్థితులలోవలనే దోష భూయిష్టమైనదని, అసంబద్ధమైనదని, బుద్ధుడు చెప్పిన మరొక ముఖ్యమైన విషయం.

కుల, వర్గ, తారతమ్యాలను నిర్ద్వందంగా వ్యతిరేకించి నిర్మూలించాడు. ఇది అప్పటికే హిందూమతానికి జాడ్యములాగా పట్టిన పీడకూడా. నేను ఇంగ్లాండ్‌లో వున్న రెండు సంవత్సరాల చివరలో థియోసాఫికల్ సాసైటీ సభ్యులు 'గీత' గురించి చెప్పారు. వారే సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ వ్రాసిన 'లైట్ ఆఫ్ ఆసియా' కూడా చదవమన్నారు. అప్పటికే ఆర్నాల్డ్ వ్రాసిన 'సాంగ్ సెలస్టియల్' చదివి ఉన్నాను. భగవద్గీత కన్నా 'లైట్ ఆఫ్ ఆసియా' నన్ను బాగా ఆకట్టుకున్నది. అప్పటి ఉత్సాహంతో 'గీతను లైట్ ఆఫ్ ఆసియా'లోని బుద్ధుణ్ణి, 'సెర్మెన్ ఆన్ ది మౌంట్'ని కలిపి ఒకటిగా అర్థం చేసుకోవాలని తాపత్రయ పడ్డాను. మహాపరిత్యాగమే (మహాభినిష్క్రమణ) మత ధర్మానికి పరాకాష్ఠ అని నాకు అనిపించింది. లండన్‌లో నాకు ఆశ్రయ మిచ్చిన స్త్రీ చాలా సామాన్యురాలు. కాని కొద్దిగా సంకుచిత స్వభావంకలది. మేము ఎన్నోసార్లు మత విషయాలు, ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుకున్నాం. అప్పుడు నేను ఆర్నాల్డ్ 'లైట్ ఆఫ్ ఆసియా' మళ్ళీ చదువుతున్నాను. బుద్ధుడి జీవితాన్ని, జీసస్ జీవితాన్ని పోల్చిచూచి, "చూడండి గౌతముని కరుణ అపారమైనది. కేవలం మానవజాతికే పరిమితం కాకుండా సర్వజీవులకు వ్యాపించింది" అని నేను అన్నప్పుడు ఆమె బాధపడటం నేను గ్రహించాను.

బుద్ధుని బోధనలను విశ్వసించేవారు ఒక్క క్షణం కూడా సోమరులుగా వుండజాలరు.

బుద్ధుని ఎన్నో మహత్కార్యాలలో అంటరాని తనాన్ని కూకటివ్రేళ్ళతో పెకిలించి, వర్గరాహిత్యాన్ని సమాజంలో అమలుపరచగలగటాన్ని నేను అద్భుత విషయంగా పరిగణిస్తాను.

- మిసిమి

బుద్ధుని సేవించి తరించిన

దశమాతలు

- వీపూరి సుదర్శన్

బౌద్ధసాహిత్యం :

క్రీ.పూ 600 – క్రీ.శ 100 మధ్యకాలంలో బౌద్ధ సంప్రదాయాలు గ్రంథరూపం ధరించాయి. క్రీ.పూ 6వ శతాబ్ది తర్వాత చాలాకాలనికి అవి గ్రంథస్తం అయినప్పటికి ఆ కాలపు సంఘటనలు, సమాజం, సంప్రదాయాలు యధావిధిగా లిఖించబడ్డాయి. అందుకనే ఆ కాలాన్ని పండితులు 'బౌద్ధయుగం' అని పేర్కొన్నారు. బ్రాహ్మణాలతో పోల్చినప్పుడు బౌద్ధసాహిత్యం ఎక్కువ ప్రామాణికమైనది.

ఆ కాలంనాటి సాంఘిక ఆర్థిక పరిస్థితులను గూర్చి త్రిపిటకాలు, జాతకకథలు, పంచనికాయాలు చాలినంత సమాచారాన్ని అందిస్తున్నాయి. అంతేగాకుండా బౌద్ధ వాఙ్మయం ఆనాటి ఇరవై ప్రముఖ పట్టణాల వ్యాపార కార్యకలాపాలను పేర్కొన్నవి.

బుద్ధుని జీవితంలో ముడిపడిఉన్న అనేక కథనాలు పాళీ, ప్రాకృతం, సంస్కృతం, మిశ్రమ సంస్కృతంలో తయారు చేయబడ్డాయి. క్రీ.శ. మొదటి శతాబ్దానికి పూర్వమే లోకోత్తరవాదులైన మహాసాంఘికులు 'అవధానంగా వినయపిటకం' మహావత్తును తీర్చిదిద్దినారు. పాళిభాషలో 547 జాతక కథలున్నాయి. అందులో సిద్ధార్థ గౌతమునికి చెందిన కథలు, యశోధరకు చెందిన జాతక కథలు కూడా ఉన్నాయి. క్రీ.శ. మొదటి శతాబ్దానికే చెందిన అశ్వఘోషుని 'సూత్రాలంకార' సంస్కృతంలో రూపొందించడినది. సూత్రాలంకార, జాతకమాల ఆకాలంలోనే చైనా భాషలోనికి అనువదించబడ్డాయి. అదేకాలనికి చెందిన గ్రంథం 'మహావత్తు', 'మహాసాంఘికుల' గ్రంథం. అది బుద్ధుని జీవిత చరిత్రతో బాటుగా, బింబిసారుని ధర్మదీక్షవరకు సమాచారాన్ని అందించుచున్నది. మహాసాంఘికులు వారి శాఖలు ప్రాచీనాంధ్ర దేశంలో ప్రముఖ స్థానాన్ని పొందినవి. స్థవీరులు పాళీ భాషకు పట్టంకట్టారు. మహాయానీయులు సంస్కృత భాషను ఆదరించారు. మిశ్రమ సంస్కృతంలో కూడా అనేక గ్రంథాలున్నాయి. 'నిదానకథ' 'లలితవిస్తరం' 'బుద్ధచరిత' ఆకాలంనాటివే. బుద్ధుని గృహస్థజీవితం మహాభినిష్క్రమణం, జ్ఞానోదయం, ధర్మచక్ర ప్రవర్తనం మొ॥ విశేషాలతో కూడిన సమాజం లలితవిస్తరం బుద్ధచరితలోను మనకు కనిపిస్తున్నది. మహావగ్గలో బుద్ధుని సంపూర్ణ జీవితంలేదు, పైగా స్త్రీలపట్ల నిరసనభావం ఉంది. బుద్ధుని మాతృమూర్తి మహామాయగూర్చి ఉంది, కాని భార్య యశోధర ప్రసక్తిలేదు.

బుద్ధుడు సంబోధినుండి మహాపరినిర్వాణం పొందే వరకు నిరంతరంగా పర్యటిస్తూ తన సందేశాన్ని పల్లె ప్రజలకు, పట్టణ వాసులకు అందిస్తూ ఎంతో చైతన్యం కల్గించాడు. అదే మార్గంలో వెళ్ళమని కోరాడు.

బౌద్ధసంఘాలలో స్త్రీలు అధిక సంఖ్యలో చేరినట్లుగాను సంఘనియమనిబంధనలను పాటిస్తూ ప్రతిభావంతంగా ధార్మిక జీవనాన్ని కొనసాగించినట్లుగా బౌద్ధసాహితీ చరిత్ర (థేరిగాథలు), డెబ్భైమంది బౌద్ధ భిక్షుణిల జీవితగాథలను తెలియజేయుచున్నది.

రాణివాసానికి (క్షత్రియ) చెందిన ప్రజాపతిగౌతమి, యశోధర, మల్లిక, ధనికవర్గాని (గహపతి)కి చెందిన విశాఖ,

డా. వీపూరి సుదర్శన్, ఫోన్ : 9885242037

పటాచర, తదితరులు బ్రాహ్మణ్యం మూర్తీభవించిన ధనంజనాని, బడుగు (శూద్ర) వర్గాలకు చెందిన సుజాత, ప్రకృతి, నగర శోభిని ఆమ్రపాలి, సిరిమలనే దశమాతలను తీసుకోవడమైనది. వీరందరూ స్వేచ్ఛగా తథాగతుని సేవించి, ఆయన ధర్మాన్ని ఆచరించి, తరించిన వారే. వారి వివరాలు:

మహాప్రజాపతి గౌతమి: లిచ్ఛవుల ఆడపడుచు, శాఖ్యవంశపు పట్టపురాణి, శుద్ధోదన మహారాజు ధర్మపత్ని, సిద్ధార్థుని పెంచి పెద్దచేసిన మాతృమూర్తి పావని గౌతమి. మహారాజు మరణానంతరం రాజభోగాలన్ని త్యజించి బుద్ధుని మార్గంలో నడవడానికి ముందుకు వచ్చిన మొదటి స్త్రీమూర్తి. అతికష్టం మీద బుద్ధుణ్ణి ఒప్పించి తనతో బాటుగా 500 మంది శాఖ్య మహిళలకు ధమ్మదీక్ష నిప్పించి భిక్షుణి సంఘాన్ని ఏర్పరచి ప్రథమసారథియై సంఘషరతులను, నియమావళిని పాటిస్తూ భిక్షుణిలచేత పాటింపజేస్తూ అర్హంతురాలిగా ఎదిగి, నిర్వాణానికి ముందు బుద్ధుని పాదాలను (గురువుగా) తాకి సుపథం చెందినది. ఆనాటి స్త్రీలకేగాక సమస్త మానవాళికి చిరస్మరణీయురాలైన ఆదర్శమాత మహాప్రజాపతి గౌతమి.

యశోధర: కొలియరాజు సుప్రబుద్ధ, రాణి అమితల కుమార్తె యశోధర. సకల సద్గుణాల సౌందర్యరాశి. పూర్వజన్మలో కూడా బుద్ధుని జీవితంలో తరించిన స్త్రీ. స్వయంవరంలో సిద్ధార్థుడికి భార్యయై, గృహస్థ జీవితంతో రాహులుడికి తల్లియై, భర్త వియోగాన్ని భరించి మహాభినిష్క్రమణానంతరం కుమారుని పెంచిన ధీరవనిత. సిద్ధార్థుని ప్రజాపతి గౌతమి కుమారులు సిద్ధార్థుని మారు సోదరులు దేవదత్త, నందులు ఆమెను వాంఛించారు. ఆందమైన స్త్రీలకు ఒంటరి జీవితం మంచిది కాదు మా అగ్రమహేషివికమ్మని ఇద్దరు సోదరులు ఆహ్వానించారు (వ్యాఖ్రీజాతకం). దానిని తిరస్కరించి బోధిసత్వుడినే ఆకాంక్షించి ఆరాధిస్తూ గడిపింది. బుద్ధుని రాకతో ఎంతో సంతోషించింది. అతని మౌనాన్ని చేధిస్తూ మీ నిర్ణయం నిస్సందేహంగా సరియైనదే. నేను కుడా పరివ్రాజికనై మిమ్మల్ని అనుసరించే దానినే కాని మన పసివాన్ని సంరక్షించవలసిన బాధ్యత నాపైనున్నది. మీ కుమారునిగూర్చిగాని, మీ తల్లితండ్రులగూర్చిగాని విచారించనక్కరలేదు. వారికి ఏలోటు రాకుండగా నేను చూసుకుంటాను. మీరు సర్వమానవాళి సౌభాగ్యాన్ని సమకూర్చండి అని పలికి తన సౌభాగ్యాన్ని లోకక్షేమం కొరకు త్యాగం చేసిన ధీరవనిత. తదుపరి అత్తగారితోబాటుగా పరివ్రాజికై తనను ధర్మమార్గంలోకి పయనించటానికి శక్తినిచ్చిన పావన గౌతమునికి శరణుజొచ్చి కృతజ్ఞతాంజలి ఘటిస్తూ తన 78వ యేట తనువు చాలించినది.

రాణిమల్లిక : కోసలదేశంలో పూలదండలల్లేవాని పుత్రిక మల్లిక శూద్రస్త్రీ. అపురూప లావణ్యవతి. మల్లెల సువాసనవలె అమె మంచిమనసు, మంచితనం అందర్ని ఆకర్షించినది. ఒకనాడు తండ్రికి మధ్యాహ్న భోజనం తీసుకెళ్తూ మార్గమధ్యలో ఒక చెట్టునీడన విశ్రమించిన తథాగతున్ని చూసి అప్రయత్నంగా భక్తితో భోజనాన్ని అందించింది. ఆహారాన్ని స్వీకరించిన బుద్ధుడు మనసు నిండా ఆమెను ఆశీర్వదించాడు. భోజనాన్ని అందించడానికి ముందు అతనెవరో ఆమెకు తెలియదు. ఇప్పుడతడు బుద్ధుడని తెలుసుకొని మహాదానందపడి పూతోటలోనికి వెళ్ళి ఆనంద పారవశ్యంలో గొంతెత్తి కోయిల కంఠంతో శ్రావ్యంగా పాడసాగినది. అప్పుడదే మార్గంలో కోసలాధిపతి ప్రసేనజిత్తు ప్రయాణిస్తూ ఆమెను చూసి అద్భుత గాన నాట్య కౌశల్యానికి ముగ్ధుడై అంగరంగ వైభవంగా ఆమెను వరిణయమాడి, పట్టపు రాణిని చేశాడు. రాజుకు అనురాగవల్లిగా, రాజ్యానికి ఆదర్శరాణిగా రాజుతోబాటుగా బుద్ధునికి శిష్యురాలై తరించినది.

మిగరమాత విశాఖ: అంగదేశానికి చెందిన ధనుంజయ, సుమనల పుత్రిక విశాఖ. సహజ సౌందర్యవతి, విద్యావతి, గుణవంతురాలు. కోసలరాజైన ప్రసేనజిత్ మంత్రివర్యులు మిగురుడు అతని కుమారుడు పుణ్యవర్ధనుడు ఆగర్భ శ్రీమంతుడు, సుఖాభిలాషి. సౌందర్యవతి, గుణవతి, అన్నివిధాల అనుకూలవతి అయిన భార్య లభిస్తేనే వివాహమాడతానని పుణ్యవర్ధనుడు పేర్కొన్నాడు. బ్రాహ్మణులు విశాఖనే తగిన వధువని నిశ్చయించి అంగరంగవైభవంగా వివాహం జరిపించారు. శ్రావస్తినగర పురజనులు ఆమెకు ఘనస్వాగతమందించారు అనేక బహుమతులనివ్వగా తిరిగి వాటన్నింటిని ప్రజలకు ఇచ్చి దాతృత్వాని ప్రదర్శించినది.

మిగురుడొకనాడు దిగంబర జైన సన్యాసులకు ఆతిథ్య మివ్వడానికి ఆహ్వానించి వారికి పరిచర్యలు చేయవలసినదిగా విశాఖను కోరగా తిరస్కరించినది. వారు ఆమెను ఇంటినుండి వెళ్ళగొట్టమని చెప్పారు. అతడాచర్యకుపక్రమించలేదు.

ఒకనాడొక బౌద్ధభిక్షువు భిక్షకై వాకిట నిలచివుండగా మిగురుడు చూసి చూడనట్లుగా బంగారు గ్లాసులో పాయసం

సేవిస్తున్నాడు. అది చూసిన విశాఖ ఆ భిక్షువుతో మా మామ పాచి అన్నంతింటున్నాడు (పూర్వజన్మఫలం అనుభవిస్తున్నాడు) మీరు ప్రక్క ఇంటికి దయచేయండని అన్నది. మామ ఆగ్రహానికిగురై పుట్టింటికి వెళ్ళుటకు నిర్ణయించుకున్నది కాని, వారు అందుకు అంగీకరించలేదు. చివరకు మిగురునిచే బుద్ధుని భిక్షకు ఆహ్వానించేటట్లు ఒప్పించింది.

అచిరకాలంలోనే మిగురుడు బుద్ధుని భిక్షుసమేతంగా అహ్వానించి, బుద్ధుడి బోధనలు విని, తరించి ఉపాసకుడైనాడు. అంతేగాక విశాఖను తన మాతృసమానురాలుగా భావించి మిగురమాతగా అమెను సంబోంధించసాగాడు. ధర్మమార్గంలో నడిచిన విశాఖ, తన స్వంత నగలన్ని అమ్మి పుబ్బారామాన్ని నిర్మింపజేసినది. దానినే అందరు 'మిగురమాత' మందిరమన్నారు. దారి తప్పిన మామగార్ని ధర్మపథంలోనికి నడిపిన మహిళగా మిగురమాత నాటి మహిళాలోకంలో ఆదర్శవంతురాలైనది.

పటాచర: శ్రావస్తినగరంలో సంపన్న వైశ్యవర్తకు డొకరుండే వాడు. అతడు జైనమతస్థుడు. వ్యాపారాలద్వారా కోట్లసంపదకు పడగలెత్తి ఏడంతస్తుల భవంతిలో నివసించే వాడు. అతని జ్యేష్ఠ కుమార్తె పటాచర. తండ్రి వివాహ ప్రయత్నాలలో ఉండగా నౌకరుతో ప్రేమాయణం సాగించి, విలువైన నగలు పెద్ద మొత్తం నగదుతోసహా పారిపోయినది. ప్రేమే సర్వస్వం, ప్రియుడేలోకం అని అనుకున్న పటాచర సుఖజీవనాన్ని సాగించి, ఇద్దరు కుమారులను కన్నది. తెచ్చుకున్న ధనం హరించుకుపోగా పస్తులుండాల్సిన పరిస్థితులేర్పడ్డాయి. తన తల్లిదండ్రులను చేరుకొని సహాయమడగాలని ప్రయాణమవగా దారిలో పాము కరిచి భర్త మరణించాడు. నదిని దాటుతుండగా నదిపొంగి ఇద్దరు పుత్రులను మింగేసినది. చివరికి తల్లిదండ్రుల ఊరు చేరుకొనగా తఫానుకు ఏడంతస్తులభవంతి కూలి తల్లితండ్రులు, తమ బంధువులు మరణించారని తెలిసి మతిభ్రమించి, తిరుగుతూ మానవీయబుద్ధభగవానుని చేరుకొని ధర్మబోధనలు విని తరించింది. జీవితం అశాశ్వతమని తెలుసుకొని బౌద్ధభిక్షుణిగా ధమ్మదీక్ష స్వీకరించి, భిక్షుణి సంఘానికి చక్కటి క్రమశిక్షణను ఏర్పరచి, ధర్మవ్యాప్తికి కృషిచేసిన పుణ్యవతి. బుద్ధుని సహచర శిష్యులతో భిక్షుణి సంఘంలో ప్రధాన భూమిక పోషించి, నాటి మహిళాలోకానికి ఆదర్శవంతురాలైనది పటాచర.

ధనంజనాని: రాజగృహంలో నివసించే భరద్వాజుడనే బ్రహ్మణుని భార్య, భగవాన్ బుద్ధుడి భక్తురాలు. ధనంజనాని భర్త బుద్ధుని తీవ్రంగా ద్వేషించేవాడు. ధనంజనాని మాత్రం బుద్ధునిపట్ల, ఆయన ధర్మంపట్ల, సంఘంపట్ల అచంచల విశ్వాసం కలిగివుండేది. భరద్వాజుడొకసారి బ్రాహ్మణులకు గొప్పవిందు ఏర్పాటు చేశాడు. ఆ విందులో బుద్ధుని గురించి ఏ ప్రసక్తి రాకూడదనీ, ముందుగానే భార్యను హెచ్చరించాడు. విందులో ధనంజనాని భర్తకు, ఆ బ్రాహ్మణులకు భయపడకుండా తనకున్న వాక్స్వాతంత్ర్యాన్ని, భక్తితత్పరతను చాటుతూ బుద్ధభగవానునిపైన, ధర్మంపైన అనేక గీతాలను ఆలపించినది. విందు ముగిసిననంతరం బుద్ధున్ని ద్వేషిస్తూ అతనికి తగిన గుణపాఠం చెబుతానని భరద్వాజుడు ఆగ్రహించాడు. తదుపరి బుద్ధున్ని సందర్శించి ఒక ప్రశ్న వేశాడు: 'సంతోషంగా జీవించాలంటే ఏంచేయాలి?' భగవానుడందుకు జవాబుగా 'ముందుగా నీలో ఉన్న కోపాన్ని త్యజింపమని సలహా ఇచ్చాడు.' తన అజ్ఞానాన్ని పూర్తిగా తొలగించుకొని బుద్ధుడి శరణుజొచ్చి భరద్వాజుడు ధర్మమార్గంలో నడిచాడు. తన వాక్స్వాతంత్ర్యాన్నీ నిలబెట్టి నమ్మిన సిద్ధాంతాలను ఆచరించిన ధీరమహిళ ధనంజనాని.

సుజాత: సిద్ధార్థుడు తపమాచరిస్తున్న నిరంజన నదీతీరంలోని ఉరువేల గ్రామానికి చెందిన సంపన్న యాదవ స్త్రీ సుజాత. భర్త సత్యవ్రతుడు. సకలబోగభాగ్యాలున్నా పుత్రసంతానం కొరకు తపించేది. ఒకనాడు సుజాత ఒక మహావృక్షాన్ని సమీపించి వృక్షదేవతలు పుత్రుని ప్రసాదించమని వేడుకున్నది. నా కోర్కెతీర్చిన భక్తి శ్రద్ధలతో మ్రొక్కులు తీరుస్తానని అన్నది. అనతికాలంలోనే మగబిడ్డను కన్నది. మ్రొక్కుతీర్చుకోవడానికి ఆ మర్రివృక్షాన్ని సమీపించగా చిక్కి శల్యమై, ఆహారాన్ని స్వీకరించడానికి నిర్ణయించుకున్న సిద్ధార్థున్నికాంచి వనదేవతగా భావించి తనుతెచ్చిన పాయసాన్ని అందించగా సంతోషంతో భుజించి, ఆమెతో సంభాషించి, ఆమె సంతోషానికి కారణం, దుఃఖాన్ని పోగొట్టుకున్న విధానాన్ని తెలుసుకున్నాడు. ఆ విధంగా భగవాన్ బుద్ధునికి అవసరమైన సమయంలో పాయసాన్ని అందించి ఆయనకృపకు పాత్రురాలైనది. ఆ తరువాతవచ్చిన భయంకరకరువుకు తన యావదాస్తిని అమ్మి తారతమ్యభేదంలేకుండా అన్నదానాన్ని నొసగిన వితరణశీలి. సత్కర్మకు సత్ఫలితాలుంటాయని ధృవపరిచిన మానవతామూర్తి సుజాత అందరికి ఆదర్శప్రాయురాలు.

ప్రకృతి : శ్రావస్తికి చెందిన మాతంగతనయ యథాప్రకారం రేవునుండి నీరు తెస్తుండగా బుద్ధుని ప్రియశిష్యుడు ఆనందుడు దాహానికి నీరిమ్మని ప్రకృతినడిగాడు. తక్కువ జాతికి చెందిన స్త్రీ నీరివ్వకూడదని పలికినది. ఆనందుడు నేను నీరడిగాను కాని నీ కులమడగలేదే అని ప్రపంచంలోని మానవులంతా సమానులే అనే సమతాదృష్టిని బోధించాడు. నీరిచ్చి ఇంటికి వచ్చిన కన్య ఆనందునితో వివాహం జరిపించాలని తల్లిని కోరినది. అతడు బ్రహ్మచారి. బుద్ధుని శిష్యుడు. భిక్షువు వివాహం అసంభవమని తల్లి తెల్పగా ఆనందుని వెతుకుతూ జేతవనం చేరగా బుద్ధుడు అమ్మా ప్రకృతి నీవు చూసిన ఆనందుని అందం తాత్కాలికమైనది. కళ్ళు కన్నీళ్ళకు నిలయం, ముక్కు మురికి కూపం, నోరు ఎంగిలి, వొళ్ళంతా చెమటకంపు, మలమూత్రాలనిలయం. జీవితం శాశ్వతం కాదు. నీ కోరిక సమంజసంకాదు ఆలోచించుకో అని అన్నాడు. ప్రకృతికి పరివర్తనం కలిగి ధమ్మదీక్షనివ్వమని బుద్ధుని వేడుకున్నది. ధమ్మదీక్షనిచ్చి భిక్షుసంఘంలోకి ఆహ్వానించిన బుద్ధుడు అమ్మా ప్రకృతి, నీవు ధన్యురాలివి, సద్ధమ్మమార్గంలో నీవు రాణులనుమించిన ప్రతిభతో వెలుగొందుతావని ఆశీర్వదించాడు. ఉత్తమ భిక్షుణిగా ఉన్నత స్థాయికెదిగిన ప్రకృతి బౌద్ధచరిత్రలో చిరస్థాయిగానిలిచినది.

ఆమ్రపాలి: వైశాలినగర గణనాయకుడైన శాఖ్య ధనికుడికి ఒక మామిడి చెట్టు మొదట అందమైన ఆడపిల్ల (ఆమ్రపాలి) లభించినది. ఆమెను పెంచి పెద్దచేసి నకలశాస్త్ర పారంగతురాలిగా తీర్చిదిద్ది తగిన వరుడితో వివాహం చేయ నిశ్చయించినాడు. ఆమె అందం, నాట్యకౌశలం, ఆమె పాలిట శాపాలైనాయి. లిచ్ఛవి రాకుమారులు ఆమెను గణభోగ్య (ఉమ్మడివేశ్య)గా ఉంచాలని వివాహ ప్రయత్నానికి అడ్డుచెప్పారు. పావనచరితుడు పుట్టిన ప్రాంతంలో జన్మించిన నా బిడ్డకు అన్యాయం చేయవద్దని వేడుకున్నా, వారు వినలేదు. కొన్ని షరతులపైన రాజనర్తకిగా – నగర శోభినిగా మనుగడ సాగించినది. అన్నీ వున్నా ఆమెకు మనఃశాంతి కరువైనది.

బుద్ధభగవానుడు వైశాలికి వేంచేయగా భిక్షుసమేతంగా ఆయనను భిక్షుకు ఆహ్వానించి స్వయంగా వండి, వడ్డించి ఆనందించినది. అంతేగాక ఆమెకెంతో ఇష్టమైన మామిడి తోటను, అందులోని భవనాన్ని బుద్ధుని అనుమతితో భిక్షు సంఘాన్ని దానంచేసింది. చివరికి తథాగతుడి ధీక్షతో పునీతయై వృత్తికి భిన్నంగా త్యాగశీలతతో పావనియైన సుజాత ఆదర్శ ప్రాయురాలు.

సిరిమ: మగధ సామ్రాజ్యంలోని సుప్రసిద్ధ వైధ్యుడైన జీవకుడి ముద్దుల సోదరి సిరిమ. ఆనాటి సమాజంలోని లక్షలాది స్త్రీలలో సిరిమ ఒక్కతే అతిలోక సౌందర్యరాశి. ఆమె అందంతో పోటీపడేది ఆమ్రపాలి మాత్రమే. నాటి రాజులామెను కులకాంతను చేశారు. అందరూ అనుభవించారు. ఆమెకు బుద్ధుడన్నా, బౌద్ధభిక్షులన్నా ఎంతో భక్తి ప్రపత్తి. స్వయంగా వండి వడ్డించేది. కాని భిక్షువులు ఆమె అందానికి దాసోహులై ఆమెననుభవించ గోరినారు. రానురాను ఆమెచెంతచేరే బౌద్ధభిక్షుల సంఖ్య పెరిగినది. ఈ విషయం భగవానునికి తెలిస్తే ఎంతో భాదపడతాడని విచారించి, తన అందం వలన భిక్షుసంఘానికి చెడ్డపేరు రాకూడదని ఆత్మహత్య చేసుకొన్నది. బుద్ధునికి ఆ వార్తతెలిసి ఖిన్నుడైనాడు. ఆమె పార్థివశరీరాన్ని శ్మశానంలో మూడు రోజులుంచవలసినదిగా కొరినాడు. మూడవనాడు యావత్ శిష్యగణంతో ఆ శవాన్ని దర్శించగా క్రుళ్ళి ఉబ్బిపోయిన శరీరం భరించరాని వాసనను వెదజల్లుచున్నది. అప్పుడు బుద్ధుడు చూశారుగా సిరిమ అందం ఏవిధంగా ఉన్నదో. మీ అపచారం వలన ఆమె అందనిలోకానికి వెళ్ళిపోయినదని అంజలిఘటించాడు. భిక్షువులు మార్పును పొందారు. సమాజ హితం కొసం జీవించి ధర్మపరిరక్షణకు బౌద్ధసంఘ సాఫల్యం కొరకు అమరజీవియైన సిరిమ నేటికీ ఆదర్శ మహిళామణే.

ముగింపు: నేను పేర్కొన్న ఈ దశమాధివనితలేగాక క్రూరమృగాల్లాంటి మగాళ్ళను హతమార్చిన సాహస స్త్రీలు, బానిసలను వివాహమాడిన సంస్కరణవాదులు, నాటి సంఘాన్ని తీర్చిదిద్దిన అనేక సాహితీస్రష్టలు, అర్హతులై ధర్మరథ సారథులుగా మారిన ఎందరో మహిళామణులు ప్రాచీన బౌద్ధసాహిత్యంలో మనకు కన్పిస్తారు.

వర్ణవివక్షతతో, సామాజిక అంతరాలతో అనేక వైరుధ్యాలుగా కొనసాగుతున్న నాటి సమాజంలో స్త్రీల స్వాభిమానం వెల్లివిరిసినది. వారు, తమ వ్యక్తిత్వాన్ని పెంపొదింప జేసుకొన్నారు

స్వేచ్ఛగా అనేక ధార్మిక కార్యక్రమాలలో పాల్గొని మహిళా ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు.

తెలుగు కవుల బౌద్ధాభిమానం

- యు. దేవపాలన

బౌద్ధం ఒక మతంకాదు. ఒక సత్యాన్వేషణం. మనిషిలో మాటువేసి ఉండే అరిషడ్వర్గాలను పారద్రోలి నివురు కప్పిన నిప్పులా ఉండే జ్ఞానాన్ని జ్వలింపచేస్తుంది. మానవుణ్ణి పరిపూర్ణునిగా జేసి సమాజసేవకు పురికొల్పుతుంది. "కులమతాలు గీచుకొన్న గీతలఁ జొచ్చి పంజరాన కట్టువడిన" నరునికి స్వేచ్ఛనొసగి విశ్వనరునిగ పరిణామం చెందడానికి దోహదంచేస్తుంది-"ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడక, ఓ మానవా నిన్ననీవే ఒక దీపంగా మలచుకో" అని బోధిస్తుంది బౌద్ధం.

జీవకారుణ్యమే బౌద్ధానికి జీవగఱ్ఱ
హేతువు, విజ్ఞాన శాస్త్రం రెండు నేత్రాలు
త్రిశరణాలు, సమత, మమత,
మానవతలకు ఆనవాళ్ళు

తరతరాల కాలపరిణామంలో అరిగి, తరిగి పెరిగి, నిత్యం పరిణామశీలియై, ప్రయోగశీలియై రెండున్నరవేల ఏండ్ల కాలంగడిచినా నేటికీ తనఉనికిని ఉన్నతంగా కాపాడుకొంటూ, సమాజానికి తన అవసరతను బలంగా చాటుతున్న నిత్య చైతన్య సజీవ క్రాంతిధార బౌద్ధం. కక్షలు, కార్పణ్యాలతో, కాంతాకాంచనాలకోసం కుత్తుకలు కోసుకొనే 'ఆనాటి క్రౌర్యతిమిరాన్ని పారద్రోలిన శాంతికిరణ సందోహం బౌద్ధం.

ఏ సిద్ధాంతమైనా ప్రజలకు చేరడానికి కళలే ఆధారమౌతాయి. అందునా కవిత్వం లలిత కళా"మతల్లి." అక్షరమే సర్వపరికరంగ కవులు వివిధ ప్రక్రియల ద్వారా ఆదర్శనీయమైన కృషిచేశారు. ఏదిఏమైనా "సామాన్యులు అసామాన్యుల మానవీయ గుణాలకు స్పందించితే, జిజ్ఞాసాపరులు అసామాన్యుల దార్శనిక సాంద్రతకు ప్రతిస్పందిస్తారు. తెలుగుకవులు ప్రధానంగా బుద్ధుని మహోన్నత వ్యక్తిత్వానికి ప్రేరణపొంది మతస్థాయిలో బౌద్ధాన్ని గురించి ఆలోచించి రచనలు చేసినారేగాని బౌద్ధ దార్శనికత గురించి అంతగా దృష్టి సారించినవారు లేరు."

పై విశ్లేషణ (ముంగర జాషువా - మిసిమి మే 2006) ఆలోచనాత్మకంగా ఉన్నది. వివిధ రచనల్ని పరిశీలించి నట్లయితే బుద్ధుని త్యాగమయజీవితానికి దర్పణాల్లా కవితలల్లినవారు కొందరు. బోధనలకనుసరణగా కొందరు. బుద్ధుని తేజోమయరూపానికి ఆకర్షితులై కొందరు వ్రాసినట్లు అవగతమౌతున్నది.

పండితుల మధ్యలో సంచరించడం కాకుండా సామాన్యులభాషలో వారిస్థాయిలో మమేకంకావాలి. బురదలో దారిపక్కన విరిసిన తామరపూవులాగా సుబోధనలు, సుగంధాలు అందించాలని ధమ్మపదం పేర్కొన్నది.

వైశాఖపూర్ణిమ రోజున అర్ధరాత్రి భగవానుడు కన్ను మూశాడు. అది క్రీ.పూ. 483వ సంవత్సరం. ఆ సన్నివేశం పాళీ గ్రంథంలో ఇలా వర్ణితమైంది:

"దివా తపతి ఆదిచ్చో
రత్తిం ఆభాతి చన్దిమా
సన్నద్ధో ఖత్తియో తపతి
ఝాయీ తపతి బ్రహమణో;
అథ సబ్బమహో రత్తిం
బుద్ధో తపతి తేజసా"

అనగా సూర్యుడు పగలు మాత్రమే ప్రకాశిస్తాడు. చంద్రుడు రాత్రివేళలో కాంతులు వెదజల్లుతాడు. యోధుడు సాయుధుడైనపుడే ప్రకాశిస్తాడు. బ్రాహ్మణుడు ధ్యానసమాధిలో ఉన్నప్పుడే కాంతివంతంగా కనిపిస్తాడు కాని, బుద్ధుడు అన్ని వేళలా ప్రకాశిస్తాడు (డా. బి.ఆర్. అంబేద్కర్, బుద్ధుడు - అతని ధమ్మం, పేజి నెం. 498).

డా. యు. దేవపాలన, ఫోన్ : 9848418574

రమణీయమైనభాష, జనప్రియమైన అలంకారాలు రచనలకు సార్వకాలికత్వాన్ని, సార్వజనీనతత్వాన్ని సాధించి పెడతాయని అర్థమౌతుంది. వేదాంతుల బోధనలు మేధావులకు అర్థమౌతాయి కాని, కవి పలుకులు సులభ సుందర శైలిలో ఉండటంవల్ల ఆకలి కడుపులకు ఆహారంలా, సహృదయుల ఎడదలకు ఆహ్లాదానిస్తాయి. బౌద్ధం నేపథ్యంగా తెలుగు కవుల కవితా కృషిని స్థాలీపులాకంగ పరిచయం చేయడమే ప్రస్తుత వ్యాసోద్దేశ్యం.

పోవరం సంస్థానాధిపతి కొచ్చెర్లకోట రామచంద్ర వేంకట కృష్ణారావు బహద్దూర్ ప్రోత్సాహంతో తిరుపతి వేంకటకవుల అనువదింపబడిన 'బుద్ధచరిత్రము' 1902 సంవత్సరంలో ప్రచురించబడింది. ఇంగ్లీషులో ఎడ్విన్ ఆర్నాల్డ్ వ్రాసిన 'లైట్ ఆఫ్ ఆసియా' అశ్వఘోషుని బుద్ధచరిత్ర, క్షేమేంద్ర కృతమైన బుద్ధజన్మములననుసరించి వ్రాయబడిన వేయి గద్య పద్యాలుగల ఆరు ఆశ్వాసాల సాంప్రదాయ కావ్యం. లైట్ ఆఫ్ ఆసియా అనువాదాన్ని విని "ఇదివరకెన్నడును ఆ మహానుభావుని చరిత్రను వినియుండని వారమగుటచే నేడు విని కడు అద్భుతమును, సంతోషమును చెందితిమి" అని ముందుమాటలుగ విన్నవించుట మనకుకూడా ఆశ్చర్యము కల్గిస్తుంది. భగవంతుడు, పునర్జన్మ, కర్మకాండలు మొదలైన పరిమితులు బౌద్ధధర్మానికి మంచుతెరలు కప్పినవి. అయినా ఒకటి రెండు ఉదాహరణలు బుద్ధుని గొప్పదనాన్ని పట్టిస్తాయి

గోపబాలునితో బుద్ధుడు
'నీ శరీరమునందు నెత్తురు నాశరీ
రమునందు మంచి దుగ్ధములుగలవె
మోముపయి బొట్టు జందెంబు
భజమునందు వర్తిలినె జన్మమందెవ్వరికి గాని
చతుర్థాశ్వసం. 108 పద్య.

బుద్ధుడు మారునితో

"అజ్ఞానమను నంధకారంబు మాయించు
రత్నప్రదీప్త మార్పందరంబె
జీవహింసా దావ పాపకంబు హరించు
పటువారిదంబు రేపందరంబె" *(చతుర్థ 174)*

బుద్ధునికి జ్ఞానోదయమైనపుడు

"వర్తకుల్మోసంబు వర్జించి తూచిరి.
"దస్యులెల్లరు దొంగతనము మాని
కటిక వాండ్రును గత్తిగద కొత్తిర జ్ఞాను
లకు నెల్ల జ్ఞాన విలసన మొదవె *(చతుర్థ 195)*

'తృష్ణ' ఎంత ప్రలోభకారియో షష్ఠ – 57వ పద్యంలో

ఆకాశ హర్మ్యంబు లల్లింపగాఁ జేయు
గగన సుమంబుగలుగజేయు
అన్యోన్య వైరంబు నందించు మోహాదు
లను, ప్రతిక్షణము వృద్ధిని బొనర్చు

సుప్రసిద్ధ పండిత కవులు, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి – కాటూరి జంటకవులచే 1932లో వ్రాయబడిన సౌందరనందం సహృదయులకు ఆనందాన్ని, సందేశాన్ని అందించింది. తమ గురువులైన తిరుపతి వెంకటకవులకు అంకితమివ్వబడిన ఈ కావ్యం బౌద్ధ దర్శనానికి చిరు సోపానం లాంటిది.

అతడటే సుకృతాత్మమైన మాయాదేవి
కడుపారగన్నా బంగారు తండ్రి
ఆలుబిడ్డలును రాజ్యము దృణమ్ముగ గాన
కేగినట్టి విరక్తుడీతడటలె

ఎంత భాగ్యమె యెన్నాళ్ళకే లభించే
సౌమ్యగంభీరమైన యీ చక్కనయ్య

సామాన్య ప్రజలకు గౌతమ బుద్ధునిపట్ల ఉన్న ఆత్మీయత, ప్రేమానురాగాలకు మంచి ఉదాహరణ.

రాచబిడ్డ నందునికి జ్ఞానోపదేశం చేస్తూ,

"అవియున్ గుండెలు రాతికైన గనుమన్నా విశ్వదైన్యమ్ము చా
లవు నీర్వెట్టగ, వేయికన్నులు, భుజాలక్షల్ వలెన్, బాప కూ
ప, విపన్నాత్ములనుద్ధరింప వెతబాపన్ సేద బోకార్ప, మై
నివురున్ బాష్ప జలమ్ము బ్రోదుడువ తండ్రీ లెమ్ము సజ్జండవై
(సౌందరనందం–షష్ఠాశ్వాసం)

ప్రపంచంలోనున్న దీనులను, హీనులను, ఆదరించవలసి ఉన్నదని నందకుమారా

"పరువము నీకు తిరమటోయి
సర్వజగతిన్ భజియింపుము నీకు మేలగున్
కొడుకులు లేనివారలకు కూరిమి బిడ్డవు
మాతృహీనులౌ బుడుతలకెల్ల దల్లివయి పోషణ సేయుము"

అని బోధించడం ఆనాటి విలాసవంతులైన రాచవారికి ఒక కనువిప్పు. ఈ కావ్యంలోని ధర్మ సంవాదం విశిష్టమైంది.



కరుణశ్రీ

కరుణశ్రీ (కీ.శే. జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు) వ్రాసిన కరుణశ్రీ, ఉదయశ్రీ కావ్యాలు నుమధురాలు. కుసుమ పేశలాలు – నహృదయ నైవేద్యాలు – తెలుగునుడి కారపు సొంపులు – మృదువైన కవితాస్రవంతులు నిజంగా తెలుగు ప్రజావళి గుండెల్లో బుద్ధమూర్తిని ప్రతిష్ఠించిన సుకవి.

ఆ ప్రక్క చూచినావా! మండు టెండలో
పొలము దున్నెడు కృషీవలులు వారు
ఆ మూల అరసినావా! గంజిలేకయల్లాడు
దరిద్ర బాలకులు వీరు

కష్ట నిష్ఠురమోయి ఈ సృష్టియెల్ల
శోక విహ్వల మోయి ఈలోకమెల్ల
వేదనా పూర్ణమైన ఈ విశ్వమందు
శాంతి ఎచ్చట? ఎచట విశ్రాంతి నీకు.

నిండు వేసంగిలో మండుటెండలందు
కష్టపడి కర్షకులు రాల్చు ఘర్మజలము
ఫలముగా మారె నేటికీ పొలములందు
బలము ప్రజలకు, మన కృషీ వలుని హలము

కష్టజీవి ఘర్మజల పవిత్రతను హలముయొక్క ప్రాధాన్యతను కవితాత్మకంగా చెప్పడం కరుణశ్రీగారి అభ్యుదయ దృక్పథానికి చక్కని సాక్ష్యం.

సమాజంలో తక్కువగ చూడబడేవారిని గురించి సానుభూతిగ ఉండడం బౌద్ధం ప్రత్యేకత. ఆనాడు అమ్రపాలి ఓ రాజనర్తకి. అయినా చిన్నచూపే. బుద్ధుడు ఆమె గృహానికి వెళ్ళే సందర్భంలో

"కన్నీళ్లతో జగత్కాలుష్యమును కడిగి
శాంతి కలహంసలకు కాంతి రెక్కలు తొడిగి
అజ్ఞానముల నణచు విజ్ఞానముల పంట
కాలూనునంట వైశాలి నర్తకి యింట"

ఇక తెలుగువారికి సుపరిచయమైన పుష్పవిలాపంలో

బుద్ధదేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి?
అందమును హత్యచేసెడి హంతకుండ
మైలపడిపోయె నోయినీ మనుజ జన్మ!

కీ॥శే॥ గుఱ్ఱం జాషువా కవి బుద్ధుని శాంతిదీపంగ వర్ణించిన పద్యాలు ఆణి ముత్యాలు.

"బుద్ధాది మునిజనంబుల తపంబున మోదబాష్పముల్
రాల్చిన భరతమాత – మాతలకు మాత
సకల సంపత్సమేత –

బౌద్ధ దర్శనం లేకున్నా బౌద్ధాభిమానానికి కొరతలేని సుకవి ఆయన.

కాలచక్ర ప్రత్యేక సంచిక జనవరి 2006, భావ వీణ సాహిత్య మాసపత్రిక బౌద్ధ దర్శన కవితా దీపిక – శ్రీ ఎమ్.పి. జానుకవి వ్రాసిన బుద్ధగీతి (చిత్త వర్గము)లో బేలయైన మనస్సును వ్యసనములెట్లు బాధించునో అట్టి మనస్సును దృఢ పరచుకోవడానికి బౌద్ధ మార్గమెలా సహాయ పడుతుందో వివరించారు.

స్వచ్ఛ జలపూర్ణ సుందర సరసువీడి
ఆర్తిగొని చేప విలవిలలాడినట్లు
మనసు బేలయై మారుని మాయజిక్కి
దారి దరిలేక మిక్కిలి తల్లడిల్లు.

మారణాయుధములతోడ మాటగాచి
బద్ధ శత్రువు కలిగించు బాధకన్న
వ్యసనములఁజిక్కి పెడదారి బట్టినట్టి
బడుగు చిత్తంబు కావించు బాధమిన్న

బుద్ధుడు కేవలం ఆసియాజ్యోతి కాదు. విశ్వజ్యోతియని వర్ణిస్తూ శ్రీ మొవ్వ వృషాధ్రిపతి

"జగతి గుండెలమీద శాంత్య హింసాజ్యోతి
వెలిగింపబుట్టిన విశ్వగురుడు
కటికవాని కసాయి వఱకు వాదర కత్తి
గుండెలో పెనుజాలి గురియు ఘనుడు

రక్తాగ్ని కీలల రగిలెడు క్రతువేది
కలు, జ్ఞానగంగచే గడుగు బుధుండు
అంటరాని తనంపు తుంటరి చిలిపి, ద
య్యము, బార ద్రోలిన విమల యశుడు

ఆసియా జ్యోతికాదు, విశ్వాత్మదీప్తి
యనెడు లోకైక విఖ్యాతి కనుగు సఖుడు
కలికిమిన్న మాయాదేవి కన్నబుడత
డలరె శాక్య సింహుడు దయామయుండు

బౌద్ధస్ఫూర్తిని హెచ్.ఆర్. చంద్రం (గుడివాడ) గారు –

"సత్య నిరతి లేక, సద్బుద్ధి నేర్వక
ఆత్మ నిగ్రహమ్ము నదియు గనక
కట్టుకొనగనేల కాషాయ వస్త్రాలు
బౌద్ధ ధర్మసూక్తి పావనోక్తి!"

వరసం అధ్యక్షులు బి. హనుమారెడ్డిగారు "బుద్ధుని మానవీయ సూత్రాలను" తన సత్యపథంలో ఇలా –

"మోహం-వాంఛ – అరిష్ట ప్రలోభాలు
కామం-ద్వేషం – వికార స్వభావాలు
కలిమి-బలిమి – అగ్ని శిఖలు
ఈర్ష్య-అసూయ – నరకలోక ద్వారాలు"

మన్నె శ్రీనివాసరావు వ్రాసిన "బుద్ధం-అశోకం" గొప్ప చారిత్రాత్మక పద్య నాటకం –

కం. సిద్ధుడవైతివి, కడు బరి
శుద్ధుడవై నీవు భూమిని శోభిల్లుమయా
బుద్ధిని లోకమునకు నిడు
బుద్ధుడవని లోకమెల్ల బూజించునినున్

తే।।గీ।। చిఱుతపులిరేగి మృగపాళి జీల్చినట్లు
కాలసర్పమ్ము పగవాని గఱచునట్లు
ఖలుడు సజ్జనులందరిన్ కాల్చునట్లు
పాపియగువాడు పరుల జీవముల గ్రోలు.

అశ్వమేధ, రాజసూయ, నరమేధ, కాళీమాత, పూజల పేర మారణకాండ చేసిన –

"సూర్య చంద్రాది వంశంపు శూరులిట్లు
రక్త పాతంబు చేసిన రాజులయ్య
ప్రాణమును సృష్టిచేయగలేని నరుడు
ప్రాణమును ధ్వంసమొనరింప పాడియౌనె."

శిథిలములలో దాగిన చరిత్రకు స్పందించిన వావిలాల నరసింహారావు (అమరావతి) –

"ఈ ధరాగర్భమందెన్ని ఆంధ్రుల సిద్ధ
శిల్పాలు శైశవ స్థితినిగనెనో
ఈపాటి దిబ్బలనెన్ని నిక్షేపము
లజ్ఞాతవాస మోక్షాభిరతుల్

ఈ మంట లోతులనెన్ని బౌద్ధ విశుద్ధ
ధర్మశాస్త్రముల్ సుస్థాపితముల్
ఈ నేల యొడిలోన నెన్ని చారిత్ర శా
సనములు పండి విశ్రాంతి గొనె

కాలమెరుగును మన ధాన్యకటక మెఱుగు
సర్వ సౌభాగ్యలోప విచారముకుళ
పద్మనేత్రాంత సంస్రవద్భాష్ప తెల్గు
తల్లి యెఱుగును సృష్టి సంధాతమెఱుగు

చింతలపాటి నరసింహదీక్షితశర్మ సత్యశోధనకై తపించిన బుద్ధుని స్మృతిలో –

ఒక తపన యొక్క వైరాగ్యమొక విషాద
మొక్క వేదన, గుండెల నొరయ
నిత్యసత్యమ్ము శోధింప నీవు బుద్ధ
మూర్తివైతివి! నీ తపస్ఫూర్తిమెత్తు

వైదికధర్మాలకు పెనుసవాళ్ళు విసిరి, పునర్జన్మను ప్రశ్నించి, అవతారాలను నిరసించిన బుద్ధుడినే ఒక అవతారమూర్తిగచేసిన భక్తిభావం కొందరు కవుల్లో కన్పిస్తుంది.

ఉ।। ఆగని క్రౌర్యమున్ నిలిపి, యందరి మేలును కోరి శాంతుడై
సాగెను జీవహింసను, విషాదపు ఛాయల నాపివేయుచున్
మూగిన మూఢనమ్మకపు ముప్పును సాంతము రూపుమాపుచున్
సేగిన బాపె ధారుణి విశిష్టముగా నవతారమూర్తియై

(దేవులపల్లి విశ్వనాథంగారి హరివిల్లు కావ్యం నుండి)

'అమ్మా క్షమించు' అనే కవితా సంకలనం వ్రాసి వృక్షానికి అంకితంచేసిన గాదేపల్లి దివాకరదత్తు గారు –

"మనుషుల్ని ఉపాసిస్తున్నాను నేను
కాలం బండి చక్రాల కింద

నలిగిన మూడు సహస్రాబ్దాల్లో
మానవతా కేతనం దిగంతాల కెగరేసిన
మనుషుల్ని ఉపాసిస్తున్నాను నేను.

బ్రహ్మతేజస్సు మూర్తీభవించినవాడు
అర్ధరాత్రి గీతదాటిన వాడు
మానవతా మహాసౌధానికి
పునాదిరాయి మోసినవాడు
మహాబోధి వృక్షం క్రింద
మానవ వేదనల కర్థం వెదకినవాడు
మొదటి సహస్రాబ్దాన
మకుటం ధరించని మానవతా చక్రవర్తి"

సతీష్ చందర్ – ఆదిపర్వంలో

కరుణం గురించి కొద్దిగా వివరిస్తే
కనిపించేది బౌద్ధమేమరి.
ఇప్పుడయినా నమ్ముతావా
నేను నిరక్షరాస్యుణ్ణయినా
నా పూర్వీకులు సరస్వతీ పుత్రులు
బౌద్ధానికి దేశ బహిష్కారమా!

బౌద్ధులకు గ్రామ బహిష్కరణా
పిచ్చివాడు
రామా అన్నవాడూ
లామా అన్నవాడు
భక్తుడు కాగలడేమోగాని
మనిషి కాలేడు
అసలు బుద్ధుడు నా దగ్గరే ఉన్నాడు
"దళితం శరణం గచ్ఛామి"

దళిత దృక్కోణం నుంచి వ్రాసిన పై కవిత కవి నూతన ఆలోచనా విధానానికి కలికితురాయి. ఇంకో దళిత కవి కీ.శే. చాట్ల రవీంద్రసాగర్ తన మైలగోరింక కవితా సంకలనంలో–

".....ఓనా మైలగోరింకా
ఎగిరొచ్చి నా చేయందుకో
నాపాటందుకో!
ఈ కులకాష్టాన్నొదిలిరా
వేయి డప్పుల్తో నిన్ను
ఊరేగింపుగా తోడుకెళ్తా
నా కలల వాడలోకి
బోధివృక్షపు నీడలోకి"

డా॥ బి.ఆర్. అంబేద్కర్‌గారు చూపిన ప్రత్యామ్నాయ సాంస్కృతిక వారసత్వంలోకి, నిమ్నవర్గాల మహాప్రస్థానం ప్రారంభం కావడం ఆహ్వానించదగ్గ విషయం.

అమరావతిలో కాలచక్ర మహాసమ్మేళనం జరిగిన సందర్భంలో డా॥ యు. దేవపాలన వ్రాసిన జ్ఞానచక్రం–

"ఆరామ మహాచైత్యాలలో
నినదించిన త్రిశరణాల ప్రతిధ్వనిని
నిశ్శబ్దం చేయగలరా!
వర్ణవ్యవస్థల వివక్షతపై
భావవిప్లవం రేకెత్తించిన
మానవతా మార్గానికి అస్తమయమా!

గొడ్డలి వేటులకు గురయిన ప్రతిసారీ మన బోధి వృక్షం ద్విగుణీకృత వసంతశోభలతో విస్మరిస్తూనే సాగింది. ఆనాటి మూఢమతులైనా, ఈనాటి ఆఫ్ఘన్ గన్స్ అయినా బుద్ధుని రూపాల్ని కాలరాశారేమోగాని, జ్ఞానచక్ర పరిభ్రమణాల్ని ఆపడం ఎవడికి శక్యమౌతుంది.

ఆనాడు బౌద్ధధర్మం సామాన్యులకు చేరువకావడానికి సమస్త కళలు దోహదం చేశాయి. శిల్ప, చిత్రలేఖన కళలు ఎంతగా కృషిచేసింది అజంతా, ఎల్లోరా, స్థూప, చైత్య ఆరామాల్ని దర్శిస్తే అవగతమవుతుంది. ఆంధ్రభూమి, తథాగతుని బోధనలచే పావనమైంది.

ప్రాకృత భాషాభేదమైన పాళీభాష బౌద్ధాన్ని ప్రజల గుండెలకు చేర్చింది. జాతకకథలు జానపదులన్ని అలరించాయి. కానీ రామాయణ, మహాభారత, భాగవత కథలవలె గ్రామీణ ప్రజల్ని అలరించడానికి కైకట్టబడిన బౌద్ధ కథలు కన్పించక పోవడం ఒక వెలితిగ కన్పిస్తుంది.

వెన్నెల, తుమ్మెద, నివాళి పదముల్లోనూ ఒక వీధి, ఒక యక్షగానం, ఒక కోలాటం, ఒక భజన మొదలైన జానపద కళారూపాల్లో బౌద్ధ ధర్మాల్ని ప్రచారం చేస్తే అందుకు కవులు, రచయితలు, కలాల్ని గళాల్ని సవరిస్తే మళ్ళీ బౌద్ధం పురివిప్పిన మరాళమౌతుంది.

విష్ణుకుండినులు – బౌద్ధం

- రాజేంద్ర అనూరాధ

వాకాటక మహాదేవి అనే చారిత్రక నవలను భిన్నూరి నరసింహశాస్త్రి (బి.ఎన్.శాస్త్రి) గారు రచించారు. ఈయన చరిత్రపరిశోధకులు, శాసనతపస్వి, స్వాతంత్ర్య సమర యోధుడు, సృజనాత్మక బహుగ్రంథ రచయిత, మూసీపత్రిక వ్యవస్థాపకులు. చరిత్రకారులంతా సాహితీ వేత్తలు కాలేరు. కానీ, బి.ఎన్.శాస్త్రిగారు బహుముఖ ప్రజ్ఞావంతులు. ఈయన చారిత్రక రచనల్లో వాకాటక మహాదేవి ఒకటి. ఈ నవలలో ఆనాటి మతపరిస్థితులు, బౌద్ధధర్మ ఆదరణ, బౌద్ధధర్మానికి ఆనాటి రాజులు చేసిన సేవ, వారి పరమత సహనం బౌద్ధభిక్షువుల పరిస్థితులు, బౌద్ధధర్మానికి ఆయువు పట్టయిన అమరావతీ స్థూపం, శిల్ప సౌందర్యాల గురించి బి.ఎన్. శాస్త్రిగారు కన్నులకు కట్టినట్లుగా వివరించారు.



నేటి మూసీనదికి 'ముచికుంద', 'ముక్తా' అనే పేర్లు పురాణ ప్రసిద్ధమైనవి. ఆ ముచికుంద నది ఒడ్డున ఇరువైపులా విస్తరించి ఉన్న ఇంద్రపురినగర సామ్రాజ్యాన్ని విష్ణుకుండిన ప్రభువై గోవిందవర్మ పాలించేవాడు. గోవిందవర్మ వైదికమత అనుయాయు డైనప్పటికీ, బౌద్ధమతంపై ఉన్న అభిమానంతో బౌద్ధానికి ఎనలేని సేవచేశాడు. పరమత సహనాన్ని అవలంబించి, బౌద్ధధర్మ విస్తరణకు కారణభూతుడైనాడు. బౌద్ధ ధర్మం క్షీణించిపోకుండా తన ఔదార్యంతో బౌద్ధధర్మాన్ని ఉద్ధరించాడు. ఇంద్రపురినగరం వింతసోయగాన్ని కలిగిన బౌద్ధస్థూపంతో, బౌద్ధవాఙ్మయ చర్చలతో, బౌద్ధవిజ్ఞాన సముపార్జనకోసం వెలసిన బౌద్ధమహావిద్యాలయాలతో, బౌద్ధాచార్యుల నోటివెంట వెలువడిన బౌద్ధవిజ్ఞాన జ్ఞాన సూక్తులతో ప్రజలను అలరింపజేస్తోందని తెలుస్తుంది. అటువంటి ఇంద్రపురి సామ్రాజ్యం ఆంధ్రమహానగరాలకు మకుటాయమానంగా ఉంటూ, సకల బౌద్ధవిద్యలకు, కళలకు, బౌద్ధవిజ్ఞానానికి ప్రతీకగా నిలిచిందని చెప్పవచ్చు.

విష్ణుకుండిన ప్రభువైన గోవిందవర్మ పట్టమహిషి పరమ (భట్టారిక) మహాదేవి కోరిన కోరికవల్ల ఇంద్రపురిలో బౌద్ధ ఆరామనిర్మాణం జరిగింది. ఆనాటి రాణులు పరిపాలనా విషయాల్లో జోక్యం చేసుకొని ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకొనే వారనే విషయం మనకు అవగతమౌతుంది. గోవిందవర్మకు పరమమహాదేవి తన కోరికను వెల్లడిస్తూ – ''బౌద్ధ భిక్షువుల సంఖ్య ఇంద్రపురిలో నానాటికి ఎక్కువగుచున్నది. మొన్న మొన్నటి వరకు వందల సంఖ్యలో నున్న బౌద్ధభిక్షువులు వేల సంఖ్యకు పెరిగినారు. దక్షిణమున బౌద్ధధర్మం రాజాదరణము లేక క్షీణించినది బౌద్ధులు విదేశములకు వలస వెళ్ళు చున్నట్లు తెలిసినది. మన సామ్రాజ్యమునందు స్థిరపడుటకు అమరావతి, భట్టిప్రోలు, విజయపురి మున్నగు ప్రాంతముల నుండి బౌద్ధపండితులు, ఛాత్రులు, భిక్షుణీ భిక్షువులు వచ్చినారు. విష్ణుకుండిన ప్రభువులు తథాగతుని భక్తులు గదా? మరి బౌద్ధసంఘములకు తగిన వసతి కల్పింపవలదా?'' అని మహారాణి తెలపడంవల్ల బౌద్ధారామాన్ని నిర్మించి, బౌద్ధ భిక్షువులకు వసతి కల్పింపదలచి, మహారాణి పేరుపైనే

డా. రాజేంద్ర అనూరాధ, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

మహాదేవి మహావిహారాన్ని నిర్మించడానికి గోవిందవర్మ ఉద్యుక్తుడైనాడు.

అమరావతీ విహారంలో మహాపండితులైన మహానాగ బౌద్ధాచార్యులు బౌద్ధధర్మ సంబంధ విజ్ఞానానికి ఖని వంటివాడు. అమరావతి శాతవాహనాంధ్రుల కాలంలో వైభవంగా ఉంది, ఇక్ష్వాకులు అమరావతీ స్థూపాన్ని రక్షించి, ఆరామవిహారాలను వృద్ధిచేసి, బౌద్ధపండితులను, కళలను పోషించినట్లుగా చెప్పబడింది. దీనివల్ల ఆనాటి బౌద్ధధర్మం వికాసదశలు మనకు అవగతమౌతాయి.

మహానాగ బౌద్ధాచార్యులను అమరావతి నుండి ఇంద్రపురికి ఆహ్వానించి గోవిందవర్మ మహాదేవి మహావిహార నిర్మాణ బాధ్యతలను అతనికి అప్పగించి, అతను తిరిగి వెళ్ళేవరకూ అమరావతి ఆరామంలో ఉన్న బౌద్ధభిక్షువులకు ఏలోటూ లేకుండా ఉండడానికి అమరనాథ దండ నాయకునితో వేయి నిష్కములను పంపుతాడు. ఈ సంఘటన వల్ల మహారాజుల ఔదార్యం మనకు తెలుస్తుంది.

మహానాగ బౌద్ధాచార్యులను అమరావతి నుండి ఇంద్రపురికి ఆహ్వానించి గోవిందవర్మ మహాదేవి మహావిహార నిర్మాణ బాధ్యతలను అతనికి అప్పగించి, అతను తిరిగి వెళ్ళేవరకూ అమరావతి ఆరామంలో ఉన్న బౌద్ధభిక్షులకు ఏలోటూ లేకుండా ఉండడానికి అమరనాథ దండ నాయకునితో వేయి నిష్కములను పంపుతాడు. ఈ సంఘటన వల్ల మహారాజుల ఔదార్యం మనకు తెలుస్తుంది.

అమరనాథ దండనాయకుడు దర్శించినప్పుడు అమరావతిని గూర్చిన వర్ణనను రచయిత వర్ణిస్తూ "అమరనాథ దండనాయకుడు సహచరులతో కృష్ణానదీ పవిత్రజలమున గ్రుంకులిడి, అమరావతీ స్థూపము దర్శించి, ప్రార్థనాదికములు ముగించుకొని, సంతోషాంతరంగుడై అచటి ప్రకృతి శోభల నలరి, అమరావతీ మహా విద్యాలయ గ్రంథాలయమును, ఛాత్రులు, ఆచార్యుల పరస్పరానురాగ సంబంధములను గురుభక్తిని బౌద్ధధర్మ విజ్ఞాన జ్యోతియైన అమరావతీ ప్రధానాచార్యుని తత్వబోధనలు, మహావిహార నిర్మాణ కౌశలమును, అమరావతీ స్థూప శిల్ప సంపదను, ఆనాటి శిల్పుల అనమాన ప్రతిభావిశేషములను సూచించు చిత్రములను, బౌద్ధ జాతక కథలను చిత్రించిన శిల్ప కళాభిజ్ఞుల కౌశలమును మననము చేసి"కొన్నాడని వివరించబడింది.

గోవిందవర్మ బోధి చిత్తంకలవాడు. పరమ మహాదేవి మహాబోధి భక్తురాలు. కాబట్టి దశబలబలి అనే బౌద్ధాచార్యుని ఆజ్ఞమేరకు తమకుమారుడైన మాధవవర్మకు కాంతిమతీదేవితో బౌద్ధధర్మానుసారంగా వివాహం నిరాడంబరంగా జరిపించారు. దీనివల్ల బౌద్ధధర్మంలో నిరాడంబరత్వం ప్రాముఖ్యాన్ని కలిగి ఉందనడానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

మహాదేవి మహావిహార నిర్మాణానికి మహారాజు బొక్కసం నుండి ఖర్చు చేస్తున్నప్పటికీ ఇంద్రపురి ప్రజలు కూడా అవసరమైన వస్తుసముదాయాన్ని సమకూర్చడానికి ఉత్సాహం చూపడంవల్ల ఇంద్రపురి ప్రజలు కూడా రాజ్యకార్యాల్లో పాలుపంచుకోవడం తెలుస్తుంది.

మహావిహార సమీపంలో ఒక వసతిగృహాన్ని నిర్మించ దలచి, ఆ నిర్మాణంకోసం మహాదేవి తన ఆభరణాలను వెచ్చిస్తుంది. ఆ వసతిగృహంలో సమస్త సదుపాయాలు బౌద్ధుల కోసం నిర్మించ బడుతుంది. అంతేకాక, మహాదేవి, కాంతిమతీదేవి మొదలైనవారు ప్రతిరోజు ఆ విహారనిర్మాణాన్ని పర్యవేక్షించడమేకాక, బౌద్ధ శిల్పులకు, ఆచార్యులకు, వాస్తు శాస్త్రజ్ఞులకు మధ్యాహ్నంభోజన సమయంలో వారికి ఆహారపదార్థాలను స్వయంగా వడ్డించే వారు. రాణులుకూడా నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతున్నట్లు వివరించబడింది.

మహాదేవి మహావిహార నిర్మాణంపై శిల్పాలు, చిత్తరువుల గురించి చెప్తూ – "విహార నిర్మాణమున బౌద్ధ జాతక కళలకు సంబంధించిన శిల్పములు, చిత్తరువులు మనోజ్ఞముగా చిత్రింపబడినవి. మహాదేవి మహావిహార నిర్మాణమున అంకురార్పణ మెట్లు జరిగినదో ఆ సన్నివేశములను తెల్పు చిత్రములు ఫలకములపై చిత్రీకరింపబడినవి" అని శిల్పుల శిల్ప చాతుర్యాన్ని కొనియాడబడింది.

మహావిహార ప్రారంభోత్సవ సమయంలో మహారాజు గోవిందవర్మ విహారంలో నివశించే బౌద్ధసంఘ పరిభోగార్థం మహావిహారానికి ఇచ్చే అగ్రహారాల్ని శాసనబద్ధం చేయించారు. మహారాజుల దాతృత్వం ఇందులో బోధపడుతుంది.

బుద్ధ భగవానుని పవిత్ర సందేశాలను ప్రజలకు ఉపదేశించు మహనీయులను సందర్శించి, వారి ఆశీర్వాదం

పొందడం అందరికీ ఆమోదయోగ్యమైనదని దశబలబలి గూర్చి చెప్పబడింది-"జీవితములో సాధించదగిన ధర్మార్థ కామ మోక్షములలో ప్రథమ గణ్యమైనది ధర్మము. ధర్మములలో బౌద్ధధర్మము పరమోత్కృష్టమైనది. బుద్ధదేవుని పవిత్రమైన జన్మముచే సార్థకమైన భారతావని సకల ప్రపంచమునకు మార్గదర్శియైనది. మానవజీవితమున మహోన్నతమైన నాలుగవ పురుషార్థమునకు సన్నిహిత సోపాన మార్గముగా విలసిల్లిన బౌద్ధధర్మ సిద్ధాంతములను బోధించు తథాగతుని శిష్యులు పూజనీయులు. అనవతరము సంసార బంధములో సతమతమయ్యే మానవాళిని కడతేర్చు మహితోక్తులతోను తథాగతుని బోధనలతో గూడిన ఉత్కృష్ట గ్రంథ రాజములు ప్రపంచ సాహిత్యమున ప్రత్యేక స్థానమాక్రమించినవి. సకలశాస్త్ర సారంగతులైన మహాపండితుల వ్యాఖ్యానములతో సామాన్య ప్రజలకు సైత మర్థమగునట్లు సులభశైలిలో, ప్రాకృత భాషలో రచింపబడిన బౌద్ధ పిటకములు – అట్టి గ్రంథములను రచించిన మహామహులలో శ్రేష్ఠుడు దశబలబలి" అంటూ బౌద్ధాచార్యుల సత్యసంధతను, వారి జీవన విధానం ఇతరులకు ఆదర్శప్రాయం, ఆచరణీయమైందిగా వివరించబడింది.

ఇంద్రపాలనగరంలో ప్రపంచ ప్రఖ్యాతిచెందిన మహాదేవి మహావిహారాన్ని అతిసుందరంగా నిర్మింపచేసి, విష్ణుకుండిన గోవిందవర్మ మహారాజు తన భార్య పరమ మహాదేవి కోరిక నెరవేర్చినాడు, వేలసంఖ్యలో దారితెన్నులేక కొట్టుమిట్టాడుతున్న బౌద్ధ భిక్షుణి, భిక్షువులకు నిలువనీడ కల్పించి, బౌద్ధం మరికొంతకాలం మాతృభూమిలో వర్థిల్లునట్లు చేశాడు దశబలబలి.

మాధవవర్మ రెండవ భార్య వాకాటక మహాదేవి వైదిక మతానురాలైనప్పటికీ బౌద్ధధర్మంవైపు ఆకర్షితురాలైందని రచయిత తెలుపుతూ

"బుద్ధం శరణం గచ్ఛామి
ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి"

"ఇంద్రపురి మహాదేవి విహారంనుండి వేకువజామున శ్రావ్యముగా వినిపించు త్రిశరణముల నాలకించి వాకాటక మహాదేవి శయనాగారముననున్న గవాక్షము తెరచి చూచి పులకాంకితయైనది'' అని వివరిస్తూ వాకాటకదేవి "నామనమీనాడు ఈ బౌద్ధమునాకర్షించుచున్నది" అని అనుకోవడంవల్ల ఎంతటి కఠిన చిత్తులను కూడా బుద్ధుని బోధలు తమవైపు ఆకర్షించుకొనుననే భావాన్ని వ్యక్తం చేశారు.

వైదిక సంస్కృతికి బౌద్ధ జైనమతాలు అవరోధంగా ఉండేవి ఆనాడు. మౌర్యచక్రవర్తి అశోకుని జీవితంలో కళింగ యుద్ధం పరివర్తన కలిగించింది. దానివల్ల బౌద్ధధర్మ వికాసం వల్ల ఎన్నో వందల బౌద్ధస్థూపాలు నిర్మించడం జరిగింది. ఎన్నో వందల, స్థూపాలు, మహావిహారాలు ఆవిర్భవించాయి. ఎన్నోలక్షలమంది బౌద్ధాన్ని స్వీకరించారు. రాజులు, రారాజులు, చక్రవర్తులు, మహారాజులు, దండనాధులు, సర్వసామంతాధిపతులు, మహావిహార నిర్మాణాలతో ఆంధ్ర శిల్పుల అసమానశిల్ప ప్రావీణ్యం కలిగిఉంది. ఏనాటి అనుబంధమో బౌద్ధం ఆంధ్రులకు స్వధర్మమైంది. బౌద్ధ ధర్మంలో హీనయాన, మహాయానాలతో పాటు వజ్రయానం కూడా స్థానమేర్పరచుకొంది. బౌద్ధారామవిహారాలు పవిత్రతను సంతరించుకొన్నాయి.

మహాదేవి మహావిహార నిర్మాణం జరగకుండా ఉన్నట్లయితే బౌద్ధం పరిస్థితి ఎట్లుండేదో తెలుపుతూ – "పరమమహాదేవి ఆదర ప్రోత్సాహములు లేకుండిన బౌద్ధ పండితులు దూర ప్రాచ్యదేశములకు వలసపోయి యుందురు. అమరావతి ఆచార్యులందరును ఇంద్రపురినాశ్రయించిన వారే" అని వివరించబడింది. అటువంటి దుస్థితినుండి బౌద్ధ భిక్షువులను తప్పించి, తమ పరమతసహనాన్ని చాటుకొన్న వారు విష్ణుకుండిన మహారాజు, గోవిందవర్మ.

బౌద్ధ గ్రంథాలు, విగ్రహాలు ఎన్నో మాతృభూమిని వదలి పోయాయనే ఆవేదన రచయితలో కనబడుతుంది.

అప్పటి రాజులు తమ అవసాన దశలో దైవచింతనలో గడిపేవారనడానికి నిదర్శనంగా మహారాజు గోవిందవర్మ, పరమమహాదేవి తమ శేషజీవితాన్ని అమరావతిలో గడపడానికి బయలుదేరుతారు.

మాధవవర్మ భార్యలు కాంతిమతీదేవి, వాకాటక మహాదేవికలిసి మహాదేవి మహావిహార నిర్వహణకోసం రెండువేల నిష్కములను ఇవ్వడంవల్ల వారిలోని దాతృత్వాన్ని తెలుపుతుంది.

ఈ విధంగా వాకాటకమహాదేవి అనే నవలలో బౌద్ధ ధర్మం వికాసం, విష్ణుకుండిన వంశీయులు బౌద్ధానికిచేసిన సేవలు, ఈ చారిత్రకనవలలో శాస్త్రిగారు వివరించారు.

బౌద్ధధర్మ పునరుజ్జీవనం - పండిత అయోతీదాస్

- చల్లపల్లి స్వరూపరాణి

ప్రాచీనకాలంలో బ్రాహ్మిణీయ వైదికమతానికి ప్రత్యామ్నాయంగా ఒక సామాజిక ఉద్యమంగా బౌద్ధధర్మం ముందుకు వచ్చింది. బుద్ధుడు వేదాల ప్రామాణికతనే కాక అవి సృష్టించిన అసమసమాజాన్ని ప్రశ్నించాడు. ప్రాచీన భారతదేశంలో రాజాదరణనూ, ప్రజాదరణనూ చూరగొన్న బౌద్ధం తక్కువకాలంలోనే అనేక ప్రపంచదేశాలకు వ్యాపించింది. అయితే మధ్యయుగాల నాటికి రకరకాల అంతర్గత, బహిర్గత కారణాలవలన భారతదేశంలో అంతరించి పోయింది. కొందరు రాజులూ, వారిబలగాలు బౌద్ధధర్మ కట్టడాలను, ఆరామాలను ధ్వంసంచేసి బౌద్ధ భిక్షువులను నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. వీరిదాడికి భయపడిన కొందరు భిక్షువులు దేశాన్ని వొదిలి పారిపోయారు. బౌద్ధాన్ని అంతమొందించాలని నడుంకట్టుకొన్న బ్రాహ్మణీయ తత్త్వవేత్తలు దానిని హిందూమతంలో కలిసి బుద్ధుడిని విష్ణుమూర్తి యొక్క అవతారాలలో ఒక అవతారంగా చేశారు. భారతదేశంలో ఆధునిక యుగం ప్రారంభమయ్యేనాటికి బౌద్ధ ధర్మం అంటే హిందూమతంలో ఒకానొక భాగం అనుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. బౌద్ధారామాలన్నీ హిందూ దేవాలయాలుగా మారిపోయాయి. బుద్ధగయలోని మహాబోధి దేవాలయం శైవమతానికిచెందిన మహంతుల ఆధీనంలో వుంది.

పునరుజ్జీవనం: ఆధునిక యుగంలో బౌద్ధధర్మ పునరుజ్జీవనం బ్రిటీష్ అధికారులు మరియు భారతీయేతర పండితుల కృషితో ప్రారంభమయ్యింది. కల్నల్ కాలిన్ మెకంజీ వంటి వారు పురాతత్వ పరిశోధనల ద్వారా బౌద్ధ ధర్మానికి సంబంధించిన స్థూపాలు, విహారాలు, శాసనాలువంటి భారతీయ అవశేషాలను వెలుగులోనికి తీసుకొచ్చారు. రీస్ డేవిడ్స్ "పాళీ టెక్స్ సొసైటీ"ని స్థాపించి పాళీభాషలోని బౌద్ధ గ్రంథాల సారాన్ని ప్రచారం చేశారు. ఈ క్రమంలోనే ఎడ్విన్ ఆర్నాల్డ్ బుద్ధుడిపై రాసిన *'లైట్ ఆఫ్ ఆసియా'* గ్రంథం బహుళ ప్రచారంపొంది బుద్ధుని బోధనలను ప్రపంచానికి అందించింది. దివ్యజ్ఞాన సమాజం తరపున కల్నల్ ఆల్ కాట్, శ్రీలంకకు చెందిన అనగారిక ధర్మపాల బౌద్ధధర్మానికి పునరుజ్జీవింప చేసిన విదేశీయులలో ముఖ్యుడు. శ్రీలంక దేశానికి చెందిన అనగారిక ధర్మపాల కొలంబోలో 1891లో మహాబోధి సొసైటీని స్థాపించి తర్వాత దాని కార్యక్రమాల్ని కలకత్తాకు మార్చాడు. ఆయన గయలోని మహాబోధి దేవాలయం మహంతి అధీనంలో వుండడాన్ని, బౌద్ధధర్మ విహారాలు శిథిలావస్థలో వుండడాన్ని చూసి కలత చెంది మహాబోధి దేవాలయాన్ని హిందూ ధర్మకర్తల చేతిలో నుండి విడిపించడానికి కృషిచేశాడు. తర్వాత ఆయన మహాబోధి సొసైటీ యొక్క దక్షిణ భారతదేశపు శాఖను మద్రాసులో ఏర్పాటు చెయ్యడమే కాక దాని పేరున ఒక పత్రికను కూడా ప్రారంభించాడు. ఆ రోజుల్లో బౌద్ధధర్మ పునరుద్ధరణకు కృషిచేసిన వారిలో ధర్మానంద కోశాంబి మరొకరు. ఈయన కార్మికుడూ, శ్రమజీవుల ఆధ్యాత్మిక అవసరాల కోసం బొంబాయిలో 'బహుజన విహార్' అనే బౌద్ధ విహారాన్ని నిర్మించారు. 20వ శతాబ్దపు తొలిదినాల్లో తమిళ నాడులో పీడిత కులాలు బౌద్ధాన్ని తమ విముక్తి సిద్ధాంతంగా భావించాయి. పండిత్ అయోతీదాస్, జి. అప్పాదురై వంటి పీడిత కులాల నాయకుల సారధ్యంలో అణగారిన ప్రజల కుల నిర్మూలనా ఉద్యమాన్ని ప్రారంభిస్తూ బౌద్ధాన్ని తమ తాత్విక భూమికగా ప్రకటించుకున్నారు.

పండిత అయోతీదాస్ : ఆధునిక కాలంలో విదేశీ పండితులు, భారతీయులు అనేకమంది బౌద్ధధర్మ పునరుజ్జీవనానికి కృషి చేసినప్పటికీ బౌద్ధం పట్ల వారందరి ప్రాపంచిక దృక్పథానికీ, అయోతీదాస్ ప్రాపంచిక దృక్పథానికి స్పష్టమైన తేడావుంది. అయోతీదాస్ బౌద్ధాన్ని దళితుల అస్తిత్వంగా, వారి స్వంత

డా. చల్లపల్లి స్వరూపరాణి, ఫోన్ : 9440345494

తాత్విక పునాదిగా భావించాడు. తమిళ దేశంలోని దళితులు బుద్ధుడు జన్మించిన శాక్య వంశంలోని వారేనని అనేక ప్రాచీన బౌద్ధ గ్రంథాలలోని ఆధారాలు చూపించాడు. ఆయన ప్రారంభించిన బౌద్ధ సంఘానికి 'శాక్యబౌద్ధ సమాజం' అని పేరు పెట్టి ఆది బౌద్ధులు దళితులేనని స్పష్టం చేశాడు.

పండిత్ అయోతీదాస్ 1845వ సంవత్సరం మే నెల 20వతేదీన తమిళనాడులో కోయంబత్తూర్‌లో పరమాకులంలో జన్మించాడు. ఆయన తండ్రిపేరు కందస్వామి. ఆయన తల్లిదండ్రులు పెట్టినపేరు 'కదవారయన్.' తర్వాత 'అయోతీదాస్' అనే తన గురువు పేరును తన పేరుగా మార్చుకున్నాడు. ఆయన బౌద్ధధర్మ శాఖయైన తంత్రయానంలో ముఖ్యమైన సిద్ధ విద్య నైపుణ్యం సంపాదించాడు. తాత్వికరంగంలో బ్రాహ్మణవాదానికి ప్రత్యామ్నాయ సిద్ధాంతం కోసం అయోతీదాస్ చాలా చిన్నవయసులోనే అన్వేషణ ప్రారంభించాడు. తన 20 ఏళ్ళ వయసులోనే నీలగిరి ప్రాంతంలోని దళితులను అగ్రకులాధిపత్యానికి వ్యతిరేకంగా సమీకరించడం ప్రారంభించాడు. దళితుల దుస్థితికి కారణమైన హిందూ సమాజానికి ప్రత్యామ్నాయాన్ని వెతికే దిశగా ఆయన సాగించిన నిరంతర అధ్యయనం ఫలితంగా అయోతీదాస్ ఈ దేశంలోని దళితులు ఈ దేశపు మూలవాసులని, వారు హిందువులు కారని గుర్తించాడు. ఈ అవగాహనతోనే ఆయన 1881లో దళితుల స్థితిగతులపై అప్పటి ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పిస్తూ అందులో వారిని హిందువుల జాబితా నుంచి తొలగించవలసిందిగా డిమాండ్ చేశాడు. అయోతీదాస్ 1886లో దళితులు హిందువులు కారని ఒక మానిఫెస్టోను కూడా అయోతీదాస్ ప్రచురించాడు.

శాక్య బౌద్ధ సమాజం : అయోతీదాస్ 1898లో దివ్యజ్ఞాన సమాజానికి చెందిన కల్నల్ ఆల్కాట్ మరియు శ్రీలంకకు చెందిన అనగారిక ధర్మపాల సహకారంతో 'శాక్య బౌద్ధ సమాజం'ను స్థాపించాడు. అనగారిక ధర్మపాల దక్షిణ భారతదేశంలో విస్తరింపచేసిన మహాబోధి సొసైటీ కూడా 1900 నుండి మద్రాస్‌లో అయోతీదాస్ ఆధ్వర్యంలో పనిచేయడం ప్రారంభించింది 1903లో ఈ రెండు సంస్థలు సంయుక్తంగా ఒక యువజన సమాఖ్యను ఏర్పాటు చేశాయి. ఈ సమాఖ్యకు అనగారిక ధర్మపాల, అయోతీదాస్ సంయుక్తంగా సెక్రటరీలుగా ఉండేవారు. ఈ సమాఖ్య కలకత్తాలోని బౌద్ధ యువజన సమాఖ్యతో సంబంధాలు ఏర్పరుచుకుని పనిచేసింది. మహాబోధి సమాజానికివచ్చే భిక్షువులు శాక్యబౌద్ధ సమాజాన్నికూడా సందర్శించి ధర్మ పరమైన కార్యక్రమాలు నిర్వహించేవారు.

అయోతీదాస్ ప్రారంభించిన శాక్య బౌద్ధ సమాజం నీలగిరి మరియు కోలార్ ప్రాంతాలలో ఎక్కువగా వ్యాప్తి చెందింది. అప్పట్లో పెరియార్లు కోలార్ బంగారు గనుల్లో గని కార్మికులుగా పని చేస్తుండేవారు. అయోతీదాస్ వారిని బౌద్ధధర్మపరంగానూ, కుల నిర్మూలనా దిశగానూ చైతన్య పరుస్తూ అనేక సభలు, సమావేశాలు ఏర్పాటు చేశాడు. తర్వాత ఈ సంస్థ కార్యక్రమాలు పెరియార్లు నివసించే బెంగుళూరు పరిసర ప్రాంతాలలోనూ వారు వలస కూలీలుగా వెళ్ళిన బర్మా, దక్షిణాఫ్రికావంటి దేశాలలో కూడా తన శాఖలు ద్వారా విస్తరింపజేసింది. చిన్నసంస్థగా మొదలైన శాక్య బౌద్ధ సమాజం కొద్దికాలంలోనే విస్తృతంకావడం వెనుక ప్రధానశక్తిగా అయోతీదాస్ కృషి ఎంతో వుంది.

బ్రిటీష్ పాలనలోని సామాజిక మార్పులూ, క్రైస్తవంలోని మతమార్పిడులు కూడా పెరియార్లు సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపాయి తప్ప అవి వాళ్ల విముక్తికి దోహదం చేయవని అయోతీదాస్ అభిప్రాయం. దళితులు ఇస్లాంలోకీ, క్రైస్తవంలోకి పరివర్తన చెందడాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నో వ్యాసాలు రాశాడు. పీడిత కులస్థులు ఎప్పుడూ తమ అస్తిత్వ పునాదిపై నిలబడి పోరాటాలు చెయ్యాలి తప్ప ఇతర ఆధిపత్య మతాల్లోకి శరణార్థులుగా వెళ్ళడం ద్వారా కాదని అయోతీదాస్ బౌద్ధాన్ని దళితుల అస్థిత్వంగా, వారి విముక్తి సిద్ధాంతంగా ముందుకు తీసుకొచ్చాడు. భారతీయుల మత వ్యవహారాలలో జోక్యం చేసుకోక పోవడమనే విధానం ద్వారా బ్రిటీష్‌వారు పరోక్షంగా అగ్రవర్ణాల వారి ప్రయోజనాలకు పట్టం గట్టారని ఆయన అభిప్రాయం. ప్రాచీన కాలంలో బౌద్ధ సంస్కృతి అమలులో వున్న రోజుల్లో వర్ణవ్యవస్థ వున్నప్పటికీ కులవ్యవస్థ ఇప్పుడున్న రీతిలో లేదు. కేవలం మనుషులు అవలంబించే వృత్తిని బట్టి కుల నామాలు ఏర్పడ్డాయి. ఆనాటి బ్రాహ్మణులు వారి స్వార్థ రహిత జీవనం వల్లా, జ్ఞానంవల్లా గౌరవం పొందారు. ఆర్య దురాక్రమణదారులు 'యదార్థ' బ్రాహ్మణుల స్థానాన్ని ఆక్రమించారు – కాని వీరు 'వేద' బ్రాహ్మణులు మాత్రమే. వీరిని అనుసరించిన వారు హిందువులు. ఎదిరించిన బౌద్ధులు

అంటరానివారిగా హీనస్థాయికి నెట్టబడ్డారు. హిందువులు బౌద్ధులు రాసిన గ్రంథాలను అరకొర మార్పులు చేసి తమ గ్రంథాలుగా ప్రకటించుకున్నారని అయోతీదాస్ వాదన. చరిత్రను బ్రాహ్మణేతర దృక్పథంతో వ్యాఖ్యానించడంతోనూ, స్వదేశీ ఉద్యమంయొక్క రెండు నాల్కల ధోరణిని ఎండగట్టడంలోనూ అయోతీదాస్‌కు మహాత్మఫూలేకి దగ్గిర పోలికలు కన్పిస్తాయి. స్వదేశీ ఉద్యమకారులు బహిష్కరించ వల్సింది విదేశీవస్తువులకనుకాదని, వారి గుడిసెలను కాలుస్తూ వారిని వూరికిదూరంగా పెట్టే అగ్రకుల అంటు జాడ్యాన్ని అని ఫూలే మాదిరిగానే అయోతీదాస్‌కూడా వాదించాడు.

అయోతీదాస్ సహచరులు : అయోతీదాస్ ప్రారంభించిన శాక్యబౌద్ధ సమాజం ఎందరో మేధావులను, కార్యకర్తలను ఆకర్షించింది. అందులో వివిధ కులాల వారు, వర్గాల వారు వున్నారు. మద్రాసు క్రిష్టియన్ కాలేజీ ప్రొఫెసర్, తెలుగు వాడైన పోకల లక్ష్మీనరసు, సింగరవేలు చెట్టియార్, ఎ.ఎస్. మొదలియార్, స్వప్నేస్వరీ అమ్మాళ్ మొదలైనవారు అయోతీదాస్‌తో కలిసి శాక్యబౌద్ధ సమాజంలో బౌద్ధధర్మ పరంగా పనిచేశారు. ప్రొఫెసర్ లక్ష్మీనరసు 1907లో ప్రచురించిన 'ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజమ్' అనే గ్రంథానికి శ్రీలంక బౌద్ధ భిక్షువు అయోతీదాస్ సహచరుడైన అనగారిక ధర్మపాల ముందుమాట రాశాడు. బౌద్ధాన్ని బ్రాహ్మణేతర దృక్పథంతో పరిచయంచేసిన మొట్టమొదటి గ్రంథంగా దీన్ని చెప్పవచ్చు. డా. అంబేద్కర్ ఈ పుస్తకంవలన ఎంతగానో ప్రభావితం అయ్యానని స్వయంగా చెప్పుకోవడమేకాక లక్ష్మీనరసు పుస్తకానికి అంబేద్కర్ ముందుమాట రాసి 1948లో పునర్ ముద్రించడం విశేషం. లక్ష్మీనరసు అయోతీదాస్ మరణానంతరం దక్షిణ భారతదేశ మహాబోధి సొసైటీకి, శాక్యబౌద్ధ సమాజానికి అంబేద్కర్ వారసుడిగా బాధ్యతలు నిర్వహించాడు.

స్వప్నేశ్వరీ అమ్మాళ్ శాక్య బౌద్ధసమాజంలో మరో ముఖ్యకార్యకర్త మాత్రమేకాక ఏకైక బౌద్ధమహిళా ఉద్యమ కారిణిగా గుర్తింపుపొందింది. ఆమె బౌద్ధధర్మానికి, హేతు వాదానికి, ప్రజల మానసికవికాసానికి తనజీవితాన్ని వెచ్చించింది. అయోతీదాస్ సహచరుల్లో జి. అప్పాదురై చేసిన కృషి బౌద్ధ ఉద్యమానికే తలమానికమైనది. మంత్రతంత్రాలు, మహత్యాలు, ఇంద్రజాల విద్యలవంటి వాటితో ప్రజలను మోసపుచ్చే వారిపై ఆయన బౌద్ధం తరపున యుద్ధం చేశాడు. అయోతీదాస్ అనంతరం బౌద్ధం ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళడంలో అప్పాదురై గొప్ప పాత్రనిర్వహించాడు.

బౌద్ధధర్మం ఆవిర్భవించిన కాలం నుండీ మనవాద సంక్షోభకాలంలో పునరుజ్జీవనం పొందేదాక అది పీడితుల పక్షాన నిలబడేదిగానే వుంది. బౌద్ధంలోని ఈ ఆధిపత్య వ్యతిరేక స్వభావం వలన అది నిమ్నకులాల మతంగా వుంది. అయోతీదాస్ బౌద్ధం పేరున పీడిత ప్రజలైన పెరియార్లను సమీకరించడం బౌద్ధధర్మ చరిత్రలో ఓ కీలకమైన అధ్యాయం. ఆయన ప్రారంభించిన శాక్య బౌద్ధ సమాజం అంటరాని వారిగా సమాజంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొంటున్న దళితులలో ఆత్మగౌరవాన్ని నింపింది. ఆయన ఈ సంస్థ తరపున నిర్వహించిన కార్యక్రమాలలో పెద్ద ఎత్తున దళితులేకాకుండా యితర కులాల వారు, బహుజనులు కూడా పాల్గొన్నారు. పీడిత ప్రజల విముక్తి సిద్ధాంతంగా శాక్య బౌద్ధం తర్వాతి తరాల పోరాటాలకు ప్రేరణగా నిలిచింది.

తమిళనాడులో పెరియార్ నాయకత్వంలో జరిగిన ద్రవిడ ఆత్మగౌరవ వుద్యమానికి శాక్యబౌద్ధ సమాజంవారు అండగా నిలిచారు. ద్రావిడ ఉద్యమంయొక్క ప్రారంభసభ 1932లో కోలార్ బౌద్ధ సమాజం ఆధ్వర్యంలో జరిగింది. దేశవ్యాప్తంగా ఆనాడు జరుగుతున్న దళిత ఉద్యమాలకు శాక్యబౌద్ధ ఉద్యమం ప్రేరణనిచ్చింది. కేరళలో నారాయణగురు ఆధ్వర్యంలోని విజయాల ఆత్మగౌరవ ఉద్యమం, కర్ణాటకలోని ఆది కన్నడ ఉద్యమం, ఆంధ్రదేశంలో భాగ్యరెడ్డి వర్మ నాయకత్వంలోని ఆది ఆంధ్ర ఉద్యమం, బౌద్ధధర్మాన్ని తమ తాత్విక పునాదిగా ప్రకటించుకొని ఆత్మగౌరవ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడంలో అయోతీదాస్ ప్రారంభించిన శాక్యబౌద్ధ ఉద్యమ ప్రభావం వుంది. అలాగే అంబేద్కర్‌కు బౌద్ధ పరంగా దృఢమైన సైద్ధాంతిక దృక్పథాన్ని యిచ్చింది కూడా తమిళ బౌద్ధ ఉద్యమ మేనని చెప్పాలి. దళితులపరంగా గాంధీ, అంబేద్కర్‌లమధ్య తీవ్రంగా వాదోపవాదాలు జరిగినపుడు శాక్యబౌద్ధ సమాజానికి అయోతీదాస్ అనంతరం బాధ్యతవహించిన అయన అనుచరుడు జి. అప్పాదురై అంబేద్కర్‌కు గట్టిమద్దతు ఇచ్చినట్లు తెలుస్తుంది. 19వ శతాబ్ది చివరిరోజుల్లో అయోతీదాస్ బౌద్ధాన్ని పీడితుల విముక్తి సిద్ధాంతంగా ముందుకు తీసుకురావడంద్వారా అటు అణగారిన వర్గాల సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాతగానే కాక ఇటు బౌద్ధధర్మ పునరుజ్జీవనానికికూడా మార్గం సుగమం చేశాడనడంలో సందేహంలేదు.

బౌద్ధంలో వ్యక్తి స్వాతంత్ర్యం

- రాయదుర్గం విజయలక్ష్మి

'కీలుబొమ్మలు' నవలా రచయితగా ప్రసిద్ధికెక్కిన జి.వి. కృష్ణరావు పూర్తి పేరు గవిని వెంకట కృష్ణరావు. 1914లో తెనాలి తాలూకా కూచిపూడిలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన వీరు, అరిస్టాటిల్ కావ్యానుశాసనం, ప్లేటో రామణీయకత నుంచి కాంట్ పరతత్వవాదం వరకు, ఇటు భరతుని నాట్యశాస్త్రంనుండి మమ్మటులదాకా ప్రాక్పశ్చిమ రససిద్ధాంతాలను, సాహిత్యాన్ని, దర్శనాలను అధ్యయనం చేసినవారు. 'స్టడీస్ ఇన్ కళాపూర్ణోదయమ్' అన్న రచనకు పిహెచ్.డి. పట్టాను పొందిన వీరు, 'ఆర్య నాగార్జునుని సాపేక్ష వాదంలో జెనో' "Flying arrow is at rest" (ఎగురుతున్న బాణం నిశ్చల స్థితిలో ఉంది)ని చూసినవారు. మాధ్యమిక వాదంలో కుతూహలం కలిగి, ఆర్య నాగార్జునుని గ్రంథాలను కొన్నిటిని పద్యాలుగా అనువదించారు. వాటిలో 'విగ్రహ వ్యావర్తిని', 'మాధ్యమిక వింశతి' మాత్రం ప్రస్తుతం లభిస్తున్నాయి. కథలు, నవలలు, నాటికలు, నాటకాలు, పద్యకావ్యాలు, వ్యాసాలు మున్నగు విభిన్న ప్రక్రియల్లో తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన వీరి రచనల్లో, "సునీథ", "ప్రతిక్రియ" అనే నాటికలు, "బొమ్మ ఏడ్చింది" అనే నాటకం, "నాగార్జునుని కాలంలో ఆంధ్రదేశ స్వరూప స్వభావాలు" అన్న వ్యాసం బౌద్ధేతి వృత్తానికి సంబంధించిన రచనలు. ముఖ్యంగా మహాసాంఘిక వాదానికి పట్టుకొమ్మ అయిన ఆర్య నాగార్జునా చార్యుల తాత్విక దార్శనిక చింతనను ఆ కాలంలో ఆంధ్రదేశంలో బౌద్ధ స్థితిగతులను – అంచనా వేసేందుకు తోడ్పడే రచనలు!

మనిషిని మనిషిగానే గౌరవించిన మొట్టమొదటి ధర్మం బౌద్ధం! శీలము, సమాధి, ప్రజ్ఞలు మూలస్తంభాలుగా, నైతిక విలువలతో కూడిన సామాజిక అవసరాన్ని గుర్తించిన బౌద్ధం ఒక జీవన విధానంగా ప్రజలను ఉత్తేజితులను చేసిన బౌద్ధం, వర్ణ, వర్గ నిరాకరణలో సమతాభావాన్ని ఆచరణ సులభం చేసిన బౌద్ధం ఒక ఉత్తుంగ తరంగంలా ఆంధ్రదేశాన్ని ముంచెత్తిన బౌద్ధం, శాతవాహనుల కాలంలోనే కొన్ని ఒడిదుడుకుల్ని ఎదుర్కొంటూ ముందుకు సాగడం గమనించగలం! ముండిత శిరస్కులైన బౌద్ధ భిక్షువులు ఎదురుపడితే దుశ్శకునంగా భావించే స్థితి చాపకింద నీరులా మెల్లగా వ్యాపిస్తున్న స్థితి క్రీ.శ. 4, 5 శ॥ల్లోనే కనిపిస్తుంది. రాణివాసపు స్త్రీలచేత గౌరవింప బడుతూ, సామాన్య ప్రజానీకం ప్రేమాభి మానాల్ని నిండుగా పొందిన బౌద్ధం, రాజ్యవిస్తరణ కాంక్షతో త్రుళ్ళిపడే రాజుల ఆదరాభిమానాలను పొందటంలో కొంత వెనకబడింది. శాతవాహన రాజులు తాము కొత్తగా జయించిన రాజ్యాలను తమ రాజ్యంలో కలుపుకొని నిశ్చింతగా వుండాలంటే, ప్రజలలోని భిన్న భావావేశాలను పోగొట్టి అందరినీ ఒకే గొడుగు క్రిందికి తేవాలంటే మతం మంచి సాధనమవుతుంది అని గుర్తించారు. దీనికి వారెన్నుకొన్న మతం హిందూమతం! తమ రాజ్యాధికారంలోనున్న సమస్త ప్రజలూ ఐక్యతగా వుండాలంటే అందరూ ఒక్కటే మతాన్ని, అదీ హిందూమతాన్ని అనుసరించాలని నమ్మి, ప్రజలందరినీ హిందువులుగా మార్చే ప్రయత్నం చేయసాగారు. తత్ఫలితంగా, బౌద్ధం, ముఖ్యంగా

డా. రాయదుర్గం విజయలక్ష్మి ఫోన్ : 9866769393

ఆనాడు ఆంధ్రదేశంలో వ్యాప్తిలోనున్న మహాయాన బౌద్ధం ఎన్నో కడగండ్లను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో రచింపబడినదే "బొమ్మ ఏడ్చింది" అన్న నాటకం!

క్రీ.పూ. ప్రథమ శతాబ్దానికే స్వతంత్ర్య రాజులై, ఆంధ్ర దేశ పాలకులైన శాతవాహనుల రాజభాష మొదట ప్రాకృతమైనా, క్రమంగా రాజభాషగా సంస్కృతం ఆదరింపబడింది. క్రీ.శ. రెండవ శతాబ్దానికి చెందిన నాగార్జునాచార్యులు తమ రచనలన్నిటినీ సంస్కృత భాషలోనే రచించారు. సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండేలా పాళీభాషలో (ఆనాటి వ్యావహారిక భాషలో) బోధింపబడిన బౌద్ధ రచనలు రెండవ శతాబ్దానికే సంస్కృతంలో రచింపబడినాయి. దీనికి కారణాలు ఏవైనా, బౌద్ధం నిలదొక్కుకునే క్రమంలో పొందిన మార్పుగా దీన్ని గుర్తించవచ్చు. ఈ కాలానికే చెందిన గౌతమీపుత్ర శాతకర్ణి నిర్లక్ష్యానికి బౌద్ధం గురికావడం అన్న చారిత్రకాంశం ఆధారంగా రచింపబడిన నాటకం యీ 'బొమ్మ ఏడ్చింది' అన్న నాటకం!

గౌతమి బాలశ్రీ కుమారుడు గౌతమీపుత్ర శాతకర్ణి, రాజ్యకాంక్షతో పశ్చిమోత్తర దేశాలను జయించి, క్షహరాట వంశాన్ని నిర్మూలించి, శక్తయవన పహ్లవుల రాజ్యాలలో కాలభైరవ పూజలు శాస్త్రోక్తంగా చేయించామని సగర్వంగా ప్రకటించుకొన్న రాజు. అతని మంత్రులైన, శివగుప్తుడు, మల్లనాగుడు ఇరువురూ బౌద్ధ ధర్మాన్ని నాస్తిక మతంగా నమ్మినవారు. బౌద్ధభిక్షువులు గావించే భిక్షా కార్యక్రమాన్ని శిక్షార్హంగా ప్రకటించడమేకాక, ఆర్యదేవుని, నాగార్జునాచార్యుల ప్రధాన శిష్యుడైన ఆర్యదేవునితోబాటు, మాతృచేటుడు, రాహులభద్రుడు అనే మరో యిద్దరు భిక్షువులను కూడ చెరసాలలో పెట్టించిన వారు. భిక్ష గ్రహిస్తున్నారన్న కారణం చూపి ఎంతోమంది బౌద్ధ భిక్షువులను, కారాగృహం పాలుచేసినవారు.

గౌతమి బాలశ్రీ మేనకోడలు వాసిష్ఠి. గౌతమి బాలశ్రీ యాత్రలకుపోతూ తనకప్పగించిపోయిన ప్రజ్ఞాపారమిత విగ్రహానికి క్రమం తప్పక పూజలు నిర్వర్తించే వాసిష్ఠి, కోటలో తానిస్తున్న భిక్షను గ్రహిస్తున్నపుడు ఆర్యదేవుడు జైలుపాలయినప్పటి నుండి ప్రజ్ఞాపారమిత విగ్రహం కన్నీరు కార్చటం చూసింది. యాత్రలనుండి తిరిగి వచ్చిన మేనత్త గౌతమి బాలశ్రీ, వాసిష్ఠి వలన వివరాలు తెలుసుకొని, మిక్కిలి చింతించి, ఆర్యదేవునితో బాటు తక్కిన యిద్దరినీ తనవద్దకు తీసుకు రావలసిందిగా ఆజ్ఞాపించి, వారిని క్షమాపణలు కోరుతుంది. "నిరపరాధులైన సద్భిక్షువులను మిమ్ము బాధించి, మీ వ్రతాలను భంజించి మా రాజభటులు మహాపాపం ఒడిగట్టుకొన్నారు. ఈ ఒక్కసారికి వారిని క్షమించండి" అని వారిని వేడుకున్న ఆమె చింతా వ్యాకులమైన హృదయంతో, విగ్రహం కన్నీరు కార్చటాన్నిచూపి పరిష్కారాన్ని అడుగుతుంది. దీనికి పరిష్కారం భవరోగ చికిత్సా విశారదులైన నాగార్జునాచార్యులకే తెలియాలి అంటూ బౌద్ధ భిక్షువులు,

ప్రబల భయదమ్ము యక్షరూపమ్ము వ్రాసి
యరసి చిత్రకారుడు తానె యడలునట్లు
ఆత్మకల్పిత సంసారమందు బోధ
విరహితుండు సమ్మోహియై విహ్వలించు అంటూ నిష్క్రమించడంతో నాటకంలోని ప్రథమాంకం ముగుస్తుంది.

ఆంధ్రదేశంలో ధర్మంపట్ల జరుగుతున్న అన్యాయాలకు చలించిన ఆర్య నాగార్జునాచార్యులు శాతకర్ణి మహారాజుకు ఒక లేఖ పంపుతారు. ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదనీ, ధర్మమార్గాన్నీ, ఎవరికీ హాని కలిగించదని, ధర్మ మార్గాన్ని అనుష్ఠించమనీ, మద్యపానం వలన లోకంలో అవమానం, కార్యహాని, ధనక్షయం కలుగుతాయి కనుక మద్యాన్ని పరిత్యజించమనీ, శుష్కిస్తున్న కారాగృహ వాసులను కనీసం ఐదురోజుల శిక్షానంతరం విడిచిపుచ్చవలసిందనీ, విచారణ చేయక బంధించి వుంచడంగాక, వారి నేరాలను విచారణచేసి, ఎవరినీ సంహరించక, దేశ బహిష్కరణ శిక్షను మాత్రమే విధించవలసిందనీ.. ఇలా ఎన్నో మంచివిషయాలను, రాజుపై అనుకంపతో చెబుతారు, ఆ లేఖలో నాగార్జునాచార్యులు.

ఈ లేఖనుచూసి కోపించిన మంత్రులచే రెచ్చగొట్ట బడుతున్న శాతకర్ణి మహారాజుకు గౌతమి బాలశ్రీ పలికిన పలుకులు ఏ నాటికైనా శిరోధార్యాలే! "మతతత్వం దురవగాహం! రాజులు దాని జోలికి పోరాదు. ఉపేక్ష వహించాలి. ద్వేషం చూపడం తగదు. ద్వేషం దహనంకంటె దారుణం. ఉపేక్ష పాపం కాదు. ఇక సురాపానం పాపం! ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడుకో! ధర్మమార్గంలో ప్రజానురంజనతో రాజ్యం విస్తరించుకో అంటున్నారు ఆచార్యులు. ఇష్టం వుంటే ఉపదేశం పాటించవచ్చు లేదా

నిరాకరించవచ్చు" అంటూ ఆ ఉపదేశానికి అర్థం చెబుతుంది. తల్లి మీది గౌరవంతో అప్పటికి ఊరుకున్న శాతకర్ణి, నాగార్జునాచార్యులు రాజు శాసనానికి మిత్రుడో, అమిత్రుడో తేలుస్తాను అంటాడు. ఈ రెండవ అంకంలో బౌద్ధంమీద జరుగుతున్న వక్రీకరణకు బాధపడుతూ దానికి కారకులైన మంత్రులను సూక్ష్మంగా హెచ్చరించే గౌతమి బాలశ్రీ బౌద్ధ ధర్మాభిలాషను వివరించటంలో రచయిత సిద్ధహస్తులయినారు.

గౌతమి బాలశ్రీ మేనకోడలు వాసిష్ఠి, 'కులపాలిక' అన్న మారుపేరుతో శ్రీ పర్వత విహారంలోచేరి, తన రోగంనుండి స్వస్థురాలవుతుంది. మల్లనాగురు, సోమదేవుడన్న మారుపేరుతో తన నేత్రచికిత్సపై బౌద్ధవిహారాన్నే ఆశ్రయిస్తాడు. నిజం తెలుసుకున్న ఆర్యదేవుడు, శత్రువును ఆరామంలో ఉంచడానికి యిష్టపడక, విహారంనుండి పంపివేద్దామంటాడు. అందుకు నాగార్జునాచార్యులు అంగీకరించక పోవడమేగాదు, 'బౌద్ధవిహారమంతా గూఢచారిమయమయిపోయిందని ఆక్రోశిస్తున్న ఆర్యదేవునితో అన్నమాటలు గమనార్హం! అంతకుముందే శివగుప్తుడు వచ్చి, భిక్షువులు ఆయుధపాణులై రాజ్య విస్తరణ కార్యక్రమంలో పాల్గొనాలన్నది రాజశాసనమని, ధాన్యకటకంలోని భిక్షువులందరూ రాజశాసనబద్ధులు కావాలనీ, వార్తను తెచ్చినప్పుడు నాగార్జునాచార్యులు సున్నితంగా తిరస్కరిస్తారు.

"జీవుల శోకాక్రందనలు వినలేక కరుణామయులై మహాయాన బౌద్ధ భిక్షువులు...దీక్షతో శక్తివంచనలేక సత్త్వ సముద్ధరణ కోసం దిగంతాలదాక తిరుగుతున్నారు. భిక్షువులు సర్వత్రా సుఖశాంతులు కోరుతున్నారు. వానికోసమే పాటు పడుచున్నారు.. మీ ప్రభువులు తమకు మతమే కావాలో, మహా సామ్రాజ్యమే కావాలో నిశ్చయించుకోవాలి.." అంటూ "జీవితంలో మూడంశాలున్నవి. పరహితం, స్వహితం, ఆత్మహితం అన్నీ వీటినే దానశీలం, క్షాంతివీరం, ధ్యానప్రజ్ఞలు అంటారు. బౌద్ధంలో వీటినే పారమితలు అంటారు... మతాలు ఏవైనా మొదటి రెండు మానవ మాత్రులకు సర్వ సామాన్యాలు. నిజమైన మతం ధ్యాన ప్రజ్ఞా సమ్మితం. బౌద్ధంలో ఆత్మశాసనం తప్ప బాహ్యశాసనం చెల్లరాదు... జాతి కుల మత దేశ భేద భావాలు లేక జీవకోటి సేవకై తపిస్తున్న బౌద్ధులు కత్తి పట్టలేరు. కాని క్షతగాత్రుల సేవను చేయగలరు..." అన్న ఆచార్యుల మాటలద్వారా బౌద్ధ ధర్మసారాన్ని ఎల్లప్పుడూ ఏ భేద భావం లేక జీవులను, ఆర్తులను రక్షించే వ్యక్తి స్వాతంత్ర్యం బౌద్ధ సారమని సూచించిన రచయిత దృక్పథం స్పష్టంగా కనిపిస్తుంది.

భారతదేశం తత్త్వవిచారానికి ఆలయమని విని, జిజ్ఞాసతో గాంధారం చేరి, అక్కడ బుద్ధదేవుల ధర్మఘోషణం మోది మక్కువతో తక్షశిలను చేరి, అక్కడ నాగార్జున కృతకారికాద్వయం విని, ఆచార్యుల దర్శనం కోరి ఆంధ్రదేశానికి వచ్చిన రోము దేశస్థుడైన ప్లాటినస్ కోరికమీద, బరుకచ్చంలో శాతకర్ణి సైనికులచే గాయపడి, అస్త్రశస్త్రాలను వదిలివేసి వైద్య సహాయం కోరి వచ్చిన యవన సైనికులను ఆరామానికి తీసుకురమ్మంటారు నాగార్జునాచార్యులు. యవనత్వాన్ని మరిచి పోవాలని, అహింసా మార్గాన్ని వీడరాదని, దేశీయ శాసనాలను ఉల్లంఘించరాదనీ, ఆంధ్రప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకోవాలనీ వారితో శపథం చేయించి, క్షతగాత్రులైన యవన సైనికులను వైద్యశాలకు చేర్చవలసిందిగా బౌద్ధభిక్షువులైన సమంత, భద్ర, శాంతి మూలురను కోరుతారు.

శివగుప్తుని ద్వారా యీ వివరాలను తెలుసుకున్న శాతకర్ణి కోపించి, నాగార్జునాచార్యులను బంధించి రాజసన్నిధికి కొనిరావలసిందిగా ఆజ్ఞాపిస్తారు. కాని శివగుప్తుడు, రాజమాత గౌతమి బాలశ్రీ అశ్వస్థులైనారని అబద్ధమాడి నాగార్జునాచార్యులను, ఆర్యదేవుని, ప్లాటినస్‌లను రాజసన్నిధికి తీసుకుని వస్తారు. ఫలితంగా రాజశాసన ధిక్కారం, రాజమాతపట్ల అమంగళ ప్రస్తావన వంటి ద్రోహాలకు ప్రధానామాత్యుడైన శివగుప్తుడు రాజాగ్రహానికిగురై ఆమరణ కారాగారవాస శిక్షకు లోనవుతాడు.

శాతకర్ణి రాజుకు తెలియకుండా, మారుపేరుతో విహారంలోచేరి నేత్రవైద్యంచేయించుకున్న మల్ల నాగామాత్యులు కూడ, రాజుదగ్గర రహస్యాల్ని దాచాడన్న నేరంతో ఆమరణ కారాగార వాసానికి గురవుతాడు. అంతేగాదు, రాజశాసనానుగుణంగా ఆయుధాలు ధరించి భిక్షువులు రాజ్య విస్తరణకు సహకరించకపోవడం, శాంతిభద్రతలనుపదేశించిన బుద్ధ భగవానుని ధర్మానుసారం, ఆర్తజీవులకు

విహారంలో ఆశ్రయమివ్వడం యిటువంటి వాటిని సామ్రాజ్య ద్రోహ చర్యగా చూపిస్తూ ప్లాటినస్‌కు మరణదండన, నాగార్జునాచార్య ఆర్యదేవులకు దేశబహిష్కరణ శిక్షలను విధిస్తాడు గౌతమీ పుత్ర శాతకర్ణి మహారాజు!

ప్రథమాంకంలో ఆర్యదేవాదులు బంధింపబడినపుడు, కంటతడి పెట్టడం ప్రారంభించిన ప్రజ్ఞా పారమితాదేవి విగ్రహం, ఐదవ అంకాంతానికి, ఆర్య నాగార్జునా చార్యులకు శిక్ష విధింపబడినపుడు కూడ ఏడుస్తూనే వుంది. 'శాతకర్ణి దుర్మార్గుడు' అన్న వాసిష్ఠితో, ఆచార్యులు, 'తప్పు అలా అనరాదు. జీవలోకానికి ఆశారేఖ కావాలి... నీవతనిని ద్వేషించరాదు. తప్పక పెండ్లి చేసుకోవాలి... నీ కొడుకు మహారాజు కావాలి...' అని ఆశీర్వదిస్తారు. క్షాంతి పారమితకు నిలువెత్తు ఉదాహరణగా నిలవడమేగాదు, 'బొమ్మ ఏడుస్తున్నదని విని, ''...అవునమ్మా తెలుసు... ఆ బొమ్మ మానవుల మనస్సులో మెదిలిన నాడే లోక కళ్యాణం..'' అంటూ సాగిపోతాడు. బౌద్ధంలో, అవిద్యను తొలగించగలిగిన ప్రజ్ఞకున్న స్థానాన్ని యీమాటలు గుర్తుచేస్తాయి.

ఈ నాటకం మతానికీ సామాజిక విలువలకూ ఉన్న సంబంధాన్ని వివరిస్తుంది. లోక క్షేమాన్ని కోరే స్వాతంత్ర్యం, వ్యక్తి స్వాతంత్ర్యం ఆవశ్యకతను నిరూపిస్తుంది. అందుకే 'బొమ్మ ఏడ్చింది' అన్న యీ నాటకం చారిత్రకేతివృత్తంతో కూడినదైనా, కాలాతీతమైన జీవన సత్యాల్ని ఆవిష్కరించే రచనగా గుర్తించవచ్చు. 'పూలమ్మినచోటే కట్టెలమ్ముకున్న' స్థితిలో కొంచెం కొంచెంగా ప్రాభవాన్ని కోల్పోయిన బౌద్ధధర్మం యొక్క అసలు స్వరూపాన్ని 'సునీథ', 'ప్రతిక్రియ' అన్న రెండు నాటికలు కళ్ళకు కట్టిస్తాయి.

నాగార్జునాచార్యుల రచనలు, సిద్ధాంతాల మీది మక్కువతో 'నాగార్జునుని కాలంలో ఆంధ్ర దేశ స్వరూపాన్ని' క్షుణ్ణంగా పరిశీలించిన జి.వి. కృష్ణరావుగారు, ఆనాటి సామాజిక జీవనంలో మతం పోషించిన పాత్ర ఎటువంటిదో గుర్తించారు. నాగార్జునాచార్యులు శాతకర్ణికి వ్రాసిన లేఖలో బౌద్ధంపట్ల అభిమానం చూపవలసిందని కోరలేదు. ఉపేక్షాభావం వహించవలసిందని మాత్రమే కోరాడు. ద్వేషం పాపంగాని, ఉపేక్ష పాపంగాదు అంటూ మత ప్రసక్తిలేని పరిపాలనకు దారిచూపాడు. ఈ నాటకం మతానికీ, సామాజిక విలువలకూ ఉన్న సంబంధాన్ని వివరిస్తుంది. లోకక్షేమాన్నికోరే స్వాతంత్ర్యం, వ్యక్తి స్వాతంత్ర్యం ఆవశ్యకతను నిరూపిస్తుంది. అందుకే 'బొమ్మ ఏడ్చింది' అన్న యీ నాటకం చారిత్రక ఇతివృత్తంతో కూడినదైనా, కాలాతీతమైన జీవన సత్యాల్ని ఆవిష్కరించే రచనగా గుర్తించవచ్చు.

'పూలమ్మినచోటే కట్టెలమ్ముకున్న' స్థితిలో కొంచెం కొంచెంగా ప్రాభవాన్ని కోల్పోయిన బౌద్ధధర్మం యొక్క అసలు స్వరూపాన్ని 'సునీథ', 'ప్రతిక్రియ' అన్న రెండు నాటికలు కళ్ళకు కట్టిస్తాయి.

'సునీథ' విషాదాంత నాటిక. రాజు తారానాథుని భార్య సునంద. మరదలు సునీథ. నైతిక శీలతలేని సునందను, పశ్చాత్తాపం పొంది బుద్ధ భగవానుని అనుగ్రహం పొందమని చెప్తూ తిరిగే బౌద్ధాచార్యుడు బుద్ధఘోషుడన్న తారానాథునికి పూజ్యభావన! తొలిసారిగా అతనిని చూసిన సునీథ, తన్ను ప్రేమించమంటుంది, తన మాటను లక్ష్యం చేయలేదన్న కోపంతో, తానడిగినది యిస్తానని తారానాథునిచే శపథం చేయించుకొని, బుద్ధఘోషుని శిరస్సును కోరుతుంది. తారానాథుడు అంగీకరించినపుడు, సునంద రాజముద్రికను చూపి చేసిన ఆజ్ఞాపన ఫలితంగా బుద్ధఘోషుని శిరస్సు ఖండించ బడుతుంది. చలించిపోయిన తారానాథుని ఆజ్ఞానుసారం సునీథ శిరస్సుకూడ ఖండించ బడుతుంది. ఈ నాటికలోని యుద్ధ వాతావరణం, రాజు తారానాథుడు మరదలు సౌందర్యానికి దాసోహం కావడం, సునీథ బుద్ధఘోషుని పట్ల ప్రవర్తించిన తీరు, హిందువులు చేస్తున్న మతసంబంధమైన వాదనల ఘోషలు ఇవన్నీ ఆనాడు బౌద్ధం ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రతిఫలింప జేస్తున్నాయి. విషాదాంతంగా ముగిసిన యీ కల్పిత నాటికలో ఒక అస్తవ్యస్తమైన సమాజం కళ్ళకు కడుతుంది. అడుగంటిపోతున్న నైతిక విలువల, రాజ్య విస్తరణకాంక్షతో సాగుతున్న యుద్ధవాతావరణం వీటిమధ్య కూడ రాజుచేత, సైనికులచేత బౌద్ధాచార్యులు పొగడ్త లందుకున్నట్లు చిత్రించడం కృష్ణరావుగారికి బౌద్ధంమీదున్న అవగాహనకు గుర్తు.

'ప్రతిక్రియ,' కొంచెం గాఢత నిండిన నాటిక. బౌద్ధ వాతావరణాన్ని సంపూర్ణంగా నింపుకున్న నాటిక. విషాదాంతంగా ముగిసిన నాటిక అయినా, 'సునీథ'లా మనసును అల్లకల్లోలం చేయక, బౌద్ధంపట్ల ఒక విశిష్ట భావాన్ని మనసునిండా నింపుతుంది. తొమ్మిది సం॥రాల

వయస్సులో, తాను సేవకునిగా ఉన్న కోటీశ్వరునిచేత పాదుకలతో కొట్టబడి కోట బయటకు విసిరివేయబడిన అనాథ బాలుడు రాహులుడు. స్పృహ తెలిసిన తర్వాత రాహులుడు, తన పక్కనే విసిరివేయబడి వున్న పాదుకలను తీసికొని, ప్రతిక్రియ సాధించాలని ఆ ఊరువదలి బౌద్ధారామం చేరుతాడు. బౌద్ధగురువు జయదేవుడతనిని చేరదీసి విద్య నేర్పిస్తాడు. ఆ విద్యా సంస్కారంతో కోపం స్థానంలోనే అతనిలో కోటీశ్వరునిపట్ల కృతజ్ఞత నిండుకుంది. తనకు విద్యాగంధం లభించడానికి, ధర్మదీక్ష ప్రాప్తించడానికి, సాధనోన్నతితో కులపతిగా ఎదగడానికి కారకుడైన ఆ కోటీశ్వరుడు హేమచంద్రుని సంసారకూపం నుండి ఉద్ధరించాలనే ధ్యేయంతో అతనికి బౌద్ధ దీక్షనను గ్రహిస్తాడు, విశ్వంతరుడిగా మారిన ఆ పిన్నవాడు హేమచంద్రుని మిత్రుడైన సుధన్వుడు, హేమచంద్రునికి దీక్షనివ్వవద్దని జయదేవుని బెదిరిస్తాడు. చివరకు నూత్నవిహార, ప్రవేశ మహోత్సవం రోజున జయదేవునికి ఎక్కుపెట్టబడిన బాణానికి విశ్వంతరుడు బలి అవుతాడు. మరణిస్తూ, విశ్వంతరుడు ఆవేదనతో పలికినమాటలు మనల్ని కూడ ఆలోచింప జేస్తాయి.

తొమ్మిది సం॥రాల వయస్సులో, తాను సేవకునిగా ఉన్న కోటీశ్వరునిచేత పాదుకలతో కొట్టబడి కోట బయటకు విసిరివేయబడిన అనాథ బాలుడు రాహులుడు. స్పృహ తెలిసిన తర్వాత రాహులుడు, తన పక్కనే విసిరివేయబడి వున్న పాదుకలను తీసికొని, ప్రతిక్రియ సాధించాలని ఆ ఊరు వదలి బౌద్ధారామం చేరుతాడు. బౌద్ధ గురువు జయదేవుడతనిని చేరదీసి విద్య నేర్పిస్తాడు.

కౌశాంబి విహారానికి హేమచంద్రుని గురువును చేసిన విశ్వంతరుడు, తనకు సాధనతో సంక్రమించిన కులపతీ పీఠాన్ని తన గురువు జయదేవునికే అప్పగిస్తూ, "...ఇంకా రెండు అంశాలు మిగిలి ఉన్నాయి. మొదటిది ఈ సుధన్వులు ఎలా ఉద్భవిస్తున్నారో ఆలోచించాలి" అన్న విశ్వంతరుని ప్రశ్న ఇంకా కొనసాగుతున్న ప్రశ్నే!

ఈ నాటికి పూర్తిగా బౌద్ధధర్మ నేపథ్యంలో కొనసాగుతూ, బౌద్ధధర్మ ప్రాధాన్యతను వివరిస్తూ సాగిన రచన! ప్రతీకారేచ్ఛ బౌద్ధధర్మ పరిచయం వలన నశించడమేగాక, క్షాంతి పారమితను సాధించిన విశ్వంతరుడు, హేమచంద్రునికి దీక్షనివ్వడం మహాయాన సిద్ధాంతాన్ని బలంగా చాటుకుంది. తనతోబాటు జీవులందరి ఉద్ధరణకై పాటుపడాలన్న మహాయానసారం యీ నాటికద్వారా మరోసారి బలంగా చాటారు జి.వి. కృష్ణరావుగారు. బౌద్ధధర్మసారాన్ని యింతగా ప్రతిపాదింపబడిన యీ నాటిక, విషాదాంతంగా ముగిసినా, అందుకే మనసును కల్లోల పరచదు.

ఏ విషయాన్నయినా కార్యకారణాలతో తర్కించి నిగ్గుతేల్చే కృష్ణరావు గారి ఆదర్శం ధర్మం. ఆశయం వ్యక్తి స్వాతంత్ర్యం. "ధర్మం ధర్మం కోసమే! ఆ ధర్మమే మానవ జీవితం" అనీ నమ్మిన వీరు, ధర్మానుష్ఠానాన్ని క్రమం తప్పక ఆచరించినపుడే వ్యక్తికీ తద్వారా సమాజానికీ ఉన్నత విలువలు ఏర్పడతాయని నమ్ముతారు. పరిస్థితులు చుట్టుముట్టినప్పుడు, ప్రతివ్యక్తీ స్వతంత్రాలోచనలో, తన అంతఃకరణం సాక్షిగా ప్రవర్తించి ధర్మాన్ని నెరవేర్చాలి. వ్యక్తులు పరిస్థితుల చేతిలో కీలుబొమ్మలుగారు. పరిస్థితులను ఎదిరించి, తాము నమ్మిన ధర్మాన్ని అనుసరించి తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడం అవసరం అన్నది వీరి అభిప్రాయం!

'బొమ్మ ఏడ్చింది' నాటకంలో నాగార్జునాచార్యులు, 'ప్రతిక్రియ'లో విశ్వంతరుడు, 'సునీథ'లో సునీథ, బుద్ధఘోషాచార్యులు తమ వ్యక్తిత్వాలను నిలుపుకున్న పాత్రలు!

తాము నమ్మిన సిద్ధాంతాలకై పరిస్థితులలో పోరాటం సల్పినవారు. నాగార్జునాచార్యులు తప్ప తక్కిన మువ్వురూ మరణాన్నే పొందారు. అయినా పరిస్థితులకు ఎదురొడ్డి నిలిచినవారు. ఇటువంటి వ్యక్తి స్వాతంత్ర్యం వల్లనే సమాజానికి మేలు కలుగుతుందని కృష్ణరావు గారికి నమ్మకం!

వీరి సాహిత్యం సామాజిక విలువలకు అద్దంపడుతుంది. అవి సృజనాత్మక రచనలైనా, విమర్శనాత్మక రచనలైనా ఒక ప్రత్యేక ముద్రతో విరాజిల్లుతుంటాయి. "ఆద్యంతాలు లేని జీవిత ప్రవాహాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగించే ఆద్యంత సహిల్ జీవిత శకలమే కళ" అన్న వీరి అభిప్రాయానికి అచ్చమైన మచ్చుతునకలైన ఈ బౌద్ధ రచనలు, అవిద్య తొలగిన వ్యక్తిస్వాతంత్ర్యం వలననే బహుజనహితం కలుగుతుందని చెబుతాయి.

సౌందరనందం

- పోలేటి పార్వతీశం

ప్రణయుద్వయం నుంచి శరణు త్రయానికి ప్రస్థానం... సౌందరనంద కావ్యం

❋❋❋

జననం మనచేతుల్లో లేనిది, కానీ జన్మసార్థక్యం జీవి సాధించుకోగలిగినది. కొన్ని జన్మల కారణంగా, ఈ మానవసమాజం విశేషంగా ప్రభావితమౌతుంది. అలా ప్రభావితం చేయగలిగిన వారంతా సార్థక జన్ములౌతారు. వర్తమానతరంలో కొందరు ప్రత్యక్షంగా చూసి తరించిన ఒక సార్థక జన్ముడు, ఒక కారణ జన్ముడు, మహాత్మాగాంధీ. భారతీయులందరిచేత, ఒక జాతిపితగా గౌరవాన్నందుకున్న మహనీయుడు. భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనకు కేంద్ర బిందువు ఆయనేనన్న విషయం అందరికీ తెలుసున్నదే. దానిని అలా వుంచితే, ఒక లోకోత్తర శక్తిగా, ఆ వ్యక్తి ఎదగడానికి, ఆయన ఎంచుకున్న జీవన ధర్మాలు యావత్ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి. త్యాగము, అహింస, సంఘసేవ ఈ మూడు అంశాలు త్రివేణిలా ఆయన జీవితంలో పెనవేసుకు పోయాయి. కేవలం వీటి కారణంగానే, ఆయన ఈ ప్రపంచాన్ని ఆశ్చర్యచకితం చేశారు.

అటువంటి మహనీయుడు, మానవాళినేకాదు, సాహిత్యాన్ని ప్రభావితం చేశాడు. అందుకే ఆనాటికవుల దృష్టి త్యాగం, అహింస, సంఘసేవ వంటి అంశాలవైపుకు మళ్ళింది. ఈ అంశాలను ప్రాతిపదికలుగా చేసుకున్న వస్తువుకోసం, ఇతివృత్తాలకోసం, కవులు అన్వేషణ సాగించారు. అటువంటి అన్వేషణ ఫలితమే ఈ ధర్మాచరణకు కేంద్రంగా శతాబ్దాలకు పూర్వమే బీజంనుండి భూజంవరకు తానై నిలచిన మహనీయు మూర్తి గౌతముడు సాక్షాత్కరించాడు. ఆ గౌతముని చరిత్ర, ధర్మాచరణ కవులకు కావ్యవస్తులైపోయింది. ఆ కావ్యాలన్నీ వివిధ కోణాలను ఆవిష్కరించాయి. ఇటువంటి నేపథ్యంలో ఊపిరిపోసుకున్న ఒక గొప్ప ఖండకావ్యం "సౌందరనందం", పింగళి, కాటూరి జంటకవులు పండించిన మేలిపంట ఈ కావ్యం. పింగళివారి సాహిత్య శిల్ప దర్శనము, కాటూరి వారి హృదయవాద నైశిత్యము, కలగలిపిన కావ్య శిల్పఖండం, ఈ సౌందరనందం. పాతదనంలో, కొత్త సోయగాలను గోచరింప జేసిన గొప్పకావ్యం ఇది. అశ్వఘోషుడి సంస్కృతమూలం ఆధారంగా పింగళి, కాటూరి కవులు ఈ 'సౌందరనందం' రూపొందించారు. వ్యక్తిగత ప్రేమను విశ్వమానవ ప్రేమగా మలచుకొమ్మని, శృంగారపరమైన జీవితాన్ని వైరాగ్యపథంవైపు మరల్చు కొమ్మని ఉద్బోధించడానికే పింగళి, కాటూరి కవులు ఈ సౌందరనందాన్ని మనకి అందించా రనిపిస్తుంది.

ఇక ఈ నేపథ్యంనుంచి, కావ్య ప్రవేశం చేద్దాం. మహితాత్ముడైన శాక్యర్షికి ఒక సవతి తమ్ముడున్నాడు. అతడే నందుడు. కోడెప్రాయంలోవున్న గొప్ప సౌందర్యవంతుడు. అతగాడికి, సార్థక నామధేయ అనదగిన సుందరి పత్ని. ఈ ఇద్దరి అనురాగజీవనం, క్రమంగా సమాజ చిత్రంవైపు మరలడమే సౌందరనందంలోని జీవబిందువు. ప్రారంభంలోనే,

డా. పోలేటి పార్వతీశం, ఫోన్ : 9440031213

సతీపతుల అనురాగస్థాయిని వర్ణించిన తీరు మనల్ని ముందుగా ఆకర్షిస్తుంది.

"ఎట్టసెరల నందుని చూపులింతి యాన
నేందునకు గెంపుల నివాళులెత్త నతివ
కజ్జలపు చూడ్కి ప్రియుని వక్షఃకవాటి
గట్టఁదోరణములు నల్లకల్వపూల"

ఎరుపెక్కిన ప్రియుని చూపులు ఆమె ముఖచంద్రునికి కెంపులతో నివాళు వెత్తినట్లు కాటుక కన్నుల నల్లని చూపులు ప్రియుని, వక్షవాటికకు నల్లకలువలతో తోరణాలు కట్టినట్లున్నదనే భావస్ఫోరకమై వర్ణనలోనే నర్మగర్భమైన సూచన మనకు ప్రవేశపెడతారు. ఎర్రని అగ్నికీలలోపడి, వారి వ్యక్తిగత ప్రేమ నల్లగా మాడి పోనున్నదనే భవిష్యత్కథా సూచన చేసినట్లుంటుంది.

నిజానికి ఇద్దరు వ్యక్తుల మధ్యనున్న ప్రేమ, అందునా సతీపతుల మధ్యనున్న గాఢానురాగానికి విశ్వజనీనతను సంతరించడమంటే, అనూహ్యమైన విషయం. ఒక రకంగా అసాధ్యమైన విషయం. అక్కడక్కడా పరివర్తన బీజాలను నాటడం, కవిద్వయం ఈ అంశాన్ని అంచెలంచెలుగా సాధించిన ప్రణాళికగా తోస్తుంది. నందునికి పురవీధులలో మహామహిమాన్వితుడైన గౌతముడు ఎదురైనప్పుడు కలిగిన అవస్థను వర్ణిస్తూ –

"...గురునింగని పుల్కలు దేఱి, సుందరిన్
దక్క సమస్తమున్ మఱచె నందుడు బాహిరవస్తు జాలమున్"

అంటారు. ఆ తేజస్సులో బాహ్య ప్రపంచాన్ని మరచిపోయినా, సుందరిని తప్ప అనడంద్వారా, ఆ శక్తి, వారి ప్రణయాను రక్తిని ఛేదించలేకపోయిందనే విషయాన్ని చెప్పకనే చెబుతారు. పురప్రజలందరికీ, పుట్టుకలేని ఒకదారి చూపుతూ గౌతముడు ప్రబోధం చేస్తుంటాడు. సతి ప్రేమలోనే సర్వస్వాన్ని చూసుకునే ప్రజానీకానికి, దానికి ప్రతినిధివంటి నందునికి కూడా హితబోధ చేస్తాడు. ''కాలముపైకొని రాకమునుపె'' కనుతెరవమంటాడు. "చిరకాలము నేటి ప్రణయ ప్రబంధముల్ నిలిచి యుండవు" అంటాడు. ''పరువము నీటిబుడగ'' అంటాడు. అనంతరం ఒకసారి నందునికి దీక్ష ఇచ్చిరమ్మని తన ప్రియశిష్యుణ్ణి పంపుతాడు. ప్రణయ జీవన సరసిలో దాంపత్య సుఖాలలో ఓలలాడే నందుడు వాటిని వదులుకోలేక, దీక్షవద్దంటాడు. ఒక గొప్ప సాకు చెబుతాడు.

"పరమడిగి నా శరీరము
తరుణీమణి పుచ్చుకొనియె తనసొత్తుగ, నే
దురితము పాలై పోవనె
పరధనమును నిచ్చవెంట వాడితినేనిన్"

తన తనువును తానే పరధనమని సాకు చెప్పే ఆలోచన మన ఊహకి కూడా అందదు. ఏమైనా తప్పించుకోవాలనే ప్రయత్నం ఫలించదు. నవమన్మథాకారుడైన నందుడు ఆ క్షణంలోనే భిక్షునిగా మారిపోతాడు. దుస్వప్నం వచ్చినప్పుడు, మేల్కొనలేని అశక్తతతో కలతపడే మనస్సులాగా, భిక్షు నిరీక్షణ దుస్సహమై పోయింది. భర్త ఏమైపోయినట్టు? అందరూ తలోమాట అంటున్నారు. భర్త నిరీక్షణలో విలవిలలాడుతున్న ఆ ప్రణయిని సుందరి మానసాన్ని, ఈ కవిద్వయం పద్యంలో కాదు, అద్దంలో బంధించినట్టు అనిపిస్తుంది.

"చని, సోపానతలముదెస
గనుఁగొని నిట్టూర్పు విడిచి గ్రక్కున మరలెన్
అనిలవశమ్మున జని, గ
ట్టును డీకొని తిరిగి సుడివడు పడవరీతిన్"

ప్రణయజీవి సంవేదనలో నిర్జీవ సంకేతాన్ని చెప్పడం, నిరీక్షణకు పరాకాష్ఠగా అనిపిస్తుంది. ఒక వ్యక్తిని మనం మనసారా ఆరాధించడం మొదలుపెడితే, ఆ వ్యక్తి చేరువలో ఏదో ఒక వస్తువుగానైనా వుంటే చాలనిపిస్తోంది. ఇది మానవ నైజం. ఆమెకు అలానే అనిపించింది.

"ఆర్తసేవాశ్రాంతుడగు దయారాశికి
సురటినై చెమ్మటల్ సురుగఁజేయ
నతడు విహారకుద్యముల జిత్రించు భా
వములకుఁ బ్రాణార్పణమునొనర్ప

దగనటేనను, నెచ్చెలీ! తనకుఁగాని
భాగ్యమిది, నాకుమాత్రము యోగ్యమటవె
అడవులకునేఁగి యిల్లు నాకడవిఁ జేసే
నయ్యడవి దేవళమ్ము జేయనటేనేను?'

వియోగమెంత దుస్సహమో, ఇల్లు అడవిజేసే అన్నమాటలో తెలుస్తుంది. చేరువతనంలో ఎంత జీవ సౌందర్యమున్నదో తెలుస్తుంది. ఈ రెండు మాటలు ప్రక్క ప్రక్కనే ఉపయోగించడంతో, వియోగ, సంయోగ భావాల అనుభవాన్ని మేళవించి, వర్ణచిత్రం గీసినట్లుంటుంది. మరొక వంక భిక్షుమండలికి చిక్కిన నందుని అనుతాపము

తారాస్థాయికి చేరింది. *"నిను బాసి యొంటి మెయిఁ బ్రాణముతో నిటనున్న వాడ, నీ దీనుని నిస్సహాయుని గతిన్ గనువారలు లేకనెచ్చలీ"* అంటూ విలపిస్తాడు. సుందరి సముఖంలో తన రసస్థితిని, బౌద్ధ విహారంలో తన పరిస్థితి మార్చి మార్చి చూసుకుంటాడు నందుడు. ఆమె సాన్నిధ్యంలో, ప్రణయ పారవశ్యంలో, కుసుమ మంజరులు తురిమి, రత్ననూపురములు కూర్చి, కస్తూరి బొట్టు దిద్ది, నీ అందాలు నువ్వే సరిచూసుకొమ్మంటూ మణిగణ స్థగిత దర్పణము పట్టిన చేతులు, ఇప్పుడు బిచ్చపు పాత్ర మొయ్యడానికి ఒకటి, కన్నీటి బిందువులు తుడుచుటకు మరొకటి నియుక్తమైన సన్నివేశం, అతని దుస్థితికి నిలువుటద్దం. కోడెప్రాయంలోని సహజ సిద్ధమైన కోరికలకు దూరమై పరితపించే నందుణ్ణి చెంతన కూర్చుండబెట్టుకొని జీవనసారాన్ని ఉపదేశిస్తాడు గౌతముడు.

"అమ్ముని యాసీనుండై
తమ్ముని నుపవిష్టఁజేసి, తనువునిమిరి, శాం
తమ్ముగఁ దత్కోమల, భా
వమ్మున కనురూపమైన ఫణితినిటులనెన్."

నీరాక, 'అంబుధి కంబుజారి యుదయుంబును బోలె' ఈ విహారవాటికలలో మహోత్సవంగా వుంటుందను కున్నాను. కానీ, దైన్యంలో మునిగిపోయావు నువ్వు. దీనిని సహించలేరు ఈ భిక్షువులు. జీవన గమ్యాన్ని తెలుసుకో, మార్గాన్ని ఎంచుకో, అంటూ శాంత మనస్కుడై ఉపదేశం చేస్తాడు.

అన్నగారి మాటలు వెన్నలాగా మెత్తగా వున్నా, కమ్మగావున్నా, నందుడికి రుచించలేదు. ధర్మ సంవాదానికి దిగాడు. జీవన మార్గం, లోకరీతి చెబుతున్నావు బాగానే ఉంది, అసలు నాకీ లోకంతో పనేమిటి? అన్నాడు.

"నాకు వేరాలని, పూలువాడని వసంతారామ మధ్యమ్ములో
రాకాచంద్రసహస్రముల్ వెలుగు హర్మ్యాగ్రమునందొక్కటన్"

నా ప్రాణానికి ప్రాణమైన ప్రియునితో, లోకంతో పనిలేని, జీవితాన్ని ప్రేమమయంగా గడిపేస్తానంటాడు, నందుడు. ప్రేమ, ప్రేమ, అంటున్నావు, అసలు నిజమైన ప్రేమ ఏమిటో తెలుసుకోమంటాడు గౌతముడు.

"కడుపు దీపియుఁ బితృభక్తి, కొంతమీది
నెయ్యమున, నెచ్చెలులపట్లఁ దియ్యదనము
'నా' యనెడు విత్తునంబుట్టి నాశమొందు
మమత లేనట్టి ప్రేమ నిత్యము కుమార!"

అనగా, అనగా రాగము అతిశయించినట్లు, వినగా, వినగా ఉపదేశము మనసుకు పట్టింది. ప్రణయజీవనం, సాధు జీవనంగా మారింది. ఈ మార్గం అందరికీ అనుసరణీయం కదా! మరి తనభార్యమాత్రం ఎందుకు దూరం కావాలి?

"స్త్రీ జనము కూడ నార్హత దీక్షగాంచి,
బౌద్ధ ధర్మము పాలింప వచ్చునేమో?"

అనే ఆలోచన కలుగుతుంది. ఆమె కూడా ఈ మార్గంలో పయనించడానికి అనుజ్ఞ కోరతాడు నందుడు.

"చానకుఁగూడ సంసరణ సంతరణమ్ము గారి జూపిఁయ
జ్ఞానము వాపకే నొకడ సమ్మతియై నవధర్మమార్గమున్
బూనఁగ నేర్తునెట్టులు?..."

అంటూ అర్థాంగికి కూడా ధర్మమార్గానుసరణంలో భాగమడుగుతాడు. ఇప్పుడు నువ్వడిగినట్లే, గతంలో చాలామంది అడిగారు.

"ఏనిపుడేల కాదనవలెన్ ; గాంతానిమిత్తమ్ముగా,
హీని జెందకయుండుఁగాక మనధర్మాంకురముల్.."

అంతకుమించి నాకేమి అభ్యంతరం వుంటుంది అంటాడు గౌతముడు.

"అసదృశమ్ముగు బ్రహ్మచర్య వ్రతమ్ముఁ
బాలనమొనరించుచు, బౌద్ధ ధర్మ
మూన నధికారిణులు నుందురేనియట్టి
శీలవతులకు నార్హత సిద్ధియగుత"

అని, ఆ శాక్యముని తన అనుజ్ఞనిస్తాడు. ధర్మాచరణకు అనువైన మనఃస్థితి వుండాలేకానీ, స్త్రీ, పురుష భేదం లేదనే సమభావం ప్రకటించినట్లనిపిస్తుంది. శాక్యముని అనుజ్ఞ ఇవ్వగానే, భిక్షకుడు సుందరికి వర్తమానం అందిస్తాడు.

"గురుడు నీ హృదయవేదనఁగన్గొని, బౌద్ధ ధర్మమున్
గొనమతియించు, నీ చరితకున్ మదిమెచ్చి యనుగ్రహమ్ముమై
నిను నిజ శిష్యగా పరిగణించె, నిదెకొనుమమ్మ! దీక్షలన్"

దీక్ష ప్రసాదించగానే, ఆమె కళ్ళనుండి, ఆనందబాష్పాలు జాలువారాయి. పులుగడిగిన ముత్యంలా ఆమె ముఖం వెలిగిపోయింది.

సుందరీ నందులిద్దరూ భిక్షుమండలి సభ్యులైపోయారు. దైహికమైన, ఆ ఇద్దరి ప్రేమానుబంధం, ఇప్పుడు విశాలమై పోయింది. దరులు దూరమైపోయినప్పుడు, మధ్యనుండే

ప్రవాహ విస్తృతి జరిగినట్లు, సుందరీనందుల ప్రేమతీరాలు విశాలమయ్యాయి. ఆ ప్రేమసాగరంలోకి దీనజన స్రవంతి చేరింది. తనివితీరా ఓలలాడింది. దీనుడైన బాలకుని వెంట, దుఃఖజనుల జీవన చిత్రాన్ని దర్శించిన సుందరి, ప్రేమ సముద్రమయ్యింది.

"పో యనెడు పిల్పు వీతేర 'నో' యటంచు
నుట్టిపడు స్థూల దేహమ్మునుజ్జగించి
యాతపస్విని, శబ్ద మాత్రాను మేయ
తనురాకృతి దాల్చు భూతదయవోలె"

గౌతముని ప్రభావంతో ఒక అన్యోన్య దంపతుల వ్యక్తిగత ప్రేమ విశ్వమానవ ప్రేమగా మారిపోయింది. సుందరీ నందుల దాంపత్యంలోని ప్రణయరేఖలు, ఇప్పుడు మానవాళిని శాంతిమయ జీవనంవైపు చేయిపట్టుకొని నడిపించే సుమశాఖలై పోయాయి. సేవాభావానికి సజీవసంకేతాలై నిలచిన, ఆ దంపతులను వీక్షించిన గౌతముడు –

"శరణము బుద్ధదైవమని పొంగిలి మ్రొక్కిన నందసుందరీ
శిరముల దీవనల్ కురిసి..."

గొప్ప ఆశీస్సులందించాడు. ప్రణయమనే అయస్కాంతానికి దైహికమైన ప్రేమవల్ల ఆకర్షితులైన ఆ దంపతులమధ్య వియోగం కల్పించి, దేహసంబంధమైన ప్రేమపట్ల వికర్షణ కలిగించి, విశ్వమానవ ప్రేమపట్ల ఆకర్షణమొలిపించి, అ లౌకిక ప్రేమ జీవులను ఒకరి కొకరిని, కానుకగా బహూకరించాడు గురుదేవుడు.

"మంటి పుటువులఁగాచి, యఖండము నవ్యయమ్ము, నా
నందముఁగొండ్రుగాతమని నందుని సుందరికిచ్చె, సుందరిన్
నందునకిచ్చె, దివ్య కరుణామయుఁడగ్గురు దేవుఁడు."

ఇలా ఒకరికొకరు బహూకృతులై, బ్రహ్మచర్యం, సహధర్మ చర్యమైనట్లు భిక్షుక జీవనం సాగిస్తున్న సుందరీనందుల జీవనశైలిలోకానికి ఆదర్శప్రాయమైంది.

"భావమొక్కడు గాగ భావన యొక్కడై
రసభావ పరిణతి యొసగఁజేసి
– – – – – – – –
తెరయెత్తుటొకడుగాఁ దెరదించుటొక్కడై
రంగ నిర్వహణమ్ము రక్తినిల్పి
సుందరీనంద జీవితానందమట్లు
పరమమగు కోటి కెక్కిన బంధు భావ
మిత్ర భావము లిమ్మొయి మేళగించి
సృష్టి జేసితి మీ కావ్య శిల్పమూర్తి"

అంటూ పింగళి కాటూరి కవిద్వయం, తమకావ్య శిల్ప నిర్మాణ సంవిధానాన్ని తెలియజేసినట్టు, బంధు భావ, మిత్రభావ సమ్మేళనంవలన విశ్వమంతా పరుచుకొనే ఒక కొంగ్రొత్త సురభళాన్ని గుబాళిస్తుంది ఈ 'సౌందరనందం.' ఈ పరిమళాలకు కాలపరిమితి లేదు. అది అనంతం.

పుష్ప పూజ

వన్నె వన్నెల సుమాలతో
సువాసనలీను కుసుమాలతో
నింపారిన పూలరాశితో
ఓ... శాక్యమునీ!
నీ పరమ పావన పాదపద్మాలను వేడుకొనీ..
ప్రణమిల్లి చేసెదను పరిమళ పుష్పపూజ నీకు..

ఎన్నెన్నో విరులతో బుద్ధుని పూజింతును
ఆ పూజే నాకు ముక్తిని కలిగించును
కడకీ పుష్పాలు రాలి వాడిపోవును
చివరికి ఈ దేహం ఆ రీతే అగును.

బోధి వందనం

ఏ తరు ఛాయల ధ్యానం చేసి
సిద్ధార్థుడు బుద్ధుడాయెనో
ఆ బోధిసత్త్వుని పూజలందుకొని
ఏ తరు జన్మ పునీతమాయెనో
ఆ బోధివృక్షానికి నమస్సులు
ఆ వృక్షరాజానికి నమస్సులు....

బుద్ధుని అడుగుజాడలలో...

- భీమవరపు రవిచంద్రా రెడ్డి, దేవళ్ళ శంకర్

ధర్మచక్ర ప్రవర్తనకు చిహ్నంగా నిర్మించిన సారనాథ్ స్థూపం

బుద్ధుని జీవితంలోని ప్రధాన సంఘటనలకు సంబంధించిన నాలుగు ముఖ్యప్రదేశాలైన లుంబిని, బుద్ధగయ, సారనాథ్, కుసినారలను, ప్రతిఒక్కరూ తమ జీవితంలో తప్పనిసరిగా సందర్శించ వలసినవి. ఈ ప్రదేశాలలో లుంబిని సిద్ధార్థ గౌతముని పుట్టుకను, సంబోధిని పొందిన బోధివృక్ష ప్రాంగణ ప్రదేశాన్ని గయలోనూ, తాను తెలుసుకున్న జ్ఞానాన్ని మొదటి సారిగా పంచవర్గీయ భిక్షువులకు ధర్మచక్ర ప్రవర్తన యొక్క బోధనల చిహ్నంగా సారనాథ్‌లోని స్థూపం, చివరిగా, మహాపరి నిర్వాణం చెందిన కుసినార ముఖ్యమైనవి. ఈ నాలుగు ప్రదేశాలతో పాటు మరియొక నాలుగు ప్రదేశాలైన శ్రావస్తి, వైశాలీ, రాజగిరి మరియు నాలందలు కూడా తప్పనిసరిగా దర్శించదగినవే.

అందులో భాగంగానే నేను, నా మిత్రుడు శంకర్ ఈ ఎనిమిది ప్రదేశాలను సందర్శించాలనే సంకల్పం తీసుకున్నాం. నేను మార్చి 25న ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ నుంచి గోరఖ్‌పూర్ వెళ్ళే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌తో మొదటి మజిలి అయిన వారణాసికి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు చేరుకున్నాను. రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో సార్‌నాథ్ చేరుకొని, శ్రీలంకకు చెందిన 'మహాబోధి సొసైటీ ఆఫ్ ఇండియా' వారి ధర్మశాలలో విడిది చేశాం. అదేరోజు సారనాథ్‌లోని పంచవర్గీయ భిక్షువులకు గౌతమ బుద్ధుడు మొదటిసారి ధర్మబోధ చేసిన ప్రదేశాన్ని సందర్శించి మరుసటిరోజు ఉదయం ప్రక్కనే వున్న ధర్మచక్ర ప్రవర్తనకు చిహ్నంగా ఉన్న సారనాథ్ స్థూపాన్ని, పురాతనమైన ఆరామవిహారాలను, అప్పటి లేళ్ళ వనాన్ని గుర్తు చేస్తూ ఇప్పటికి వాటిని సంరక్షిస్తూ, వాటితోపాటు నెమళ్ళను కూడా ఈ వనంలో ప్రకృతికి వదిలిన తీరు చూపరులను ఆకర్షిస్తుంది. భారత ప్రభుత్వం ఎంతో శ్రద్ధతో వాటిని సంరక్షిస్తూ ఇప్పటి తరానికి, ముందు తరాలకు చరిత్రకు సంబంధించిన ఆనవాళ్ళను అందిస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

అదేరోజు ఉదయం 10 గంటలకు ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్న దాని ప్రకారం వారణాసి నుంచి గయకు వెళ్ళడానికై రైల్వేస్టేషన్‌కు బయలుదేరి వచ్చాను. ఆ రోజు విద్యుచ్ఛక్తి పొదుపు దినోత్సవం సందర్భంగా రైళ్ళు మూడు గంటలు లేటుగా నడుస్తున్నాయి. దానికితోడు వారణాసి రైల్వేస్టేషన్‌కు మరమ్మత్తులు చేస్తుండటం వలన వసతులుగాని, రైళ్ళ రాకపోకల విషయాలు సరిగా లేకపోవడం వలన నేను ఎక్కవలసిన రైలు తప్పిపోయింది. ఆ తరువాత

భీమవరపు రవిచంద్రా రెడ్డి, ఫోన్ : 9246487034 ; దేవళ్ళ శంకర్, ఫోన్ : 9704640273

తిరిగి డూన్ ఎక్స్‌ప్రెస్‌లో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి రాత్రి 11.30 గంటలకు గయ స్టేషన్‌కు వచ్చి, అక్కడి నుంచి ఆటోలో సుమారుగా 20 కి.మీ.ల దూరంలో వున్న బుద్ధగయ ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్‌కు చేరుకున్నాను. నా మిత్రుడు 20 రోజుల ధ్యాన సాధనకై ముందుగానే బుద్ధగయలోని విపశ్యనా అంతర్జాతీయ ధ్యాన కేంద్రానికి వచ్చి వుండడంవలన అతను సాధన ముగించుకునే సమయానికి నేను గయకు చేరుకున్నాను. మిత్రుడు గయలోనే వుండటం వలన వసతి ఏర్పాట్లను ముందుగానే ఏర్పాటు చేశాడు.

గయలోని బోధివృక్షపు ఛాయలో భగవానుడు ఆసీనుడైన ప్రదేశం

మరునటిరోజు 28వ తారీఖు ఆ విహారంలోనే భోజనంచేసి చూడవలసిన ప్రదేశాలకు బయలుదేరాము. ముందుగా గౌతముడు సత్యాన్వేషణకై, దుఃఖ నిర్మూలనకై చాలా మంది గురువులను, ఆచార్యులను కలసి వారి దగ్గర ధ్యానాన్ని అభ్యసించి అష్టసమాధి స్థితులను అల్పకాలంలోనే పొంది వాటివలన దుఃఖనివృత్తికాదని తెలుసుకొని, తానే స్వయంగా అంతిమ సత్యాన్ని కనుగొనాలనే వుద్దేశ్యంతో అనేక ప్రదేశాలలో సంచరిస్తూ చివరకు నేరంజనా నది ఒడ్డున ఉరువెల వనంలో బోధివృక్షం క్రింద ధ్యాన నిమగ్నుడై ఇలా అధిష్ఠానం (దృఢ సంకల్పం) చేస్తాడు. ''ఏదిఏమైనా అంతిమ సత్యాన్ని కనుగొనేవరకు ధ్యానాభ్యాసాన్ని చేస్తూనే వుంటాను'' అనే దృఢ చిత్తంతో ఉండి, ఏడు వారాలలో సంపూర్ణ జ్ఞానాన్ని పొందిన ప్రదేశాన్ని సందర్శించాము. 25 శతాబ్దాల క్రితం గౌతముడు బోధివృక్షపుఛాయలో ధ్యానంచేసి బుద్ధుడుగా అవతరించడానికి సహాయపడిన ఆ బోధివృక్షాన్ని ఇప్పటికి కాపాడుకుంటూ వస్తున్న (తల్లివేరు నుంచి తీయబడి మరలా నాటినదైనప్పటికి) వారందరికీ సర్వదా కృతజ్ఞతలు తెలుపవలసిన అవసరం ఎంతైనావుంది. బోధివృక్షాన్నిగాని, బుద్ధుడు ఆసీనుడైనటువంటి ప్రదేశాన్నిగాని, ప్రధాన ఆలయాన్ని ఫోటోతీయడంగాని, వీడియోను ఆవిష్కరించడానికిగాని (తగిన రుసుముతో) ఎటువంటి అభ్యంతరం లేదు.

ఆ రోజు సాయంత్రం నా మిత్రుడు శంకర్ తనతోపాటు 20 రోజుల ధ్యాన శిబిరంలో పరిచయం అయిన లండన్‌కు చెందిన ఇద్దరు విదేశీ స్నేహితులను నాకు పరిచయం చేశాడు. వారిలో ఒకరు క్రిస్‌పార్కిన్ కాగా, మరొకతను జిగ్నేష్. జిగ్నేష్ ఇండియాలో పుట్టినప్పటికి లండన్‌లో వుంటున్నాడు. మరుసటి రోజు వీళ్ళు గౌతమ బుద్ధుడు సత్యాన్వేషణకై సంచరించిన ఆరు సంవత్సరాల కాలంలో భాగంగా ధ్యానంచేసిన 'మహాకాల గుహ (ఇక్కడే గౌతముడు చిక్కి శల్యమై ఉదరము తాకితే వెన్ను, వీపుతాకితే ఉదరము తగిలేవి. కఠిన ఉపవాస దీక్షల వల్ల పొట్ట వెన్నుకు అంటుకు పోయింది. ఈ గుహ నేరంజనా నదికి ఆవల ఒడ్డున వుంటుంది)కు మరికొంత మంది భిక్షువులు ధ్యానం చేసినటువంటి 'బరాబర్ గుహలు', 'నాగార్జునీ గుహలు' ఎంతో పురాతనమైన మార్బుల్ గుహలు. వీటిని చూడటానికి వెళుతూ మమ్మల్ని కూడా రమ్మని ఆహ్వానించారు. నేను నా మిత్రుడు శంకర్‌తో పాటు ఇప్పుడు ఇద్దరు కొత్త స్నేహితులతో మొత్తం మేము నలుగురము కలసి 29వ తారీఖు ఉదయం 6.30 ని॥కు బయలుదేరి పైన చెప్పిన గుహలను సందర్శించి, 60 నుంచి 90 కి.మీ.ల దూరంలో వున్న 'గుర్‌పా' అనే గ్రామంలోని కొండపైన నిర్మించిన 'పగోడాను' చూడటానికి బయలుదేరాం. ఇది చాలా పెద్ద పర్వతం. 1,250 వరకు మెట్లుండగా మరికొంత దూరం మెట్లుకూడా లేవు. ఈ పర్వతంపైన బుద్ధుని పాదాలు శిలారూపంలో వున్నాయి. వీటితోపాటు హిందూ సంప్రదాయానికి చెందిన ప్రతిమలు కూడా వున్నాయి. వీటన్నింటినిచూచి విహారానికి వచ్చేసరికి రాత్రి 10 గంటలయింది. సాధారణముగా రోజులాగానే రాత్రి 9

గంటలకు విహారానికి తాళం వేశారు. వాచ్‌మెన్ వున్నాడు కాని రాత్రి 10 గంటలయ్యేసరికి నిద్రలోకి జారుకున్నాడు. మేము ఎన్నిసార్లు పిలిచినా పలకకపోవడంతో చేసేదిలేక గోడదూకి లోపలికి వెళ్ళాము.

మరుసటి రోజు 30వ తారీఖు మరికొన్ని చూడదగిన ప్రదేశాలైన సుజాతఘర్ (నివాసము)ని, బుద్ధగయలోని బౌద్ధ విహారాలను ముఖ్యముగా థాయ్‌లాండ్, చైనా, జపాన్, శ్రీలంక, కాంబోడియా దేశాలకు చెందిన విహారాలలో ప్రతిష్ఠించిన బుద్ధ ప్రతిమలు చాలా అందముగా తయారు చేయబడినాయి. ఒక్కొక్క విహారం ఒక్కొక్కదేశ ప్రత్యేకతను చాటుతున్నాయి. వీటిలో జపాన్‌కు సంబంధించిన డైజోక్యో సంస్థవారు నిర్మించిన సుమారు 60 మీటర్లు ఎత్తైన ధ్యానముద్రలో వున్న శాక్యముని బుద్ధుని ప్రతిమ నిర్మించిన తీరు బాగుంది. అలా నాలుగు రోజులు గయలోనే గడిపాము.

చరిత్రకాధారంగా నిలచిన ప్రాచీన నాలంద విశ్వవిద్యాలయం

ఇక మా తరువాతి మజిలీ నాలంద. గయ నుంచి నాలంద 70 నుంచి 80 కి.మీ.లు వుంటుంది. గయ బైపాస్ నుంచి నాలందకి ప్రైవేట్ బస్సులు వుంటాయని అక్కడి వారిని అడిగి తెలుసుకొని అక్కడి వరకు ఆటోలో బయలుదేరి వెళ్ళాం. అక్కడ ప్రైవేట్ బస్సు సిద్ధంగా వుండటంతో బస్సు ఎక్కి 3 గంటలలో నాలందకి చేరాం. ప్రధాన రహదారికి ప్రక్కనే వున్న చైనీస్ మందిరంలో భంతే ఖేమసార తెలిపిన భిక్షువుని కలిసి, వారు మాకు ఉండడానికి అనుమతినివ్వగా మేము ఆ విహారంలో బసచేశాము. ఆ రోజు రాత్రికి విశ్రాంతి తీసుకొని మరుసటి రోజు ఏప్రిల్ 1వ తారీఖు ఉదయాన్నే బయలుదేరి విహారనుంచి 3 కి.మీ.లదూరంలో వున్న నాలంద మ్యూజియాన్ని, నాలంద పురాతన విశ్వవిద్యాలయ శిథిలాలను చూశాం. ఈ నాలంద విశ్వవిద్యాలయం ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందింది. దీని ప్రాశస్త్యం పదివేలమంది బౌద్ధభిక్షువులు చదువుకోవడానికి, వుండటానికి వసతికల్పించబడింది. అప్పటికాలంలో మొత్తం 108 విహారాలు, ఒక్కొక్క విహారానికి ఎదురుగా ఒక్కొక్క బుద్ధ మందిరం కలిగి వుండేవి. కాని, కాలగర్భంలో ఎన్నోశిథిలమైపోయి గ్రామాలుగా మరియు పంటపొలాలుగా మారిపోయినాయి. భారతప్రభుత్వం, పురాతత్వశాఖకు సంబంధించినవారు ఎంతోశ్రమకోర్చి 108 విహారాలకుగానూ 11 విహారాలను మరియు కొన్ని బుద్ధ మందిరాలతోపాటు భగవాన్ బుద్ధుని ముఖ్య శిష్యులలో ఒకరైన సారిపుత్తుని స్థూపం వాటితోపాటు కొన్ని స్థూపాలను వెలికితీశారు. ఇక్కడ గమనించివలసిన విషయం ఒకటుంది. ఆ రోజుల్లోనే పదివేల మంది భిక్షువులు ఒకేచోట చదవగలిగే సామర్థ్యం వున్నదంటే ఆ విశ్వవిద్యాలయంలో వున్న గురువులుగాని, ఆచార్యులుగాని ఎంత ప్రతిభావంతులో అర్థం చేసుకోవచ్చు. అంతేగాక ఇది నిర్మించటానికి పట్టిన సమయము గాని, కేటాయించిన నిధులుగాని, నిర్మాణంలో చేపట్టిన మెలకువలు చూస్తేగాని అర్థం చేసుకోలేము. ఇక్కడ తిరగటానికి గుర్రపుబళ్ళు మాత్రమే వుంటాయి. ఇక 2వ తారీఖు ఉదయం 10 గంటల ప్రాంతములో బయలుదేరి ప్రక్కనే 10, 15 కి.మీ.ల దూరంలో వున్న రాజగిరి (అప్పటి మగధరాజ్యానికి రాజధాని)కి వెళ్ళాము. ముఖ్యముగా రాజగిరిలో చూడదగినవి 9 ప్రదేశాలు వున్నాయి. వీటన్నింటిని సందర్శించటానికి మేము గుర్రపుబండిని మాట్లాడుకొని గృధ్రకూట (గిజ్జకూట), శాంతిపగోడా, జీవకావన్, బింబిసారజైలు, స్థూపం, సోన్‌బండార్ గుహలు, మణియార్‌మఠ్, పిప్పిలిఘర్, వేణువనాలను సందర్శించాం. వీటిని సందర్శించడానికి 6 గంటల సమయం పట్టినది. ఈ ప్రదేశాలు ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి వున్నాయి.

మరుసటి రోజు 3వ తారీఖు మిగిలిన ప్రదేశాలు అయినటువంటి యువాన్‌చాంగ్ (హుయాన్‌త్సాంగ్)

చైనా బౌద్ధ యాత్రికుడు యువాన్‌చాంగ్

మెమోరియల్‌హాల్, నవనాలంద విశ్వవిద్యాలయాన్ని చూశాం. మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ హోటల్స్ కూడా అరుదు. నాలందా మ్యూజియం ఆవరణలో వున్న బీహార్ టూరిజం వారి రెస్టారెంట్‌లో భోజనం చేసేవాళ్ళం. అది తప్ప మాకు వేరే హోటల్ ఏమీలేదు. ఎందుకంటే మేము బసచేసిన చైనీస్ మందిరంలోని వంటకాలు మాకు క్రొత్త.

4వ తారీఖు ఉదయం బయలుదేరి వైశాలీ అనే మరొక బౌద్ధ యాత్రాస్థలానికి బయల్దేరాం. వైశాలీకి నేరుగా వెళ్లడానికి రైలుగాని, బస్సుగాని లేకపోవడం వలన మేము పాట్నా వరకు రైలులో వెళ్ళి అక్కడి నుంచి ఆటోలో హాజీపూర్ వెళ్ళి లాల్‌గంజ్ మీదుగా ప్రైవేట్ బస్సులో వైశాలీకి చేరుకోవాలి. ముందుగా రైలుకి రిజర్వేషన్ చేయకపోవడం వలన నాలంద నుంచి పాట్నా వరకు జనరల్ టికెట్ తీసుకొని రాజగిరి నుంచి ఢిల్లీకి వెళ్ళే శ్రమజీవి ఎక్స్‌ప్రెస్ ఎక్కాం. శ్రమజీవి అన్న పేరుకు తగ్గట్టుగానే మేము ఎక్కిన భోగిలో అందరూ శ్రమజీవులు లాగానే వున్నారు. మాకు గయలో కలిసిన లండన్ మిత్రుల దగ్గరవున్న ట్రావెల్‌గైడ్‌ని మేము జిరాక్స్ చేసి పెట్టుకున్నాము. దానిలో ఇప్పటివరకు మేము తిరిగిన ప్రదేశాలలో కలిగిన అనుభూతులు కళ్ళకు కట్టినట్లు కనిపించాయి. కాబట్టి మేము ఇక ఎవరిని ఏదీ అడిగే అవసరం లేకుండా ఆ గైడ్‌ని అనుసరించాం. ఇంత వివరంగా వ్రాయడానికి కారణం వారు ఈ ప్రాంతానికో, ఈ దేశానికో చెందిన వారు కాదు. విదేశాలకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు. మా ఈ యాత్ర విజయవంతంగా జరగటానికి కారకులైన ఈ పుస్తక రచయితలకు సర్వదా కృతజ్ఞులం.

నాలంద నుంచి వైశాలికి కేవలం 150 కి.మీ. దూరమే కాని ప్రయాణం చేయడానికి 8 గం॥ల సమయం పట్టింది. ఆ రోజు రాత్రికి మేము విశ్రాంతితీసుకొని మరుసటిరోజు ఉదయాన్నే అల్పాహారం తీసుకొని అశోక స్థూపం మరియు అక్కడి ఆవరణలో వున్న రామకుండ్, వైశాలీ మ్యూజియం, బుద్ధుని ధాతువు భద్రపరిచిన స్థూపం (తరువాత ధాతువును పాట్నాలో భద్రపరిచారు), రాజా విశాల్‌ఘర్ చూసి ఆ రోజు రాత్రికి శ్రీలంక విహారంలో విశ్రాంతి తీసుకొని మరుసటి రోజు బయటికి వెళ్లి గోరఖ్‌పూర్ వెళ్లడానికి తాత్కాల్‌లో రైలుకి రిజర్వేషన్ చేయించుకొన్నాం. హాజీపూర్ నుంచి. 6వ తారీఖు సాయంత్రం వైశాలీ నుంచి బయలుదేరి హాజీపూర్ రైల్వేస్టేషన్‌కు ముందుగానే చేరుకున్నాం. ఎందుకంటే వైశాలీ నుంచి చీకటిపడేకొద్దీ రాకపోకలు తగ్గిపోతాయి. మేము ఎక్కవలసిన రైలు రాత్రి 10.30 ని॥లకు అయినప్పటికి రాత్రి 7 గంటలకే స్టేషన్ చేరుకున్నాం.

వైశాలి

మా తరువాత యాత్రాస్థలం గౌతమబుద్ధుడు మహాపరి నిర్వాణం చెందిన కుసినారకు బయలుదేరాము. 7వ తారీఖు ఉదయానికల్లా గోరఖ్‌పూర్ స్టేషన్‌కు చేరుకున్నాము. ఇక్కడినుంచి కుసినార సుమారుగా 55 కి.మీ. వుంటుంది. రైల్వేస్టేషన్‌కి ప్రక్కనేవున్న గోరఖ్‌పూర్ బస్‌స్టాండ్‌కి చేరుకొని, ఉదయం 7 గంటలకల్లా కుసినార చేరుకున్నాం. ఆ సమయంలో విపశ్యనా జిప్సిక్యాంప్ నిర్వహిస్తున్న ఆంధ్ర టీచర్ అయిన రవికుమార్‌రెడ్డి గారిని కలిసి వారితోటి రెండు రోజులు బర్మీస్ విహారంలో వుండి, సాయంత్రం ప్రక్కనే వున్న కుసినార మెయిన్ టెంపుల్‌లోని బుద్ధప్రతిమకు నమస్కరించుకొని, అదే ఆవరణలో వున్న పురాతన శిథిలాలను సందర్శించాం. మరుసటి రోజు ఉదయం మరలా ఒకసారి దర్శించి ప్రక్కనే వున్న మాతాకౌర్ మందిరం, మ్యూజియం, రమాబార్ స్థూపంతోపాటు వివిధ బౌద్ధ దేశాలకు సంబంధించిన ఆరామ విహారాలను చూశాం. చివరగా బుద్ధభగవానుని మహాపరి నిర్వాణం తరువాత భగవానుని ధాతువులను ఎనిమిది శాఖలకు సంబంధించిన వారు ఒక మహా బోధివృక్షం క్రింద పంచుకొన్న ప్రదేశం కెళ్ళాం. అది ఇప్పటికి కూడా ఒక మహాబోధి వృక్షంగానే వుంది. మరుసటిరోజు అల్పాహారం తీసుకొని, టీచర్‌గారిని కలిసి మేము మళ్లీ గోరఖ్‌పూర్ మీదుగా, సిద్ధార్థ గౌతముని జన్మస్థలమైన లుంబినీకి బయలుదేరాము (ఇది ఇప్పుడు నేపాల్‌లో వుంది).

లుంబినీ చేరుకోవాలంటే ముందుగా గోరఖ్‌పూర్ వచ్చి అక్కడి నుంచి సనౌలీకి వెళ్ళాలి. ఇది ఇండో – నేపాల్ సరిహద్దు ప్రాంతం. గోరఖ్‌పూర్ నుంచి సనౌలీకి బస్సు సౌకర్యం వుంది. ఇది సుమారుగా 100 కి.మీ. వుంటుంది. మేము సుమారుగా 11 గంటల ప్రాంతంలో బయలుదేరి సాయంత్రానికి ఇండో – నేపాల్ సరిహద్దుకి చేరుకున్నాం. ఆ రోజు నేపాల్‌లో బంద్ జరుగుతున్న కారణంగా రాకపోకలు జరగటం లేదు. మేము రిక్షాలో మా లగేజ్ తీసుకొని సరిహద్దు ఆవలికి వెళ్ళాము. అక్కడ నేపాల్ సరిహద్దు సైనికులు మా లగేజ్‌ని చెక్ చేసి పంపించారు. బంద్ కారణంగా మేము లుంబినీ వరకు వెళ్ళలేకపోయాం. మాకు నేపాల్లో తెలిసిన వారైనటువంటి బోధి ఛానల్ సి.ఇ.ఒ. అయిన అభిలాష్ ఆచార్యకు మరియు కెమెరామెన్ సాధురామ్‌కి ఫోన్ చేశాం. వారు కాట్మండ్‌కు రావలసినదిగా ఆహ్వానించారు. అదే రోజు రాత్రికి బంద్ ఎత్తి వేస్తారని తెలియడంతో అక్కడే వున్న పంజాబీ హోటల్‌లో భోజనం చేసి కాట్మండ్‌కి రెండు టిక్కెట్లు తీసుకొని బస్ ఎక్కాం. ఇది సుమారుగా 300 కి.మీ. ప్రయాణం. వీరు ఒక్కొక్కరికి 400ల నేపాలీ రూపాయలు తీసుకొన్నారు. మేము అప్పటికే ఇండియన్ కరెన్సీని నేపాల్ కరెన్సీలోకి మార్చుకున్నాము. మన రూపాయి కన్నా నేపాల్ రుపాయి తక్కువ (1 రూపాయి = 1.6).

కాట్మండ్‌కి ప్రయాణం ఎక్కువభాగం ఘాట్‌రోడ్‌గానే వుంటుంది. సాధురామ్ మమ్మల్ని 'కలంకి' అనే ప్రాంతంలో దిగమని చెప్పాడు. మేము ఉదయం 8 గంటల ప్రాంతంలో కలంకికి చేరుకున్నాము. సాధు అప్పటికే మా కోసం ఉదయం 6 గంటలకు వచ్చి, ఎదురుచూసి వెళ్ళానని చెప్పారు. తిరిగి మరలా వచ్చి మమ్మల్ని తీసుకొని బోధి చానల్ ఆఫీస్ గెస్ట్ హౌస్‌కి తీసుకొనివచ్చారు. మేము భోజనంచేసి విశ్రాంతి

కుసినారలో బుద్ధుని మహాపరినిర్వాణం

తీసుకున్నాము. మరుసటిరోజు అయిన 11వ తారీఖున మేము బయటకు వెళ్ళి కొన్ని ప్రదేశాలు చూడవలసి వుండి శంకర్‌కు ఆరోగ్యం సరిగా లేకపోవడం వలన వెళ్ళలేక పోయాం. తరువాత రోజు కూడా బంద్ అని అభిలాష్ చెప్పాడు. ఆ రోజు మధ్యాహ్నంనుంచి బయలుదేరి దగ్గరలోవున్న 'టామిల్' అనే టూరిస్టు ప్రదేశానికి వెళ్ళి అక్కడవున్న హోటల్‌లో 'నేపాలీ తాలీ'తో పిలువబడే భోజనం చేశాం. ఇది దాదాపు 90 శాతం దక్షిణ భారతదేశపు వంటలలాగానే వున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా విదేశీ పర్యాటకులు వున్నారు. వీరిలో ఎక్కువ మంది పర్వత సానువులను అధిరోహించాలని వచ్చిన వారే. ఇక్కడికి హిమాలయ పర్వతాలు దగ్గర కావడంవలన అప్పటి వరకు ఉత్తరప్రదేశ్, బీహార్ ఎండలకు తిరిగి, తిరిగి అలసిపోయిన మాకు ఇండో-నేపాల్ సరిహద్దు దాటి కాట్మండుకు చేరుకోగానే అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదంగా అనిపించింది.

కాట్మండ్‌లోని కలపతో నిర్మించిన దర్బారు స్క్వేర్

ముఖ్యంగా కాట్మండ్‌కు ఆ పేరు రావడానికి కారణం పూర్వం రోజుల్లో 'కాష్ఠ మండపం' అనే దేవాలయం అక్కడి పర్వతసానువుల మధ్యవున్న లోయలో వుండటం, అది రాను రానూ కాట్మండ్‌గా పిలువబడటం జరిగిందని విన్నాం. ఈ కాష్ఠ మండపాన్ని నిర్మించడానికి ఒకే ఒక్క మహావృక్షం నుంచి తీసిన కలపను వాడారనే కథనం కూడా వుంది.

ఇక్కడి పురాతన దేవాలయాలకు ఒక ప్రత్యేకత వుంది. ఈ దేవాలయాలను నిర్మించడానికి ఎక్కువ మొత్తంలో కలపవాడారు. ఈ కలపతో మలచిన దేవాలయాల మీద ప్రతిమలను పరిశీలిస్తే అప్పటి శిల్పకారుల చాతుర్యాన్ని పరిపాలించిన రాజులు యొక్క సహాయ సహకారాలను అభినందించక మానరు. ఇంకా ఇక్కడ చూడవలసిన ప్రదేశాలైనటువంటి బౌద్ధ స్థూప్, పసుపతినాథ్ దేవాలయం వున్నాయి.



నేపాల్‌లోని బౌద్ధ స్థూపం

మేము కాట్మండులో వున్న రోజుల్లోనే ఏప్రిల్ 13వ తారీఖు నేపాల్ కొత్త సంవత్సరం వచ్చింది. నేపాల్ ప్రజలు కొత్తసంవత్సరవేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మరుసటిరోజు 14వ తారీఖు మేము వుండే లయన్‌చోర్ నుంచి కొన్ని షాపింగ్ సెంటర్లకు, మాల్స్‌కు తిరిగాం. ఇక్కడ లెదర్ వస్తువులు తక్కువకే లభించడం వలన మేము కొన్నింటిని ఖరీదు చేశాం. తరువాతి రోజు అయిన 15వ తారీఖు అభిలాష్ మమ్మల్ని స్వయంభూ స్థూపానికి, బౌద్ధ స్థూప్‌కి తీసుకెళ్లినాడు. స్వయంభూ స్థూపం నుంచి చూస్తే నేపాల్ నగరమంతా వీక్షించవచ్చు. అలా వారం రోజుల

మాయాదేవి కపిలవస్తునుండి తన పుట్టిల్లు దేవదహ వెళ్లేటప్పుడు మార్గమధ్యంలోని లుంబినీవనంలో సిద్ధార్థునికి జన్మనిచ్చుట

పాటు వుండి తిరుగు ప్రయాణంలో లుంబినీకి వెళ్ళి గోరఖ్‌పూర్ మీదుగా శ్రావస్తి వెళ్ళాలని నిర్ణయించుకున్నాం.

కాట్మండ్ నుంచి ఉదయాన్నే బస్సు ఎక్కి సాయంత్రానికి లుంబినీ చేరుకున్నాం. ఈ లుంబిని వనంలో, కపిలవస్తు నుంచి బంధుగణముతో మాయాదేవి పురుడుకోసమని పుట్టిల్లు అయిన దేవదహకు బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యలోనే పురుటినెప్పులు మొదలయి, సాలవృక్షాల మధ్యలోనే, ప్రపంచాన్ని దుఃఖంనుంచి విముక్తపరిచే ఒక మహా సత్పురుషునికి జన్మనిచ్చినది. ఆ మహాపురుషుని పాదస్పర్శతో లుంబినీ పావనమయింది. ఇక్కడ, ఇప్పటికీ భగవానుడు జన్మించిన ప్రదేశాన్ని, అప్పటి ఆరామవిహారాలను, అశోకస్తంభాన్ని, కొలనును చూడవచ్చు.

లుంబినీ నుంచి ప్రైవేట్ బస్సులో తిరిగి సనౌలీకి వచ్చి ఉత్తరప్రదేశ్ గవర్నమెంట్ బస్సులో గోరఖ్‌పూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని చివరి మజిలీ అయిన శ్రావస్తికి బయలుదేరాం. బౌద్ధ సాహిత్యం ప్రకారం శ్రావస్తిలోని జేతవనానికి ప్రత్యేక గుర్తింపు వుంది. గౌతమ బుద్ధుడు తన జీవిత కాలంలోనే ఎక్కువసార్లు వర్షావాసాన్ని ఇక్కడే గడిపినట్లు (20 సంవత్సరాలకు పైగా), వుంది. బుద్ధుని ప్రధాన శిష్యులైన సారిపుత్ర, మౌద్గల్యాయనలు కూడా ఇక్కడికి తరుచుగా వచ్చినట్లు చెబుతారు. బుద్ధుడు తన బోధనలలో భాగంగా ఎక్కువ సుత్తాలను కూడా ఇక్కడే చెప్పినట్లు వుంది. వ్యాపారవేత్తయిన అనాధపిండకుడు కట్టించిన జేతవనానికి అంతటి ప్రాశస్త్యంవుంది. ఈ ఒక్క జేతవనంలోనే 12 వేల మంది భిక్షువులు నివసించేవారు. శ్రావస్తిలోనే జేతవనానికి కొద్దిదూరంలో వున్న అంగుళిమాల గుహ, ప్రక్కనే వున్న మరొక గుహను కూడా సందర్శించాము. అన్ని బౌద్ధ సందర్శన ప్రాంతాలలోలానే ఇక్కడ కూడా వివిధ బౌద్ధ దేశాల విహారాలు కూడా ఇప్పుడిప్పుడే బాగా అభివృద్ధిచెందుతూ, తిరిగి బౌద్ధాన్ని తన పుట్టినింటికి తీసుకొనిరావాలనే వారి కోరిక దృఢముగా వుంది. అన్ని ఆరామవిహారాలలో కెల్లా థాయ్‌లాండ్‌కు చెందిన వాట్‌థాయ్ మందిరాలు తమప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

చివరిగా శ్రావస్తితో మా 22 రోజుల దీర్ఘ యాత్రలో భాగంగా నాలుగు ప్రధానమైన ప్రాంతాలతోపాటు మిగిలిన నాలుగు ప్రాంతాలను చూసి ఉత్తరప్రదేశ్‌లోని గోండా రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్‌కు చేరుకున్నాము.

లుంబినిలోని బుద్ధుడు జన్మించిన స్థలం

భారతదేశంలో బౌద్ధధర్మ పతనం

- డా. బాబా సాహెబ్ అంబేద్కర్

భారతదేశంలో బౌద్ధం ఏ విధంగా ఉచ్ఛస్థితికి చేరి తరువాత కాలంలో ఎలా పతనావస్థ పాలయిందో అధ్యయనం చేసినవారు ఈ విషయాన్ని కూలంకషంగా వివరించలేదు. నాకు ఇంతవరకూ బౌద్ధధర్మ ఉత్థాన పతనాలకు సంబంధించి నిర్దుష్టమైన సాక్ష్యాధారాలు అంతుపట్టలేదు.

ఏ విషయమైనా క్షుణంగా తెలుసుకోవాలంటే అందుకు సంబంధించిన సాంప్రదాయ పద్ధతులను నిశితంగా అధ్యయనం చేయాలి. అలాగే బౌద్ధం ప్రాముఖ్యత తెలియాలంటే దాని ఆవిర్భావ పరిస్థితులు అర్థం చేసుకోవాలి. కేవలం హిందూ మతమే భారతదేశంలో ఏకైక మతమని అంగీకరించను. హిందూమతం భారతదేశంలో ఇటీవలికాలపు సాంఘిక పరమైన ఆలోచనా స్రవంతి.



మనదేశంలో మతవిశ్వాసం మూడుదశలలో మార్పు చెందినది. మొట్టమొదటి వైదికమతం, కాలక్రమేణ బ్రాహ్మణమతంగా రూపాంతరంచెంది హిందూ మతంగా మారింది.

వైదికమతాన్ని ఆచరించడం చాలా తేలిక. యజ్ఞ యాగాదులు, పూజలద్వారా వైదిక ఆర్యులు ఎంతోమంది దేవతలను కొలిచారు. వారి ప్రీత్యర్థం యజ్ఞాలు చేశారు. ఘనంగా పూజలు నిర్వర్తించారు. అది వ్యవసాయక నేపథ్యంలో గోసంపదతో వర్ధిల్లినది. అందుకని ఆవులను బలిచ్చి దేవతలను సంతుష్టులను చేసుకొనేవారు. ఈవిధంగా వైదికమతం హింసను ప్రోత్సహించింది.

బ్రాహ్మణులు తమ చుట్టూవున్న సాంఘిక జీవనాన్ని ప్రభావితం చేశారు. అందుకు ముఖ్యంగా యజ్ఞ ప్రక్రియ ప్రధానమైన సాధన అప్పటి సాంఘికవ్యవస్థను తమ చెప్పుచేతలలో పెట్టుకోగలిగినారు. అంతేకాక బ్రాహ్మణ, వైశ్య, శూద్రులుగా ఆ సంఘాన్ని చీలగొట్టారు. అప్పటి నుంచే తారతమ్యాలు, ఘర్షణ మొదలయింది. బ్రాహ్మణులు తాము బ్రహ్మ నోటినుంచి, శూద్రులు పాదాలనుంచి పుట్టినట్టు ప్రచారంచేశారు. సాంఘికపరమైన చీలికలు తీసుకొనిరావడం ఒక మతధర్మంగా చెప్పగలమా? కాని వైదికబ్రాహ్మణులు చేసింది ఇదే.

ఇందుకు భిన్నంగా బౌద్ధంలో సాంఘిక సమానత్వం ముఖ్య ఉద్దేశ్యంగా చెప్పబడింది. బౌద్ధం ఆలోచనా స్వాతంత్ర్యాన్ని వ్యక్తి ఔన్నత్యాన్ని ముఖ్యంగా ప్రబోధించింది. జీవహింసను, జంతుబలిని నిర్ద్వందంగా వ్యతిరేకించిన బౌద్ధం కనవడని దేవతల కోసం జీవరాసులను బలివ్వడం దాని ద్వారా మోక్షసాధన సాధించడం అవివేకం అని బోధించింది.

బౌద్ధానికి ముందుతరాలలో శూద్రుడికి రాజ్యార్హత అనే ఆలోచన లేదు. భారతదేశచరిత్రను పరిశీలిస్తే బౌద్ధం కారణంగానే శూద్రులు రాజులుగా సింహాసనం ఎక్కగలిగారు. అంతేకాక ప్రజాపరిపాలన కూడా సాధ్యమైంది.

ఇంత ఔన్నత్యంగల బౌద్ధం భారతదేశంనుంచి ఎలా కనుమరుగయిందో తెలుసుకోవడం ఎంతో సంక్లిష్టమైన వ్యవహారమే. అందుకు ఉపయుక్తమైన సాహిత్యంగాని,

తెలుగు సేత : వల్లభనేని అశ్వినీకుమార్

చారిత్రక ఆధారాలుగాని ఏవీ లభ్యం కావడంలేదు. క్రీ.పూ. 274నాటి పరిస్థితులు తెలుసుకోవడానికి ఆధారాలు ఏమీలేకుండాపోయాయి. అశోకునికాలంలో ఎంతో ప్రచారం గలిగి అన్ని ప్రదేశాలలో వెలిగిపోయిన బౌద్ధం భారతదేశపు హరిత ప్రదేశాలనుండి ఎలా నిష్క్రమించిందో ఊహకే అందని విషయం.

క్రీ.పూ. 184 కాలంలో బౌద్ధానికి చాలా వ్యతిరేకత వచ్చింది. మౌర్యచక్రవర్తిని అతని సేనానాయకుడే చంపివేయడం వెనుక బ్రాహ్మణుల హస్తం వున్నదనేది సత్యం. ఈ చర్య పౌరోహిత మతవిశ్వాసాలను రక్షించుకోవడానికే, కాని చరిత్రకారులు దీనికి అంత ప్రాముఖ్యత ఇవ్వలేదు. బౌద్ధసాహిత్యం చదువుతుంటే ఒక విషయం తెలుస్తుంది. బుద్ధుని అనుచరులలో ఎక్కువమంది బ్రాహ్మణులే ఉన్నారని. బుద్ధుని దగ్గరకు వారి సంశయ నివృత్తి కొరకు వచ్చి ఆయన బోధనలకు ప్రభావితం చెంది బౌద్ధంలో చేరిన బ్రాహ్మణులు చివరకు వారే దాని పతనానికి కారణమయ్యారు.

ఈ విషయంలో కులదేవతారాధన చాలా ముఖ్యమైనదని నా ఉద్దేశ్యం. భారతదేశంలో గ్రామదేవతలు, జాతిదేవతలే కాక, కులదేవతలనుకూడా బ్రాహ్మణులు పూజించారు. ఈ పూజల ద్వారా వారు రాణివాసంలోని స్త్రీ జనాన్ని ఎక్కువగా ప్రభావితం చేసారు. అశోకుడు బౌద్ధంలో ప్రవేశించిన తరువాత, ఈ పౌరోహిత పూజలను, గ్రామదేవతల జాతరలను నిర్మూలించాడు.

"నేను జ్ఞానోదయంచెందిన బుద్ధుడ్నే గౌరవిస్తాను, పూజిస్తాను, మరే చిల్లర దేవుళ్ళని పూజించనవసరం లేదు" అని అశోకుడు ఉద్ఘాటించాడు.

అశోకుని ఈ చర్య బ్రాహ్మణులను ఎంతగానో బాధించి, వారి నోటి దగ్గర ఆహారాన్ని పోగొట్టింది. వారు అమాయకులను దోచుకుతినే అవకాశం లేకుండాపోయింది. అందుచేత వారు ప్రతీకారానికి ప్రతిన పూనారు.

రాజ్యపాలన చేసే రాజులు తప్పక నరకానికి వెళ్తారని బ్రాహ్మణులు విశ్వసించేవారు. దీనికి కారణం రాజులు యుద్ధంలో చేసే హత్యలు, శిక్షల ప్రతిఫలం – అందుచేత బ్రాహ్మణులు ఎప్పుడూ అధికారం కోసం, సింహాసనం కోసం ప్రాకులాడలేదు. ఎప్పుడూ పురోహితులుగానే వుండడానికి, సలహాలు ఇవ్వటానికి పరిమితమయ్యారు – బౌద్ధం వలన బ్రాహ్మణులకు జరిగిన నష్టం – వారి కులదేవతల పూజా కార్యక్రమాలు – జనసామాన్యాన్ని – రాణివాసపు స్త్రీలను దోచుకునే కర్మకాండల కార్యక్రమాల నిర్మూలన – ఇవన్నీ సరిచేసుకోవడంకోసం అధికారం చేజిక్కించుకోవడానికి కూడా వెనుకాడలేదు. అంతేకాక, వారి ఆలోచనలు సమర్థించే క్షత్రియులతో కలిసి ఈ ప్రణాళికలు తయారుచేసి, బౌద్ధాన్ని ఎదుర్కొని తమ ఆధిక్యాన్ని నిలుపుకోవటానికి శతవిధాల ప్రయత్నాలు చేశారు. ఈ బ్రాహ్మణ అధికార ప్రణాళిక అమలు చేయటం బౌద్ధపతనానికి నాంది పలికింది.

అదే సమయంలో పరదేశీ ఆక్రమణలు – వారి మత ప్రచారాలు కూడా దీనికి దోహదపడ్డాయి. గ్రీకులు బౌద్ధానికి కీడు చేయలేదు – వారు బౌద్ధ భిక్షువులకు ఆర్థిక సహాయం చేసిన దాఖలాలున్నాయి – గుప్తులతో యుద్ధంలో ఓడిపోయిన హూణులు భారతదేశంలోనే స్థిరపడిపోయారు.

దీనికి ముందు బ్రాహ్మణులు బౌద్ధాన్ని నాశనం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. ముసల్మానులు బౌద్ధానికి ఎనలేని హాని చేశారు. బుద్ధుని విగ్రహాలు ధ్వంసం చేసి, భిక్షువులను హత్యచేశారు. నాలంద విశ్వవిద్యాలయాన్ని బౌద్ధుల కోటగా అపార్థం చేసుకుని అక్కడ విద్యనభ్యసించిన బౌద్ధ విద్యార్థులందర్ని చంపివేశారు. అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయిన భిక్షువులు నేపాల్, టిబెట్, చైనా దేశాలు చేరారు.

నన్ను కొంతమంది అడుగుతుంటారు : "హిందూమతం కూడా విగ్రహారాధనతోనే ముడిపడివుంది కదా, మరి అది భారతదేశంలో అన్ని పరిస్థితులను తట్టుకుని ఎలా ప్రచారంలో ఉంది, అదే సమయంలో బౌద్ధం ఎందుకు దీనావస్థలోకి చేరింది"అని. అప్పుడు నేను చెప్పే సమాధానం: "ఏ మతమయినా పూజారి వర్గపు దన్ను – ఆధారం లేనిదే బ్రతికి బట్ట కట్టలేదు" అని.

ఇది గుర్తించి బౌద్ధులు పౌరోహిత అనుయాయులను ప్రోత్సహించినా ప్రయోజనం లేకపోయింది – ఎందుకంటే హిందూ పౌరోహిత సంప్రదాయం – వంశపారంపర్యం – పురోహితుని కొడుకు పురోహితుడే – అందుకే ముసల్మానుల దాడిని హిందూమతం తట్టుకుని నిలబడింది. దానిని నిలబెట్టేందుకు పౌరోహిత వర్గం వంశపారంపర్యంగా

వస్తుండటమే కారణం. ఈ విధానం బౌద్ధంలో లేకపోవడమే బౌద్ధధర్మపతనానికి మరోకారణం. అప్పుడు రాజకీయ కారణాలు కూడా ఇందుకు దోహదం చేశాయి.

శంకరాచార్య ప్రచారం బౌద్ధాన్ని నాశనం చేసిందనే వాదనను నేను అంగీకరించను. ఎందుకంటే శంకరుని మరణానంతరం బౌద్ధం కొన్ని వందల సంవత్సరాలు బ్రతికే వుంది. నా ఉద్దేశ్యంలో శంకారాచార్య బౌద్ధుడే. ఆయన గురువు కూడా బౌద్ధుడే.

బౌద్ధం పతనమవటానికి మరో ముఖ్య కారణం వైష్ణవ-శైవ మతాలు ప్రజల్లో ఆదరణ పొందటం. దానికి కారణం బౌద్ధంలో వున్న ఎన్నో మంచి సూత్రాలను, విషయాలను పై రెండు సంప్రదాయాలు గ్రహించి ప్రచారం చేయడమే.

ఇవాళ హిందూమతం (ముఖ్యంగా అహింస విషయంలో) చాలా అభివృద్ధి చెందినది. ఇది బౌద్ధధర్మ ప్రభావమే, ఒకప్పుడు జంతుబలిని ప్రోత్సహించిన హిందూమతం బౌద్ధధర్మ ప్రభావంతో అహింసనే ప్రచారం చేసింది. అంటే బౌద్ధం ప్రస్తుతం కనపడకపోయినా దాని ప్రభావం ఆధ్యాత్మికత భారతదేశంలో ప్రచ్ఛన్నంగా వుందని అంగీకరించాలి.

భారతదేశంనుంచి బౌద్ధం అంతర్ధానమవడం ఆశ్చర్యకరమే కాక విచారించవలసిన విషయం కూడా. కాని బౌద్ధం చైనా, జపాన్, బర్మా, శ్రీలంక, మలేషియాలే కాక చాలా తూర్పు దేశాలలో జీవించేవుంది. ఒక్క భారతదేశంలో అది మృతప్రాయం అయిపోయింది. అంతేకాక బుద్ధుణ్ణి తలుచుకునేవారే కరువైనారు. ఇంత ఘోరమైన పరిణామం ఎలా వచ్చింది? ఇంత ముఖ్యమైన ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లేకపోయింది.

భారతదేశంనుంచి బౌద్ధం అంతర్ధానమవడం ఆశ్చర్యకరమేకాక విచారించవలసిన విషయం కూడా. కాని బౌద్ధం చైనా, జపాన్, బర్మా, శ్రీలంక, మలేషియాలే కాక చాలా తూర్పు దేశాలలో జీవించేవుంది. ఒక్క భారతదేశంలో అది మృతప్రాయం అయిపోయింది. అంతేకాక బుద్ధుణ్ణి తలుచుకునేవారే కరువైనారు. ఇంత ఘోరమైన పరిణామం ఎలా వచ్చింది? ఇంత ముఖ్యమైన ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం లేకపోయింది. అంతేకాక దీనివెనుకవున్న సత్యాన్ని అన్వేషించినవారు లేరు. ఇంత ముఖ్యమైన పరిణామాన్ని శోధించడానికి ప్రజలు, ప్రముఖులెవరూ పూనుకున్నట్లు లేరు. దానికి కారణం బౌద్ధమతం క్షీణించడానికి, పతనావస్థకు వ్యత్యాసం తెలియకపోవడమే. బౌద్ధం క్షీణించడానికి, పతనమవడానికి ప్రత్యక్ష కారణాలు ప్రత్యేకంగా గుర్తించ వలసిన అవసరం వుంది. ఎందుకంటే బౌద్ధం పతనానికి దారితీసిన కారణాలు స్పష్టముగా వుండగా దాని క్షీణావస్థకు కారణాలు ప్రక్షిప్తంగా వున్నాయి. మహమ్మదీయుల దాడులు భారతదేశంలోని బౌద్ధం పతనానికి ముఖ్యకారణం అనడానికి సందేహం లేదు. ఇస్లాం విగ్రహారాధన (But)కు శత్రువు. ఈ But అనే అరబిక్ మాట విగ్రహానికి మారు పదము. కాని ఈ విషయం చాలామందికి తెలియకపోవచ్చు. దురదృష్టవశాత్తు ఈ But (బుత్) బుద్ధ అయింది. ఆ విధముగా ఇస్లాంలోని విగ్రహారాధన వ్యతిరేకత బౌద్ధానికి వ్యతిరేకమయింది. ఈ వ్యతిరేకతే ముస్లింల మనసులో కూడా నాటుకుంది. వారి దృష్టిలో విగ్రహారాధన, బుద్ధిజం రెండూ ఒక్కటే. ఈ తప్పుడు అవగాహనతోనే బుద్ధుని విగ్రహాలను విధ్వంసం చేయడం ముఖ్యకార్యంగా ముస్లింలు భావించారు. ఇస్లాం పుట్టకముందు బౌద్ధమే మొత్తం ఆసియాతో పాటు బ్యాక్ట్రీయా, పార్థియా, ఆఫ్ఘనిస్తాన్, గాంధారా, టర్కిస్తాన్‌లో ముఖ్యమైన ధర్మం.

విన్సెంట్‌స్మిత్ ఈ విధంగా అన్నారు: "సనాతన హిందువులు బౌద్ధానికి చేసిన నష్టం కంటే మహమ్మదీయ దాడుల మూలంగా భారతదేశంలో బౌద్ధానికి ఎక్కువ నష్టం జరిగింది."

అయితే విన్సింట్‌స్మిత్‌తో అందరూ ఏకీభవించక పోవచ్చు. అది అసంపూర్తిగా వుందని అనిపించవచ్చు. ఎందుకంటే ఇస్లాం బౌద్ధంతో పాటు, బ్రాహ్మణ మతంపైన కూడా దాడి చేసింది. అటువంటప్పుడు ఒకటి బ్రతికి రెండవది లేకుండా పోవడానికి కారణం ఏమిటి? కాబట్టి బౌద్ధ పతనానికి ఇస్లాం కత్తి ఒకటే కారణం కాదు. దీనికి మించిన కారణాలు – లేక, కనపడని కారణాలు ఏవైతే బ్రాహ్మణమతం బ్రతకడానికి దోహదం అయినదో అదే బౌద్ధం బ్రతకడానికి కారణం కాలేకపోయాయి. ఏవైతే బ్రాహ్మణమతానికి అదృష్టం అనుకున్నామో బౌద్ధానికి దురదృష్టం అయింది. మహమ్మదీయ దాడులనుంచి బ్రాహ్మణమతం బ్రతికి బట్టకట్టడానికి బౌద్ధం మరుగై పోవడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

మొదటిది బ్రాహ్మణమతానికి రాచరికపు అండవున్నది. అదే బౌద్ధానికి కరువైనది. ఇంకా లోతుగాచూస్తే మహమ్మదీయుల మొట్టమొదటి విధ్వంసకర దాడులు తగ్గి ప్రశాంతత ఏర్పడేవరకు బ్రాహ్మణమతానికి రాజరికపు అండ వుపయోగపడింది. అదే సమయంలో ఇస్లామిక్ విధ్వంసానికి బౌద్ధ ఆచార ప్రచారకర్తలందరూ బలైనారు. వీరి స్థానాన్ని పూరించినవారు ఏవరూలేరు. బ్రాహ్మణ పౌరోహిత్య సంఘాలను మహమ్మదీయులు నాశనం చేయలేక పోయినారు (ఇది రెండవ కారణం).

మూడవకారణం బౌద్ధధర్మబోధకులను అప్పటి బ్రాహ్మణ పాలకులు, రాజులు హింసించడంతో వారినుండి తప్పించుకునేందుకు బౌద్ధులు ఇస్లాంలో చేరారు. ఈ పరిస్థితులను తెలియ చెప్పేందుకు ఆధారాలు దొరకడం లేదు.

సింధు రాష్ట్రం మొట్టమొదటగా ఇస్లాం మత పరిధిలోకి వచ్చినది. దాని పరిపాలకుడు ఒక శూద్రుడు. కాని ఆ సింహాసనాన్ని ఒక బ్రాహ్మణుడు ఆక్రమించి సొంత రాజ్యముగా ఏర్పరుచుకోవడానికి బ్రాహ్మణ మతం వెన్నుదన్నుగా నిలిచింది. అప్పుడే ఇబ్నుకాశిం అనేవాడు క్రీ.శ. 712లో దాడిచేశాడు. అప్పుడు సింధును దాహిర్ రాజు పరిపాలిస్తున్నాడు. ఈ దాహిర్ బ్రాహ్మణజాతికి సంబంధించిన వాడు.

హుయాన్‌సాంగ్ చెప్పిందాన్ని బట్టి పంజాబ్‌ని బౌద్ధానికి చెందిన క్షత్రియ రాజు పరిపాలిస్తున్నాడు. ఇది క్రీ.శ. 880. ఈ సింహాసనాన్ని కూడా లల్లియా అనే బ్రాహ్మణ సైనికాధికారి ఆక్రమించి షాహి వంశాన్ని ప్రతిష్టించాడు. ఈ షాహి వంశం పంజాబ్‌ని క్రీ.శ. 880 నుంచి 1224 వరకూ పరిపాలించినది. ఈ వంశానికి చెందిన జయపాలుడు (960 – 980), ఆనందపాలుడు (980–1000), అలోచన్ పాల్ (1000–1021) పంజాబ్‌ని పరిపాలించారు. వీరందరూ కూడా మహమ్మదీయుల దాడులకు గురయినవారే.

మధ్యభారతంలో మహమ్మదీయుల దాడులు సహబుద్దీన్ ఘోరి, ఇతర మహమ్మదీయుల ఆధ్వర్యంలో ఎక్కువై ఇస్లాం వ్యాపించినది. ఈ సమయంలోనే యేవార్ట్ రాజ్యములో గులోహిత్, సాంబార్ రాజ్యాన్ని చౌహాన్లు, కనేజ్ రాజ్యాన్ని ప్రతీహార్లు, ధార్ రాజ్యాన్ని పర్మార్లు, బుంధేల్‌ఖండ్ రాజ్యాన్ని చంద్రిల్లాలు, అన్హిల్‌వధ్ రాజ్యాన్ని చావ్‌దాస్‌లు, ఛేది రాజ్యాన్ని కాలచూరులు పరిపాలించేవారు. ఇవన్నీ కూడా రాజ్‌పుత్ వంశానికి చెందినవి. వీరికి కారణాంతరాలవల్ల బ్రాహ్మణమత మద్దత్తు ఎప్పుడూ వుండేది.

ఇదే కాలంలో బెంగాల్ రెండు రాజ్యాలుగా (తూర్పు – పడమర) విడిపోయింది. పశ్చిమబెంగాల్‌ను పాల్ వంశరాజులు, తూర్పు బెంగాల్‌ను సేన వంశరాజులు పరిపాలించేవారు. పాల్‌వంశీయులు క్షత్రియులు, బౌద్ధులు కూడా. కాని అది నామమాత్రమే. సేన రాజులను క్షత్రియులుగా మారిన బ్రాహ్మణ రాజులుగా డా. బండార్కర్ గుర్తించారు. కానీ డా. వైద్యప్రకారం ఈ సేన రాజులు ఆర్యక్షత్రియులు లేదా చంద్రవంశానికి చెందిన రాజ్‌పుత్‌లు. ఏది ఏమైన ఈ సేన వంశానికి చెందినవారు కూడా రాజ్‌పుత్‌లవలే సనాతన ధర్మాన్నే నమ్మారు.

నెర్బుడానదికి దక్షిణ ప్రాంతంలో అదే కాలంలో నాలుగు రాజ్యాలు వుండేవి.

1. పశ్చిమ చాళుక్యుల దక్కన్ రాజ్యం, 2. చోళుల దక్షిణ రాజ్యం, 3. శిలహార్ల కొంకణ రాజ్యం (పశ్చిమ తీరం), 4. త్రికళింగ గంగారాజ్యం (తూర్పు తీరం). ఈ రాజ్యాలు అన్నీ క్రీ. శ. 1000–1200 మధ్య సుభిక్షంగా వుండేవి. ఈ సమయంలోనే మహమ్మదీయుల దాడులు జరిగినవి. 12వ శతాబ్దంలో పరిపాలించిన రాజులకు అంతర్గత విభేదాలు వుండేవి.

తరువాత శతాబ్దానికి 1. యాదవులు పరిపాలించిన దేవగిరి, 2. కాకతీయులు పరిపాలించిన ఓరుగల్లు, 3.హొయిసలులు పరిపాలించిన హాలబేడు, 4. పాండ్యులు పరిపాలించిన మధుర, 5.చేరులు పరిపాలించి ట్రావెన్‌కోర్. ఈ రాజ్యాలన్ని కూడా సర్వస్వతంత్ర్యమై వున్నాయి. అంతే కాదు బ్రాహ్మణమత ఆధిపత్యంలో వున్నాయి.

భారతదేశం మీద మహమ్మదీయుల దాడులు క్రీ.శ. 1001లో మొదలైనవి. అవి 1296 వరకు ఉధృతంగా సాగి అల్లావుద్దీన్ ఖిల్జి దేవగిరిని ఆక్రమించడంతో తగ్గుముఖం పట్టినవి. నిజానికి మహమ్మదీయులు భారతదేశాన్ని మొత్తం ఆక్రమించకపోయినా తరువాత కూడా మహమ్మదీయ యోధులు మరో 300 సం॥లు ఈ దాడులు చేస్తూవున్నారు. అప్పటికి మిగిలింది ఈ బ్రాహ్మణ మత మద్ధతుతో వున్న చిన్నా, చితక రాజులు, పాలకులు మాత్రమే. ఈ మహమ్మదీయుల చేత హింసించబడిన బ్రాహ్మణులు తమను

కాపాడే రాజులని వెతుక్కున్నారు. కానీ ఈ మహమ్మదీయుల చేత తన్ని తరమబడిన బౌద్ధులకు అటువంటి ఆసరా దొరకలేదు. ఈ ఇస్లాం దండయాత్రలలో బౌద్ధ విశ్వవిద్యాలయాలైన నాలందా, విక్రమశిల, జగద్ధాల, బంధంత పురిలాంటి అధ్యయన కేంద్రాలన్నీ నాశనం అయ్యాయి. బౌద్ధ ఆరామాలన్నీ నేలకూలాయి. బౌద్ధ భిక్షువులందరూ నేపాల్, శ్రీలంక, టిబెట్‌కువారు తీసుకెళ్ళగలిగినన్ని బౌద్ధ అవశేషాలను గ్రంథాలను తీసుకు వెళ్ళగలిగినారు. చాలా మంది బౌద్ధులు, ముస్లింలచేతిలో ప్రాణాలు కోల్పోయినారు. బౌద్ధధర్మ బోధకులు ఇస్లాంకత్తికి ఎలా బలయినది ముస్లిం చారిత్రికకారులే వర్ణించారు. అందులో ముఖ్యమైనది, క్రీ.శ.1197 సం॥లో బీహార్ ఆక్రమణలో ముస్లమాన్ జనరల్ బౌద్ధ భిక్షువులను ఏ విధంగా ఊచకోత కోసింది విన్సెంట్ స్మిత్ ఈ విధంగా వర్ణించాడు:

"ఒక ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం, క్రీ.శ. 1243లో బీహార్ కోటను ఈ ముస్లమాన్ జనరల్ కేవలం రెండువందల అశ్వారూఢులైన యోధులతో ఆక్రమించినాడు. ఆ ఘర్షణలో పాల్గొన్న వారందరితోపాటు బ్రాహ్మణులని, బౌద్ధభిక్షువులని చంపడమే కాక అక్కడవున్న గ్రంథాలను, విలువైన వ్రాత ప్రతులను తగులబెట్టి, ఒక్కడ్ని కూడా మిగల్చకుండా మట్టుపెట్టి, ఉన్నదంతా దోచుకొని, ఆఘోరమైనకార్యాన్ని పూర్తిచేశాడు."

ఒక ప్రత్యక్ష సాక్షి కథనం ప్రకారం, క్రీ.శ. 1243లో బీహార్ కోటను ఈ ముస్లమాన్ జనరల్ కేవలం రెండువందల అశ్వారూఢులైన యోధులతో ఆక్రమించినాడు. ఆ ఘర్షణలో పాల్గొన్న వారందరితోపాటు బ్రాహ్మణులని, బౌద్ధ భిక్షువులని చంపడమేకాక అక్కడవున్న గ్రంథాలను, విలువైన వ్రాత ప్రతులను తగులబెట్టి, ఒక్కడ్ని కూడా మిగల్చకుండా మట్టుపెట్టి, ఉన్నదంతా దోచుకొని, ఆ ఘోరమైన కార్యాన్ని పూర్తిచేశాడు.

ఈ విధంగా బౌద్ధధర్మ ప్రచారకులు, భిక్షువులు ఇస్లాం దాడులలో సర్వనాశనమవడమేకాక, బౌద్ధాన్ని కూకటి వ్రేళ్ళతో పెకిలించారు. బౌద్ధానికి జరిగిన దురదృష్టకరమైన పరిణామంలో ఇది ముఖ్యమైనది. ఏ మతానికైన ప్రచారమే ప్రాణం. ఇక్కడ బౌద్ధానికి బోధకులతోపాటు, ఉపాసకులు విశ్వాసపాత్రులు అంతరించారు. ఆ విధంగా ఇస్లాం కత్తికి బౌద్ధం బలి అయింది. బౌద్ధ ధర్మదీపాన్ని వెలిగించే నాధుడు కరువైనాడు.

అప్పుడు ఇదే దారుణం బ్రాహ్మణమతానికి కూడా జరగవలసినది కాని బ్రాహ్మణానికి, బౌద్ధానికి ఉన్న మౌలికమైన భేదం బ్రాహ్మణమతాన్ని రక్షించింది. బ్రాహ్మణమత బోధకుల సంఘం చాలా పెద్దది. ప్రతీ బ్రాహ్మణ కుటుంబం నుంచి ఒక పురోహితుడో, ఒక వేదపండితుడో, ఒక యజ్ఞకారుడో తప్పనిసరిగా ఉంటాడు. వారు తప్పనిసరిగా ఆ విద్యలో కొనసాగుతారు. వారణాసిలో బ్రాహ్మణ కుటుంబాలు, మరాఠ, గుజరాత్ ప్రదేశాలలో బ్రాహ్మణ కుటుంబాలు ఈ మత ప్రచారంలోనే ఉన్నాయి. వీరిలోనుంచి చాలామంది దేశంనలుమూలలకు వెళ్ళి ఈ ప్రచారంతో పాటు సంపన్న కుటుంబాలను కలసి వేదాలను, ఉపనిషత్తులను, ఆపస్థంబ సూత్రాలనూ బోధించేవారు. వారు ఇచ్చిన తృణమో, ఫలమో స్వీకరించేవారు. వీరిలో కూడా గృహస్థులు, సన్యాసులు ఉండేవారు. గృహస్థులు లౌకికమైన కార్యక్రమాలను నిర్వర్తిస్తూ, సన్యాసులు మాత్రము పూర్తిగా ప్రచారానికి, క్రతువులకు, ఇతరత్రా కార్యక్రమాలను నిర్వర్తించే వారు.వీరు తప్పనిసరిగా సంధ్యావందనం చేసేవారు. గాయత్రీ మంత్రాన్ని జపించే వారు. ఋగ్వేదమంత్రాలను, ఐతిరేయ బ్రాహ్మణ వాక్యాలను, ఐతిరేయ అరణ్యక వాక్యాలను, యాగసంహితను, సహ సంహితను, అధర్వసంహితను, అశ్వలాయన కల్ప సూత్రాన్ని, నిరూపాన్ని, కండాలనూ, నిఘంటువుని, జ్యోతిష్యాన్ని, శిక్షని, పాణిని, యజ్ఞవల్క స్మృతిని, మహాభారతాన్ని, కన్నడ సూత్రాల్ని, జైమిని సూత్రాల్ని, బాదరాయణ సూత్రాల్ని విస్తృతంగా ప్రచారం చేసారు.

స్థూలంగా బ్రాహ్మణ సన్యాసులకు, గృహస్థులకు వ్యత్యాసం లేకపోయినా బ్రాహ్మణమతంలో ఇద్దరూ మత బోధకులుగానే పరిగణిస్తారు. అన్ని క్రతువులకు పూజా పునస్కారాలకు, కర్మకాండలు చేయించడానికి బ్రాహ్మణ గృహస్థులు కూడా అర్హులే. కాబట్టి వారికి అది ఒక వృత్తిగా, జీవనాధారంగా మారింది. దీనికి ప్రత్యేకమైన శిక్షణగానీ, అర్హతగానీ అవసరం లేదు. కాబట్టి బ్రాహ్మణ మతంలో ఈ పౌరోహితవర్గం ఎప్పటికీ రూపుమాసిపోదు. పైగా మత ప్రచారానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. బౌద్ధధర్మంలో అది సాధ్యం కాదు.

బౌద్ధమత ఆచారం ప్రకారం భిక్షువు, శిక్షణపొందాలి, అరహంతుడు కావాలి. ఇక్కడ గృహస్థాశ్రమం లేదు. ఈ కారణంగా మహమ్మదీయులు ఊచకోత తరువాత, బౌద్ధధర్మ ప్రచారకులు పూర్తిగా కనుమరుగైనారు. కొత్తవారిని ఆహ్వానించి, శిక్షణిచ్చి ఇందునిమిత్తం నియమించే నాధుడు కరువైనాడు. బౌద్ధధర్మం అదృశ్యమవ్వడానికి ఇది ముఖ్యకారణం. హిందూమతంలో గృహస్థాశ్రమంలో వుంటూ కూడా మతాచారాలను పాటించడానికి, అధ్యయనానికి, గురుత్వానికి ఎటువంటి ఆటంకంలేదు. ఇటువంటి అవకాశం బౌద్ధంలో లేదు. ఈ కారణాల వలన బ్రాహ్మణమతం, బౌద్ధధర్మానికన్నా గొప్పది కాకపోయినా భారతదేశంలో బ్రతికి బట్టకట్టడానికి అవకాశం దొరికింది. భారతదేశంలో మహమ్మదీయుల, ఐరోపాజాతి చేతిలో చావుదెబ్బలు తిన్నా, బ్రాహ్మణమతం ఊపిరితో వున్నదంటే, వారి మత బోధకుల తెలివితేటలు, లౌక్యంతోనే. దురదృష్ట వశాత్తు బౌద్ధానికి ఈ దశ లేదు.

ప్రొ. సురేంద్రనాథ్ సేన్ 1938లో అలహాబాద్‌లో 'ఇండియన్ హిస్టరీ ఆఫ్ కాంగ్రెస్'లో మాట్లాడుతూ 'చచనామా ప్రకారం సింధుదేశ బౌద్ధులు, బ్రాహ్మణ పరిపాలకుల చేతిలో పడనిపాట్లు, అవమానాలు లేవు. తరువాత అరబ్బు దండయాత్రలో బౌద్ధులు అరబ్బులకు తమ సహకారాన్ని అందించారు. దీని కారణంగా అరబ్బులు దాహిర్‌ని చంపగలిగారు. తరువాత అక్కడ మహమ్మదీయుల రాజ్యం ఏర్పడినది కాని బౌద్ధుల దురదృష్టం అరబ్బులు వారికి ఎటువంటి సహాయసహకారాలు అందించకుండా, అంతకుపూర్వం బ్రాహ్మణ పాలకులలాగానే హింసించారు. దీని మూలంగా బౌద్ధులంతా పెద్ద సంఖ్యలో ఇస్లాంలోకి మారవలసిన గత్యంతరం ఏర్పడినది. భారతదేశంలో ముస్లిం జనాభా పెరగడానికి కూడా ఇది ఒక కారణమయింది' అన్నారు.

బ్రాహ్మణ రాజులలో కూడా ముఖ్యంగా ఇద్దరూ ఈ బౌద్ధ ధర్మపతనానికి, అంతర్ధానానికి దోహదమయినారు. మొదటివాడు పూనవంశానికి చెందిన మిహిరకులుడు క్రీ. శ. 455 సం॥ ఉత్తరభారతదేశంలో పేరుగలవాడు, ఇప్పటి పంజాబ్ రాష్ట్రంలోని సియాల్ కోట్ రాజధానిగా రాజ్యం ఏర్పరిచాడు. క్రీ.శ. 528 వరకు పరిపాలించాడు. విన్సెంట్ స్మిత్ ప్రకారం ఈ హూణరాజు మహానిరంకుశుడు. రక్తదాహం కలవాడు. ఇతను నిర్దాక్షణ్యంగా ఎంతో శాంతియుతంగా బ్రతికే బౌద్ధులను హింసించి నిర్మూలించాడు. బౌద్ధస్థూపాలను, విహారాలను నాశనం చేసినాడు. వారి వనరులు అన్నీ కొల్లగొట్టాడు. రెండవవాడు నెన్సంకా. హర్షుని సోదరుడిని అతి భయంకరంగా చంపాడు. ఇతను గుప్తరాజ వంశానికి చెందినవాడు. శైవుడు. బౌద్ధ వ్యతిరేకి. గయలో బోధివృక్షాన్ని త్రవ్వి తగలబెట్టింది ఇతడే. బుద్ధుని పాదాలు వున్న పాటలీపుత్రలోని రాతిని పగలగొట్టింది ఇతడే. బౌద్ధారామాలను, పాఠశాలలని ధ్వంసం చేశాడు. బౌద్ధులను నేపాల్ వరకు తరిమికొట్టాడు. చివరగా విన్సెంట్ స్మిత్ 'భారతదేశ చరిత్రలో క్రీ.శ. 7వ శతాబ్దం బౌద్ధానికి చీకటియుగం లాంటిది' అన్నాడు.

ఇంకా బౌద్ధపతనానికి ముఖ్య కారణం బ్రాహ్మణ వాదుల హింసనుంచి తప్పించుకోవడానికి బౌద్ధులు ముస్లిం మతంలోకి మారడం. ఈ ప్రక్రియకు ముఖ్యంగా బ్రాహ్మణ వాదులు, అప్పటి పరిపాలకులే బాధ్యులు.

ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.

I.	**మిసిమి ప్రచురణలు**		₹
1.	బాపు బొమ్మలు	(హార్డ్ బౌండ్)	200.00
2.	మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు	అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి	500.00
3.	బుద్ధుని దీర్ఘ సంభాషణలు	" "	200.00
4.	బుద్ధుని మధ్యమ సంభాషణలు	" "	200.00
5	ఆచార్య నాగార్జునుడు	" "	150.00
6.	దూర తీరాలలో...	వల్లభనేని అశ్వినీకుమార్	60.00
7.	అమాహ	" "	60.00
8.	అంతర్వీక్షణం	" "	50.00
9.	సిద్ధార్థ	" "	50.00
10	నాలో నేను	" "	30.00
11.	కథాంజలి-1	ఎస్సారె	80.00
12.	కథాంజలి-2	" "	110.00
13.	THE THUNDERCLOUD	S.R.A.	120.00
14.	భట్టిప్రోలు కథలు	డా. నక్కా విజయరామరాజు	150.00
15.	రెండు దశాబ్దాలు - కథ 1990-2009	కథా సాహితి	150.00
16.	IN QUEST OF UTOPIA	Mrs. Daggubati Purandeswari	250.00
II.	**వేమన ఫౌండేషన్ ప్రచురణలు**		
1.	లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి*		100.00
2.	మన వేమన - *ఆరుద్ర*		80.00
3.	వేమన - *నార్ల వెంకటేశ్వరరావు*		50.00
4.	VEMANA - *V.R. Narla*		50.00
5.	VEMANA - Through Western Eyes. - *V.R. Narla*		50.00
6.	విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి*		100.00
7.	పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)*		100.00
8.	THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)*		50.00
9.	వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ*		100.00
10.	వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని*		25.00
III.	**ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**		
1.	బౌద్ధ ధర్మ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)*		70.00
2.	మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)*		75.00
3.	మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య*		75.00
4.	మహా పరిత్తం - *బోధ చైతన్య*		100.00
5.	జాతక కథలు - *శివశంకర స్వామి*		60.00
6.	బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు		40.00
IV.	**ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**		
1.	తెలుగా, ఆంధ్రమా? - వాగరి		40.00

మిసిమి
మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

మిసిమి *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

మిసిమి పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/- కలపండి.

1. పేరు : .....

2. చిరునామా :

ఇం.నెం. .....

వీథి .....

పేట .....

ఊరు .....

పిన్ .....

సెల్ .....

3. సంతకం : .....

Our A/c Details for Online Transfer :-

Bank	:	STATE BANK OF INDIA
Account	:	MISIMI
A/c. No.	:	10261569316
Branch	:	Saifabad, Hyderabad, INDIA
IFS Code	:	**SBIN0007315**

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



(చిత్రకారుడు : తల్లావఝుల శివాజి)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11

అవలోకితేశ్వర (టిబెటన్ చిత్రం)